భారతి

సచిత్ర మాసపత్రిక

అధిపతి

కా. నాగేశ్వరరావు

సంపాదకుడు

గన్నవరపు సుబ్బరామయ్య


సంపుటము ౯. సంచిక ౧౧.

ఆంధ్రపత్రికా ముద్రాలయము, మద్రాసు.

౧౯౩౨

విషయసూచిక

చిత్రములు



నా గ పూ జ

చిత్రకారుడు: యమ్. వి. సుబ్బారావుగారు, బ్రాహ్మణకోడూరు.



చెన్నపట్టణము, నవంబరు ౧౯౩౨

సంపుటము ౯ ఆంగీరస సంవత్సరము, కార్తికమాసము సంఖ్య ౧౧

ఆత్మఘోష

విశ్వనాథ వేంకటేశ్వర్లుగారు

౧

అంటం జూడను జేరనుం దగనియన్యాయ్యంపు జీవంబుల
గ్గెంటన్ మా నుదుటన్ లిఖించెనట తండ్రీ యేటియన్యాయమో
ఇంట న్నొంటను నత్తి చచ్చినది మా యిల్లాండ్రు ముప్పూఁట ప
స్తుంటం దొట్టిన మంటలే యివి సుమా తోఁతెంచె విస్వేథులన్.

నల్లనికార్మొయి ళ్లలమి నాలుగుమూలల భారతంబు తా
పుల్లవడెన్ దిగుల్వడియు పూఁటకు గంజికి నోఁచుకోని మా
పిల్లలు రెల్లవోయి యతి పేదమొగాల రగుల్చు లేఁబొగల్
జిల్లున చిమ్మచీఁకటులు చిట్టము కట్టినవే మొయిళ్లనన్.

తమి దేవుళ్లకు మ్రొక్కుకొందమన లే దాయెన్ ముఖుల్ గట్ట ప
గ్గములం గొల్లను దేవతాళి మొఱలే కాఁబోలు వీతెంచెదన్

దములంబై వినువీథి బెట్టు రొద యేదో! చూడ నారాతికం
బమునం బుట్టిన సామి రావలయునో భామల్ వడిం ద్రెళ్ళఁగన్.
కోమగుం ద్రాయపు గుబ్బెతల్ వలపు చిక్కుల్ దీర్ప మేల్మేలు సా
దములన్ మెక్కుచుఁ ద్రుళ్లుచుం దనబిసల్ తారించు జియ్యర్లు సం
యములై సన్నిధిసేవ చేయఁదగు నన్నా మాకుఁ బోరాము లే
యమరుంగా! యవుఁ గాని వార్తలకు వేత్రై యాకులుం గంచముల్.

నిను రాబందెలఁ గట్టిపెట్టుదురు గానీ గోపురాగ్రాల పం
బిన యీసం దిలకించు మా కనుతుదల్ పేటెత్తు రాగాలలోఁ
గననయ్యెః మలుసంజ చీఁకటిగముల్ కల్పావసానాన ము
మ్మొనవాఁల్జోడు జటారుచిన్ దగు హాసన్మూర్తిన్ విడంబించుచున్.

పోనీ, లోకము గొడ్డువోయిపదె బాబూ! యేల లేవంతె బి
చ్చానన్ జీవిక నెట్ట నేల లవి లక్షల్ కోట్లు, 'పోదా' మనన్
పోనీ కెంతయుఁ గాళ్ల కడ్డపడి వాపోవన్ నినుం జూడ వే
కానల్ వడ్డవి దార్లు మాకు కను మయ్యా, అష్టదిగ్బంధమై.

పంటవలంతి గడ్డపారఁ బాతిన తీయనిబోదెనీరు మై
నంటినఁ బుట్టుపుల్క పొగలార్చిన రతుల సస్యబాలికల్
మింటికి మంటికిన్ సొబగు మేకొనఁ జేయఁగ నుండు మాకుఁ బ
స్తుంటలు తప్పవాయె దయతోఁ గనుమయ్య కిశోరరత్నమా!

నెత్తురుగడ్డ మాది యిది నింపిన రక్తము మాంసమున్ వృథా
తుత్తుమురై చెడంగఁ బడఁ దోలిరి యూరిబయళ్లలోనికిన్
కత్తులవాదరన్ నడకగా నిటు జీవిక వెళ్లఁబోయుచున్
తొత్తుల మైతి మింక దయతోఁ గనఁగాఁ దగు దీనకోటులన్.

ఆరంజోతికిఁ గన్నబిడ్డలము కన్నారంగఁ జూడంగనున్
గారా మింతయు నోఁచుకోము గద కక్కా! నీదు రూపంబు నేన్
మారాముల్ పచరింప మాల లను దుర్మానంబులన్ బెట్టి యా
త్మారాము న్నిను మాకునై కొలిచి మర్యాదాంకితుం జేతురే!

తఱితోనఁ గనుమూఁత తెలుపుల్లువడ నుదు ర్వొచ్చనూఁదెడు మింటివేగుచుక్క
నడుమింటఁ దెలిదమ్మి యుడుకతేనెలు జార్చి విజ్జువోవఁగఁ జేయు వేఁడివెలుఁగు

ఎదకల్వ రే కత్తి సొదలు వెళ్లఁగఁబోయ ముచ్చముంపులు ముంచు మొయిలుగుంపు
బమ్మగూఁట వెలుంగు తమ్మిమొగ్గవెలుంగు రిమ్మవోవఁగఁ బడఁ జిమ్ము గాలి
తెలియవో! యెదకోఁతల తీఫు లెల్ల-విన వోకో! వాయి లేని లోవెతల నెల్ల
కనవోకో! గుండె యెసరు వార్చినది నల్ల-ప్రకృతి మాకోన మిట్లు విప్రకృతిఁ గనునె?

౨

పూవులవింటివాని మెలఁపుల్ చల మూఁదిన బాపనమ్మవా
ల్లావి దలిర్పఁ గాఁపువలపయ్యల పజ్జల పూవుసెజ్జలన్
దావులు చిందఁగా నయిన తప్పులపుట్టుక యాటఁ జేసి సూ
వే! విలయంబు వచ్చి పడె నీగతి మాగతి కాగతిం బడన్.

ఏనాఁడో, యెవరో, యెటో, యెచటనో యేమేమొ యేద్వన్ మమున్
దానన్ దప్పను బెట్టుఁ డంచు నిటు గండాగొండి నేయింతురే
కానం దోలిన మూఁగ మొండి పసులం గావించి కారింతురే
యేనాయం బిది మేక తోఁడెలు విలం బేవంబు ఘట్టించెదున్.

పోసి! మాటు మడంగినాఁడో యిపు డీపున్నెంపునేలన్ మరుం
దూనన్ గోరిక తేనె లూరు మదిలో నుప్పొంగి మై జారఁగా
నీనాఁటమ్మల చెప్పరానమఁగులం దేవన్నియ ల్గానఁగా
నానో మప్పక చెప్పనొప్పఁ గద యయ్యా! యిట్టి తప్పొప్పులన్.

గోనమున్ కర్మము నందురో, తెలియ నీకుట్రల్ రువారించు మా
యనునారోపము నొందు రూపములె కా అద్దానికిన్ నీకునున్
జన వొక్కింతయు లేన లే దిది యెటుల్ సైరించి సాగింతురో
తనువుల్ నిక్కము లేమి నిక్క మగునే తండ్రీ! యిటుల్ చూచినన్.

ఇది లేదందును నాదుచుం ద్రోకట పై నీ లేని లేమిన్ గొనం
బదుకన్ జూచుచునుం ద్రోకంట తగునయ్యా! లేన లేదాయె, లే
నిది లేనట్టులె గాక యున్నదగునే నీ వొక్కఁడే గాదె యు
న్నది యన్ బ్రాఁజదు వొప్పరో! కలికి దానం బొదురో మాకునై.

పొగచెట్టియ్యది యుష్టా నూఁద విడిలున్ బుంజించు లేకున్న ని
ప్పగిదిన్ బుట్టిన వెచ్చుతగ్గులని సంబాళించుకోఁ జూతురో

పొగ దట్టంబు పొగన్ గ్రహించు కెటు లబ్బున్ నిక్క మీ చీకటుల్
దిగఁ ద్రావన్ వెలుఁగొందువాఁడవు గదా! దృగ్దీప్తి దృశ్యైక్యమై.
పొగ వెలుఁగుల్ సతమ్ము లని పోర, వెలుం గది కొంకి దేనికిన్
అగు నధికారిభేద మన నాత్మకు లే నధికార ముండునే
పొగ సరిగట్టియే స్మృతులఁ బోల్చిరి మేర లటన్న నీకునుం
దెగనిది మర్త్యమాత్రులకు ద్రెంపఁగవచ్చునటయ్య, వైదికా!

ఆచారమా యిది, యచ్చపుఁగనుకలి కలవడకున్నట్టి వెలుఁగులేమి
ధర్మానువృత్తియా, మర్మముల్ నోనాఁడు విన పవమానాల వెతలకోఁత
లోకసంగ్రహణమా, వాకిలి గడపలఁ గాచియుండిన బంటు గాసిసేఁత
కీర్తికాముకతయా, యార్తదశాపాతితైకజాతీయుల యాత్మఘోష
చెల్ల రే! నప్తకోటి నిర్జీవ లిట్లు - కల్లకపటంబు లెఱుఁగమి గాసివడఁగ
ఆర్తరక్షణ బిరుదంబు నవధరించు - ప్రభువు నీ వుపేక్షించుట పాడియగునె?

కరుణావార్నిధి! తత్త్వభాసివి త్రయీఘంటాధ్వనీనుండ వు
ర్వర సృష్టిస్థితిఘాతహేతుఁడవు సర్వం ఖ ల్విదం బ్రహ్మవా
క్యరమావ్యంజిత విశ్వవైభవుఁడవున్ యత్తత్త్వమస్యాది సం
భరితానంద జగత్స్వరూపుఁడ వికన్ బాలింప రావే! ప్రభూ!

3

తోలుదోల్తి నీదు తనువై - తలసూపిన నీరు తాఁకఁ దగదఁట తండ్రీ!
కలదే పగతుర కైనన్ - కలకాలము నిట్టికష్టకర్మము కృష్ణా!
మము సోఁకు నీదు రూపము - తము సోఁకఁగ రాదు గాలి త్రసరేణువులున్
భ్రమ, పడగ చుట్ట పానే - నమరుం బా మెట్లు శత్రు వగుటలు కృష్ణా?
మానవరూపము నొందిన - నీ నవవిశ్వాత్మభాగనిష్ఠతఁ గనుచున్
మానవులమైన మమ్మున్ - కానక కన్నెత్తి చూడఁ గనటఁట తండ్రీ!
కడలకుఁ ద్రోసిరి మమ్ముల - నడువఁగ రాదంట వీథినడుమల నభవా!
కడలందు నీవు కలుగుట - కడకేనియుఁ దెలిసి చూడఁ గాంతురొ కృష్ణా!
కాలము నీవే పురుషత - పాలించెద ననుచు శ్రుతులు పలుకఁగ నిజం
భూలత నెఱుఁగక ధర్మపు - చాటునఁ బడిపోదు రిద్ది నరిమె ముకుందా!

పురుషార్థరూపుఁడవు నై - పరపురుషుఁడ వైన నీదుభద్రాకృతిలోఁ
దర మిడి పంచిన మాకుం - బురుషార్థము సున్న యయ్యె భువిపై నభవా!

యజమానరూప! సర్గము - యజనంపు హవిర్విశేష మయ్యెడి మాకున్
స్వజనులకంట త్వదర్చా-భజనమ్ములు కూడవంట పాడియె కృష్ణా!

కర్మానుభూతి యంకురు - కర్మకు వేఱొకనిలీల కారణ మనుచున్
మర్మము నెఱుఁగక యూరక - ధర్మాధర్మముల వలలఁ దగులుదు రభవా?

లీలోల్లాసవిలాసలాసితజగల్లీలానులాస్యక్రియా
లోలాలోల విలోలకేవలరసోల్లోలామృతానందవా
ర్లీలాడోలిక లూఁగు ముక్తిలలనాలీలాకలాలాప ధృ
జ్ఞాలాకల్పిత గానలోల, మము సంబాళించుకోవే! ప్రభూ!

౪

గణగణ గంటమ్రోఁతలకు గాసిలిపోయె పరాత్పరుం డటో
కనుకలి లేక యూరక వికావిక తప్పెటతాళముల్ వడిన్
వినుకలి సేతు రేమిగతి వేదపుఁ గ్రొంజివురుల్ చెలాడఁగాఁ
గొని శయనించినాఁ డచటొ కోరినకందువప ట్టెఱుంగవే.

కరుణారసంబు దేల్చి వడఁగట్టినసామి, వెలుంగుఁ జేర్పఁగా
నిరులను గొల్చి, కోర్కె తెలియించి కృతార్థత నొందఁజేయు దే
వర! చిఱు చిమ్మ చీఁకటులు వ్రాలిన గుళ్లను గోపురంబులన్
దొరఁగి మెఱుగెనో వెలుఁగుత్రోవలఁ జూడరె! ఆలకించరే!

తిరునామంబులు తీర్చి దిద్ది ఖుసిమై తీర్థప్రసాదంబులన్
తిరుపొంగళ్లను నారగించి దొరమున్నే దేవదాసీలతోఁ
దిరుకైంకర్య మొనర్చు నయ్యలు కృతార్థీభూతు లైనారులే
పరమైశ్వర్యుఁడు బిచ్చమెత్తుచు నిరాహారై మనంబోయెనో!

అటఁ గను విచ్చి చూడుఁడు వియత్పద మూరిబయళ్ల నాదేసన్
ఫుటమునఁ బెట్టు బంగరువుపోలిక కావిపసందు రేక లు
త్కటముగఁ బర్వెఁ జుక్కలకుఁ దల్లి వశిష్ఠుని కంటిమంట నూ
ఱ్పటములు గన్న మాలెత యరుంధతి వెల్గుల వియ్య మందుచున్.

సామికి మాలపల్లెల ముసాఫరు కాఁదగు గీత వ్రాసిరో
గాముల కుట్రవాదనలఁ గాఁకలుతీరిన యయ్యవార్లు గా
రాములు పెట్టి, సామి వెలి రా, ముడిరాళ్లను దేవులాడుచు
న్నేమిఁక బాపుకొందురో కా యాచిటుబుజ్జలు బానబొజ్జలున్.

పట్టియమాయికుండు తనుఁ బట్టినవారల గోవు వత్సమున్
ముట్టి చరించునట్లు కడముట్టెడు దాఁకను వెన్నడించు న
ట్టి ట్టన రాని యిట్టిగుణహీనుని నెట్టుల యంత్రబద్ధుఁగాఁ
గట్టిరొ! దైన వారిపాడ గానఁగనీ కెటు లుంచిరో కదే!

ఆటికి అంకు దీర్చె, పెనుజాఁగకు కుబ్జకు వంక దీర్చె, దు
ర్జాతి కిరాతి యెంగి లనురాగిలి యానె, నజామిళున్ సుఖా
పాతిఁ జేసె నీ పతితపావననామునకున్ దలంపఁగం
బ్రాఁతియె కన్నబిడ్డలము మ మ్మెదఁ జేర్చి యనుగ్రహించుటల్.

ఆయతవిశ్వవైభవుఁడు నాపరమేశుఁ డిటుల్ దరిద్రనా
రాయణరూపముం గొని విరక్తు లకించను లాత్తకాము లు
న్నేయతినుస్థితిక్రియులు నిశ్శూన్యలోకవిశూన్యభావనా
ధ్యాయులు నాకు నౌ ప్రియు లటంచును మాయిలువేలు పయ్యెడున్.

అస్పర్శసంశుద్ధి యాభిముఖ్యనిషేధ మనహంకృతియు దూర మగుట శాంతి
నిర్బంధదారిద్ర్యనియతి వైరాగ్యంబు విద్యలే మకుహానాభిజ్ఞతయును
దైవతదర్శనాభావంబు నిత్యానుసంధానలబ్ధ సాక్షాత్కృతియును
అంతేనివాస మాత్మానంద వైభవం బనశనకృతి నిష్క్రియానుభూతి
యమరఁ జేయ, నిర్బంధయోగావధూత-వృత్తి జరిగించు మాయింటివేలు పగుచు
శ్రీదరిద్రనారాయణసిద్ధమూర్తి-వెలసె, రారయ్య! ముక్తిని విలువ రయ్య.

చండాలార్థము నిచ్చు వాచ్య మదియున్ సర్వంసహాచక్రమం
దుండన్ రా దనుఘోష పర్వ దెసలం దున్మీలితాంహోగణో
చ్చండంబై, యెఱవాడసంయమి సహస్రారామృతాగ్ని ప్రభల్
తండంబై దశదక్ప్రశాంతిసుమ సంతానంబు వర్షింపఁగన్.

ఓం తత్సత్.

ద్రావిడభాషా లక్షణము—తొల్కాప్పియమ్

కోరాడ రామకృష్ణయ్యగారు, యమ్. ఏ.

"తొల్ కాప్పియ" మనునది తమిళభాషా లక్షణమును దెలుపు గ్రంథములలో నతిప్రాచీనమైనదిగా బరిగణింపబడుచున్నది. అరవభాష కాది మునియగు అగస్త్యునిచే రచింపబడినదిగా దలంపబడు "అకత్తియమ్" అనునది, యీ భాష కాది లక్షణమని చెప్పవలసియున్నను, ఈగ్రంథము సమగ్రముగ లభింపకుండుటచేతను, అగస్త్య మహాముని కర్తృత్వమే వివాదగ్రస్తమై యుండుటచేతను, నిప్పటికి నిలిచియున్న తమిళభాషాలక్షణ గ్రంథములలో "తొల్కాప్పియ" మను నదే యతి ప్రాచీనమని చెప్పవలసియున్నది. ఇది "తొల్కాప్పియనార్" అను నొక బౌద్ధ పండితునిచే రచింపబడినట్లు చెప్పుదురు. "తొల్ కాప్పియ" శబ్దమును బట్టి విచారింపగా, నిది 'తొల్ + కాప్పియమ్' అను రెండుపదముల కూడికచే నేర్పడినట్లును, అందు 'కాప్పియ'మనునది 'కావ్యం' అను సంస్కృత శబ్దమునకు వికృతి యైనట్లును దోచుచుండుటచే, నిది "తొలి కబ్బము" అను నాంధ్రశబ్దమునకు జేరికయైన ట్లగపడుచున్నది. ఈకారణముచే గ్రంథనామమును బట్టియే తద్రచయితకా పేరు వ్యవహారములోనికి వచ్చినదేమో యని సందేహము కలుగక మానదు. కాని తమిళభాషా పండితులు పెక్కురు "తొల్కాప్పియనార్" అనునాతడు రచించినది కావుననే యాగ్రంథమున కాపేరు గలిగిన దని విశ్వసించుచున్నారు. మధురకు దక్షిణభాగమున "తొల్కప్పియకుడి" యను గ్రామ మొకటి కలదనియు, నా గ్రామమునుబట్టియే యితని కీ నామము కలిగిన దనియు, నీతనితల్లిదండ్రులు పెట్టినది "తిరణదుమాకిని" యను నామాంతరము కలదనియు, నతడు జమదగ్ని ముని వంశీయుడగు బ్రాహ్మణకులజుడే యనియు కొందఱు చెప్పుదురు.

భాషాలక్షణ గ్రంథమున కిది కావ్యశబ్ద వాచ్యంబగుటయు నొక విశేషము. కాని తమిళవాఙ్మయమున నిదియే తొలికబ్బమని చెప్పుట కవకాశము లేకుండుటచేతను, లక్షణగ్రంథమగు నిది కావ్య శబ్ద వాచ్యమగుట యంత సమంజసముగా గనబడకుండుటచేతను, మఱియు నీభాషలో 'తొలి' శబ్దము ప్రాచీనము అను నర్థమున విశేష వ్యవహారము కలదగుటచేతను, నిది తొలికబ్బమనుట కంటె "ప్రాచీన కావ్యములను గూర్చిన లక్షణము"- (తొల్కాప్పియ, ఇలక్కణం) అని చెప్పి, 'నామైకదేశే నామగ్రహణం' అను న్యాయమున, ఇలక్కణ శబ్దలోపముచే 'తొల్ కాప్పియ' మనునామమున బ్రసిద్ధి జెందినదని తలంప దగియున్నది. లక్ష్యగ్రంథములు లేనిదే లక్షణము బయలుదేరదు గదా. ఈ లక్షణగ్రంథమునకు పూర్వ మపారమైన వాఙ్మయ మాభాషలో బయలుదేరియుండెననుటకు బాహ్యాభ్యంతర నిదర్శనము లనేకములు కలవు. ప్రాచీనములగు ననేక లక్ష్యగ్రంథముల నుండి యుదాహరణములను గ్రహించుచు, ననేకపండితుల (పులవర్) యొక్కయు, లాక్షణికులయొక్కయు నభిప్రాయములను నది తెల్పుచుండుటచే, దీనికి పూర్వ మనేకశతాబ్దములనుండి వచ్చుచున్న తమిళభాషా వాఙ్మయము కలదని యదియే రుజువుచేయుచున్నది. ఇంకను ప్రాచీన తమిళ వాఙ్మయమును గూర్చిన గాథ లపారముగా గలవు. తమిళదేశమున తద్భాషావాఙ్మయ పోషకములు, శాసకములు నగు సంఘము లను పేర బరగిన మూడు పండిత పరిషత్తులు ప్రాచీనకాలమున బ్రబలి యుండెనని చెప్పుదురు. అందు మొదటి సంఘమున ౫౪౯ కవులు కలరట. అది ౪,౪౪౦ సంవత్సరములు భాషా వాఙ్మయ పోషకత్వకార్యమును నిర్వహించినది. అం దగస్త్యుడు, శివుడు, మురుగేశుడును కవులుగను, సభ్యులుగ నుండిరి. సముద్రమున నంతరించిన ప్రాచీన మధురా పట్టణమున నీసంఘము నెలకొని యుండెను. ఆ కాలమున ౮౯ రాజు లాపట్టణమున పరిపాలకులుగా నుం

డిరట. రెండవ సంఘముకూడ సముద్రము పాలైన కపాదపురమున ౫౯ పరిషత్సభ్యులతో ౩,౭౦౦ సంవత్సరములు కార్య నిర్వహణముచేసి ౩,౭౦౦ కవుల కావ్యములను పరిశీలించినది. ఈ కాలమున ౫౯ రాజులు పరిపాలించిరి. ఇక మూడవ సంఘము ౧,౮౫౦ సంవత్సరముల పాటు ౪౯ రాజుల పరిపాలనలో ౪౯ సభ్యులతో గూడినదై ౪౪౯ కవుల కావ్యములను పరీక్షించినది. ఈపరిషత్తులో అగస్త్య ముని వాని శిష్యులును గూడ నుండిరట. "తిరువళ్లువార్" అనువానిచే రచింపబడిన "కురళ్" అను నీతిబోధక గ్రంథమునుబట్టి యీ పరిషత్సభ్యుల నామములు మనకు దెలియవచ్చుచున్నవి. ఈ పరిషత్తున కధ్యక్షుడు "నక్కీరార్" అనువాఁడు ఇప్పటికి నిలిచియున్న "ఎట్టుత్తొగై", "పత్తుప్పాటు", "పదినెన్‌కీల్‌కణకు" మొదలగు ప్రాచీన సంఘవాఙ్మయమునకు జెందినవిగా దలంపబడుచున్న గ్రంథము లనేకము లీమూడవ సంఘమునందలి సభ్యుల యంగీకారముద్రను బొందినవే. ఇదియే యిపుడు ప్రాచీనసంఘ వాఙ్మయమని చెప్పబడుచున్నది. మొదటి సంఘములోనే శివుడు, మురుగుడు మొదలగువారితో పాటు ఒక అగస్త్యుఁడు కూడ కనబడుచున్నాఁడు. *ఈ మూడవసంఘములోగూడ నగస్త్యుఁ డొక డున్నాఁడు. కావున వాఁ డీతనికంటె భిన్నుఁడని కొందఱి యభిప్రాయము. ఈ మూడవసంఘమునందలి యగస్త్యమునియే కాశిలో గొందఱు సంస్కృతపండితులతో నేదో వివాదము పెట్టుకొని, వారిపై గోపముచే సంస్కృతము కంటె మధురమైన భాష నొకదానిని తనకు దెలుపుమని కందస్వామిని వేడుకొనఁగా, నంతలో నా యగస్త్యుఁడున్నగది యంతయు దివ్యపరిమళభూయిష్ఠమయ్యెనట. అంత నాస్వామి యా మునీశ్వరు నాగదిలో నొక మూలను వెదకుమని సెలవిచ్చెను. అట్లు వెదకఁగా నా యగస్త్యుని కీభూర్జ పత్రముల గ్రంథ మొకటి యొకమూల కనఁబడెను. వెంటనే యాతఁడు "తమిళ్ తమిళ్" (అనఁగా, మధురమైనది-మధురమైనది) అని యాశ్చర్యముతో పలికెను. ఆకారణముచే నీభాషకు తమిళభాష యను పేరు కలిగెననియు, నద్దానిని మునీశ్వరుఁడు కందస్వామియొద్ద నేర్చుకొని వచ్చి దక్షిణదేశమున వ్యాపింపజేసెననియు నొక కథ కలదు. ఇట్టిగాథ లింక ననేకములు కలవు. అగస్త్యుఁడను వాఁడు తమిళభాషను సృష్టించి వ్యాపింపజేసినను చేయకున్నను, మొత్తముమీద తమిళభాష కగస్త్యముని ప్రధానదేవతగా భావింపబడుచున్నాఁడు. ఈతఁడే యీ భాషకు ప్రప్రథమమున వ్యాకరించి లక్షణ మేర్పఱచిన మహాముని యని సర్వసామాన్యముగా విశ్వసింపబడుచున్నది. ఈతఁ డొక్క భాషాలక్షణకర్తయే గాక సుమారు ౨౦౫ వైద్యగ్రంథములను రచించిన వైద్యశిఖామణి. అనేకములగు వేదాంతగ్రంథములను గూడ రచించెనని చెప్పుదురు. ఈతని లక్షణగ్రంథము ఇయల్ (Verse), ఇశై (Lyric), నాటకం (Drama) అను మూడుభాగములతో గూడి ౧,౬౦౦ సూత్రములు కలదై యుండెనట. కాని యిందు చాలభాగము ఖిలమైనది. ఏవో కొన్నిసూత్రములు మాత్రమే "తొల్కాప్పియ" వ్యాఖ్యానకర్తలచే నుదాహరింపబడియుండుటచే నిప్పటికి నిలిచియున్నవి. ఇది యిట్లుండ నగస్త్యుఁడను లక్షణకర్తయే లేఁడనియు, నీతనిగూర్చిన కథలన్నియు తరువాతివారి కల్పితకథలే యనియు ప్రాచీన తమిళసంఘవాఙ్మయ మనుదానిలో నెచ్చటను ఈతనిపేరు గాని ప్రశంస గాని కనబడకుండుటచేతను, నీతనిపేర బరగుచున్న లక్షణగ్రంథములలో ననేకములగు నర్వాచీనవిషయము లుండుటచేతను, నీలక్షణగ్రంథములు, వైద్యగ్రంథములును గూడ తరువాతివా రెవరో రచించి యాతని పేర వ్యాపింపజేసినవే యనియు విశ్వసించువా రాధునిక తమిళపండితులలో పలువురు కలరు. మొత్తముమీద నాంధ్రమునకు బృహస్పతి, కణ్వుఁడు మొదలగు మునులు

---

* సంఘమనునది జైనబౌద్ధ మతములకు సంబంధించినది గావున నీ దక్షిణదేశమున జైనబౌద్ధమతవ్యాప్తి కలిగినపిదపనే యీసంఘము లేర్పడె ననుట యుక్తిసహమై యుండుటచే మొదటి రెండుసంఘములు నీ వాఙ్మయమునకు ప్రాచీనత నాపాదించుటకుగా నిటీవల కల్పింపబడియుండునని విమర్శకదృష్టితో జూచినవారు తలంచుచున్నారు. మూడవదియే వాస్తవమైన సంఘము.

ప్రథమ లాక్షణికులైనట్లే తమిళమునకగస్త్యముని ప్రథమ లాక్షణికుడైనాడు. ఈ దక్షిణదేశభాషలను వ్యాకరించి యుద్ధరించుట కీయార్యమహర్షి యేకాలమున వచ్చెనో తెలియుటలేదు గాని (అగస్త్యుడు రామాయణకాలమునకు దక్షిణదేశమునకు వచ్చియుండెనని మాత్రము తెలియుచున్నది. మూడవతమిళసంఘ కాలమునకును రామాయణకాలమునకును వ్యత్యాస మగపడుచున్నది), వీరినిగూర్చిన కథలు మాత్ర మేదో యొక్క సమకాలముననే యీదేశములలో బయలుదేరి యుండనోపునని యూహింపదగియున్నది.

ఇట్లఱవభాష కాదిముని యని చెప్పబడు నగస్త్యుని ౧౨ గురు శిష్యులలోని వాడీ "తొల్కాప్పియ" గ్రంథరచయిత. ఈ గురుశిష్యుల కొకప్పుడు గలిగిన భేద కారణమును గూర్చి యొక కథ చెప్పెదరు. అగస్త్యుడు హిమాలయమును విడిచి మలయ పర్వత ప్రాంతమునకు బయలుదేరు సమయమున, తన భార్యయగు లోపాముద్రను శిష్యునితో గూడ ముందు పంపివేసెనట. ఆ పంపునపుడు శిష్యుడగు తొల్కాప్పియనార్ ముందు పదిబారల దూరములో వెనుకకు తిరిగిచూడకయే పోవుచుండవలయుననియు, నాతనిని వెంబడించి యామె పోవుచుండవలయుననియు కట్టడిచేసెను. వీరిద్దఱు నట్లనే నడిచి పోవుచుండగా మార్గమున వైగైనది యడ్డము వచ్చెను. వీరానదిని కాలినడకనే దాటిపోవు సమయమున ప్రవాహవేగముచే నాయమ కొట్టుకొనిపోవుటకు సిద్ధమై యుండగా తొల్కాప్పియనారామెను గోల్పోవవలసి వచ్చునని తలంచి, గురునాజ్ఞ మీఱి వెనుకకు దిరిగి యొక వెదురుకఱ్ఱ నామెకు నూతగా నందిచ్చి, తాను దానిని పట్టుకొని తీసికొనిపోయి యామెను సురక్షితముగా నావలియొడ్డు జేర్చెను. ఈ విషయ మగస్త్యునికి దెలియగా దనయాజ్ఞ మీఱినందులకు శిష్యునిపై గోపించి యాతని నిందించి స్వర్గప్రాప్తి లేకుండునట్లు శపించెను. శిష్యుడును గురువు నవివేకితకు గనలి తిరుగ నాతని నట్ల శపించెనట. ఈ కారణముచే నగస్త్యుడు కోపము పట్టజాలక, తనయొద్ద వ్యాకరణ మభ్యసించి పండితుడైన "అదంకోట సిరియర్" అను మఱియొక శిష్యుని బిలిచి "తొల్కాప్పియర్" రచించిన వ్యాకరణమున తప్పులు చూపి ఖండించి యది మధుర సంఘ సభ్యుల యంగీకారమును బడయకుండునట్లు చేయుమని యాజ్ఞాపించెను. 'అదంకోట సిరియర్' ఒక పెద్ద చిక్కులో బడెను. ఒక వైపున గుర్వాజ్ఞ, మఱియొక వైపున నిష్కారణముగ గురుని కోపమునకు గురియైన సహాధ్యాయుని గ్రంథము. మొత్తముమీద నాగ్రంథమున నేవో కొన్ని స్వల్ప దోషములను పైకి దీసి చూపినను నందలి యుత్తమగుణములనే విశేషముగా కొనియాడుటచే పరిషత్సభ్యుల యామోదమే కలుగునట్లు చేసెను. ఆ కారణముచే నది పరిషదంగీకారముద్రను పొందనే పొందినది. ఈ తొల్కాప్పియమే తరువాతి కాలమున బయలుదేరిన లక్షణ గ్రంథముల కన్నిటికిని మూలాధారము. దీనికి పలువురు వ్యాఖ్యానముల రచించిరి. ఆ వ్యాఖ్యానకర్తలలో మొదటివాడు 'ఇళంపురనర్' అనువాతడు. ఇతడు తొల్కాప్పియమంతకును, "సేనావరియర్" అనువాతడు సొల్లధికారముపైనను, వ్యాఖ్యలు రచించిరి. అవి "ఇళంపురనం", "సేనావరియం" అని తద్రచయితల పేరనే, పరగుచున్నవి. 'నచ్చినార్ కినియర్' అనువాత డీ గ్రంథమున కంతకును వ్యాఖ్య రచించినాడు. వీరు మువ్వురును గాక "పేరాసిరియర్", "కల్లాదర్" అను వారు కూడ దీనికి వ్యాఖ్యలు రచించియుండిరి. తరువాతికాలమున ననగా పదుమూడవ శతాబ్ద ప్రాంతమున పవనంది మొదలగు వారు రచించిన 'నన్నూల్' మొదలగు వ్యాకరణములన్నియు చాలవఱకు తొల్కాప్పియము ననుసరించి రచింపబడినవే. ఈ తొల్కాప్పియ వ్యాకరణము క్రీస్తుశకారంభముననో, యించుక తరువాతనో రచింపబడియుండునని విమర్శకులు తలంచుచున్నారు.

'ఇయల్', 'ఇశై', 'నాటకం', అను తమిళ వాఙ్మయభాగములు మూడింటిలో నీ తొల్కాప్పియమ్ 'ఇయల్' అను మొదటిభాగమును గూర్చియె చెప్పుచున్నది. ఈగ్రంథమున మూడధికారములు గలవు. ఎళుత్తధికారము, సొల్లధికారము, పొరుళ్ అధికారము నని. ఇందు ౧౬౧౨ సూత్రములు కలవు. 'ఎళుత్తు' ననగా వర్ణము. కావున ఎళుత్తధికారము వర్ణములకు సంబం

ధించిన విషయములను గూర్చి తెల్పుచున్నది. 'శోల్' అనగా శబ్దము. కావున రెండవది శబ్దాధికారము. 'పొరుల్' అనగా 'వస్తువు'. కావున మూడవది కావ్య వస్తువునుగూర్చి తెలిపెడు నధికారము. వీనిలో ప్రత్యధికారమునకు తొమ్మిదేసి భాగములు కలవు. అందు

ఎళుత్తధికారమునందలి భాగములు :—

౧. నూన్‌మరపు = సంజ్ఞా ప్రకరణము.

౨. మొళిమరపు=పదముల నడుమను వచ్చు ధ్వనులనుగూర్చి తెలుపునది.

౩. పిరపు ఇయల్ = వర్ణోత్పత్తి విధానమును గూర్చి తెలుపునది.

౪. పుణరియల్ = సంధి ప్రకరణము, సామాన్య విధులను దెలుపునది.

౫. తొగైమరపు = సంప్రదాయసిద్ధమగు సంధిని గూర్చి తెలుపునది.

౬. ఉరుపుఇయల్ = విభక్తి సంధి ప్రకరణము.

౭. ఉయర్‌మయంగు ఇయల్ = అజంత సంధి ప్రకరణము.

౮. పుళ్లిమయంగు ఇయల్ = హలంత సంధి ప్రకరణము.

౯. కుట్రియలు కరపుణరియల్ = హ్రస్వతరోకారాంత సంధి ప్రకరణము.

శొల్లధికారము నందలి భాగములు:—

౧. కిళవి అక్కం = పదముల వాక్యములో జేర్చి చెప్పుటను గూర్చి దెలుపు ప్రకరణము.

౨. వేట్రుమైఇయల్ = విభక్తి ప్రకరణము.

౩. వేట్రుమైమయంగు ఇయల్ = విభక్తి ప్రత్యయము చేర్పబడినప్పుడు కలుగు మార్పులను దెలుపునది.

౪. విళిమరపు = సంబోధన విభక్తి ప్రకరణము.

౫. పేయర్ ఇయల్ = నామ ప్రకరణము.

౬. విన్నైఇయల్ = క్రియా ప్రకరణము.

౭. ఇడైఇయల్ = ఆగమ ప్రకరణము.

౮. ఉరిఇయల్ = నిపాత ప్రకరణము.

౯. ఎచ్చఇయల్ = క్రియా విశేషణ నామ విశేషణ ప్రకరణము.

మూడవది యగు పొరుళధికారమునందలి భాగములు:—

౧. అహత్తిణై ఇయల్ = అభ్యంతరవస్తు ప్రకరణము—శృంగారరసమును గూర్చిన వస్తువును ప్రతిపాదించునది.

౨. పురత్తిణై ఇయల్ = బాహ్యవస్తు ప్రకరణము—యుద్ధము వీరరసమును గూర్చిన వస్తువును ప్రతిపాదించునది.

౩. కళవు ఇయల్ = ప్రథమదర్శనమందు పొడమిన యనురాగమును గూర్చి చెప్పునది.

౪. కర్పు ఇయల్ = వివాహోత్పూర్వము సమాగమము లేని నాయికానాయకుల యనురాగమునుగూర్చి తెలుపునది.

౫. పొరుళ్ ఇయల్ = సామాన్యవస్తువిభాగములనుగూర్చి తెలుపునది.

౬. మైప్పాట్టు ఇయల్ = మానసికవృత్తులను గూర్చిన ప్రకరణము.

౭. ఉవమ ఇయల్ = ఉపమాలంకార ప్రకరణము.

౮. శెయుళ్ ఇయల్ = ఛందస్సును గూర్చినది (Versification).

౯. మరపు ఇయల్ = తమిళ జాతీయములను గూర్చి చెప్పునది.

దీనినిబట్టి మొదటి రెండధికారములును భాషావ్యాకరణ విషయములను దెలుపుచుండ, మూడవ ప్రకరణము వస్తురసాదులను గూర్చియే గాక ఛందోలంకారవిషయములను గూర్చియు దెలుపుచున్నదని విశదమగు

చున్నది. తరువాతి వ్యాకరణములలో నీ ఛందస్సు, అలంకారము అను విషయములు, ౮, ౯ భాగములుగా ప్రత్యేకము గ్రహింపబడు చున్నవి. తొల్కాప్పియములోని యీ పొరుళధికారము ప్రాచీన తమిళకావ్యవస్తువును గూర్చి తెలుపు సందర్భమున, నా దేశకాల స్థితిగతులను గూర్చియు విశేషముగా జెప్పుచున్న దగుటచే, ప్రాచీన తమిళ దేశ చరిత్రను దెల్పు గ్రంథములలోగూడ నిది ప్రాధాన్యమును వహించుచున్నది. కావ్యములలో శృంగారము గాని వీరరసము గాని యాయా దేశకాల విభాగము ననుసరించి గనే వర్ణింపబడవలయు ననున దొకకవిసమయము. శృంగారము-లేదా అనురాగము రెండువిధములు. నాయికా నాయకులు లెచ్చటనో కలియు", ప్రథమదర్శనమున నే వారి కనురాగోదయ మగుట, వారు తల్లిదండ్రుల యనుమతి గాని, వారి జోక్యము గాని లేకయే స్వయముగా (గాంధర్వ) వివాహము చేసికొనుట;—ఇదియే 'కళవు ఇయల్' అను భాగమున ప్రతిపాదింపబడునది. రెండవది యొకకన్య తల్లిదండ్రుల యాజ్ఞలో మెలగుచు వారి యనుమతిపై నొక నాయకుని వరించి వారిచే తానా వరుని కొసంగబడి వివాహము చేయబడిన పిదపనే యా నాయకుని సాంగత్యమును బడయుట. ఇది 'కర్పు ఇయల్' అనుభాగములో వివరింపబడినది. ఇక శృంగారము రసమైనపుడు నాయికానాయకుల సమాగమము (పుణర్దల్) కురంజి అనగా పర్వతప్రదేశమందే జరిగినట్లును, రాత్రి మొదటిజామున సంఘటిల్లినట్లును వర్ణింపబడవలయును. అట్లే వియోగము (పిరిదల్) పాలై అనగా మరుప్రదేశమునను, అర్ధరాత్రి వేళను జరిగినట్లు వర్ణింపవలయును. వియోగమున నోర్పు గలిగియుండుట - ప్రత్యాశ, దుఃఖము, అభిసరణము అనునీ మూడును క్రమముగా అడవి ప్రదేశమునను (ముల్లై), సముద్రపుటొడ్డునను (నైదల్), మాగాణిచేలుగల ప్రదేశమునను (మరుతం) జరిగినట్లు సూచింపవలయును. వీని కనుగుణములగు ఋతువులు, పక్షులు, పువ్వులు మొదలగునవియు గలవు. ఇక 'పురం'అనగా బాహ్యవస్తువు. ఇందు వీరరసమునకు సంబంధించిన యుద్ధాది వర్ణనము ప్రధానమైనది. మొదట నిది గోగ్రహణముతో ప్రారంభింపబడి, దాడి వెడలుట, ముట్టడి, యుద్ధము, జయము, హితబోధనము, విజయప్రశస్తి యనెడు విషయ క్రమముతో గూడియుండవలయును. దీనికిని పై (అగం) శృంగారమునకు వలెనే దేశకాల పుష్పాదికమును గూర్చిన నియమములును గలవు. గోగ్రహణమునకు సంబంధించినది (కురంజి) పర్వత ప్రదేశము. అనగా గోగ్రహణ మా ప్రదేశమున జరిగినట్లు సూచింపవలయును. దాడి వెడలుటకు సంబంధించినది (ముల్లై) అడవిప్రదేశము. ముట్టడికి (మరుదం) మాగాణి చేలుగల ప్రదేశము. యుద్ధమునకు (నైదల్) సముద్రప్రాంతము, విజయమునకు (పాలై) ఎడారి. కాని యీ నియమము ప్రాచీన గ్రంథములలో నియతముగా పాటింపబడిన ట్లగపడదు. ఇక పుష్పముల విషయమున ఎఱ్ఱనిరంగుగల వెచ్చి పువ్వులు రుధిరస్రావముతో గూడిన యుద్ధకర్మకు చిహ్నముగా గ్రహింపబడును. పసుపు పచ్చని 'వంచి'పువ్వులు అప్రతిహతమైన శక్తికి చిహ్నములు. బంగారువన్నెగల యొకవిధము పత్తిపువ్వులదండ దుర్బలమై సుళభముగా స్వాధీనము నొకకోటను ముట్టడించువారిచే ధరింపబడును. "తుంబై" యను ద్రోణపుష్పము కేవల యుద్ధచిహ్నము. యుద్ధసన్నద్ధులై శత్రువులపై బోవు రాజులచే నీ పూలదండ ధరింపబడును. 'వాహై'యను తెల్లని పువ్వుల దండ రాజులు విజయమును బడసి యింటికి బోవునపుడు ధరింతురు. ఇట్లు కావ్యవస్తువును గూర్చిన విషయములనేకము లీమూడవభాగమున దెలుపబడినవి.

ద్రావిడభాషా వ్యాకరణము లన్నిటిలోను నతి ప్రాచీనమై క్రీస్తు శకము మొదటి శతాబ్దప్రాంతమున బయలుదేరిన యీ తమిళభాషా వ్యాకరణమందలి విశేషములను దెలిసికొనినచో, నాంధ్రము మొదలగు తక్కిన ద్రావిడభాషలలోని వానికిని సంస్కృతాదులలోని వానికిని గల భేదసాదృశ్యములను గనిపెట్టుట కవకాశమేర్పడును. ముందు వర్ణములను గూర్చిన విశేషముల నించుక పరిశీలింతము.

రక్షకునిప్రాపు

వెల్లాల ఉమామహేశ్వరుఁడుగారు (రాయలసీమ కవికుమారసమితి)

నేను:—

చినిఁగిన గోఁచిపాఁతయును శీర్ణములై జడగట్టినట్టి యె
ఱ్ఱనివి శిరోజము ల్గలిగి రాళ్లఁ గరంగఁగఁ జేయు దీనతా
జనితములైన యశ్రువుల చా ల్గల చెక్కులతోడ నిందు ని
ల్చినజనుఁ డెవ్వఁ డోయి? యగలించెడు నాహృదయంబు నెంతయున్.

ఏలొకో నాయనా! తనువు నెమ్ములప్రోవయి యెండుటాకటుల్
తూలుచునుండె? గుంతవడి లోచనము ల్కడు జాలిఁ గొల్పెడున్?
ఏలొకొ దూర మేగ దిటు లేను నినుం దరిఁ జేర? నీగతిన్
సోలుచుఁ దూలుచుం బడెదుసు మ్మెటనైన నభాగ్యసోదరా!

*　　*　　*　　*　　*

అతఁడు:—

అంటరానివాఁడ ననరానివాఁడను-చేరరానివాఁడఁ జెనఁటివాఁడ
తొలుతపుట్టువందు శిలలచే దేవునిఁ-బూజచేసినట్టి పుణ్యజనుఁడ.

తెరువు లూడ్చుచుంటి దేహపోషణకయి-జ్వరము పీల్చి పిప్పి సలుపుకతన
పనికిఁ బోవకుంటఁ బడిపోయె జీతంబు-పస్తుపడుట యొకఁడె మార్గ మయ్యె.

రెండురోజు లయ్యె లే దన్న మింతకు-నోడల బలము లేద యుపవసింప
కులమువారు తమకె కూడు లేకున్నదో-నెట్లు నాకు నన్న మిడఁగఁగలరు?

అన్నమో యని సుతు లఱచుచున్నారలు-వారియేడ్పు లెడఁదఁ బగులఁజేయు
ఇంటిపనులచేత హృదయవేదనచేత-భార్య లేవలేక పడియె నేల.

బిచ్చమైన నెత్తి బిడ్డలకైనను-నింతగంజి చేసి యిత్త మన్న
ఇండ్లదరికి నన్ను నేరు రానీయరు-కాన చచ్చు టొకటె యౌనె తెఱఁగు?

ఏసుక్రీస్తు దేవుఁ డెవ్వరినైనను-నమ్మినట్టివారి యుమ్మలికముఁ
బాపి కాచు నంట:—పరమకృపామూర్తి-యతఁడు భేద మింత యరయఁ డంట.

అన్నమానచేసి యలక్రైస్తవులఁ జేరి-వారిమతముఁ జొచ్చి పడఁతి సుతుల
ప్రాణరక్ష సేయఁ బరుగెత్తుచుంటిని-తండ్రి! దూర మింత తలఁగిపొమ్ము.

"ద్రుతాఖ్యో నః; లుక్సంశ్లేషౌ నాచి"

అనుసూత్రములు, తద్వివరణములు, సమన్వయము

విద్వాన్ దూసి రామమూర్తి శాస్త్రిగారు

నకారము ద్రుతసంజ్ఞ నందునని యీ సూత్రమున కర్థము. ఈ యర్థము ననుసరించి నకారమాత్రము నకు ద్రుతసంజ్ఞ సంప్రాప్తము గా బాలవ్యాకరణకర్త యీ సూత్రము నున్న దున్నటులనే తెనిఁగించియుఁ దిక్సంఖ్యాది సూత్రములమూలమునఁ జింతామణికర్త యెఱుకపఱచిన కళలపట్టికనుబట్టి ద్రుతప్రకృతికముల నూహించి ద్రుతసంజ్ఞార్హ నకారముల నెల్లఁ దేటపఱుప యత్నించెను. బాలవ్యాకరణముచే సందిగ్ధము లగువానిని, ననుక్తములను నెఱుకపఱుప నెంచిన ప్రౌఢవ్యాకరణ కర్త పట్టికనుబట్టి ద్రుతసంజ్ఞార్హ నకారములను నిర్ణయించికొనుట దుస్సాధ్య మగునని యెంచి కావలయుఁ, దాను "నకారం బసాధారణంబు ద్రుతంబు" అని లక్షణ మును దెల్పుచు నసాధారణశబ్దమునకుఁ "ప్రత్యయాగమా వ్యయాత్మకమై యుత్వవిశిష్టమైన నకారంబు ద్రుతసం జ్ఞకం బని యర్థము. ద్రుత మనఁగా నొల్లనియెడ మఱుఁగి పోవునది యనుట" అని పై చింతామణి బాలవ్యాకరణ సూత్రముల ననుసరింప యత్నించెను. ఈతఁడు చింతామణి నెల్ల విషయములఁ బ్రమాణీకరించువాఁడు వోలె నటించు వాఁడు గాన శబ్దశాసనుఁ డుత్వవిశిష్టమయిన నకారమునకు ద్రుతాఖ్య నిడుట స్థిరసంజ్ఞాసిద్ధ్యర్థము గాని యుత్వ ముతో నుండరా దనుటకుఁ గాదని స్వసిద్ధాంతమున కను కూలించుకొని 'నః' అనుదానినుండి యర్థము నుద్ధరించిన వాఁడు. దాన వర్ణసమామ్నాయమున హల్లులపై అకా రము లుచ్చారణార్థము ప్రయుక్తము లయ్యెననియు, నట్టి అకారములో స్థిరసంజ్ఞ నందఁదగిన నకార ముం డుండుటబట్టి తత్స్వరూపజ్ఞాపనార్థ మందుఁ గేవలాత్వ విశిష్ట నకారమే స్వీకృత మయ్యెననియుఁ, గాన నుత్వ విశిష్ట నకార మనునర్థము నద్దానినుండి యుద్ధరింప నవకాశము గలదనియుఁ బ్రౌఢవ్యాకరణకర్త యభి ప్రాయపడెనని తెల్లమగుచున్నది.

మఱియు నిట్లే "కచటతపాః పరుషాఖ్యాః, గజ డదబాస్తు సరళాః" అని అత్వవిశిష్టములకే తత్తత్సంజ్ఞల నిడుటయుఁ బై యభిప్రాయమునకుఁ బోషక మనియును భావించి యుండవలెను. దీని నిగూఢము చింతామణి సూత్రార్థ మిదియే యనియు, ద్రుతసంజ్ఞా విషయమున శబ్దశాసనునకును దీని యభిప్రాయమే గలదనియును ప్రౌఢవ్యాకరణకర్త యాశయ మైనట్లు తెల్లమగుచున్నది.

ఇఁక ద్రుతసంజ్ఞావిషయమునఁ దామును, జింతా మణికర్తయు నేకాభిప్రాయులే యగునపుడు "అన్నిట్ట సఖి" అను నన్నయప్రయోగమునందలి ప్రకృతిస్థ నకార మునకు ద్రుతసంజ్ఞ యుభయులమతమునను దుస్సాధ మగుటం జేసి, ప్రౌఢవ్యాకరణకర్త దానిని దన ద్రుత ద్విత్వములకుఁ బ్రమాణముగఁ జూపుటకును, నన్నయ ద్రుతసంశ్లేషరూపములను బ్రయోగించెననుటకును నెట్లు సాహసించెనో యరయవలసియున్నది. మఱియు నియ్యది ద్రుత ద్విత్వమే యని సాధింప నవకాశ మున్నపుడు ప్రౌఢవ్యాకరణకర్త దీనిని బెన్నాదులకడ హల్లునకు ద్విత్వము సాధించు సూత్రమునందలి తఱచుశబ్దమునకు లక్ష్యముగాఁ జేయ నెంచుట కనియు విచారింపవలసి యున్నది.

అరయ నరయఁ, బ్రౌఢవ్యాకరణకర్త "ద్రుతా ఖ్యో నః" అను సూత్రమునందలి "నః" అనుదానినుండి తాను జెప్పిన యర్థముగూడ నుద్ధరింప నవకాశము గల దనుటకు మాత్రమే యద్దానిఁ బ్రమాణీకరించెఁ గాని యదియే నన్నయయాశయమని యభిప్రాయపడలేదనియు,

అకార మాచ్చారణార్థ మనువప్రుడు యథాశ్రుతమగు నర్థము ననుసరించి యెల్ల హల్లువకారములును ద్రుతసంజ్ఞార్హములగుటం జేసి, నన్నయమతమున "అన్నివ్వసఖి" అనుదానియందలి 'న్ని' అనునది ద్రుతసంశ్లేషము గానోపును గాన నన్నయకూడ ద్రుతద్విత్వరూపములం బ్రయోగించె ననుటకు మాత్రమే యారూపమును దన ద్రుతద్విత్వవిధానసూత్రముక్రిందం బ్రమాణముగ నుదాహరించె ననియుం, దనమతమున 'అన్' అనుదానియందలి హల్లు ప్రకృతిస్థమగుట దానికి ద్రుతసంజ్ఞ సిద్ధింపమిని మహాకవిప్రయోగసాధుత్వసంపాదనమునకై కడంగి ప్రకృతిస్థనకారములకు ద్విత్వమును సాధించు పెన్వాది సూత్రమునందలి తదనుశబ్దమునకు లక్ష్యముగం జేసెననియు, "అన్నివ్వ సఖి, పెన్నురము, అన్నువ్వకుండు" అనునవి మిశ్రసమాసములగుటంజేసి, యాచ్ఛికసాధారణమును, నకారానకార సామాన్యమును నను పెన్వాదిసూత్రమునకు లక్ష్యముగం జేయక సరూపత ననుసరించి యందలి తదనుశబ్దమునకు లక్ష్యముగం జేసెననియు సమన్వయమును గ్రహింపవలసి యున్నది.

ఇకం బ్రౌఢవ్యాకరణకర్త తలంచినచొప్పున 'నన్నివ్వసఖి' యనునది 'లుక్సంశ్లేషా వాచి' అను సూత్రమునకు విరుద్ధమగు నుదాహరణమా, యచట సంశ్లేషమునకు రెండుహల్లుల కలయికయే యర్థమా, యను విషయము లాంధ్రశబ్దచింతామణిప్రణాళిక ననుసరించి విమర్శించి నిశ్చయింపవలసియున్నది.

చింతామణిలో ద్రుతమున కచ్చు పరమగునపుడెచటను రెండుహల్లుల కలయికరూపమగు సంశ్లేషము విహితము గామింజేసియు, ద్రుతమున కచ్చు పరమగునప్పుడు ద్రుతలోపమునుగూడవిధింపమింజేసియు "లుక్సంశ్లేషా వాచి" యను సూత్రము నభావవిషయనిషేధకమై నిరర్థకముగ సూత్రితమయ్యెనని యనవలసివచ్చినది. శబ్దశాసనుండు ప్రయోజనము నెంచక యొకసూత్రమును రచించె ననుటకన్నం దత్ప్రణాళిక ననుసరించి విమర్శించి చక్కనియర్థము నద్దానినుండి యుగ్గడింప యత్నించుట సముచితమని మది నెంచి యింకం దత్ప్రణాళికం బరిశీలింతము.

నిపుణముగం బరికింప, ద్రుతపూర్వప్రాణసంధి చింతామణికర్తృసమ్మతమైనట్లు "అనాదిషు అవిభక్తిషూతోవా, చోర్వా స్యా ద్వర్తమానవిహితస్య" అను మొదలగు విధుల ననుసరించి నిశ్చయింపవలసి యుండుటంజేసి ద్రుతపర కాకా రేకా రోకారాంతరముల కచ్చు పరమగునపుడు క్రమముగా "వాతః, ప్రాయస్తు స్యాత్క్వాదిక స్యేతః, సంధి ర్నా చో ఉచ్యసుతః" అను సామాన్యవిధులచే సంధివశమున నవ్యాదివద నుండు ద్రుతము లుప్తమై యపరూపము లేర్పడవలసియుండ (రాముఁన్ + ఏమి=రామేమి, చేయన్ + అపుడు=చేయపుడు, హరిన్ + ఏల=హరేల), నింక విశేషవిధ్యంతరములు లేమి నట్టిచోటులందలి ద్రుతము స్వపూర్వస్వరము నంటి వ్రేలాడుచు నట్లే యుండవలసియుండ నట్టిచోట్ల సంధ్యాభావముచే ద్రుతలోపము కలుగదనియు, ద్రుతమునకు స్వపూర్వ స్వరాశ్రయణరూపసంశ్లేష మచ్చు పరమగునపుడు కలుగదనియు, "లుక్సంశ్లేషా వాచి" అనువిధిచేం దత్కర్త తెల్పవలసివచ్చెనని విశ్వసింపవలసి యున్నది. కాంగా, విశేషవిధులు లేనపుడు సామాన్యవిధులు సంప్రాప్తములైనను, విధియగపడనప్పుడైనను, ద్రుతప్రకృతికముల కచ్చు పరమగునపుడు సంధి చేయరాదనుటకును, సంధ్యభావముకతన నేర్పడు ద్రుతము స్వపూర్వస్వరము నంటియుండు (వచ్చెన్ ఇపుడు) సంశ్లేషరూపము లపరూపములు గాన నట్టిచోటులందలి ద్రుతమును బరస్వరముతోం గూర్పవలె ననుటకును నీసూత్ర మారబ్ధమయ్యెనని ఫలితమును గ్రహింపవలసి యున్నది. దీని కిట్లర్థము సందర్భోచితముగం జేయునపుడు చింతామణిచే నేర్పడు "రాముఁన్, నినున్, ననున్, హరిన్" అను మొదలగు సంక్షిప్తరూపముల కచ్చు పరమగునపుడు కలుగు "రామేల, నినేల" నను మొదలగు నపరూపము లేర్పడుట కేయవకాశము లభింపదు. మఱియుం జింతామణిలో నెచటను ద్రుతప్రకృతికముల సంధిని వారించు సామాన్యసూత్ర మగపడకుండుటయు నిందులకుం దోడ్పడుచున్నది.

ఇంక "లుక్సంశ్లేషా వాచి" యను సూత్రము ద్రుతప్రకృతికముల కచ్చు పరమగునపుడు సామాన్య సంధి సూత్రములవలనంగల్గు ద్రుతలోపమును, విధ్యంతరాభావ

మునఁ గల్గు ద్రుతస్వపూర్వస్వరాశ్రయణరూపసంశ్లేషమును నిషేధించున దగునపుడు, చింతామణి మతమున ద్రుతప్రకృతికములు గాఁదగు తద్ధర్మక్రియాతద్విశేషణోకారములకు సంధిని నిషేధించు “న స్యాత్ తద్ధర్మోక్తేః” అనుసూత్ర మేల యారబ్ధమయ్యెనని విమర్శింపవలసి యున్నది.

తద్ధర్మవిశేషణోకారములు ద్రుతమంతమందుఁ గలవైనను వానిద్రుతములు సమాసమున| “ద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు” అను విశేషవిధి ననుసరించి యచ్చు పరమైనపుడును లోపించును గాన, నట్టిచోటుల ద్రుతమును దిరుగ నుద్ధరించుటకై ‘న స్యాత్ తద్ధర్మోక్తేః’ అను సూత్ర మారబ్ధమయ్యెననియు, చేయుఁడ్ మొదలగు సమాసక్రియల కచ్చు పరమగునపుడు సమాసమునఁ గల్గు ద్రుతలోపము సంధించ నవకాశము లేమిం జేసియు, నట్టిచోట సామాన్యసంధివిధిప్రాప్తద్రుతలోపమును వారింప ‘లుక్సంశ్లేషౌ నాచి’ యనుసూత్రము సమర్థమైయుండుటం జేసియు, నాసూత్రమునకుఁ దద్ధర్మసమాసక్రియోకారములు విషయములు గావనియు, దాన నాసూత్రము తద్ధర్మక్రియావిశేషణముల కచ్చు పరమగునపుడు సామాసికద్రుతలోపవిధి ననుసరించి, లుప్తమైన ద్రుతమును దిరుగ నెలకొల్పుటకే యారబ్ధమయ్యెఁ గాని సంప్రాప్తసంధి నిషేధపరము గాదనియు గ్రహింపవలసి యున్నది గానఁ బైశంక కవకాశమే లేదు. మఱియుఁ గళలపట్టికలోఁ జేరమింజేసి చింతామణిమతమున “ప్రతిషేధవాదినాం నిః, భూతార్థానాం తు నః క్రియాణాం స్యాత్” అనువిధులచే సిద్ధించు “రక్షింపని, రక్షించిన” అను విశేషణములను గూడఁ దద్ధర్మక్రియావిశేషణములతోపాటుగ ద్రుతప్రకృతికములుగ నంగీకరింపవలసియుండుటచే సమాసమున నవ్వానిద్రుతము లోపించుటకై “ద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు” అనుసూత్ర మావశ్యకమై యుంట, సామాసికద్రుతలోపశాస్త్రము ప్రత్యాఖ్యానయోగ్యము కాదగదనియు గ్రహింపవలయును. ఇంతియ గాక, యరయ నరయ, “ద్రుతస్య సర్వత్ర లుక్సమాసేషు” అనుసూత్రముచే, “షష్ఠీ భవేత్ ద్వితీయాతుల్యా” అనువిధి ననుసరించి షష్ఠీసమాసమున ద్వితీయాతుల్యమైన పదము తుది నున్న ద్రుతము లోపింపఁగా, లుప్తమైన ద్రుతము నకారాంతములపైఁ దిరుగ నిల్పుటకై “షష్ఠ్యా ఉతోచి నుక్వేచ” అను సూత్ర మారబ్ధమైనయట్లే, “న స్యాత్ తద్ధర్మోక్తేః” అను సూత్రమును సూత్రింపవలసి వచ్చెనని నమ్మవలసి యున్నది గాన, “న స్యాత్ తద్ధర్మోక్తేః” అను సూత్రము సంధినిషేధపరము గాక నకారవిధానపరమనియే విశ్వసింపవలసి యున్నది. దీన “న స్యాత్” అను ద్విసకారపాఠమే సందర్భశుద్ధి గలదని గ్రహింపవలసి యున్నది.

ఇఁక “న స్యాత్ తద్ధర్మోక్తేః” అను సూత్రము సామాసిక ద్రుతలోపవిధి లుప్తద్రుతపునరుద్ధారక మగునపుడు “షష్ఠ్యా ఉతోచి నుక్వేచ” అను సూత్రమునందువలె నుమ్మనక ‘నః’ అని అకారముతోడ ద్రుతము నేల నిర్దేశించెనని యాలోచింపవలసి యున్నది. ద్వితీయాతుల్యత నందిన షష్ఠ్యంతపదోకారము ‘రాముని యాజ్ఞ’ అను మొదలగుచోటుల నిగాగమ వ్యవహితము గాక యంత్యాచ్చు గాఁ దగియుండునపుడే యీవిధి ప్రవర్తించునని తెల్పుటకై యందు నుమ్మనెననియు, నంత ద్రుతము సామాసిక ద్రుతలోపవిధిచే లోపింప నుకారాంతతయే తద్ధర్మక్రియావిశేషణములకు మిగిలియుంట నుచ్చారణార్థ మకారమును బైనిడి పొల్లునకారమును విధించినఁ జాలునని భావించి, ‘న స్యాత్ తద్ధర్మోక్తేః’ అను సూత్రమున ‘నః’ అనె ననియు గ్రహింపవలసియున్నది. కాన నీరీతి నాలోచించినను నీవిధి సంధినిషేధపరము గాక ద్రుతవిధానపరమే యగుచున్నది.

పైని నిరూపించిన కారణపరంపర ననుసంధించి “లుక్సంశ్లేషౌ నాచి” యనుసూత్రము ద్రుతప్రకృతికముల కచ్చు పరమగునపుడు సామాన్య సంధివిధులవలనఁ గల్గు ద్రుతలోపమును, విధ్యంతరాభావమునఁ గల్గు స్వపూర్వస్వరాశ్రయణరూప ద్రుతసంశ్లేషమును వారింప నారబ్ధమయ్యె నని యంగీకరించుటయే సముచితమని చింతామణి ప్రణాళిక విశదీకరించుచుండుటం జేసియు, నట్లంగీకరించునపుడే యీసూత్రమునందలి లుక్సంశ్లేషదళము లర్థవంతములు గాఁదగియుండుటం జేసియు నీసూ

త్రమందలి సంశ్లేషపదమునకుఁ బ్రౌఢవ్యాకరణకర్త చేసిన రెండుహల్లులకలయిక యనునర్థము స్వోక్తద్రుతద్విత్వములు శబ్దశాసనవ్యాకరణావిరుద్ధములని సమర్థించు నభినివేశముతో నొనర్చినది గాని తత్ప్రణాళిక ననుసరించునది కాదని విశ్వసింపవలసి యున్నది. మఱియు నీసందర్భము ననుసరించి "న స్వాశ్లిష్టద్రుతః" అను సూత్రము "మస్యా ఉతోచి మస్నేచ" అను సూత్రమువలెనే సామాసిక ద్రుతలోపశాస్త్రమువలన లుప్తమైన ద్రుతమును దిరుగఁ గల్పుటకై యేర్పడినదనియు గ్రహింపవలసి యున్నది.

కాఁగా 'అక్న్నంశ్లేషా నాచి' యనుదానిని సామాన్యవిధిప్రాప్త ద్రుతప్రకృతిక సంధ్యభావపరముగను, దళన్వపూర్వస్వరాశ్రయణరూప సంశ్లేషనిషేధపరముగను సమన్వయింపవలసి వచ్చుటఁబట్టి, ప్రామాణిక ప్రయోగములందును, "నందిని యన్నెటితరంగలు, అన్నిష్టసఖి, అన్న సుర, ఎన్నడున్నని" అను మొదలగు నన్నయ భారతప్రయోగములందును నగపడు నింకొకనకారమును జింతామణికర్త విధించుట మానెననియు, దాన నట్టివి చింతామణిదుస్సాధములనియు ననవలసివచ్చును.

కాని యాచ్ఛికశబ్దసాధనమునఁ జింతామణికర్త యంతగ శ్రద్ధ తీసికొననియట్లు తచ్చింతామణిప్రణాళిక విశదీకరించుచుండుటంజేసియు, నితరాచ్ఛికశబ్ద సంధ్యాది విషయముల నపేక్షించినట్లే ఇట్టిద్రుతద్విత్వముల సాధనము నపేక్షించె ననుటయే సయుక్తికమగుటంజేసియు, వాచ్ఛికశబ్దసిద్ధివిషయమున ముఖ్యముగ లోకమునే ప్రమాణీకరించిన చింతామణికర్త యిట్టి విరళప్రయోగముల నపేక్షించుట పొసఁగియేయుండుటంజేసియు, నన్నయభారతభాగ మంతటిలోను నొకటి రెండు మాత్రమే యిట్టి వగపడుటంబట్టి యాతనికాలమున నిట్టివి విరళములనుట కవకాశ ముండుటంజేసియుఁ, బాణిన్యాదులకువలెఁ దెలుఁగు వ్యాకరణకర్తలకు సర్వజ్ఞత్వ మంగీకరింప నవకాశము లేమింజేసియు, "అన్న + ఇష్టసఖి, అన్న + ఏరు, అన్న + అసుర" అని యిట్లు ఛేదించి యవ్వానికి సాధుత్వ మీయ శక్యమగుటంజేసియు, నింక విమర్శకులు ద్రుతద్విత్వములని సంభావించుచున్న "నన్నెల, చన్నె" మొదలగువానిని "నన్నునస్, నన్నున, నన్నునె, నన్ను, నస్, చనుస్, చన్స్, + ఏ" అని యీరీతిగఁ జింతామణిచే నేర్పడు సంక్షిప్తరూపముల సంధిరూపములని గ్రహింప నవకాశ ముండుటంజేసియు, నాఁడు నేఁడుఁ గూడ నిట్టివి విరళములే యగుటంజేసి నన్నయ యిట్టిప్రయోగ లేశముల నపేక్షించె ననుటయే పొసఁగియుండుటంజేసియుఁ, చింతామణికర్త కీవిషయమున నెట్టిశంకయును గలుగదని విశ్వసింపఁదగును.

విద్వద్బుధియభాషాప్రవీణ బిరుదములఁ బడయఁ గోరు విద్యార్థిబృందమున కీవ్యాకరణములను బోధించు సమయమునఁ దోఁచిన యీసమన్వయమునందలి గుణములను సమర్థులును, విచక్షణులును నైన యాంధ్రపండితు లభినివేశమును, బక్షపాతమును వీడి యాదరమున నరయుదురు గాక.

"ప్రణయ సామ్రాజ్యము"

(ప్రతివిమర్శ)

కర్లపాలెం కృష్ణరావుగారు

నేను వ్రాసిన "ప్రణయసామ్రాజ్యా"న్ని, నిమ్మగడ్డ పున్నయ్యశాస్త్రిగారు సంగ్రహంగా విమర్శించారు 'భారతి'లో...వారి విమర్శనలో గ్రంథకర్త లందరికి, విశేషించి నాకు, ఇచ్చిన సలహాకు నేను కృతజ్ఞుడను. "ప్రణయ సామ్రాజ్యము" పఠనీయగ్రంథముగా నుపయోగింప పనికిరాదని విమర్శకులు గట్టిగా నొక్కి వ్రాసిరి. మఱియు...

"విషయలంపటులై తల్లిదండ్రుల, గురువుల యాజ్ఞల నుల్లంఘించి స్వైరవిహారతత్పరత నభిలషించు పడుచువాండ్ర కుబుసుపోకకు జదివికొన నుపయోగింపవచ్చును. అంతియకాని, విద్యార్థులకు భాషాజిజ్ఞాసువులకు, కవితారసపిపాసులకు, ఆంధ్రభాషకు నేవ్విధి జూచినను సహకారి కానేరదు."

అని వ్రాసిరి.

అసలు నిజ మేమిటంటే:—ఈగ్రంథము పఠనీయగ్రంథముగా నుపయోగపడునని గాని, టెక్స్టు బుక్ కమిటీవారు యీ గ్రంథాన్ని అప్రూవ్ జేస్తారని గాని నేను వ్రాయలేదు. నేను జైలులో నున్నతరుణమున, పబ్లిషర్సు ప్రయత్నింపగా యీగ్రంథము అప్రూవ్ చేయబడినదట......సంఘమందున్న దురాచారాలను ఉన్నవి యున్నట్లు, జరిగినవి జరిగినట్లు వ్రాయడమే నా ముఖ్యోద్దేశము. గ్రంథరచనయందు సత్యమును బయల్పరచుటలో సమాజికులకు గాని, లోకానికి గాని, నేను భయపడక, స్వేచ్ఛగా భావప్రకటనము జేసితిని. ఇలా చేయడమే నా లోపమని విమర్శకు లూహిస్తే నేను సమాధానము వ్రాయజాలను. వెల్లివిరియుచుండే పవిత్రమైన భావాలతో స్వేచ్ఛాగాన మొనర్చి ఆనందించాను. గ్రంథమందలి నాయికానాయకుల పవిత్ర ప్రేమానుబంధములు కళంకరహితంగా దినదినప్రవర్ధమాన మగుచు, సంకల్పసిద్ధి యగుట చూపించాను. ఉపపాత్రలచేత సమయానుకూలంగా మాటాడించి పోషించాను. హేయముగ జీవయాత్ర సాగించే వేశ్య సన్మార్గానికి వచ్చి దేశసేవ జేస్తుంది. సాధారణంగా నిత్యము మన కళ్ల యెదుట జరుగుచుండే మోసకృత్యాలు చూపబడినయి. చాల వితంతువులకు జరుగుచున్న అన్యాయము, సంభవిస్తున్న కష్టాలు విపులముగ వ్రాయబడినయి. గ్రంథమందు శృంగారరసము ప్రధానము. సాంఘిక నవల కావడంచేతను, శృంగారరసప్రధాన మగుటచేతను, వేశ్యాలోలుర విషయాలు ప్రకటించుట కవకాశము గలుగుటచేతను, కొన్నిచోట్ల పచ్చిశృంగారము చూపబడినది. కాని అది నాయికానాయకులకు సంబంధించి

నది గాకపోవుటచేత, వారి పవిత్రప్రేమకు కళంకము గలుగదు. ఈగ్రంథము ప్రతులిప్ప టికే షుమారు మూడువేలు ఖర్చుపడియుండుట వల్ల యిందలి విషయములు ఆంధ్రలోకమునకు మరల తెలియజేయడము అనవసరము. "ప్రణయసామ్రాజ్యము"ను గూర్చి 'భారతి'మున్నగు పత్రికారాజము లొసగిన అభిప్రాయాలు ఆంధ్రలోకానికి తెలియకపోలేదు. వెతికి వెతికి, ఉన్నవాటిని, లేనివాటిని, కేవలము దోషములనే ప్రకటించిన విమర్శకుల వ్రాతలు సమంజసముగా లేవు. విమర్శకులు ఈర్ష్యారహితముగ గుణదోషాలను రెంటిని విమర్శించి యుండ లేదని చదువరులే గ్రహించియుందురు. నాయికానాయకుల ప్రేమానురాగములయందు కళంకము లేదనిన్ని, తదితరపాత్రలు సందర్భానుసారముగ పోషంపబడినవనిన్ని, విమర్శకులు వ్రాసినట్లు అసందర్భములు లేవనిన్ని, 'ప్రణయసామ్రాజ్యము' జదివిన తెలుగువారికి తెలియదా?

అసహ్యాకరములును అవినీతిని బోధించునట్టివియు, దోషభూయిష్ఠములును అగు అనేకగ్రంథాలు యిప్పుడు స్కూళ్లలో పఠనీయములుగా నుండుట మనము చూచుచునే యున్నాము. సంఘదురాచారములను నిరసించు 'ప్రణయసామ్రాజ్యమును' విమర్శించుటకు బూనుకొని, దోషములనే వక్కాణించిన విమర్శకుల యభిప్రాయ మేమో? ఈ గ్రంథ మెందులకును బనికిరాదనియు, భాషాదోషాలలామ కిది కాకిబంగారుసొమ్ము అనియు వ్రాసిన వ్రాతలయందలి సత్యాసత్యములను చదువరులే నిర్ధారణచేయగలరు. నా రాజోపు గ్రంథమందలి "పరము గిరమ్మటంచు నిట పల్కెద వేలను, కాని వాటి" అనుపద్యమును జూపుచు, "ఇట్టివేనా బాలురకు బోధించునవి?" అని విమర్శకులు వ్రాసిరి. ఆ గ్రంథము విద్యార్థులకొరకు వ్రాసినది గాదనియు, అది యొక ఖండకావ్యమనియు విమర్శకులు, గ్రహింతురుగాక. స్వర్ణయుగమందలి కవికుమారుల స్వేచ్ఛాగానము నాలకించి ఆనందించు భాగ్యమును, ఈర్ష్యారహితమగు సద్బుద్ధియు పున్నయ్యశాస్త్రిగారికి భగవంతుడు ప్రసాదించుగాక!



హోళీ



ప్రేమోద్యానము

కుపిత దూర్వాసము

సముద్రాల వేంకటరాఘవాచార్యులు గారు

(ప్రొద్దుటిపూట. ప్రశాంతకణ్వాశ్రమంలో ఏకాంతంగా వున్న శకుంతలకి దుష్యంతుని జ్ఞాపకం స్పృహకొచ్చింది. ఆ వూహల్లో ఆమె యెక్కడెక్కడో తిరుగుతోంది. ఆ సమయంలో అతిథిగా వచ్చి దుర్వాసుడు అపరిలక్షితు డైనాడు. అతనికి వళ్లు మండిపోయింది.)

కన్నొకటి తక్కువయ్యెనే కాని యతడు-విలయభైరవమూర్తి యావేళ గనుల
నిప్పుకలు రాలె బెంజెడ లుప్పరంబు-నలమి కంపించె, విశ్వంబు లాకులించె

ఇంద్రియంబులు గెలిచిన యింగితజ్ఞు-భ్రుకుటిమండలి ముడివడిపోయినంత
దొసగు లాడని నాలుకం దూసె విసపు-గూతలు పయోదపాళినిర్ఘాతములటు.

"తా నిలు పీడి యుండ వనితాగురుతం గనకుండ వే డాభూ
జాని నటంచు వచ్చిన విచారము సేయక చేసినట్టి య
జ్ఞానము కణ్వు డేమిటికి సైచెనొ ఆశ్రమగౌరవోన్నతుల్
పో నిడుమీద మూడగు తపోధన మేటికి శౌచ మేటికిన్.

పూవులదండవోలె శిరముంబడి దాల్చితి మిన్నినాళ్లు ని
న్నో వగలాడి, సాధ్వివయి యున్నతి గూర్చెద వంచు గాని పాల్
ద్రావి యురంబు గ్రుద్దినటు డాసిన మౌనికులమ్ముపట్ల సం
భావన మాని యిట్టు లవమానము సేయ గడంగినా విసీ!

ఎవనినో రాజమాత్రుని స్మరించుచు సన్యము విస్మరించి మా
నవపతిసేవ్యుడైన మునినాథుని నీశ్వరతుల్యు న న్బరా
భవ మొనరింప బూనితివి పాయగ ద్రోసి కమండలూదకం
బవునని యెండమావులకు నాసిలి పాతరలాడుతీరునన్.

గరగరలాడు ప్రాయపు వికారపుసుళ్ళ మునింగి తేలుచున్
గురులగు మౌనిసత్తములకుం దగుసేవ యొనర్ప కీగతిం
బరవశతం గుమారిలెడి పాపము భోజ్యము గాకపోదు నీ
వరుడును నిన్ను నిట్లె పరిభావము సేయునుగాత విస్మృతిన్."

ఈ శ్రుతికఠోర శాపవాక్యేతిహాస-ముల ప్రతిధ్వనించి నది తపోవనంబు.
ఆశ్రమ లతాళి రాల్చె దుఃఖాశ్రువులను-ఉరలి మిగిలిన మంచుబొట్లొకట రెంట.

సహజశాంతినివాస మాశ్రమపదమ్ము-భీషణస్వనోద్భ్రాంతమై బిక్కురుగొనె
నిర్నిమిత్తంబిదేమని నిమిషమాత్ర-మూహసేసి ప్రియంవద యుడికిపోయి.

కోసినపూవుముత్తములు కుట్టక పొత్తరలోన బోసి మె
చ్చో సహదుఃఖసౌఖ్య కనసూయకు జెప్పక మాటమాత్ర మా
యాసము నాక పర్విడి ప్రియంవద తెక్కలు గల్గినట్లు, దూ
ర్వాసుని గాంచి పాదములపై బడి దుఃఖకషాయకంఠయై.

"చెల్లియొ చెల్లకో కొమిరె చేసిన తప్పిద మోసరించి నీ
తల్లులసత్ప్రవర్తనవిధుల్ గరపందగు గన్నవారికిన్
జెల్లని పేదరాలిపయి జెల్లునె కోపము; మీర లల్గుచో
నెల్లిదమౌట గాక మరియేది శరణ్యము తాపసోత్తమా!

మునులు సమస్త దుర్విషయమూలనిషూదన పండితుల్ దపో
ధనులు ప్రశాంతజీవను లుదారమనస్కులు నయ్యునిట్టు లీ
తనువిషయాని కొక్కఘనసతిం బొసగించి దురాగ్రహింపబో
లునె? యిటు సేత విన్న బుధలోకము మెచ్చునె. నిన్ను భూసురా!

ఈ తలిరాకుబోడి యొనరించిన దేమి? సమాధిలో ముని
వ్రాతము చూడగా గలిగిరా యితరంబుల? నట్టివారు గా
రో తెరవల్? పవిత్రప్రణయోన్ముఖులై నపు డిష్టవస్తువున్
జేతమునన్ స్మరించుచు భజించుట మీ తలనే లిఖించెనే?

ప్రకృతినిసర్గమౌ మధురభావన నన్యము విస్మరించి తా
వక పదపూజనంబు సలుపం గమకింపగలేని యొక్క బా
లిక నరిక్రొత్తపెండ్లికొమిరెం దెగటార్పగ బోకు మయ్య ఘా
తుకతరశాపయుక్తి వలదో దయ యున్నది మౌనిమూర్తికిన్.

ఎందరు మౌనివర్యు లిట కింతకు మున్నరుదేర లేదు వా
రిం దనియింపదేమి పొనరించి యథోచితగౌరవాళి; దై
నందిన మిట్టి జీవనవినాశకశాపము విన్న ప్రాణముల్
బొందిని నిల్చునే? తలపబోవు మహర్షివి స్త్రీస్వభావముల్.

గురు పరివేగమై యలముకొన్న కళిందసుతోపమంబునై
విరిసి పిరుందు లంటికొని వ్రేలెడు నీలశిరోజసంతతిం
దురమక యేఖియో తలపు ద్రోవల శోకరసైకమూర్తియై
కరము కపోలసీమ నిడి గాసిలుచుండిన యీమె జూడుమా.

ఉడుగనివాంఛలం బొడమునూర్పుల వాడిన యోష్ఠసంపుటిన్
ముడుగు దరస్మితాళి నరమూతలకన్నుల వెల్లవోయి వె
ల్వడి కనుగొల్కులందునె మొరంగెడి చూపుల దన్మయాత్మయై
సుడివడుచున్న యీ యబల చూచునె నిన్ను పరాభవింపగన్.

ఏకతమందు నేరి కెఱిగించిన ద్రోవగ రానిదై యదృ
చ్ఛాకృతమైన యీవిరహసాగర మీదగలేనిదాని గ్రో
ధాకులితుండవై బ్రదుకు నార్ప గడంగుట గోరుచుట్టుపై
రోకటిపోటు గాదె—భువిలో నిది క్రొత్తది గాదె హానికిన్.

ఈ మెలనాగ నీవు శపియించిన గణ్వమునీంద్రు లేయభి
ప్రాయము వుత్తురో దలపవైతి; బెదర్పగ గాదు పుత్రి శా
పాయతి గుందునట్టి విషయంబు చెవిం బడెనేని, హాని గా
ధేయుడు గూడ సుంత వెనుదీయునె శాపరణాని కుగ్రుడై.

భారతసార్వభౌమపదభాసితు డై యెసలారు పుత్రు వి
స్ఫారగుణాన్వితుం బడయజాలు శకుంతల యంచు గణ్వు ల
న్నా రది సత్యహానటు లొనర్చుట మీకును బాడి దానితో
దీరు సమస్తబాధలును దివ్యులు మెత్తురు నీ దయామతిన్.

అగ్రకులోద్భవుండవు మహర్షికులాగ్రణి వార్తనిగ్రహా
నుగ్రహశక్తిమంతుడవునుం గద; నీ కెరుగంగరాని స
త్యాగ్రహ మేమి యున్నది, దయానిధి! శాపవిమోచనక్రియా
వ్యగ్రత జూపవేని గదలాడగ నీయను నీపదాబ్జముల్."

పదిబది యిట్టు లొప్పిదపుబల్కుల గర్జము హత్తగా బ్రియం
వద బతిమాలినంతన దపస్వియు శాపము ధర్మభంగబు
ద్ధ్యుదిత మమోఘ మద్ది; కననోపుత సౌఖ్యము లాత్మముద్రికన్
ముదిత! ధరాధినాథుడు గనుంగొన మీ చెలియంచు వేచనెన్.

తొరతొర బర్వులెత్తుటను ద్రొటిలుపూవుల బుట్ట బూని యు
స్సురనుచు వచ్చి చేర ననసూయయు నీ పలుకాడువేళ వా
రిరువురు నిర్ణయించికొని రేమి శకుంతల కీయుదంతవి
స్తరము వచింపరాదని ప్రశంసయొనర్చరు వా రిదెవ్వడున్.

'కృషీవలుఁడు'

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తిగారు

కవితాతత్త్వమును చక్కగ గుర్తెఱింగిన దువ్వూరు రామిరెడ్డిగారు రచించిన యమూల్యగ్రంథములలో నొకటి యగు "కృషీవలుఁడు" పండితపామరలోకమున కత్యంతాదరణీయమైన కావ్యము. "వాక్యం రసాత్మకం కావ్యం" అను పండితోక్తి ప్రకారము వీరి పద్యములు సాధారణముగ ఒక్కొక్క కావ్యమనియే యనవచ్చును.

వస్తువిషయమునను, శైలివిషయమునను, వర్ణన విషయమునను, ప్రాచీనప్రబంధ భావ మితనియం దిసుమంతయైన నున్నట్లు గన్పించదు. పైమూటి(విషయముల)యందును నిది స్వతంత్రగ్రంథమే. "ప్రకృతిబిడ్డవోలె పెరిఁగిన" కృషీవలుని దైనందినజీవితము ఇందలి వస్తువు. తత్సంబంధము లైనవియే వర్ణనాంశములు; శైలియు మృదుమధురమై శ్రోత్రపేయమై,యచ్చటచ్చట కృషీవల పారిభాషిక పదములవంటివి కొన్నిటిని గలిగి,నాతికఠినమై, సులభగ్రాహ్యమై యలరారుచున్నది. ఇట్టి గ్రంథము ఆంధ్రభాషలో నిదివరకు లేదని చెప్పవచ్చును. ప్రతిదినమును మనము నైరస్యముతో జూచుచున్న కృషీవలుని జీవితము తీసికొని, తత్సంబధములగు వర్ణనాంశముల గైకొని యించుకేనియు నస్వాభావికత కలుగకుండ, పాఠకుల మనస్సున నాటునట్లు ఆదరణీయ మహాశయముల బోధ పరుచుచు, నింత వరకు పెంచి మనయెదుట బెట్టిన వీరి యనన్యసాధారణ ప్రతిభ అనిర్వచనీయము.

ఇది యొక చిన్న ఖండకావ్యము. దైవప్రార్థనాదిక ప్రాచీనప్రాబంధికవిషయము లిందు లేవు. వస్తునిర్దేశముతోనే కావ్యము ప్రారంభింపబడినది. మనోహరములగు పద్యములతో నిర్వచనముగ వ్రాయబడినది. వీరి ప్రతి పద్యములోని భావమును గద్యలో పెట్ట ప్రయత్నించినయెడల అంత గుణవత్తరముగా నుండదు. పద్యములో చెప్పుట కర్హమైన భావమునే వీరు సాధారణముగ పద్యములో వ్రాయుదురు.

ఈచిన్నిపొత్తము (పరిమాణ విషయముననే చిన్నది) బోధించు ముఖ్యాదరణీయాశయములు రెండు గలవు. సంతృప్తి (contentment):

"ఉండి తిన్నను లేక పస్తున్నఁ గాని
ఆసచేయవు పరుల కష్టార్జితంబు."

రెండవది అనుదిన పరిశ్రమ (dignity of labour):

"మనపని చేసికొన్న యవమానమె..."
"అనుదినపరిశ్రమయె మత మగును నీకు."

అందు చేతనే కృషీవలుఁడు

"...........భారతసత్కీర్తిలాత్మ
గౌరవపవిత్రమూర్తి" యు,

"సాంఘికోత్కృష్టసౌభాగ్యసంపదలకు"

కారణమును అగుచున్నాడు. ఈరెండుగుణములు కలిగియుంటనే కృషీవలుడు మనకంటె మిన్న యైనాడు. అందుచేతనే

"అన్నా హాలిక! నీదు జీవితము నె
య్యంబార వర్ణింప మే
కొన్నన్ నిర్ఝరసారవేగమున వా
క్పూరంబు మాధుర్యసం
పన్నంబై ప్రవహించు......"

అని వీరు నుడివినారు.

మూఁడవది పౌరుషము; అనగా పురుష లక్షణము:

"...........................రమా
కలితుల్ భోగములన్ భుజించుచు నినుం
గన్నెత్తియుం జూతురే."

"అట్టికృతఘ్నులన్ మనము
నందుఁ దలంపక సేద్యనాద్యపున్
ఘట్టన నస్థిపంజరము
గాఁ దను వెండిన కాని వర్షముల్
పట్టిన కాని క్షామములు
వచ్చిన కాని శరీరసత్వమే
పట్టుగ స్వశ్రమార్జితము
పట్టెడు నన్నము తిందు వెప్పుడున్."

అని సరిగానుడివి మనలకు బోధించుచున్నారు.

మఱియు

"...చెమ్మటల్ దొరఁగ శ్రమియించి పౌరుషము
తో బ్రతికించెదు నీ కుటుంబమున్."

తరువాత వ్యవసాయవృత్తి యొక్క ఘనతను వీరు పాఠకుల మనంబుల నాటునటుల చక్కనిపద్యములలో వర్ణించిన భాగములు మిక్కిలి యాదరణీయములు.

"కృషి సకల పరిశ్రమలకు కీలుచీల
సత్పరిశ్రమ వాణిజ్యసాధనంబు
అఖిలవాణిజ్యములు సిరి కాటపట్లు
సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ."

"ధారుణీపతి పాలనాదండ మెపుడు
నీ హాలంబుకన్నను ప్రార్థనీయ మగునె?"

"............ని
ర్ర్థకభూములనైనఁ జెమ్మటన్
శ్యామలసస్యవంతముగ
నల్పెడు కాఁపులు నోగులైన నిం
కోమెడువార లెవ్వరు జ
నోత్కరమున్ సరసాన్నదాతలై."

ఇట్లు చెప్పుట కూడ గుణవత్తరముగా లేదని కాబోలు,

"సంఘపరివర్తనంబులు జరుగుచున్న
రాజకీయ సంక్షోభంబు రగులుకొన్న
విప్లవంబుల దేశంబు వీఁగుచున్న
కృషి త్యజింపకు కర్షకా! కీడు గల్గు"

అని చెప్పి యేయెడను కృషియే గౌరవపాత్రమని నొక్కి వక్కాణించుచు, "సర్వవృత్తిపావన"మైనది కృషి యని చెప్పినారు.

హాలికులు పడు కష్టముల నింతైనను గుర్తింపక కర్షకులన నెంతెయు నీరసదృష్టితో జూచువారు గూడ కనికరము చెంది వారిపైనే యన్నికష్టములను పెట్టకుండ తాము కూడ పాల్గొనవలసినదని చెప్పుచున్నారో యన,

"మున్నూటఱువది దినముల
నెన్నండును గన నశక్య మేపనియును లే
కున్న నిమేషము; కాఁపుం
గన్నియ! నీ కాటవిడుపుకాలము లేదే?"

అని కర్షకవనితలు కూడ నెల్లప్పుడు శ్రమపడు చున్నారని చెప్పినారు.

"నిత్యకృత్యములం దొక్క నిమిషమైన
దొంగిలింపుము కైసేయ తోయజాక్షి"

యనుటలో పాఠకుల హృదయ మెంతగా గర గునో గమనింపుడు. 'అహా! కైసేయుటకు గూడ తీరుబడి లేక యెల్లప్పుడు కష్టపడుచు న్నారే పాపము. స్త్రీలు కూడ నిట్లు నిత్య కృత్యములలో మునింగి పనిచేయుచుండ మన కాలమును వృథాపుచ్చుచున్నామే మనము. ఇకనైనను మేల్కొనవలయు' నని యేపాఠ కుని హృదయమున తోచదు?

"ఓయి రెడ్డియువక! ఊరక యిందందు
తిరుగ నేమి ఫలము, తిండిచేటు"

అని వీరు వ్రాసిన మాటల యాథార్థ్య మెంత భావిసూచకముగ నున్నదో గమనింపదగినది. మున్ముందు రాబోవు నిరుద్యోగసమస్యా ప్రాబ ల్యమును వీరు గుర్తించినట్లు కన్పట్టెడిని. అందు చేతనే "సర్వవృత్తిపావన కృషిజీవనైకసరి పాలన" "లోకహితార్థ కాంక్షుల"మై యందర మును చేయవలసినదిగా వీరు బోధించినారు.

"శ్రమము లేకయె ఫలములు దుముకఁబోవు
పిండికొలఁదియె రొట్టె; ఓపినవిధాన
కష్టపడుము కృషీవలా! కలుగు సుఖము
ఉత్తరయానలకన్న మే లుద్యమంబు"

అను బోధ ఒక్క కర్షకునికే గాదు. బహుశః కర్షకు డప్పుడే యీబోధ ననుసరించుచునే యున్నాడు. నిరుద్యములై, సోమరిపోతులై యున్న తక్కినవారికే యీ బోధ యుద్దేశింప బడియుండును. ఇటుల నింక నే పద్యమును చూచినను రెడ్డియువకునికి హెచ్చరికయును, తక్కిన నిరుద్యమ యువకులకు సన్మార్గబోధ యును పొత్తమునిండ గానవచ్చును.

ఇక కృషీవలుని కుటుంబ జీవనమునకు వత్తము. వివిధభోగోపయుక్తు లగువా రెంత యానంద మనుభవించుచున్నారో కర్షకులును అంత యానంద మనుభవించుచున్నారు. వీరి కుటుంబజీవనమే ఆదర్శజీవనము. పరిశ్రమ యందును, గృహకృత్య నిర్వహణమందును, తక్కుంగల విషయముల యందును స్త్రీపురుషు లిర్వురు సమానస్థానము నలంకరించి యాదర్శ స్త్రీపురుషులై యున్నారు.

"తరుణీ! ధూళులఁ గాళ్లు కాలెనని సం
తాపంబునన్ కాంతునిన్
చిరముల్ రాడక గేహనిర్వహణమున్
సేద్యంబు సాగంగ ని

ద్దఱుఁ గష్టింప కుటుంబరక్షణము సా
ధ్యం బౌను; భిన్నాధ్వసం
చరణాసక్తహయద్వయంబు రథముం
సాంతంబుగా లాగునే"

అను పద్యమున వేదశాస్త్రవిదితధర్మము బోధింపబడినది. వివాహకాలమున 'పూజు' యొక్క ఉద్దేశమునే తీసుకొని భార్యాభర్తలు సంసారశకట వహనమున సమానులని చక్కగా బోధించినారు. వస్తుసామగ్ర్యాది సంపాదనకే పురుషు డనియు, నింటిపనులు నిర్వర్తించుటకు మాత్రమే (భార్య ఒకగృహపరిచారిక యయినట్లు) స్త్రీ యనియును తలంచుట తప్పు. ఇంటిపనులయందు స్త్రీకి పురుషుఁడును, ఇతర విషయములయందు పురుషునికి స్త్రీయును ఉచితరీతిని తోడ్పడవలెను. ఈ ముఖ్యోద్దేశము ఈచిన్నిపాత్రము బాగుగా బోధించుచున్నది.

"........ప్రాఁచిను లొవ్వనర్చుచుం
వనిత యతిప్రయాసమున
పర్యాలిడం గనుఁగొనె, కావడిఁ
గొని సరసీజలంబులను
కోపము సేయక తెచ్చి యిచ్చి కాం
తను పరితోషపెట్టును......"

ఆదర్శ సతీమణి ధర్మములను చెప్పుచు వీరు వ్రాసిన పద్యములు గమనింపదగినవి. భాగ్యవంతులగు పొరుగింటి స్త్రీలు విలువగల వస్త్రములను భూషలను ధరించుట జూచి సాధారణ యువతి తానుకూడ వాటిని ధరించుటకు నాశపడరాదు. అవి యన్నియు కృత్రిమభూషణములె. స్త్రీకి ఒక్కటే అమూల్య రత్నము.

"........అమూల్యరత్నమా
సరసపు ప్రేమచిత్త జల
జంబు వెలుఁగ నలంకరింపుమా."

ఈ యమూల్యరత్నము బాహ్యశరీరము నలంకరించునది కాదు. పైయాడంబరము లక్కర లేదు. హృదయపద్మము నలంకరించి యందు పవిత్రకాంతిని నెలకొల్పునది యీ సరసపు ప్రేమ. ఇట్టిప్రేమయే వనితలకు ముఖ్యావశ్యకము.

"వెలగల రత్నభూషలను
వేలకుఁ దాల్చిన నిన్నుఁ గాంచుచో
కలుగదు ప్రేమ భర్తకు, వి
కస్వరమౌ వదనారవిందమం
దొలికెడు ముద్దులేనగవు
లొక్కనిమేషము దోఁపకున్న; భూ
షలు ప్రణయానుబంధసద్వ
శమ్ములు గావు కులాంగనాళికిఁ."

ఇట్టి కులాంగనల యొక్క ఆధిక్యమును చూడుడు.

"అతుల సంసారసాగరమందు, కాల [చ
జలము సుకృతదుష్కృతవాతచలిత మగు
సుఖవిషాదపు తరఁగలై సుడియుచుండ
పడవవై గట్టుఁ జేర్తువె పతిని గృహిణి!"

వీరిలోను మన మనుభవించు శృంగారాదిభావములు లేకపోలేదు. పుత్రపుత్రికాపరిష్వంగాది సౌఖ్యానుభవము లేకపోలేదు.

"చలికప్పఁ గప్పి విచ్చలవిడి లేమెండఁ
  గ్రాఁగు ముద్దులకూఁతుఁ గౌఁగిలించి
పునికి తోఁగాడుచు బొమ్మఁతో నాడు
  పసిబిడ్డమోము చుంబనముసేసి
యెగతాలిసరసాల నిల్లాలు పల్కుచు
  నవ్వినందుకు మారు నవ్వి నవ్వి..."

"వ్రాలినకొమ్మలోపలి పూలరేకులు
  నడలి యొక్కొక్కటి జారుచుండ
పరుసంపు రొమ్ముపై పయ్యెద చిఱుఁగుళ్లు
  గాలికి నటిటు కదలి యాడ
      టటు
నెలుఁ గెత్తి పాడెడి యేలలు విని బాట
  సారు లెక్కసకెము సల్పుచుండ
తమ్ములపుంబూఁత తవిలిన వాతెఱ
  పై పలుచాలు నవ్వకయె నవ్వ-"

చేతికొడవలి ఝళిపించుచున్న చిన్నెలాడి సహజసౌందర్య శృంగారాదికము లెంతయు మనోహరములు.

ఇక వీరి కవిత్వవిషయమునకు వత్తము. అనఁగా, కల్పనాశక్తియు, అలంకారాదికము లును. స్వభావసిద్ధవర్ణనా పూరితమగు నీచిన్ని పొత్తమున స్వభావోక్తి - అలంకారములకు మేర లేదు. తరువాత రూపకము, ఉత్ప్రేక్ష, ఉపమ, అర్థాంతరన్యాసము మొదలగు తక్కుం గల యలంకారము లిందు సమయోచితముగ నుంపబడినవి. ప్రతియలంకారమున కొక్కొక్క ఉదాహరణము నిచ్చుట గ్రంథవిస్తరము కాఁగల దని యిచ్చుట లేదు. వీరి 'ఉత్ప్రేక్ష'-అలంకారము మాత్రము గమనింపదగినది. సాధారణముగ పూర్వప్రబంధములలో 'నుత్ప్రేక్ష' ఉన్నవిధము చూడుడు. అసంభవములైనవి వర్ణించి యందుచేతనే యేదో స్వాభావిక విషయమును వర్ణించుట. ఎత్తైన మేడలపై బాలిక లాడుకొనుచుండ, తెల్లని బంతివలె జాబిల్లి యందుండి పోవుచుండ, ఆబాలికలు ముగ్ధత్వమున ఆచంద్రుని పట్టుకొనుటయు తడవుగా చల్లగానుండుటచే ఆచంద్రుని జార విడిచి నారనియును, అందుచేతనే చంద్రుడు పదహారు ఖండము లయ్యెననియు ఒకచో వ్రాయబడినది. ఇట్లే పూర్వప్రబంధములలోని ఉత్ప్రేక్ష లుండును కాని,

"సమయ మమూల్య మొక్కనిమి
  షంబు వృథా చనఁ గ్రమ్మరింప నే
రము; మనయాయు వాత్రుటిప
  రంపర యాట నెఱింగి నిద్ర మాం
ద్యమును తొలంగి విహితముల
  నారయుఁ డో జనులార! యంచు డం
బముగ మెడ న్నిగిడ్చి కృక
  వాకము గూసెడి నింటికొప్పునన్."

అను వీరి పద్యమును చూడుడు. వేకువజాముస కోడి కూయుటయు, నా కూఁత విని చాలమంది నిద్రనుండి మేల్కాంచుటయు స్వాభావికము. ఇందుండి వీ రుత్ప్రేక్షించదగిన దేది? ఆకోడికూఁత లోని బోధ. ఆ బోధయు నమూల్యమైనది. నిద్రమాంద్యము పోగొట్టుకొనుడని జనములకు బోధసేయుచున్నదో యనునట్లు కృకవాకము కూసెను. ఇది యెంత స్వాభావికముగా నున్నదో పాఠకులే యెఱుం

గుదురు గాక. ఇట్టి స్వాభావికములగు వర్ణనల తోను, అలంకారములతోను నిండిన యీ చిన్నిపొత్తము సర్వక ఆంధ్రభాషాయోషా మణి కొకయమూల్యరత్నాభరణమే.

కవితాంభోధి గభీరగర్భమునకుం బోయి, భావనాశక్తి యను నావపై వీరు అనన్యసామాన్య లభ్యములగు పద్యరత్నములను, సకలజనోపయుక్తముగ ఆంధ్రాభ్యుదయార్థ మొసంగినారు. అట్టి వీరి యమానుష ప్రతిభ వందనీయము; సర్వజన మాననీయము. ఈ చిన్నిపొత్తమునం దుద్దేశింపబడిన హెచ్చరికను మదికి దెచ్చుకొని కర్షకులు మఱియింత బాగుపడి నిస్సందేహముగ

"భారతతప్మోతలాత్మ
గౌరవపవిత్రమూర్తు"

లగుదురు గాక. ఇతర బోధనాంశములను చక్కగా గ్రహించి తక్కిన జనులును నిరంతర సౌఖ్యానందముల నోలలాడుదురు గాక! ఇట్టి యత్యుత్తమ గ్రంథములు పెక్కులింకను బయలువెడలి ఆంధ్రభాషాపథూటి కమూల్యభూషణప్రాయములై యాచంద్ర తారార్కము వెలయుగాక!

నైష్ఫల్యము

సహదేవ సూర్యప్రకాశరావుగారు

రెప్పవిప్పని తొలిప్రొద్దు రేకు విచ్చి
పరిమళింపని, కలయేని విరియబోని,
పసిడిమొలనూలి రవమేని మసలి మెరయ
నీ దరిద్రగృహాన జీవింతు నొకడ.

నిలుకడయు లేక, గాటంపు నిదుర లేక,
చలువవెన్నెలరేక పిసాళి లేక,
ఊర్పులే గాక కంటినీ రోడ్పు లేక,
ఎండి గడ్డకట్టుకొనిపోయినది యెడద.

క్రమ్మినది చావుమసుగు నగమ్ము, జగతి
శోభనమ్ము లూర్పుకలె యూడ్చుకొనిపోయె,
కాని మధురించి తరళించి కరగి చనిన
స్నిగ్ధకౌముదీరేఖ వాసింప దింక.

జేవురించి కుంచుకొని శుష్కించిపోయి
మసకచీకటి పురి విచ్చి మసలుదాకి
రాలి పడిపోవు తలిరుపత్రాన నొదిగి
ఒదిగి నిట్టూర్పలేక నా బ్రతుకు పొగలు.

హృదిని పదనువెట్టిన నాటి మృదులశక్తి
సుభగతారకాకోమల సొగయుద్యుతుల
పులకరిల్లు, నీదరహాసకళిక వెలిగి
బ్రదుకు బ్రదుకెల్ల నొక్కస్వప్నముగ మార్చు.

వినెడువా రేరు లేని పృథ్వీతలాన
కారుక్రమ్మిన చిమ్మచీకట్లతోడ
క్షుధితహృదయాన నాలోన గొణగికొనుచు
వెళ్లబోయుచునుంటి జీవితపుసొదల.

ఏ యనూహ్యరూపిణియో జిహ్వికల సాచి
భీకరాట్టహాసముల కుంతీకరించి
నా మలినజీవితపథాన నర్తనమ్ము
సలుపు రేయింబవలు గుండియలు నులింప.

ఏనిముసమేని నా కీ మహీతలాన
కలుష నిస్పృహా వేదనోచ్ఛలితమైన
విలయఘోరనిరాకారకలన దక్క
ఇతరమే వినరాదు.... ......

భవభూతి మహావీరచరితము — తట్టా వీరరాఘవాచార్యులుగారు

(వెనుకటి సంచిక తరువాయి)

ఇక: ద్వితీయాంకమున మాల్యవదమాత్యునీతిగరిమ చక్కగా వర్ణింపబడినది. సీతాగ్రహణవిషయమై ససంరంభుండగు రావణుని వారించి సామముచేతనే కార్యమును చక్కబరచుటకుగాను ప్రథమాంకమున సూచితుండగు రాక్షసపురోహితుని పంపునట్లు చేసినవాడితడే. ఈధీసచివుడు సిద్ధాశ్రమవృత్తంబులగు తాటకాసుబాహ్వాదిమరణములను విని దివ్యాస్త్రదీప్తుండగు దాశరథిచే మున్ముందు తమకు గలుగబోవు విపత్తుల ననుమానించి చాల విషణ్ణుడాయెను.*

ఇటువిమ్మట శ్రీరామమాహేంద్రధనుఃప్రాప్త్యాది సూచికయగుచు ప్రవేశించిన శూర్పణఖకు రామవీర్యవిషణ్ణుడగు నీయమాత్యునికి ఈ క్రిందివిధమున సంభాషణము జరుపబడినది

శూ—మానుషమాత్రే ఏతావతీ చింతా.

(మనుష్యమాత్రునివిషయమై యింతచింతయా ?)

మా—వత్సే మా మైవమ్.

శ్లో. ఉత్పత్త్యైవహి రాఘవః కిమపి త
ద్భూతం జగత్యద్భుతం
మర్త్యత్వేన కిమస్య యస్య చరితం
దేవాసురైర్గీయతే;
వస్తుష్వాదధతే చ శక్తి మృషయో
దేవాశ్చ తేరోత్తరాః
మర్త్యా దేవ వరప్రదానసమయే
బ్రహ్మోఽభయం నో జగౌ.

శ్లో. నిసర్గేణ స ధర్మస్య గోప్తా ధర్మద్రుహో వయమ్;
అర్థో విరోధశ్శక్తేన జాతో నః ప్రతియోగినా.

(ఓబిడ్డా! అట్లన కట్లనకు. శ్రీరాముడు ఉత్పత్తిచేతనే జగదాశ్చర్యకరంబగు మహామహిమశాలి యగు నొకానొకమహావ్యక్తి. దేవదానవులచేతను కొనియాడందగు చరిత్రవిచిత్రుండగు నీరాముండు మనుష్యుడైన నేమి? భవిష్యద్విజ్ఞులగు దేవర్షులు కొన్ని వస్తువులయందు దివ్యశక్తిని కలుగచేయుచున్నవారలు. వరదానసమయంబున విధాత మనకు మనుష్యునివలననుంచియే భయము కలదని చెప్పెను. స్వభావముచేతనే యాదశరథపుత్రుండు ధర్మరక్షకుడు. స్వభావముచేతనే మనము ధర్మద్రోహులము. కాన మనకు మహావీరుండై ప్రతిద్వంద్వి యగు శ్రీరామునితో వాస్తవికంబగువిరోధంబు సంప్రాప్తంబాయెను.)

* దూరాద్ద్వితీయో ధరణీధరాభం
యస్తాటకేయం తృణవద్వ్యధూనోత్,
హన్తా సుబాహోరపి తాటకారిః
స రాజపుత్రో హృది బాధతే మామ్.

తదనుప్లవానాం భూయసాం లక్ష్మణేనైకేన వధ ఇతి కిమేత దాశ్చర్యమ్.

వీరోత్సేకైర్యదమృతభుజాం
నిర్మమే పద్మయోని
స్తస్య ద్వైధం వ్యధితధనుషః
శాంభవీయస్య రామః;
దివ్యా యస్త్రోపనిషద ముషే
ర్యాః కృశాశ్వస్య శిష్యా
ద్విశ్వామిత్రా ద్విజయజననీ
మప్రమేయః ప్రపేదే.
ప్రసహ్య రావణద్విష్ట మస్మద్ధూతస్య పశ్యతః;
అస్త్రదానాద్భుతం కాలే ప్రౌఢేన మునినా కృతమ్.
సీతా బన్దీగ్రహపరిభవ
స్తస్య రాజ్ఞో నిరస్తో
నీతం చాస్మాత్ప్రతి శిథిలతా
మైక ముఖ్యం సురాణామ్;
నాన్దీదానప్రభృతి హి కృతిం
మంగలం త్రైస్తదానీం
సర్వః ప్రాయో భజతి వికృతిం
భిద్యమానే ప్రతాపే.

ఇట్లు చెప్పి ఈవృద్ధామాత్యుండు విచారించి పౌత్రికేయుండగు రావణునిహితాకాంక్షియై బలవచ్ఛత్రువగు రాఘవుని నిధనోపాయంబునకు పరశురామోత్తేజనము కర్తవ్యమ్మని నిశ్చయించి మరల వీరిరువుర బలాబలవిషయమై యెట్లు వితర్కించెనో చూతుడు:

శ్లో. యది ప్రపద్యేత ధనుః ప్రమాథీ
శిష్యస్య శంభోర్న తితిక్షతే సః;
ఆయోధనే చేదుభయోర్నిఘాత
స్సంబంధయోగా దతిహి ప్రియం నః.

(శంభుశిష్యుడగు పరశురాముడు శ్రీరాముడు స్వగురుధనుర్భంజనము కావించెనని విని సహింపడు. యుద్ధమున పరస్పరక్రోధప్రాశితులగు నీమహావీరు లిరువురు నశించినచో మన కతిప్రియముగదా!) ఇచ్చట భార్గవుని నాశనముగూడ తమ కిష్టమగుటకు కారణం బాతడు బ్రాహ్మణపక్షపాతియై మహావీరుం డగుటయే.

'ఈభార్గవరాములలో క్షత్రియాంతకుడగు భార్గవునికే విజయంబు కల్గిన గురుద్రోహియగు దాశరథిని సంహరింపక శాంతక్రోధుడు కాడు. ఇట్లయినను మన కిష్టంబగు రామనాశం బనాయాసముగా సిద్ధించినది. ఒకవేళ దశరథరామునికే విజయంబు గల్గి స్వగురుగాధేయ బాంధవ్యబ్రాహ్మణపక్షపాతాదులచే పరశురాముని సంహరింపక యాతండు వదలినచో మరల నీభార్గవుడు ముక్తిహేతుతపస్కుమ్మడై శస్త్రము నెక్కొనుటకు సాహసింపడు. అందుచేత మనకు గొప్పయనిష్టము సంభవించు ను' అనియును,

'పరశురాముండు ముని గాన రాముని సంహరించినను మరల నట్టివృత్తి గలవాడే. శౌర్యాధికుండను నా రాజనూనుం డుత్కర్షాకాంక్షియై యుత్సాహాతిశయముచే రావణకేత్వకార్తవీర్యసంహారాదులచేత ప్రకృష్టుండగు ధర్మయోధియగు రైణుకేయుని జయించినచో రావణవీర్యచకితులగు దేవతలందరు నీరాముని ప్రకృష్టవీరునిగా నిశ్చయించి యప్పు డీయాలంబనమున ధర్మద్వేషి యగు రావణుని ధిక్కరింపగలరు. అసురవిరోధులగు దేవతలహృదయమునందు నైజకోప మీ రాక్షసుల పట్ల గలదుగదా' అనియును—

ఇట్లీమేధావి యగు మాల్యవంతుడు వితర్కించిరాముడే జేతయయినచో,

తత్రాపి శక్తితః ప్రతివిధాస్యతే

శ్లో. తాన్యేవ యది భూతాని తా ఏవ యది శక్తయః
తతః పరశురామస్య న ప్రతీమః పరాభవమ్.

(ఆపక్షమునందును శక్త్యనుగుణముగా ప్రతిక్రియ చేయబడగలదు. ఆపాంచభౌతికశరీరుడే శ్రీ పరశురాముడయినచో, ఆశక్తులే భార్గవుని కున్నచో శ్రీరాముని వలనమంచి పరాభవంబు కలుగనేరదు.) అని విచారించి భార్గవోత్తేజనం బొనర్చి మిథిలకు పంపుటకుగాను శూర్పణఖాసహితుడగు నీతడు మహేంద్రద్వీపమునకు వెళ్లె. ఇట్లు మిశ్రవిష్కంభముచే ప్రకటీకృతము. తదుపరి మాల్యవత్ప్రకునవాక్య సముద్దీపిత క్రోధజ్వాలమండగు భార్గవుని ప్రవేశము వర్ణింపబడినది. ఈతరుణమున భార్గవాగమనంబును విని,

ద్రష్టవ్యస్సచ మాం దిదృక్షు రపిచ

(చూడదగినవాడు నన్ను చూడ నిచ్ఛచే వచ్చినవాడు) ఇత్యాదివాక్యసందర్భములచే గంభీరముగా నుపన్యసింపబడిన ధీరోదాత్త శ్రీరామనాయకవిశిష్టభావంబు లెంతయో ప్రశంసనీయములు. క్రోధాంధుడై స్వాన్వేషణార్థము కన్యాంతఃపురప్రవేశియగు భృగురాము నెదుర్కొనుసమయమున సకలక్షత్రియమహారాక్షసభార్గవపరాక్రమచకితయై తన్నవరోధించు త్రాసావేగలజ్జాద్యధీనయగు నూతనవధువగు జానకి నుద్దేశించి రాఘవుచే నెట్లుపన్యస్తమో తిలకింపుడు.

అయి ప్రియే!

శ్లో. ముని రయ మథ వీర స్తాదృశ స్తత్ప్రియం మే
విరమతు పరికంపః కాతరే క్షత్రియాసి;
తపసి వితతకీర్తే ర్దర్పకండూల దోష్ణః
పరిచరణ సమర్థో రాఘవః క్షత్రియో౽హమ్.

(ఓ ప్రియురాలా, ఈ పరశురాముడు మునియు, ప్రసిద్ధుడగు మహావీరుడును; ఇట్టివాడు నా కత్యంత ప్రియుడు. ఓపిరికిదానా, నీవును క్షత్రియకులమునం దుద్భవించి క్షత్రియునికి భార్యవయితివి. ఈ భయకంపాదులను వీడుము. తపః క్షత్రియత్వాదులకు స్థానమగు రఘువంశమునం దుద్భవించిన నేనును మహాతపస్వినై సమరాభిలాషచే తీటగల భుజంబులుగల యీభార్గవునికి తగునట్లు పరిచర్య నొనర్ప సమర్థుడను.) ఇచ్చట రాఘవ క్షత్రియోఽహ మిత్యాది పదంబుల ధ్వని విశేషంబు లెంతయో హృదయంగమములు. ఇటుపిమ్మట శ్రీరామకృతధనుర్భంజనాదిస్మరణచే క్రోధపూరితుండగు భార్గవునివాక్యము లెట్లు ప్రకృతి కనురూపములుగా వచింపబడినవో తిలకింపుడు:

ఏవ ఏవ మే ప్రశమస్య కదర్ధకః పరిణామః.
య త్క్షత్రియే ష్వపి పునస్స్థిత మాధిపత్యం
తై రేవ సంప్రతి ధృతాని పున ర్ధనూంషి;
ఉన్మాద్యతాం భుజమదేన మయాపి తేషా
ముచ్ఛృంఖలాని చరితాని ప్రవర్తితాని.

(క్షత్రియులే మరల నధిపతు లగుటయు, వారే మరల ధనుర్ధారు లగుటయు, భుజమదోన్మత్తులగు వారలే మరల నేను గూడ వినునట్లు స్వేచ్ఛావ్యాపారముల నాచరించుటయు ననునివి నాశాంతికి క్రూరంబులగు ఫలంబులు. ఇట్లధిక్షేపించెడి జమదగ్నిసూను నుద్దేశించి యాక్షేపించువాడువోలె చెప్పిన శ్రీరాముని వాక్యము లెంత రమణీయములో యాలకింపుడు.

అయం సకల సపరివారకార్తికేయ విజయావర్జితేన భగవతా నీలలోహితేన సహస్రపరివత్సరాంతే వాసినే తుభ్యం ప్రసాదీకృతః పరశుః.

(గణసహితుండగు కుమారుని జయించుటచే నీవి క్రాంతికి సంతసించిన యర్ధనారీశ్వరుం డగు పరమేశ్వరునిచే ననేకవత్సరములు పరిచర్యచేసిన నీకొఱ కనుగ్రహింపబడిన ఆగొడ్డలి యిదియేకదా.) ఇచ్చట కొండను త్రవ్వి ఎలుకను పట్టునట్లు బహువత్సరంబులు భర్గశుశ్రూష యొనర్చి యీ యినుపముక్కను సంపాదించితివి యని నిగూఢముగా పరిహాసాధిక్షేపాదికము సూచింపబడుచున్నది. ఇట్లే వీరియువురికి కించిత్కాలాక్రమానంతరము.

సర్వథాపి హృదయంగమోఽసి మే.

(అన్ని విధములచేతను నాహృదయము నాకర్షించుచున్నావు.)

పరిరబ్ధుమి చ్ఛతి త్వామ్.

(నాహృదయము ని న్నాలింగన మొనర్చుకొనుటకువలె నిచ్ఛయించుచున్నది.)

ఇత్యాది వాక్యములచే రామగుణాకృష్టుం డగు భార్గవుని గురించి రామవాక్యములు:

భగవన్ పరిరంభణం ప్రస్తుత ప్రతీప మేతత్.

(ఓ మహానుభావా, యీ ఆలింగనము ప్రకృతమునకు విరుద్ధమయినది.) ఏతాదృశవాక్యశ్రవణముచే,

జామదగ్న్యః—(స్వగతమ్)

పరగుణోత్కర్షత త్త్వేఽపి పరిమాణగ్రాహి హి జనస్య ప్రూతమ న్తఃకరణ మస్య రాజన్యపోతస్య. పారమార్థికవినయ దుర్విభావ్యో నిపుణబుద్ధిగ్రాహ్యో మహా నహంకారగ్రంథిః.

(ఈరాచకిల్లవానియొక్క సుచరిత్రపూతం బగు హృదయము పరగుణోత్కర్ష యథార్థకథనమునందును పరిమితమయినది. స్వాభావిక వినయముచే నూహింపశక్యము గాని యీతని యహంకారాతిశయము నిపుణబుద్ధు లగువారిచేతనే గ్రహింప దగినది.) ఇట్లు తలంచి మరల నీరేణుకాసూనుండు రామ మహిమాతిశయవ్యాముగ్ధుడై,

అప్రాకృతస్య చరితాతిశయస్య...
సంభావ్య సప్తభువనాభ యుదానపుణ్య

మిత్యాది శ్లోకములచే నారాయణావతారసంభావితుడై సకలకల్యాణగుణాకరుండగు దాశరథిని శ్లాఘించియున్నవాడు. ఇటుపిమ్మట జామదగ్న్యుని స్వభావానుగుణముగా సత్కారధిక్కారముల నొనర్పతలచిన శతా

నంద జనకుల ప్రవేశంబును, మరల రామునుద్దిశ్య భార్గవ వాక్ప్రవృత్తియు,

భార్గవ, జ్ఞాయతే మా మనుకంపస ఇతి.

(ఓభార్గవా, నన్ను కరుణించుచున్నావు—నన్ను చూచి భయముచే కంపించుచున్నావని తెలుసుకొనబడుచున్నది.) ఇత్యాదివ్యర్థి రామవాక్యములచే పునర్భృగురామక్రోధోద్దీపనంబును, రామద్వయసత్త్వానుగుణ సంవాదంబును, జనకశతానందరామయుగల సమీక్షణ సంభాషణాదులును, కంకణవిమోచనార్థము కంచుకాహూతుడయి భార్గవానుమతుండను శ్రీరాముని నిర్గమనంబును, వసిష్ఠవిశ్వామిత్రప్రేషిత సుమన్త్రాహూత భార్గవజనకాదులనిష్క్రమణంబును వర్ణింపబడి యంకసమాప్తి చేయబడినది. ఈసందర్భమున శతానందరైణాకేయుల సంభాషణము కడు రమణీయము. ఇక తృతీయాంకమున ప్రథమంబున వసిష్ఠ విశ్వామిత్ర శతానంద భార్గవ సంభాషణాదికము వర్ణింపబడినది. ఈయసాధారణ విప్రచతుష్టయమున కనురూపములగు భావంబులు చక్కగా కూర్పబడినవి. వసిష్ఠవిశ్వామిత్రులు మొదట

సోఽయం త్వాం తనయప్రీతః పరిణతో
రాజా శమం యాచతే.

(అట్టి యీవృద్ధుండగు దశరథుండు పుత్రప్రీతిచే నిన్ను శాంతింపుమని యాచించుచున్నవాడు.) అని వివిధవాక్యములచే బతిమాలుకొనిరి. కాని యీవాక్యముల నంతగా నాదరించని పరశురాము నుద్దేశించి వృద్ధుండగు వసిష్ఠుండు

అయి వత్స, కిమనయా యావజ్జీవ మాయుధపిశాచికయా; శ్రోత్రియోఽసి జామదగ్న్య.

(ఓవత్సా, బ్రతికియున్నంతవఱకు నీయాయుధపిశాచికతో ఏమిప్రయోజనము? శాంతి నవలంబింపుమా; పెద్దల మార్గము ననుసరింపుమా; శ్రోత్రియుడవు నీవు.) ఇత్యాదివాక్యసందర్భములచే

'యాచకాస్తే'

ను పర్యంతము చేసినహితబోధ యెంతయో పాత్రౌచితిని పోషించుచున్నది. ఇచ్చటి విశ్వామిత్రుడు

సత్యం రోమాంచయంతి మామ్.

(ఈపరశురామునివీరరసోద్గారివాక్యములు యథార్థముగా నన్ను పులకాంకితునిగా చేయుచున్నవి.) అని యనుకొనునట్లు వర్ణింపబడుటచే,

భక్షితేఽపి లశునే న రోగశాంతిః.

(లశునభక్షణం బొనర్చినను రోగము శాంతింప లేదు) అనునట్లు బ్రహ్మర్షి యయినను పూర్వక్షత్రియవాసనను పూర్తిగా వదలినట్లు కాన్పింపడు. కావనే మహర్షులయందు ఈచండశాసనునివలె క్షత్రియకుటుంబ వ్యవహారములయందును దక్షుండగువాడు కాన్పింపడు. ఇక శతానందు డన్ననో, రాజానుగ్రహంబు సంపాదింప నిచ్ఛగల రాజపురోహితునికి రాజకుటుంబములయందుంచవలసిన విశ్వాసమును పూర్తిగా నుంచిన వాడు కావనే యీ శతానందుడు

ఆః, శక్తిరస్తికస్యవా విదేహరాజన్యస్య రాజర్షే ర్యాజ్యస్య మే ప్రేయస శ్ఛాయామ ప్యవస్కందితుమ్; కింపున ర్జామాతరమ్.

(నాకు ప్రియుడై నేను పురోహితుడుగాగల జనకరాజర్షి యొక్క నీడనుగూడ త్రొక్కుట కెవనికి శక్తి గలదు? ఇక నితని యల్లుని విషయమై చెప్పవలసిన దేమి?) అని రాజకులాభిమానమును చూపియున్నవాడు. ఇట్టివానికిని భార్గవునికిని సంభాషణ మెట్టిదో యీ క్రింద గమనింపుడు:

జామదగ్న్యః—
త్వయేవ బహుభిః క్షత్రియపురోహితైః స్ఫురిత మాసీత్. కింతు ప్రాకృతాని జ్యోతీంష్యప్రాకృతే జ్యోతిషి శామ్యంతి.

(ఓగౌతమా, నీవలెనే యనేకులు రాజపురోహితులు బ్రహ్మతేజస్సును వెలిపుచ్చినవారు గలరు. కాని దివ్యతేజస్సన్నిధానమున నీ సాధారణ తేజస్సులు శాంతించుచున్నవి.)

శతానందః—(సక్రోధమ్)

అరే, అనడ్వన్, పురుషాధమ, నిరపరాధరాజన్యకుల కదన, మహాపాతకిన్, అశిష్ట, వికృతవేష, బీభత్స కర్మన్, అపూర్వపాషండ, కాండీర, కాండపృష్ఠ, కథ మస్మా మపి దిశి ప్రగల్భసే. నను చ రే త్వమసి బ్రాహ్మణఏవ; అహో! బ్రాహ్మణస్యాచారః.

మాతు రేవ శిరశ్ఛేదో గర్భానాం చాపకర్తనమ్;
రాజ్ఞాం చ సవనస్థానాం బ్రహ్మహత్యాసమో వధః.

జామదగ్న్యః—

ఆః స్వస్తి వాచనిక, దుష్టసామంతపురోహిత! అపిచ, రే అహల్యాయాః పుత్ర! తవాహం కాండపృష్ఠః.

పాప మీశతానందుని కీయహల్యా పుత్రత్వమే బాంధకినేయత్వ సూచక మగుచు నెచ్చట కేగినను వదలి పెట్టుట లేదు. ఇట్టివాచాటబ్రాహ్మణద్వయము మత్త వృషభంబులవలె అంకెలు వైచుచు జరిపిన సంవాద ప్రౌఢిమ యనుమోపముగానే యున్నది గదా! ఇటుపిమ్మట శాపోద్యుక్తశతానంద శామనంబును, దన్నిష్క్రమణంబును, పిమ్మట మరల జనకభూపతి ప్రవేశంబును వర్ణింపబడినవి. ఈ జనకుని విషయమై ప్రథమంబున,

సద్వృత్తి వీమః; తథాపి క్షత్రియ ఇతి శిరశ్శూల ముత్పాదయతి.

(మంచినడవడిక గలవాడీతడు; అయినను క్షత్రియు డగుటవలన తలనొప్పిని కలుగచేయుచున్నవాడు.) అని తలంచిన యీభార్గవు డనంతరంబున,

త్వరయతి పునః కర్మణే కార్ముకం నః.

(మరల ధనుర్గ్రహణము కొఱకు నాహస్తము నన్ను త్వరపెట్టుచున్నది.)

విప్రేఽప్యస్మి న్నమతి ధను ర న్యాసి న గతిః.

(బ్రాహ్మణుడయినను ఇట్టి పరశురామునియందు వాధనుస్సు నమ్రమగుగాక. రెండవయుపాయము లేదు.) అని జామాత్రుస్నేహముచే పల్కినజనకరాజర్షిని

కర్కశాని బ్రవీషి!
పశుమివ పరశుః పర్వశ స్త్వాం గృణాతు.

(కఠినవాక్యములను బల్కుచున్నావు. ఈ నాగంద్రగొడ్డలి పశువునువలె నిన్ను కణుపు కణుపున తెగగోయుగాక.) అని ధిక్కరించియున్నవాడు. ఇట్లు ససంరంభుం డగు భార్గవునితో జరిగిన దశరథ వసిష్ఠ విశ్వామిత్ర సంభాషణశైలియు, తత్తిరస్కారంబును, సాహంకారభార్గవవిజయోద్యుక్తరామ సంరంభంబును, క్రుద్ధభార్గవవాచాలత్వంబును వర్ణింపబడి యంకసమాప్తి చేయబడినది. చతుర్థంబున భృగురామాపజయమాయమాను లగుచు ననంతరము శ్రీరామ దండకాప్రస్థాపనాదుల నొనర్చి వంచనచే వైరనిర్యాతనకరణేచ్ఛు లగు మాల్యవచ్ఛూర్పణఖలయొక్క ధర్మాలోచనప్రకార ముపవర్ణితము. ఇచ్చటగూడ మాల్యవదమాత్యుని నీతిగరిమ కామందకకౌటిల్యాది పరణ్యమపారియై తరోత్కృత్తర మగునట్లు ప్రస్తావింపబడినది. ఈమిశ్ర విష్కంభానంతరము సంతుష్టజనక దశరథ వసిష్ఠ విశ్వామిత్రప్రవేశసరససల్లాపాదు లుపశ్లోకితములు. పిమ్మట చికిత్సితదర్పమయుండగు రేణుకాత్మజునియొక్కయు, రాఘవునియొక్కయు ప్రవేశ ముద్గ్రథితము. ఈ సందర్భమున విధిలేక మహాత్ము డగు భార్గవుని ధిక్కరించుటచే పరితప్తుండగు రామభద్రునివాక్యములు:

శ్లో. యన్బ్రహ్మవాదిభి రుపాసితవన్ద్యపాదే
విద్యాతపోవ్రతనిధే తపతాం వరిష్ఠే;
దైవాత్కృత స్త్వయి మయా వినయాపచార
స్తత్ర ప్రసీద భగవ న్నయ మంజలిస్తే.

(ఓ మహానుభావా, బ్రహ్మజ్ఞానులచేత నమస్కరింపదగిన పాదములు గలవాడవై విద్యాతపోవ్రతనిధివై మహాతపస్వివగు నీవిషయమై విధిలేక నాచే నొనర్పబడిన యీ వినయాపచారమును సహించి ప్రసన్నుడవగుమా; దోసిలి యొగ్గి వేడుకొనుచున్నాడను) ఇట్టిభావంబు సహజవినయాభిరాముండగు రామునికి శ్రోత్రగాదుగదా. తదుపరి శాంతప్రకృతియై యుండెడు జమదగ్నిసూను నుద్దేశించి వృద్ధ వసిష్ఠునిచే నుడువబడిన వాక్యము లెంతప్రకృతికమరూపములో చూడుడు:

శ్లో. దుర్వినీతే త్వయి వయం
　　దుఃఖితా స్సుఖినో౽న్యథా;
నిసర్గో హ్యేష వృద్ధానాం
　　యత్తు శ్రేయ స్తథైవ తత్.

(నాయనా, భార్గవా, నీవు దుష్టుడ వయినచో మేము దుఃఖింతులము. నీవు సజ్జనుడ వయినచో మేము సంతసింతుము. వృద్ధుల కిది స్వభావము. ఏది మంచిదియో అదియే కదా ఎల్లర కిష్టమయినది.) ఈప్రకారమే యనేకస్థలముల సహృదయహృదయానుభవ సంవాదులగు విషయంబు లనేకము లున్నను, విస్తృతిభీతిచే వదలి కథాంశమునమాత్రము సూచింపుచున్నాడను. ఇట్లు పరస్పర సౌహార్దులగు వీరియందలి సంభాషణానంతరము శూర్పణఖావిష్ట మంథరాప్రవేశానుకూలముగా త్రికాలజ్ఞులగు వసిష్ఠవిశ్వామిత్రాదుల నిష్క్రమణము సూచింపబడినది. మఱియును సద్గుణోదారుండగు నాయకుని మధ్యమాంబయై శ్రీరామభక్తిభరితభరతమాతయై సత్త్రియాణియగు కైకేయికి ననర్థకారియగు సందేశప్రేషణ మనుచితమని తలంచి కార్యాంతరప్రేషితయగు మంథరయందు దండకావనప్రస్థాపనాది సందేశహారిణి యగునట్లు మాల్యవత్పూర్వబోధితయైన యాకురూపిణి శూర్పణఖావిశ్వస్తయొక్క యావేశము వర్ణింపబడినది. ఈ సందేశమునకు పూర్వమే రాక్షసనిగ్రహార్థము వనప్రయాణోద్యుక్త సీతాలక్ష్మణ సహిత రామప్రస్థాన సంరంభంబును, రామవిరహాసహాభరతునికి యుధాజిద్బోధిత దాశరథిబోధిత తపస్వీశపాదుకాప్రస్తావనయు, దుఃఖావిష్ట దశరథ నిర్గమనాదులును వర్ణింపబడి యంకసమాప్తి చేయబడినది. రసౌచిత్యానుగుణముగా ఇవి యన్నియు మిథిలయందే జరిగినట్లు ఈ మహాకవిచే కూర్పబడినవి. పంచమంబున సంపాతిప్రవేశంబును, చిత్రమృగాకృష్ట రామలక్ష్మణాసాన్నిధ్యంబున భిక్షువేషధారి రావణాహృత సీతావృత్తాంతసూచక జటాయుఃప్రవృత్తియు, విరహావ్యథమానలక్ష్మణానుగత రామప్రవేశంబును, శ్రమణారక్షణాదులును, ఋశ్యమూకస్థిత విభీషణ లేఖాప్రేషణంబును, కబంధాదివధయు, మాల్యవద్బోధిత రావణమిత్రవాలిసంరంభంబును, తద్వధాదికంబును వర్ణింపబడియున్నవి. ఈసందర్భంబున మహావీర్యసద్గుణోపేతుండగు శ్రీరాముడు జాయానిమిత్తమయి యొక ప్రాకృత వానరునితో మైత్రి యొనర్చి తద్విశ్వాసార్థము శౌర్యప్రకటనం బొనర్చి మహావీరుండగు వాలిని వృక్షాంతర్లీనమూర్తియై సంహరించెననుట యనుచితంబని తలంచి యీ మహాకవి మాల్యవద్బోధితు డగు వాలి రావణమైత్రిని స్మరించి రామసంహారమునందు నియోగింపబడునట్లును, ఈ విషయమును గుర్తెరింగియు కౌసలేయుడు

　　ఏషఏవ పన్థా శ్చారిత్రస్య.

శ్లో. న తాదృశే స్పృహ్యాత్కార్య
　　మాధ్యస్థ్య మవలంబతే;
మమా ప్యస్మి న్మహావీరే
　　సోత్కంఠమివ మానసమ్.

(మహావీరచరిత్రమునకు మార్గ మిదియే. అట్టి మహావీరుండగు వాలి మిత్రకార్యంబున నౌదాసీన్యమును వహింపడు నాయొక్క హృదయంబును ఈమహావీరునియందౌత్సుక్యమును వహించుచున్నదియువోలె) నని తద్దర్శనోత్సుకుడై పిమ్మట వాలి నెదుర్కొనియు, ద్వంద్వయుద్ధమునకు కొన్ని కారణములచే సిద్ధపడక పలాయమానుడై మతంగశాపమున కురంగరూపధారి యగు వాలిని ప్రమాదవశమున వధించినట్లును వర్ణించి యనౌచిత్యమును పరిహరించియున్నవాడు. షష్ఠంబున దివ్యరూపధరవాలి సమాగమంబును, సుగ్రీవాద్యభిషేకప్రస్తావనయు, కుంభసంభవదివ్యశక్తిచే రావణాది నిశాచరసంహారోద్యుక్త రామునికి తన్మాయాపరిజ్ఞానాదికంబును వర్ణింపబడినవి. సప్తమంబున ఇంద్రదశరథప్రవేశంబును రావణసంహారానీతజ్వలనశోధిత సీతాసహితరామపట్టాభిషేక ప్రశంసయు, వసిష్ఠవిశ్వామిత్రమహేశ్వరేంద్రదశరథాదిసమాగమసంభాషణాదులును భరతవాక్యముచే నంకసమాప్తియు నొనర్పబడి నాటకము ముగింపబడినది. ఈమహాకవిచే సామాజిక మనోముకురప్రతిఫలనయోగ్యతాపాదకము లగునట్లు తత్తత్పాత్రసంవిధానప్రాగల్భ్యంబులు పెక్కు స్థలంబుల వ్యక్తీకరింపబడినవి. నాయకవర్ణనసందర్భాదుల

సంధ్యూరేవ సుఖాని

ఇత్యాదివాక్యప్రస్తావనచే యుపనిషదర్థ రహస్యం బులు గర్భీకృతంబులు పరశురామ సీతావియుక్త శ్రీ రామయోజనబాహుచిత్యాదిసందర్భంబుల రౌద్ర కరుణవిప్రలంభశృంగారబీభత్సాదిరసములు వర్ణింపబడి నను అవి ప్రధాన వీరరసాంగములుగా నుండుటచే నా లంకారికమార్గ విరోధంబు నిరసింపబడియె. ముఖ ప్రతిముఖగర్భావమర్శనిర్వహణాది సంధులును, పరిక్షే పపరికరవజ్రసంఘేటాది చతుష్షష్టి సంధ్యంగంబులును, అవివక్షితవాచ్యాది ధ్వనివిశేషంబులును తత్తత్స్థలంబుల చక్కగా కూర్పబడినవి. రసానుగుణరీతి ప్రస్తావనయు ప్రస్తావిత మాయెను. ఈకవివలె ధారాపంశుద్ధిచే రసపా త్రానుగుణభావములను చిత్రించి రసికహృదయాకర్షం బొనర్పజాలిన వేఱొకమహాకవి గాన్పింప డనుట యతిశ యోక్తి గానేరదు. ఈకవి గ్రంథంబున లక్షణానుగుణము గా విషయంబుసు విమర్శింప బూనుకొనుట కుద్యమించి వచో నపరిమితములు ప్రకృతవిమర్శకమార్గమునకు భిన్న మగునని దిఙ్మాత్రోదాహరణచే తృప్తి నొందితిని. ఇట్లు చెప్పుట యీ గ్రంథయథార్థ స్థితియే. 'నాటకాన్తంహి కవిత్వ' మ్మనునార్యోక్తిచే కవితాపరాకాష్ఠ లగు నీదృశ దృశ్యకావ్యములను మాత్రమే యొనర్చి విఖ్యాతిని బడ సిన యీ కవిశిల్లజాని వంశాదికంబును కొంత ముచ్చ టించి విరమించుచున్నాడను.

ఈ గ్రంథప్రథమాంక ప్రారంభంబున—

అస్తిదక్షిణాపథే పద్మపురంనామ నగరమ్. తత్ర కేచి త్తైత్తిరీయాః కాశ్యపా శ్చరణగురవః పంక్తిపావనాః పంచాగ్నయో ధృతవ్రతా స్సోమపీథిన ఉదుంబరనామా నో బ్రహ్మవాదినః ప్రతివసంతి. తదాముష్యాయణస్య తత్రభవతో వాజపేయయాజినో మహాకవేః పంచమ స్సుగృహీతనామ్నో భట్టగోపాలస్య పౌత్రః పవిత్ర కీర్తే ర్నీలకంఠవ్యాత్మసంభవః శ్రీకంఠపదలాంఛనః పద వాక్యప్రమాణజ్ఞో భవభూతి ర్నామ జతుకర్ణీపుత్రః కవి ర్మిత్రధేయ మస్మాక మితి భవంతో విదాంకుర్వంతు.

ఇట్లని సూత్రధారప్రస్తావనచే విశిష్టాచారవృత్తి వ్రతవిద్యాసంపన్నులగు నీతనిపూర్వులు పద్మపుర వాస్త వ్యులనియు, వారిలో వాజపేయయాజియగు మహాకవికి నైదవవాడనియు, భట్టగోపాలపౌత్రుడనియు, నీలకంఠ సూనుడనియు, శ్రీకంఠనామాంకితుడనియు, తర్కవ్యా కరణమీమాంసాదిపరిజ్ఞాతయనియు నీమహాకవివిషయమై తేలుచున్నది. ఈమహాకవి విశేషించి జతుకర్ణియను తనమాతనుగూడ స్మరించియుండుటచేన మాతుః పరదైవ త మ్మను నార్యోక్త్యనుసారముగా నధికమాతృభక్తి పూరితుడని తోచుచున్నది. ఇట్టిగుణ మీమహాత్మునికి ఉండుట యబ్బురము గాదుగదా. ఈతనికి భవభూతి యనునామము

సాంబా పునాతు భవభూతిపవిత్రమూర్తి

రిత్యాది శ్లోకరచనచే వచ్చిన నైతిహాసికులు వక్కా ణించుచున్నవారలు. ఈతడు ఈనామముచేతనే వ్యవహారప్రసిద్ధుడు. ఈమహాకవి కాలనిర్ణయాదివిష యమై యనేకవిప్రతిపత్తు లుండుటచే నావిషయముల నింతటితో నుజ్జగించి యీమహాకవివిషయమైనన్యవాదం బుల వర్ణించుచు వ్యాసంబును ముగించుచున్నవాడను.

రాజాలను!

పిలకా గణపతిగారు

రాజాల నో ప్రభూ! రాజాల నిపు డేను!
ఈసుందరప్రపంచము విడువఁగా లేను!

మల్లికాముకుళసిత
శూలాగ్ర సూచికలు,
కేతకీ కుసుమవిష
మాంచల క్రకచములు,
బాలసహకారమ్మదు
పల్లవచ్ఛురికలును,
గ్రుచ్చుకొన్నవి స్వామి,
గాటముగ నాహృదిని!
కదలి వచ్చుచునుండఁ
గలుకుమనుచున్న యవి!

రాజాల నో ప్రభూ! రాజాల నీతోడ;
విసిగింపకుము నన్ను బాధింపకుము నన్ను!

ఏ నెఱుంగుదు — నెపుడొ
నీనఖాగ్రము సోఁక
నిద్రగన్నేరువలె
నిదురింతు శాంతముగ.
కొలనిచిరుతరఁగములఁ
గలసి నృత్యము సల్పు
ననుతామరాకులోఁ
దెలినీటి ముత్తెమటు
లీ యఖాతానంత
కాలంపుసరసిలో
జారిపోయెద నెపుడొ,
కరఁగి పోయెద నెపుడొ:

కాని నీతోడ నే రాజాల నో ప్రభూ!
మాటిమాటికి నన్ను మరలి రమ్మన కింక.

మాయమయ్యెద వేల!
వినుము నా దోశమాట,
వెడలిపోదువు గాని:
నవ్వు వెన్నెల లీను
హారితమల్లీ సఖుల;
నరుణమధురాధరల
మందారతరుణులను;
ధవళతారల నవ్వు
మాధవీబాలలను;
అది యిదియు నన నేల?

సకలప్రపంచమ్ము
హృదయమ్ము మత్తిల్లు
నటు సృజింతి వేల?
ఆఁకొన్న భిక్షుకుని
కమృతపాత్రము నిచ్చి
త్రావఁబోవుచునుండఁ
ద్రోసివేసెడు మాడ్కి-
రమ్ము రమ్మని నన్ను
వేగిరించెద వేల?

మధుపూర్ణమా నీసువర్ణపాత్రము తన్ని
రాజాల నో ప్రభూ! రాజాల నిపు డేన!
ఈసుందరప్రపంచము విడువఁగా లేను!

---

9. 11- 5 ఒ౯౯

ప్రహ్లాద

కొల్లూరు ధర్మారాయ కవిగారు, బి. ఏ.

(దివిజ గంగా తీరాన్ని నారదముని ఆశ్రమం. కైలాస శిఖరకాంతి శేతవెన్నెల ప్రసరిస్తూంది. ఆశ్రమ వాటికలో లీలావతి వుంది. దృష్టియందలి అలసత్వం గర్భవతి అని సూచిస్తూంది. చెంత నర్మద అనే ఋషి కుమారిక కూర్చుంది.)

లీలావతి

అమ్మాయీ నర్మదా! నారదమునీంద్రుల మాటలు విన్నప్పట్నించీ, బయలంతా అంధకారమై నాలో యేదో కాంతి చోరబారినట్లుంది.

నర్మద

అమ్మా! తేజస్వంతుడైన కొడుకుని కంటావు నువ్వు.

లీలావతి

దానవేశ్వరుడని నా నాథునిమీద కత్తి గట్టిన యీ దేవతల్ని స్తోత్రం చేస్తారేం మీరూ? దేవేంద్రుని దౌష్ట్యం కళ్లారా చూచేరుకదా?

(నారదుడు నారాయణ నామస్మరణ చేసు కుంటూ ప్రవేశించును.)

లీలావతి

మునీంద్రా! మీ జపం నాకు చాలా తాపం గలిగిస్తూంది.

నారదుడు

అమ్మా! అట్లనడం పొరపాటు. ఏకాగ్ర చిత్తంతో విశ్వమంతా సంధించడమే కదా తపస్సు!

లీలావతి

అలాగైతే విశ్వమంతా వశంచేసుకున్న నా భర్తని ధ్యానించకూడదూ?

నారదుడు

నీ భర్త జయించవలసినది చాలా వుంది యింకా.

లీలావతి

మీ నారాయణుడు కనిపిస్తే అతణ్ణికూడా గెల్చేవుండును.

నారదుడు

అదే నే చెబుతూన్నది—శ్రీహరి విశ్వమంతటా వుంటూ, ప్రతివారిలోనూ వున్నాడు; నీ భర్తలోనూ వున్నాడు.

నర్మద

(నవ్వుతూ) గర్భంలో శిశువులాగు.

నారదుడు

అంతే కాదు; శిశువునందలి హృదయం లాగు.

లీలావతి

అంటే?

నారదుడు

అనగా శిశుహృదయ మంత విశ్వవ్యాప్త మన్నమాట. తనను ఆవరించివున్న తల్లి యొక్క ప్రతి అనుభవమూ శిశువున కెట్లు

ప్రతిబింబిత మవుతుందో, విశ్వమందలి ప్రతి వ్యక్తికీ నారాయణుడు గురి అవుతాడు. అందుకే అతణ్ణి సర్వసాక్షి అంటారు. నమామి, త్రిలోకవంద్యా! నమామి!

లీలావతి

(నసుగుతూ) అవును కాబోలు. గర్భస్థ శిశువులాగు............విశ్వకర్తయే విశ్వమంతటా ఆవిష్కరించివుంటే, అతణ్ణి సంహరించడానికి విశ్వమంతనీ సంహరించా లన్నమాట.

నారదుడు

అంటే, అందుతోపాటు ఆత్మహత్య కూడా జరగా లన్నమాటేనా?

లీలావతి

అయితే మరి యితణ్ణెట్లా లొంగదీయడం?

నారదుడు

విశ్వమంతనీ ప్రేమిస్తే శ్రీహరి చేత చిక్కుతాడు.

లీలావతి

ప్రేమించడ మంటే?

నారదుడు

అవినాభావంగా ఐక్యము వహించడం. అప్పుడు మరి రక్తపాతం చెయ్యవలసిన పని లేదు.

లీలావతి

మనమీద కత్తి గట్టినవారిని ప్రేమిస్తే మాత్రం?

నారదుడు

కత్తిప్రేటు గాలిపా లవుతుంది. ఎదిరి చేయి మొత్తకుంటే, ఒక్కచేతితో ధ్వని పుట్టనే పుట్టదు.

లీలావతి

విశ్వప్రేమ, విశ్వప్రేమ!

౨

(రక్షోనాథుని అంతఃపురం. తూగుటుయ్యాలలో ప్రహ్లాదకుమారుడు నిద్రిస్తున్నాడు. చెంతనున్న పాన్పుపై హిరణ్యకశిపుడు కూర్చున్నాడు. అతని పాదముల చెంత లీలావతీదేవి.)

లీలావతి

ఏమోకాని చిరంజీవి పలవరిస్తున్నాడు.

హిరణ్యకశిపుడు

పసికూనలు పలవరిస్తూవుంటారు; వారికి పూర్వజన్మవాసన—

ప్రహ్లాదుడు

(నిద్రలో) శ్రీహరీ శ్రీహరీ!

హిరణ్యకశిపుడు

(చటుక్కున లేచి కుమారుణ్ణి కదిపి లేపి కూర్చోబెట్టి) ఏం నాయనా! దుష్టు కల యేదేనా వొచ్చిందా యేమిటి?

ప్రహ్లాదుడు

(కళ్లు నులుపుగుంటూ) ఏం లేదు బాబయ్యా! శ్రీమన్నారాయణుడు ఆడుకుందికి రమ్మన్నట్లైంది; నేనూ కేక లేసేనుకాబోలు.

హిరణ్యకశిపుడు

నాయనా! నీ తోడికుర్రాళ్లలో ఆపేరు గలవా డెవడూ లేడుగదా! ఆ పే రెక్కడ విన్నావు నువ్వు?

ప్రహ్లాదుడు

అదేమో కాని అందరిపేరూ అదే అనిపిస్తుంది నాకు.

హిరణ్యకశిపుడు

పోనీ కాని, ఆ హరి యేలాగు కనిపించేడో చెప్పు చూదాం?

లీలావతి

నాయనా! నువ్వు సరిగా చెప్పేవంటే బాబయ్యగారు పట్టుకు తీసుకొచ్చి మనకోటలో పెడతా రతణ్ణి.

ప్రహ్లాదుడు

పట్టుకోడం ఎందుకూ? ఇక్కడే వున్నాడు.........అల్లడుగో అడుగో — శ్రీహరీ! ఆ కిటికీ పక్కనించి పారిపోయే డిప్పుడు.

హిరణ్యకశిపుడు

(కొడుకు నెత్తుగుని) తప్పు, నాయనా, అలా గనకూడదు. (భార్యతో) చూసేవా, ఒళ్లు కొంచెం వెచ్చగా వుంది! ఆ దాక లెవరో, యేమింత అజాగ్రత్త?

ప్రహ్లాదుడు

బాబయ్యా! నే నాడుకుందికి తోటలోకెళ్లొద్దూ? మా స్నేహితు లంతా వొస్తారిపాటికి.

హిరణ్యకశిపుడు

వెడుదువుగానిలే, నాయనా, సాయంత్రం చల్లబడ్డాక వెడుదువుగాని. అందాకా గురువుగా రొస్తారు, అక్షరాలూ అవీ చెబతారు, దిద్దుకుంటూ వుండు; మరి పెద్దవాడి వైపోతున్నావు కావూ?

ప్రహ్లాదుడు

ఊఁ.

3

(i) (గురువు, శిష్యులు.)

గురువు

ఒరే, విభూతికుర్రాడూ! దిద్దేవూ అక్షరాలన్నీ?

విభూతికుర్రాడు

నాకు వేలు నొప్పెడుతూందండీ. కావలిస్తే చదువుతానండీ.

గురువు

సరే, చదూ. ప్రహ్లాదా! ఏమిటా పరధ్యానం? నాడు చదూతూవుంటే విను, మళ్లా నువ్వొప్పజెప్పాలి.

ప్రహ్లాదుడు

అలాగే.

విభూతికుర్రాడు

అ ఆ ఇ ఈ ఉ ఊ... ....

గురువు

ప్రహ్లాదా! అక్షరాలన్నీ యెన్నో చెప్పు.

విభూతికుర్రాడు

నే చెప్తానండి; డెబ్భైమూడు.

గురువు

ఊరుకో, శుంఠా! నిన్నడిగి నప్పుడు చెప్పు.

ప్రహ్లాదుడు

ఒక్కటే అక్షర మండి.

గురువు

మతి పోతూంది నీకు.

ప్రహ్లాదుడు

శ్రీహరినామ మొక్కటే అక్షరం.

గురువు

ఆ భూతం వొదల్లేదూ, యింకా? లెక్క చూసి సరీగా చెప్పు.

ప్రహ్లాదుడు

పంచభూతాల్లోనూ యిమిడివున్న ఆ భూతం సర్వవ్యాప్తం. అది వొదిలిపో దెప్పు డూను.

విభూతికుర్రాడు

యాభై రెం డండీ, గురువుగారూ; నేను లెక్కపెట్టేను.

గురువు

మొన్నని చెప్పేడో, నువ్విప్పుడు చెప్పు?

ప్రహ్లాదుడు

యాభై రెండు.

గురువు

అది: అలాగు వెళ్లి కుదుర్చుకో.

(ii) (ప్రహ్లాదుడు, చెలికాండ్రు.)

ప్రహ్లాదుడు

నేనే గురువునైతే, మిమ్మల్ని యీ పాఠా లేవీ చదవొద్దని చెప్తాను.

చెలికాండ్రు

ఆయిహాయి! అయితే ఇవాళ బరిఆట ఆడుకుందాం; ప్రహ్లాదా! నువ్వు గురువుగారి విట.

ప్రహ్లాదుడు

నే నొక్కటే పాఠం చదూకున్నాను, అదే మీకూ చెప్తాను వినండి:— సృష్టిలో కల్లా శాశ్వత మేది?

ఒకడు

నేను ముందు చెప్తాను. (ఆలోచించి) భూమి.

రెండోవాడు

పోరా, భూమి శాశ్వత మేమిట్రా! భూమి మరి లేకుండా పెద్ద నుయ్యి తవ్వేస్తే,— లేకుంటే సముద్రం పొంగిపోయి ముంచేస్తే,— మరి భూమి ఎక్కడుంటుంది?

ఒకటోవాడు

అయితే, సముద్రం.

రెండోవాడు

అదీ కాదురా! అది మాత్రం నశింప దనుకున్నా వేమిటి? ప్రహ్లాదా, నువ్వే చెప్పాలి.

ప్రహ్లాదుడు

అయితే వినండి. సమస్త చరాచర సృష్టిలోనూ ఒక సన్నిహితత్వం ఉంటూందా!

చెలికాండ్రు

అంటే?

ప్రహ్లాదుడు

అనగా, సర్వతోదృశ్యమైన ఒక లక్షణం.

చెలికాండ్రు

అవును.

ప్రహ్లాదుడు

అదే శాశ్వతత్వం ప్రసాదించేది. దానినే శ్రీహరి అంటారు. రక్తసంబంధం కేవలం ఐహికం గాని, యీ సృష్టి సన్నిహితత్వం అనాది, అనంతం! అందుచేత విశ్వమంతనూ ప్రేమించడమే శాశ్వతత్వం యిస్తుంది. దానికి మూల మంత్రమే శ్రీ హరినామస్మరణ.

చెలికాండ్రు

(పెద్దధ్వనితో) శ్రీహరీ, శ్రీహరీ!

ప్రహ్లాదుడు

ఆ శ్రీహరి సర్వాంతర్యామి; అణువుల లో పరమాణువు, మహాదర్థములకన్న మహా దర్థము; ప్రేమస్వభావుల మైతే అతడు ప్రత్యక్ష మవుతాడు. రోజూ యీపాఠం చదూకుంటూ ఉందాం, అందరం.

చెలికాండ్రు

శ్రీహరీ, శ్రీహరీ!

(iii) (రాచనగరులో గురువు, ప్రహ్లాదుడు.)

గురువు

శబ్దాంతంబట్టి లింగవిభేదం ఎట్లా చేస్తావు?

ప్రహ్లాదుడు

స్త్రీపురుషసంజ్ఞ శరీరానికే గాని ఆత్మకి లేదు.

గురువు

(కోపంతో) వ్యాకరణశాస్త్రంలో ప్రశ్న అడిగితే వేదాంతం మాటాడతా వేం?

ప్రహ్లాదుడు

వేదాంతవాదాంతమైన శ్రీహరిలోనే వున్నాయి అన్నిశాస్త్రాలూనూ!

గురువు

పోనీ శ్రీహరి పుంలింగవాచకమేనా?

ప్రహ్లాదుడు

కాదు, విశ్వప్రేమ వాచకం!

గురువు

నీమొండితనం దెబ్బలతోగాని వొదల్దు.

ప్రహ్లాదుడు

అందువల్ల మీకు చిత్తశాంతి లభిస్తే నాకదే ఆనందం!

గురువు

(కోపం పట్టలేక) పద పద, బాబయ్యగారి యెదట పెడితే యీ పొగ రణుగుతుంది.

ప్రహ్లాదుడు

లోకమంతటికీ జనకుడు అచ్యుతుడు.

గురువు

పదవోయి, అధికప్రసంగం చెయ్యక.

(iv) (సింహాసనంపై హిరణ్యకశిపుడు; అతని తొడమీద ప్రహ్లాదకుమారుడు — మొగమున శాంతి తేజము, కమలంగు చిరునగవూ తాండవిస్తున్నాయి.)

హిరణ్యకశిపుడు

(కొడుకుశిరస్సు నిమురుతూ) నాయనా! ఇన్నాళ్లకు సర్వశాస్త్ర శేముషీసింధుడవై మన వంశానికి వన్నె తెచ్చేవు.

ప్రహ్లాదుడు

బాబయ్యా! మీ ఆశీఃఫలం.

హిరణ్యకశిపుడు

మూడులోకాలూ సాధించిన రక్షోనాథుణ్ణి నేను. ఈ విశ్వసామ్రాజ్యభారం, బుద్ధికుశలుడవై నువ్వే వహించాలి, యికను.

ప్రహ్లాదుడు

జగద్భర్తయైన శ్రీహరి కటాక్ష—

హిరణ్యకశిపుడు

(ఉగ్రుడై, పుత్రుని తొడమంచి దింపి)

ఏడీ, స్వామిద్రోహియైన మీగురు వేడీ?

ప్రహ్లాదుడు

తండ్రీ, నా గురువు లజ్ఞానతమోనిమగ్నులగుట తప్ప, యేపాప మెరుగరు. ఆత్మవంచకులే కాని స్వామిద్రోహులు కారు!

హిరణ్యకశిపుడు

(అవనతనేత్రుడై) పోనీ కాని, నాయనా! మన శత్రువైన శ్రీహరిని చింతించుట మనకేమి శ్రేయస్కరము?

ప్రహ్లాదుడు

బాబయ్యా! శత్రుత్వ మన్నదే ఉత్త మిథ్య. అందులో అనంతప్రేమస్వరూపునితో వైర మెట్లు పొసగును?

హిరణ్యకశిపుడు

మరి......(కోపముతో) కులద్రోహబుద్ధి నీవు మానవా యేమిటి?

ప్రహ్లాదుడు

విశ్వకుటుంబ మంతనూ ప్రేమించు నేను ఎవరిపై ద్రోహచింత చేతును?

హిరణ్యకశిపుడు

(అత్యుగ్రుడై) ముదిరింది యీ పిశాచం! (భటులతో) వీణ్ణి తీసుకెళ్లి కారాగృహంలో వుంచండి; కఠిన శిక్షలతో గాని మార్గాని కొచ్చేలాగు లేదు.

౪

(కారాగృహంలో.)

ప్రహ్లాదుడు

శ్రీహరీ, శ్రీహరీ! ఈకైదులో వున్నావేం నువ్వు? నీకోసాన్ని యెంత వెతుక్కున్నా ననుకున్నావు? ను వ్విక్కడున్నావని మా బాబయ్య కెలా తెలిసిందో న నిక్కడికి పంపడానికి!......ఎండుకమ్మా యేడుస్తున్నావూ? నే నాడుకుందికి రాలేదనే కాబోలు? పోనీలే, మనిద్దరం ఇక్కడే స్వేచ్ఛగా ఆడుకుందాం; కాదనేవా రెవరూ లేరుగా మరీ? చక్కా, విశ్వప్రేమగీతాలు పాడుకుంటూ యిక్కడే వుందాం!.........అవును గాని, శ్రీహరీ, మా

బాబయ్యావాళ్లూ యెంత అదృష్టవంతులోయ్! వాళ్ల చేతుల్లో బల్లెముల రూపం ధరించి, చాటునే వచ్చి నన్ను ముద్దాడుతావా!— ఆ అవ్యయానందంతో నాకు వొళ్లు పులకరించి పోతో వుంటుంది సుమీ! నువ్వు దాగుండే చోట్లన్నీ వాళ్లందరికీ తెలుసునోయ్, నేనొక్కణ్ణే వెతుక్కుంటూ వుంటానుగానీ! లేకుంటే నీదగ్గర పడేలాగు కొండమీదనించి సరిగ్గా సముద్రం లోకి యెలా నన్ను విసరగలరు?...

ఏడీ, నా హరి, ఏడీ?—అమ్మ, దొంగా! మాట్లాడుతూవుండగానే మాయమై పోయినట్లై, యిక్కడే వున్నావూ? ఇక్కడ వుండి, ఇనపగజాల అవతల కూడా కనిపిస్తున్నావు, యీ రాతిగోడలలోను కనిపిస్తున్నావు! ఇన్ని చోట్లా ఒక్కసారిగా యెందుకున్నావు? నన్ను ఆవరించుగుని ఉండాలనా? (తల వంచుకొని) నా హృదయంలోనూ నువ్వే, గర్భస్థశిశువులాగు! అంతటా నువ్వే, ఆకాశంలాగు! నిన్ను యిలాగు, గట్టిగా కౌగలించుకుని నిద్ర పోతాను; నన్ను లేపకుండా పైకి యెలాగు దాటగలవో చూస్తాను.

* * * *

౫

(రక్షోరాజ సభామందిరం : రాజు, కొడుకు.)

హిరణ్యకశిపుడు

ఇవాళ నీహరి యెక్కడున్నాడో చెప్పు. డొక్క చీల్చేస్తాను.

ప్రహ్లాదుడు

బాబయ్యా! యెక్కడని చెప్పేది? అతడు సర్వాత్మకుడు; మీ యందు, నాయందు, ఎల్లెడలను ఉన్నాడు!

హిరణ్యకశిపుడు

నీలో వున్నాడని నీకేం తెలుసును?

ప్రహ్లాదుడు

అంతటా కనిపిస్తూన్నవాడు నాలో మాత్రం లేడని యెట్లా చెప్పగలను?

హిరణ్యకశిపుడు

ఈ గదతో స్తంభాన్ని మొత్తితే, నీహరి చచ్చిపోవా లన్నమాట, స్తంభంలో వుంటే!

ప్రహ్లాదుడు

గదలో మాత్రం లేడా యేమిటి? అనాది మధ్యలయు డచ్యుతుడు!

హిరణ్యకశిపుడు

సరే, కాని — ఈదెబ్బతో సమాప్తం.

(అని గదతో స్తంభాన్ని మొత్తును.)


ప్రహ్లాదుడు

(కన్నులు మూసుకుని) శ్రీహరీ, శ్రీహరీ! ఏమి యీ గర్జారవము? భువనాలన్నీ గజగజలాడి ప్రతిధ్వనిస్తూన్న ఈ ప్రళయభేరి? (కన్నులు తెరిచి) తండ్రీ! ఎంతటి ధన్యమూర్తివి? వెంటాడి శ్రీహరిని హృదయంలో అంకించుకున్నావే!........పరాత్పరా! నీ దివ్యాక్షేమమున వెల్లివిరిసిన విశ్వప్రేమకు నమోవాకము!

(తెర)

అమరనాథ చిత్రములు ౮

(E. N. P.)



౧. అమరనాథ సాధు యాత్రికబృందము



౨. పంచతర్ణివద్ద యాత్రికులు స్నానశ్రాద్ధాదుల నొనర్చుట



3. లిడారు నల్లా



౪. కోహెన్హారు

౭. కవిబ్రహ్మ తిక్కన

కాకతీయ గణపతిదేవ చక్రవర్తి సకలశిష్యగణంబులు లరివేష్టించి కొలువ స్వర్ణాందోళిక యందుఁ దనయాస్థానంబున కరుగుదెంచిన తిక్కనను సబహుమానంబుగాఁ గైకొని యాతని రాకకుం గారణ మారసి,—

కవివర, యిట్టిస్వల్పమగు కర్జమునం దలఁపూఁది, నాకుఁగా
నవహితవృత్తి రాఁజనఁగ నొదునె! రమ్మని కాకిచేత నా
చెవిఁ బడఁ జేసినం జనదె! చేరిన ని న్నిటఁ గాంచి మత్పురీ
పవనము లుల్లసిల్లినవి బంధురసత్కవితారసార్ద్రితన్.

ఏను విదల్తు నాజిని నికృష్టుల నక్కన బయ్యనాదులన్
ధీనుత, దీని కింత వలెనే యినవంశజుఁడైన సిద్ధిభూ
జాని నొనర్తు సింహపురశాసకుఁ గాఁ జను వంత పీడుమీ
యానము మాకుఁగూడను శుభావహ మింతకుఁ బల్క నోడెదన్.

అగు మీ కిర్వుర కెన్నొ వర్షములుగా నాచార్య శిష్యత్వముల్
తగ వేపారఁగ నీవ యి ట్లుచిత విద్యన్ సిద్ధభూపాలకున్
విగత శ్రీవిభవాభిరాముని పురోవృద్ధిన్ మదిం గోరి నె
వ్వగ నేతెంచితి వాపదం గడప; సంభావింప నా సత్కవీ!

సరసకవిత్వరాజ్యమున శాసకుఁడై తనరారె దీవు ను
ర్వర భవదీయ శాసనముఁ బాలన సేసెడు నేను పోర న
య్యెరువుర గెల్చుచో నదియ యిష్టము నీయది గాక వేరుగా
నరసెడి వాఁడనే యిది యనంత మహామహిమంబు సత్కవీ!

పలికితివి భారతము ప్రజ్ఞల కెల్లను దావు గాఁగ జ్ఞానపిపాసా
త్ములు తనివి తీరఁ గ్రోలఁగ నిల నీ కెవ రీడు సత్కవీ, పరికింపన్.

ఎన్నిదినాల నాఁటిదొకొ యిప్పుడు కన్నులఁ గట్టి నట్లు నీ
వన్నియుఁ జూచినట్లు పరమార్థము ద్యోతకమై తనర్చు న

ట్లన్న, రచింతు భారతము నయ్యది నీప్రతిభాసముద్ధృతిం
బన్నికమై యెసంగుఁగద! పార్థివరాజ్యరమానుశాసనా!

ఇది మును విందు 'భారతము నీవు రచించెడివేళ సంగరా
భ్యుదయము దెల్పుపట్టులను పోరి నినాదము లుప్పతిల్ల ని
న్గదిసి కులాలకుండు గురునాథుఁడు కాండపటంబుఁ బ్రక్కకుం
జిదిమినఁ గన్న వారె' నని: చెప్పుము నిక్కువమే మహాకవీ!

వెన భూమీశు లానంగుమాన్యములతో వేడ్కల్ దగం బొందుచుక్
బసలక్ మించిన మానినీమణులు సంభాషించి సేవింప న
ద్దెనలక్ సద్యశమున్ రహించు కవితల్ వల్కంగ నోఁ గాక యీ
యసిధారావ్రత మూని పల్కుటిది యేలా ఛాందసప్రక్రియక్.

పాలసముద్రమంథనవేళఁ బక్వము నొందిన వెన్న యెట్లో య
ట్లోలి భవత్కృతిం దరవ నొప్పును గాదె సమస్తధర్మముల్;
ధీలలనాధిపా, యిదియెఁ దీనుని సత్కృతిగాఁ దలంచి గ్రా
మాలను స్వీకరింపఁ గదె మాన్యుడ, యర్ధశతాధికంబులక్.

ఎది భవదీయవాంఛితమొ యెప్పగిదిక్ జయ మొందుఁ గాక యి
య్యదియ మదీయహేతిని జయావహ మాటకు గర్వమొందె దే
సదను నెఱింగి వత్తు చతురంగబలంబులతోడ శత్రులం
బదర జయించి సిద్ధినృపుఁ బాలకుఁ జేసెద నేగు మోకవీ!

* * * * * * * *

పునరభిషిక్తుఁ డైనమనుమసిద్ధి

అనఘా, నీయెడ నుద్భవంబయిన కావ్యశ్రీని నా కిచ్చి మ
న్ననలం దన్పితి మున్న నేఁడు జను లెన్నం బెండ్లి గావింతు నీ
యనుకంపన్ భవదీయపాల్యయగు రాజ్యశ్రీకి నాకున్ ధరక్
మనె దీ వెన్నఁడు మామవంచుఁ బిలువన్ మామా, దయాంభోనిధీ!

కవుల గారవమును నిల్పఁ గలుగు సుకవి-కరుణకు నధీశ్వరుండు కాఁగలిగనేని
అట్టికవి కాశ్రయము నిచ్చి యలరునృపతి - కరుదె యిడుములు దొరఁగుట
అమరవంద్య!

పాలతల్లి

కపిల కాశీపతిరావుగారు

రాత్రి పదిగంటలైనది. ఇంటిల్లిపాదీ భోజనాలు చేసి పనులు చక్కబెట్టుకుని పడుకున్నారు. రుక్మిణికిమాత్రం యెంతప్రయత్నించినా నిద్దరపట్టడము లేదు. పక్కలో పిల్లవాడు "కుంయి, కుంయి" లాడుతున్నాడు. తల్లి అటూ యిటూ కాస్త వత్తిగిలితే గంయ్యిమని యేడుస్తూ బాధపెడుతున్నాడు. ఓపక్కన పడుకుని చెయ్యి తలకింద యెత్తుబెట్టుకొని పిల్లవాడికి పాలిస్తూ, విసుక్కుంటూ, మూలుగుతూ అవస్థపడుతున్నది. చిన్నతనంనుంచీ ఒక్కర్తే, తన స్వేచ్ఛగా పడుకునేటందుకు అలవాటు పడ్డది. కాపరానికి వచ్చిన కొత్తలో తప్ప ఆమె భర్తకూడా ఈ విధముగా నిద్రాభంగముచేసి వ్యథపెట్టలేదు. మూడునెలలుపైగా పిల్లవాడు పుట్టినప్పటినుంచీ ఆ అమ్మాయి సుఖముగా నిద్రపోయిన పాపాన్ని పోలేదు.

గదిలో దీపం వెలుగుతూన్నది. తలుపులన్నీ వేసి వున్నవి. నుమ్మంలో నులకమంచం వేసుకుని మడిగా ఒక తాటియాకు తలగడా తలకింద వుంచుకుని రుక్మిణి తల్లి నిద్రపోతూన్నది. తాను పడుకుంటే పిల్లవాడు యేడుస్తాడు. యేడిస్తే నిద్రపోయేవాళ్లు విసుక్కుంటారు. ఎందుకు వచ్చిన అవస్థో యిది అని ఆ యిల్లాలు కొట్టుపడిపోతూన్నది.

"ఏమిటే, అమ్మాయీ, ఊఁ, అల్లా ఆపసోపాలు పడతావు, వొక్కనిమిషం కునుకు పోరాదూ" అన్నది వాళ్లమ్మ.

"నీకేం, చెబుతావు, కునుకో అంటే కళ్లు మూయ్యనిస్తేనా?"

"ఎవరే?"

"ఇంకా అడగాలీ? బ్రహ్మరాక్షసి నీ మనమడే."

"అంతా అపరూపాలు పోతావే, పిల్లా! మేం యెవరం కనిపెంచలేదు? ఎల్లాగైతే కన్నావు పిల్లాణ్ణి. కాస్త ఒత్తిగిలి వమలబెట్టి పడుకుంటే వాడే వుంటాడు వాడి ధోరణ్ణి."

"ఇంక బతకఖర్లే, పిల్ల పిప్పిచేసెయ్యడమేనేటి, పాట్టేలుకు మల్లే కుమ్మెయ్యడమే? ఇదేం పిల్లాడోనమ్మా! అందరి పిల్లలూ ఇల్లాగే వుంటే చచ్చిపోరూ?"

"ఎన్నో కంతలు కోశామగాని, నా కంతెంత చెప్పలేదన్నాడు వెనకటి కోవైద్యుడు. అల్లావుంది నీ వైఖరి. తొలిచూలుకే యిల్లా గనుకుంటే యేడుకాన్పులెల్లా భరించానమ్మా నేను? మీరంతా యిల్లా యేడ్పించిన వాళ్లే."

"పోదూ నీ కాన్పులుసరే నువ్వు సరేనూ, వొక్క నిమిషం కదలడానికి వీల్లేక చస్తోంటేనూ. పొద్దస్తమానూ అయ్యగారి సేవే అయితే యెల్లాగ? ఇంకెందుకు పనికిరా అక్ఖర్లేదు మనుషులు?"

"ఔను పాపం దుంగలూ దూలాలూ ఎత్తలేక నలిగిపోతోంది పిల్ల, పని తీరుబాటు లేక. పుట్టినవాళ్లకి పురుష జెజ్ఞంచేశాట్ట."

"పిల్లికి చెలగాటం, ఎలుకలికి ప్రాణపోకట అన్నట్టుంది."

"ఓసి పిల్లా పోకులు పోకుమీ."

"నీకేమే, నుంచుంటే కళ్లు తిరుగుతాయి. ఊఁ నీరసం. రాత్రి కాస్త తమలపాకులికి సున్నంరా పిమ్మయ్యమంటే లేవలేక కోపంచేత పడిపోయాను. అప్పుడు ముఖాన్ని యిన్ని చన్నీళ్లుకొట్టి తీసుకొచ్చి పడుకోబెడితే తెలివొచ్చింది. ఆయనికి కూడా నిద్రలేదు పాపం."

"ఆఘాయిత్యపుపనులూ, తెలివితక్కువ పనులు చేస్తే పోపొస్తుందా మరింకేమన్నా అవుతుందా? పిచిక పిట్టలాగ బుర్రూబుర్రూమని తయారవగానే సరేనా, సంబాడించుకునే శక్తి ఉండాలి."

"ఎవరేంచేశారే? పూరుకున్నకొద్దీ మరీ మితి మీరిపోతూంది ఉపన్యాసం. ఇంకముఖాలు ముఖాలు చూసుకోఅఖ్ఖర్లేదు. ఎల్లాగైతే కలిగింది సంపత్తి; పిల్లలూ, పీచులూనూ. రెండురోజులు శెలవు దొరక్క దొరక్క దొరికితే. పాపం! ఆయనేం చేశారు? ఈ రెండుపూటలు గుర్రాలక్కలాగ మూతి ముడుచుకుని కూచోమన్నావేమిటి. ఎన్నాళ్లో?"

"నేనేంవన్నానే నువ్వల్లా ఖంగారు పడతావూ. మీ మీ యిష్టాలు నాకెందుకు బాబూ! బుద్ధితక్కువై కలగజేసుకున్నాను. ఉట్టికట్టుకుని వూరేగండి. కట్టకట్టుకుని గంగలో దిగండి. ఈమాటు మాలిగితే చూడు చెబుతా."

....

"అమ్మా!"

"........."

"అమ్మా!"

"ఏం తల్లీ."

"నిద్రపోనివ్వడం లేదే."

"ఇల్లాతే అమ్మా, నేనన్నా పక్కలో వేసుకు పడుకుంటాను కానీవూ. తెల్లవార్లూ బిడ్డ కోడిపిల్లా సట్టు కూస్తోంది, ఒక్క కునుకు లేకుండా. అర్భకపు పిల్లలూ, అర్భకపు బతుకులూనూ. ఏం బతికి బట్ట కడతారో?"

"అమ్మయ్యా, బతికాను, బాబూ."

"ఇంక పాలతల్లిని రాత్రికూడా రమ్మని చెబుతా నుండమ్మా. ఇక్కడే పడుకుంటుంది అది కూడానూ. ఇంకో ఒకటో రెండో ఎక్కువడిగితే అడుగుతుంది. ఏం చస్తాం? హూనం అయిపోతోంది పిల్ల. పసిపిల్లలు, పసిప అవస్థాను. ఒకరోజా రెండురోజులా?"

ఉదయం ఏడుగంటలైనది.

పాలతల్లి అప్పుడే వచ్చి పిల్లవాడికి పాలిస్తూ ఉయ్యాలగదిలో కూర్చున్నది. రుక్మిణి తండ్రి వసారాలో పడక కుర్చీలో పడుకొని వెండి కళ్లజోడు పెట్టుకుని పంచాంగం తిరగవేస్తున్నాడు. ఒకసారి పుస్తకంచూసి, చూరుకేసి చూసి తలతడుముకున్నాడు. పెదిమలు ముడిచి విరిచినాడు.

"అమ్మాయీ" అని పిలిచినాడు.

"ఎందుకు నాన్నా?"

"ఇల్లా రా."

రుక్మిణి వచ్చి గడపలో నుంచుని "ఏం, ఎందుకూ?" అన్నది.

"నీ వంట్లో ఎల్లా వుంది?"

"నా వంటికేం, నిమ్మళంగానే ఉంది" అంది, ఒకపక్కకు వొరిగి ద్వారబంధానికి ఆనుకొని.

"మీ ఆయన ఏంచేస్తున్నాడు?"

"ఫలహారం."

"ప్రయాణం?."

"మధ్యాహ్నం."

"ఎవరెవరూ?"

"ఏమో, నాకేం తెలుసు, నన్నడిగితే?"

"మరి, ఎవర్ని అడగాలి?"

"అడగవలసిన వాళ్లనే అడగండి. నాకేం తెలుసు?" అని వెళ్లిపోవడానికి సిద్ధపడితే "ఇదిగో, ఇల్లా రా, వెళ్లిపోకు" అన్నాడాయన.

"అక్కడ ఫలహారం చేస్తున్నారు. ఎందుకు?"

"ఈవేళా, రేపూ మంచిదికాదు. ఎల్లుండి బయలుదేరితే దివ్యంగావుంటుంది. అందులో పిల్లతల్లిని తీసుకు వెళ్లడం."

"నాతో చెబితే? ఆయనతోనే చెప్పాసంగతి."

"ఏమిటి చెప్పే సంగతి, నేనొక్కణ్ణే ప్రయాణం. ఇప్పుడేం కంగారుపడి పంచాంగాలు తిరగెయ్యఖ్ఖర్లేదు" అంటూ అల్లుడు వసారాలోకి వచ్చినాడు. రుక్మిణి మూతివిరిచి, నవ్వుకుంటూ, వెళ్లిపోయినది. మామగారు ఏమీ మాట్లాడకుండా లేచి, ఏదో పనిమీద అవతలికి వెళ్లిపోయినారు.

పాలతల్లి వళ్లోపిల్లవాణ్ణి తీసుకుని రుక్మిణి వసారాలో కూర్చున్న భర్తగారి వళ్లో కూలేసినది. తాను స్తంభాన్ని ఆనుకుని, తండ్రీ కొడుకుల ముచ్చట్లు చూస్తూ మంచున్నది. ఆవిడ ముఖముమీద అపరిమితమైన ఆనందం తాండవిస్తున్నది. శరీరం అంతా తేలిక అయిపోయినది. పిల్లవాడు కళ్లుమూసుకుని నిద్రపోతున్నాడు. రామారావు, ఇంక విధిలేదురా బాబూ కాసేపు ఎత్తుకోకపోతే, అని మనస్సులోవున్న అసహ్యం అంతా అణుచుకుని వెగటుగా పిల్లవాణ్ణి చూస్తున్నాడు.

"ఉచ్చోస్తాడేమోనే తీసెయ్యి" అన్నాడు. రుక్మిణికి చాలా కష్టం తోచినది. "ఒక మాటు ముద్దన్న పెట్టుకోరు. పాపం!" అని నసుగుతూ వేసి మంచున్నది. పోనీ దీనితోటన్నా పోదులుతుందని అతను అలవాటు లేనివాడు చుట్టకాల్చినట్టుగా ముద్దుపెట్టుకున్నాడు. వెంటనే గుడ్డతో మూతి తుడుచుకొంటూంటే "మరీ శోద్దమండీ, మీరు" అని పిల్లవాణ్ణి తీసుకుని "మా నాన్నేడీ, చిట్టేడీ, బుల్లేడీ, నాన్నదగ్గిర కొల్లిందా, పిచ్చిముండా, ఏం వన్నాలమ్మా నాన్ననిన్నూ, వుచ్చోత్తా నన్నారా, కొట్టుదామా, నాన్నని కొట్టుదామా" అని అనురాగ మహాంబుధిలో, తుపానులో ఓడమాదిరిగా ఊగిపోతూన్నది. "నీచువాసనేస్తాడేమే, వెధవ?" అన్నాడా చిట్టినాన్న, ఇంత అవస్థ పడినతరువాత. రుక్మిణికి చాలా కోపం వచ్చినది. "ఉప్పరిదాని పాలు తాగుతున్నాడు, వుప్పరి వెధవ" అన్నాడాయన. ఆమెకు మరింతకోపం వచ్చినది.

....

....

"పొద్దెక్కుతోంది, పిల్లాడికికాస్త నీళ్లొయ్యవుటే, అమ్మాయి?"

"పడుకున్నాడే పాపం. లేపితే ఏడుస్తాడు ఎల్లాగ?"

"అయితే, యీవేళ వొళ్లు కడగవేంవిటి వాడికి?"

"నా చేతకాదు బాబూ, కావలిస్తే నువ్వే పొయ్యి."

"ఏం, విడ్డూరాల్లే, మాయమ్మతల్లీ, పడుకుంటే వో అపురూపం, పడుకోకుండా మేలుకుంటే వో అపురూపం."

"అమ్మా, ఇదివరకు అల్లా ఏడ్చేవాడు, ఇప్పుడల్లా నిద్రపోతాడేమే. మూడో నెల వొచ్చినకాణ్ణించి మానేశాడు. నెలకోపై ఖరీ అయ్యగారికి."

"పిల్లలికి నిద్రే సఘంబలంట. ఇదివరకు కడుపు ఎండగట్టి పడుకోపెడ్తే ఏడ్చేవాడు. ఇప్పుడు కడుపునిండి శుభ్రంగా నిద్రపోతున్నాడు. నా చిట్టి తండ్రి" అని నిద్రపోతూన్న పిల్లవాణ్ణి తీసుకుని ముద్దుపెట్టుకున్నది ముసలావిడ. బద్ధకంలోవున్న పిల్లవాడు నిద్రలోకూడా పాలుతాగుతూన్నట్టు పెదిమలు ఆడిస్తూ నాలిక చప్పరిస్తున్నాడు.

"పాలు తాగుతున్నాడు చూశావుటే అమ్మా నిద్దట్లో. కలగంటున్నాడేమోనే?"

"పిల్లలంతా అంతేనే."

ఇంతలో పిల్లవాడు మేలుకుని తన చిన్నవొళ్లు విరుచుకుంటూ, బుల్లినోరు తెరిచి ఆవులించినాడు. "చూడవే, అమ్మా, చూడవే" అన్నది రుక్మిణి. పిల్లవాడు బుగ్గలు సొట్టపడుతూ నవ్వినాడు.

"ఎందుకే నవ్వుతాడల్లాగ?"

"దేవుడు చంటిపిల్లలికి కల్లో కనబడతాట్ట, కనబడి మీ అమ్మా మీనాన్నా కాశీ లేచిపోయారంటాట్ట. అంటే వాళ్లేడుస్తారు. మళ్లీ అదుగో వచ్చారంటాట్ట. వెంటనే నవ్వుతారు. వాళ్లకేంవిటి చంటిపిల్లలు దేవుడితో సమానం" అంటూ పిల్లవాణ్ణి నీళ్లుపోయడానికి పెరట్లోకి తీసుకు వెళ్లిందామె. రుక్మిణి, తల్లి కూడా వెళ్లి రుబ్బురోలుమీద కూర్చుని చూస్తున్నది.

"ముచ్చట చూస్తూ కూచోకపోతే కాస్త అందివ్వకూడదూ? అంతె అబ్బదాలే, తల్లీ, యీకాలపు పిల్లలూ."

రుక్మిణి వినిపించుకోనట్టు ఏదో మాట్లాడుతున్నది.

"ఇంకెన్నాళ్లమ్మా, లెక్కపెట్టి ఇరవయి రోజులు, తరువాత నా అవస్థ నేనే పడతాను."

"అవునమ్మా, నీకవస్థకాకేం, కుర్రాడి గడ్డి కుర్రాడు తింటాడు. నీ పెంపూ, నీ పెట్టూ, వాడు బాగుపడకేం? నీ ధోరణి నీది వాడి ధోరణి వాడిది."

"ఇక్కడ దిగబెట్టిపో, నాదగ్గిరె వుంటాడు వాడు. మగపిల్లల్ని పెంచి చాలా రోజులైంది. వాళ్ల తాతయ్య యెంతో మురిసిపోతున్నారు. ఏంవుందమ్మా, ఇక బుట్టె బిడ్డలా, ఇక పెరిగే బాలలా. సూర్యాస్తమయం అయిపోతూంది" అని ఆవిడ, స్తంభించిన కంఠంతో, నీరు గ్రక్కిన కండ్లతో గతించిన సర్వసౌభాగ్యములూ తలుచుకొని, శేషించిన వార్ధకానికీ, శీర్ణించిన శరీరపటుత్వానికీ చాలా విచారించినది.

"ఇంకా ఏ మాటే, కాటికికాళ్లు చాచుకుని కూచుని, యింకా పిల్లలు కావాలని ఉవ్విళ్లూరుతోంది, అమ్మగారు. నవ్విపోయారు, ఎవరన్నా వింటే. సిగ్గు చేటు."

"అవునమ్మా, వేళాకోళం అయిపోయింది మా బతుకు. ఇంతకీ మా చిట్టివాన్నని ఇక్కడ వుంచుతావా వుంచవా?"

"నా యిష్టం ఏం వుందమ్మా, వాళ్ల నాన్నని అడుగు. నీకే అపేక్ష మనమలంటే? వాళ్ల బామ్మకి లేదూ?"

"ఇదంతా యెందుకు, శ్రీరంగనీతులు. వుంచనని చెప్పరాదూ. అల్లా వుంటుందిగావునమ్మా యెవరిపిల్లలంటే వాళ్లకి" అంటూ ఆవిడ పిల్లవాడికి నలుగు పెడుతూన్నది.

"అదేంవిటే, అల్లా నలిపేస్తావూ, వాణ్ణి చూడు పాపం, వొళ్లంతా ఎల్లా కందిపోయిందో. ఇదే గావును పెంపు. నీ పెంపూ, సొంపూనూ."

"నక్కపుట్టి, మూడు ఆదివారాలైందట. ఇంత వుప్పెన యెప్పుడూ యెరగనందిట. అల్లావుంది నీమాటా, వేషం. నువ్వుకూడా చెప్పాలీ వాకు, పిల్లల సంరక్షణ. లేక లేక పిల్లబుడితే గడ్డపారతో ముక్కు కుట్టినట్టుంది. అబ్బురం! నువ్వే పిల్లాణ్ణి గన్నావు. అస లల్లా నలిస్తేగాని పిల్లలు బలంగా వుండరు" అని మరి కాస్త దృఢంగా నలిచినది. పిల్లవాడు ఏడ్చినాడు.

"చూడవే, పాపం, చూడవే, నెమ్మదిగా నలవ్వే."

"అరిగిపోడు లేవే ఇంతలో నీకొడుకు. అరగనీ, కాస్త తాగిన పాలన్నీ. ఆ పాలతల్లి వొళ్లో చేరి తెగతాగుతాడా పాలన్నీ."

"ఊరుకోవే, దిష్టి తగుల్తుంది. మనమే అనుకుంటే వూళ్లోవాళ్లేంవంటారు?"

"అనుకోరు మరీ. అది గోల, పాలన్నీ మీ అబ్బాయే తాగుతున్నాడు, మా పిల్లకేం మిగలవని."

"అమ్మా, వాళ్లేం తింటారే, అంత బలంగా వుంటారు. ఒక పిల్లాడికే మనం ఇల్లా అనుకుంటాం గదా, ఇద్దరికీ కూడా ఎల్లా యిస్తోందో అది?"

"వాళ్లు కాయకష్టం పడతారు. వేళకింత కలో గంజో తాగుతారు."

"మనయింట్లో మనిషి మకీనే. దీనమ్మ కడుపు బంగారం గానూ, నల్లరాళ్లు. అనుకోకూడదుగాని పాపిష్టి మాటలు, ఆవుపాడుగో, గేదెపాడుగో అనిపిస్తుంది." అని చెంపలు వాయించుకొన్నది.

"సరిగ్గా మాడలేదుటే యెప్పుడూ నువ్వూ, యీ వొడ్డుప్పరాళ్లంతా అంతేనే. వాళ్లకి ఆ పటుత్వం స్వతహా వుండనూ వుంటుంది, పైగా మీకుమల్లె దిక్కుమాలిన ముష్టి పోకులన్నీ యెరగరు వాళ్లు. మా కాలంలో, మేము అల్లాగే వుండేవాళ్లం. నాకార్యానికి మా అత్తారు బణారసు రవిక పట్టుకొస్తే, తొడుక్కునే సరికి జేబుల్లో సుడ్డ చాలక పిగిలిపోయింది రవిక. అప్పటికి నాకు పదమూడేళ్లు. ఇప్పటికి మల్లేనా, అసలు ఈ కాలుకారంతా అంతే. తినలేరు, తింటే హరాయించుకో లేరు."

"మరి మనం కూడా యింత తింటాం గదా, ఈ నీరసం యెందుకే."

"అదుగో, అల్లారా; దీనికి కారణం అసలీ దిక్కుమాలిన ఫ్యాక్టరీ బియ్యం. ఇవి లేక ముసవు, తలనెప్పి

ఎటువంటిదో రోగం. సుభ్రంగా దంపుడు బియ్యం వండుకుతిని మాడుపూట్లా, యింటిడి పనీ చెయ్య చూద్దాం. ఎక్కడుంటుందో నీరసం. నీరసం గీరసం, రొంగిరిపోవాలి. పదిరోజులల్లా చేశేసరికి రొల్లా తేల్తావో మనిషివి,నోవనోవ లాడుతూనూ, ఆశ్చర్యంవేస్తుంది నీకే, రొంతో వోపికొస్తుంది. ఇదుగ్గోనమ్మా పిల్లాణ్ణి తీసుకో, మానుమీద నూనెట్టి,భొట్టెట్టి కాటుకెట్టి పడుకోపెయ్యి."

భోజనాలు అయిన తరువాత రామారావు ప్రయాణం సాగించివాడు. వెళ్లడానికి సిద్ధంగా సావిట్లో కుర్చీలో కూర్చున్నాడు. రుక్మిణి పక్కన నుంచొని తమలపాకులికి సున్నంరాసి యిస్తూన్నది. కింద తుంగ చాపమీద పిల్లవాడు బోర్ల పడుతూ, కాళ్లూచేతులూ కొట్టుకొంటూ, నోటితో బుడగలేస్తున్నాడు.

"ఇదుగో, మీరిప్పుడెళ్లకండి."

"ఏం?"

"వానొస్తుంది."

"నీ కెల్లా తెలుసు?"

"అదుగో చిట్టిగాడు బుడగలెయ్యటం లేదూ, చంటి పిల్లలు బుడగలేస్తే వర్షం వొస్తుందిట."

ఇంతలో పిల్లవాడి తాతగారు అక్కడికి వచ్చి "పిట్ట కూతపట్టిందే" అన్నారు మనుమణ్ణి చూచి. అది తండ్రి అందుకుని, "పాతిక పందిలా బలుస్తున్నాడు వెధవ" అన్నాడు.

"పోదురూ మరీనూ, దిష్టిగుణాలు దిష్టిమాటలూనూ. దానికేంగాని, నేను చెప్పినమాట జ్ఞాపకం వుంటుందా? ఉండదా? మేం జ్ఞాపకంవుంటాం, అక్కడికి వెళ్ళేను."

"ఏం చెప్పావు నాతోను, జ్ఞాపకం వుండడానికి?"

"ఊఁ పోకండీ, పాలతల్లి సంగతి."

"వాళు వేళైంది. నీతో కూర్చుంటే రైలందదు." అని లేచినాడు.

"వెడుదురుగాని, వెళ్లకపోతారేంవిటి? నా మాటకి జవాబు చెప్పరేం?"

"ఏంవని చెప్పమన్నావు?"

"పాలతల్లిని కుదిర్చి,కుదరగానే వుత్తరం వ్రాస్తే వస్తాను. ఇదుగో తరవాత మీ యిష్టం. అత్తయ్యతో చెప్పండి నే చెప్పావని, ఆవిడికి తెలుసునులెండి. ఏం?"

"సరేగాని, టైము చూడు ఎంతైందో."

౨

రుక్మిణి పిల్లవాణ్ణి తీసుకుని అత్తవారింటికి వెళ్లినది. ఆమెకు ఇంకా శరీరంలో నీరసంగానే వున్నది. తత్కారణముగా భార్యాభర్తల అన్యోన్యముకు కొంత లోపము కలిగినది. పిల్లవాణ్ణి ఆమె జాగ్రత్తగానే చూచుకొంటూన్నది. మంచి దృఢమైన వయస్సులో వున్న మనిషినే పాలతల్లిగా కుదిర్చినారు. పిల్లవాడు అక్కడికంటె ఇక్కడ బాగున్నాడని రామారావు అభిప్రాయం. కాని రుక్మిణి ఆ మాట ఒప్పలేదు. కానైతే పాలిచ్చేమనిషికి యిక్కడే రెండురూపాయిలు యెక్కువ మనుతూవున్నది. "ఎందుకండి అంత డబ్బు?" అంటే రామారావు "పోనిద్దూ" అన్నాడు. ఆ మనిషి పక్కింటివారితో, "అమ్మగారికంటె అయ్యగారే మంచివా" రని చెప్పినది. ఆసంగతి రుక్మిణి చెవుల బడినది. ఆమెకు చాలా కోపం వచ్చినది. ఆ మనిషిమీదే కాక, భర్తమీద కూడా చాలా ఆగ్రహం వచ్చినది తలపరాని వూహలు చాలా ఆమెకు తట్టినవి. ఇదివరకు మాదిరిగా రామారావు తన కూడాకూడా తిరగడము లేదని ఆవిడకు యిదివరకే మనస్సు కష్టం తోచినది.

ఒకరోజున రుక్మిణి దొడ్లో ఎదో పనిచేసుకొంటూన్నది. రామారావు భోజనంచేసి కచేరీకి వెడుతూ రొంమకో ఆమెను పిల్చినాడు. రుక్మిణికి వినబడక పలుక లేదు. తొందరచేత గదిలో పిల్లవాడికి పాలిస్తున్న మనిషిని పిల్చి అమ్మగార్ని పిలవమన్నాడు. ఆ మనిషి ఆ యాజ్ఞ శిరసావహించినది. రుక్మిణి రుసరుస లాడుతూ వచ్చి "గట్టిగా పిలిస్తే పలకనూ" అని సాధిస్తూ కోర చూపులతో అతన్ని చూసినది. అతను సుమ్మంటిగానే "రాయబారాలు రాయబారాలు" అని గొణుక్కున్నది. అది అతను వినలేదు.

ఇంకొకరోజున వీధిలోకి వెడుతూ, ఎండగా వుంటే, వెనక్కి వచ్చి, "గొడుగు" అని కేకవేస్తే ఆ మనిషి తీసుకువెళ్లి యిచ్చినది. అది రుక్మిణి చూసి "ఏ అమ్మో, నీపని మవ్వుమాసుకో, పిల్లాణ్ణి విడిచిపెట్టి, పెత్తనాలుచేస్తా వెందుకు" అని, ఆ సంగతి మనస్సులో పెట్టుకున్నది.

మరోమాటు గదిలో పిల్లవాడు పాలతల్లి దగ్గిర పాలు తాగుతున్నాడు. రుక్మిణి యింట్లోవున్నది. రామారావు వెళ్లి ఆ అమ్మ వొళ్లో పిల్లవాణ్ణి ఆడిస్తున్నాడు. రుక్మిణి అథాత్తుగా ఆ గదిలోకి వచ్చినది. చూసి గిరుకున తిరిగి వెళ్లిపోయినది. దొడ్లోకి వెళ్లి, "నారాయణ, నారాయణా, మరీ వొస్తోంది, ఆనాటి కానాటికి, కళ్లార చూస్తో ఎల్లాగ వూరుకోడం." అని రుంజుకున్నది.

ఇల్లావుండగా కొద్దిరోజుల్లో పిల్లవాడి నోరంతా వొరిసి ఎర్రగా పుండుమాదిరిగా అయిపోయినది. డాక్టరుగారిని పిల్చినారు.

"ఏంపాలిస్తున్నారండి"అని అడిగినా డాయన పిల్లవాణ్ణి చూసి.

"ఎవరో, శూద్రమనిషిని పెట్టి పని జరుపుతున్నాం, ప్రస్తుతం ఏంచేస్తాం ?" అన్నాడు రామారావు.

"అనుకున్నాను." అన్నాడు డాక్టరు.

"ఎందువల్ల ?"

"చూశారూ, సాధారణంగా చంటిపిల్ల తల్లి పత్యం చెయ్యాలంటారు మనవాళ్లు. వాళ్లు వూరికే అన లేదు ఆసంగతి. పాలిచ్చేతల్లి ఆహారాన్ని, శరీరావస్థని పట్టి వుంటుంది పిల్లల ఆరోగ్యం. పైగా, ఈ అలగా జనంమనుషుల్ని మనం కుదర్చడమేగాని, వాళ్లు సాధారణంగా పాడుతిళ్లన్నీ తింటారు. పైపెచ్చు, వాళ్ల శరీరంలో అనేక జాడ్యాలు వుంటవి." అని యేమేమో చెప్పి ఆయన వెళ్లిపోయినాడు.

ఇంతకూ తేలిన పర్యవసానం ఏమిటీ అనగా, డాక్టరుగారు చెప్పిన మాటమీదనైతే నేమి, రుక్మిణికి అదివరకేవున్న అనవసరమైన అసూయచేతనైతే నేమి పాలతల్లికి ఉద్వాసన చెప్పినారు.

ఆరోజుమొదలు పాలతల్లులు ఎవరూ ఆగుమ్మం ఎక్కలేదు. కాని సీమగోశమునుంచి, మనదేశానికి దిగుమతి అయేటటువంటి "చేతితో తాకబడని శిశ్వాహారము"ల సీసాలు, డబ్బాలుమాత్రము చాలా ఆయింట్లో గూళ్లలో చేరినవి.

3

పిల్లవాడికి రెండేళ్లు దాటినవి. వడుస్తో, ఎగురుతో గంతులు వేస్తున్నాడు. ఏడాది నిండకపూర్వమే అన్నప్రాశన చేసినారు. అప్పటినుంచీ కాస్త అప్పుడప్పుడు జ్వరం రావడం ప్రారంభించినది. కాని చలాకీగానే ఆడుకుంటూ వుండేవాడు. కొంచెం దుండగీడుగానే వుండేవాడు.

ఓమాటు దొడ్లో కాకి గుడ్డిపీతని పడవేస్తే, అది తీసి నాకుతూండగా వాళ్ల బామ్మచూసి, అదిలాగేసి, కుర్రవాణ్ణి స్నానంచేయించి, తాను స్నానం చేసినది.

దాసీదానికొడుకుతో ఆడుకునేవాడు. దాసీదాని కొడుకు యింటివద్దనుంచి తెచ్చుకున్న ఉప్పు చేప ముక్కలు నేస్తగాళ్లు యిద్దరూ ఫలహారం చేశేవాళ్లు. పిల్లవాడు ఆటవస్తువులు దాచుకునే అట్టపెట్టిలో అప్పుడప్పుడు కోడిగుడ్డు డొలకలు దొరుకుతూ వుండడం కద్దు.

ఇవన్నీచూసి వాళ్లనాన్న "శూద్రపాలు తాగి శూద్రమెధవలా అయిపోయా" డని తిట్టేవాడు. రుక్మిణికి విపరీతమైన కోపం వచ్చేది.

రామారావు స్నేహితులు చలాకీగా పుష్టిగావున్న కుర్రవాణ్ణిచూసి చాలా సంతోషించేవారు. చిట్టినాన్న కూడా కొత్తలేకుండా అందరిదగ్గిరకూ వచ్చేవాడు. వాడిమాటలు మాత్రం మామూలు చంటిపిల్లల యాసమాటలే కాక కొంచెం శూద్రపద్ధతిని కూడా వుండేవి. కొద్దిగా తనుమాత్రం, అవసరార్థమై కావును తిట్లుకూడా జాగ్రత చేసినాడు. పెద్దమనుష్యులకు పలుకరింపరాని

వాడు. నిరంతరమూ బూడిదలోనూ మట్టిలోనూ ఉం డుటజేసి పరమశివునితో సమానుడు.

ఒకనాడొక స్నేహితుడు చూసి "పిడేమ్రా మీ యువరాజు? ఉట్టి బూడిద బుస్సన్నలా వున్నాడేం?"

"వాడేగాని, నీమర్యాదకాపాడుకో దలుచుకుంటే, వాడి జోలికి వెళ్లకు; బహుదుష్టుడు. వాడికి దూరంగా వుండడం ఉత్తమం. వాడిది బ్రాహ్మణ కుటుంబంలో శూద్ర జన్మ. మత్స్యమాంసాదులు అవలీలగా తింటాడు. నోరువిప్పితే బూతుల పంచాంగం. తరువాత నీయిష్టం." అన్నాడు రామారావు.

ఇంకో స్నేహితుడు "అదేమిట్రా, రాముడూ, వాడి పొట్టల్లా వుంది బానలాగ" అన్నాడు.

"బల్లట్రా, కడుపులో."

"ఇసకపిడ్లన్నీ, గ్లాకోస్ అని అవని ఇవని పెడితేనూ" అన్నాడొక అనుభవజ్ఞుడు.

"ఏమోరా, ఏంకర్మమోనూ?"

"కర్మం ఏంరా, నీపనే బాసుంది ఎంచక్కగాను. ఓ కొడుకు కడుపులో బల్ల, యింకో కొడుకు కడుపులో కుర్చీ, కూతురు కడుపులో మంచం, నువ్వింక సామానే చేయించుకో అక్ఖర్లేనూ" అన్నారొకరు. ఈ సంభాషణ అంతా రుక్మిణి పక్కగదిలోంచి విన్నది.

రాత్రి భోజనాలవేళ "పిల్లాడేడీ?" అన్నాడు రామారావు.

"మీరేం పిలవక్ఖర్లేదు; శూద్రపిల్లాడుగా, వాళ్ల శూద్ర తల్లితోనే తింటాడు" అన్నది రుక్మిణి.

"శూద్ర బుద్ధులంటే శూద్రవేనవ కాదూ."

"పోన్లెండి, మీ బ్రాహ్మణ్యం మీరు కాపాడుకోండి."

భోజనం చేసి రామారావు కాసేపు అటూ యిటూ తిరిగి గదిలోకి వెళ్లి పండుకొన్నాడు. ఎంతసేపటికీ రుక్మిణి రాలేదు. భోజనాలు అయిపోయినవి: పిల్లవాడు వాళ్ల బామ్మదగ్గర పడుకొన్నాడు. రుక్మిణి వసవలో చాప మీద పడుకొన్నది. రామారావు వినుగుపుట్టి "తామల పాకు లెక్కడున్నాయే" అని పిలిచినాడు.

జబాబు లేదు.

పదినిమిషాలు జరిగినది.

"మంచినీళ్లు."

ఎవరూ పలుక లేదు.

లేచి అలమార్లన్నీ చప్పుడు చేస్తూ ఏదో వెదుకడం మొదలుపెట్టినాడు.

"అబ్బ! తల నొప్పిగావుంది. అమృతాంజనం ఎక్కడ పెట్టావ్?"

పలుకు లేదు.

"అమ్మాయి, ఎందుకో పిలుస్తున్నాడే, అబ్బాయి" అన్నది అత్తగారు, రుక్మిణిని హెచ్చరిస్తూనూ.

"ఏంచిటే" అని బద్ధకం నటిస్తూ అటు వొత్తిగిలి పడుకొన్నది రుక్మిణి.

"అమృతాంజనం సీసా కావలిటే, తలనొప్పిగా వుందిట."

రుక్మిణి మూలుగుతూ లేచి గదిలోకి వచ్చి అమృతాంజనం వెదికి తెచ్చినది.

"ఇదుగో."

"ఏంచిటి?"

"అమృతాంజనం కావా లన్నారుగా!"

"తొందరేం?"

"అబ్బ! నిద్రొస్తోంది."

"వొస్తే పడుకో."

"ఇది తీసుకోండి."

తీసుకోబోతూ రామారావు రుక్మిణిచెయ్యి పట్టుకొన్నాడు.

"శూద్రకాన్ని ముట్టుకోకండి" అన్నది చెయ్యి లాక్కోబోతూనూ. అతను విడిచిపెట్టలేదు. రుక్మిణి కళ్లలో నీళ్లు తిరిగినవి.

"సంతోషించాల్లే తెలివికి."

"మరెందు కేంవిటి, అందర్లో అల్లా అనడం?"

"శూద్రవెధవని అంటే కోపం యెందుకూ?"

"శూద్రబిడ్డ తల్లీ శూద్రే, అయితే; తండ్రికూడా నూ, మళ్లీ మాట్లాడితే."

"వుప్పరిదాని దగ్గిర పాలు తాగుతే అంతే."

"చంటి పిల్లలకేనా ఆపట్టింపు, పెద్దవాళ్లకి కూడానా?"

"అది కాదోయి వేడిచెవులూ."

"వేడిచెవులే మరి, స్నేహితులంతా కన్నబిడ్డని అల్లా అంటోంటే వూరుకోడం."

"ఏంవన్నారు?"

"బల్లల్టు, కుర్చీల్టు."

"నిజం చెబితే నిష్ఠూరంట."

"గ్రహచారాని కేంచేస్తాం వేంవిటి?"

"నీమొహం, పాడు డబ్బాలలో పిండంతా వాడి పొట్టలో వేస్తే ఏమవుతాడు?"

"పోన్లెండి. ఏం చెక్కిరిస్తారు? మనిషిని పెడితే వో అవస్థ, దాని యిబ్బందులు దానికి. డబ్బాపాలు పోస్తే, యీ అవస్థ. మరెల్లాగండీ?"

"మనపూర్వులంతా డబ్బాపాలే తాగి బతికారా? వాళ్లు 'అమ్మబాయో' అని యేడ్చారా, 'అమ్మ, డబ్బా బాయో' అని యేడ్చారా?"

"పోన్లెండి, చమత్కారపుమాటలూ మీరూనూ, మీకు యెదురు చెప్పగలరూ, యెవరన్నా. ఈమాటొద్దులెండి; పాలతల్లీ వొద్దు, డబ్బాలు వొద్దు. పోతే నేనే పోతాను! మీబిడ్డ బాగుంటే సరిగదా మీకు. తొందరెందుకు? ఆర్నెల్లు వోపికపడితే ఆమనసులూ తీర్తాయి."

"ఇప్పుడు తీరినవి చాలవూ? ఇంకా తీరాలి?"

"పోనీ, మీ రల్లా అంటారు గాని నే నెందులో విన్లేను చెప్పండి మీమాటా? ఓమాటు బుద్ధి పొరబాటైంది; యికముందు దిద్దుకుంటాం. సరిగదా?"

"సరేలే; టైము చూడు."

"పదిన్నర అయిందిగాని, తమలపాకులు యెదురుగుండా బల్లమీద పెడితే, అల్లా కేకలేశా రెందుకు?"

"అక్కడ పెట్టినవాళ్ల కోసం."



జీవామృతము

శ్రీరాజహంస బాలాంత్రపు వేంకటరావుగారు

జ్ఞాన మధుర సౌఖ్య నిధానమగుట - ఆనిధాన మానంద నిదానమగుట
అదియె విశ్వ జీవామృత మగుటఁ దెలిసి-అనుభవింతు నా యమృతరసాయనంబు.

ఆది యున్నదటంచు నభిమాన ముంతునా యే మూల యే త్రోవ యెఱుఁగవచ్చు?
అంత మున్నదటంచు నంగీకరింతునా యే చోటి కే నాటి కేఁగవచ్చు?
మధ్య మున్నదటంచు మనసుంచుకొందునా యీ మొండితనమున కేమి వచ్చు?
ఆదిమధ్యాంతశూన్యత నిజం బందునా నా యున్కి నేమని నమ్మవచ్చు?
తుది మొదలు లేని శంకలతోఁ బనేమి - నేను లేదనుకొను తెల్వి నిల్చునాఁడె
నేను జీవుఁడ నను భ్రాంతి మానునాఁడె-అన్నియును దీఱుఁ బరమాత్మ నైననాఁడె.

భావానందస్ఫూర్తిఁ - సేవానందానురూప చిన్మయమూర్తిఁ
భావింతును సేవింతును - జీవానందామృతంబు సిద్ధించుటకై.

అది సారము సౌఖ్యంబున - కది గుఱి సాధనకుఁ, దృష్ణ కది తృప్తి పదం
బది యంతరంగలీలకు - నదియే యానంద మమృతమని సేవింతుఁ.

ఆనందుని విశ్వజ్ఞా-నానందుని, తత్త్వదర్శనానందునిఁ బ్రే
మానందుని నిత్య బ్ర-హ్మానందునిఁ గొల్తు ననుభవామృతమూర్తిఁ.

విశ్వకోశ పత్రంబుల విప్పి విప్పి - వెలుపలను లోపలను గూడ వెదకి వెదకి
సిద్ధసారామృతరసంబు జీవరసము - నాని యానిఁ నే దానిలో మేను మఱతు.

సాగరగంభీర జలతరంగములందు నవఘనాఘన ఘోషణంబులందు,
మధుమనోహర మందమందానిలములందు సరసశకుంత కూజనములందు,
నిర్మలనిర్ఝరిణీ నినాదములందు వనశైలకందరస్వనములందు,
మణిమయవల్లకీ మంజు నాదములందు శిశుగణావ్యక్త భాషితములందు,
ప్రణయమిథునానురాగ భాషణములందు - విశ్వవిజ్ఞాన సంగీత విమలకళలె
నాదబిందు చిదానంద నవ్యకళలె - ఆలకించుచునుందుఁ గర్ణామృతముగ.

జిగి సొంపుఁ గూర్చు కెంజిగురుటాకులలోన, సమదకోకిల కూజితములలోనఁ,
దావిమోవులు విచ్చు పూవుగుత్తులలోన, భ్రమరఝుంకారనాదములలోన,

నెలపూఁత నించు నీరెండసంజలలోన, వర గోకులాంభా రవములలోనఁ,
జలువ లందించు క్రొన్నెల వెన్నెలలలోనఁ, భ్రమదచకోర నృత్తములలోనఁ,
గన్నులార జీవకల్యాణకరమైన - జ్ఞానదానమూర్తిఁ గాన రండు,
వీనులార సకల విశ్వసారంబైన - జ్ఞానగానరసము నాన రండు.

నాదం బోంకారముగా - వేదం బీవిశ్వరూప విజ్ఞానముగా
వాదము రసభావముగా - నాదియు నంతంబుఁ గలిపి యామోదింతున్.

తలఁపులోనఁ బెంచు తాఁబేటిఁ గనుఁగొందుఁ - జూపులోనఁ బెంచు చేపఁ గందుఁ,
పొదిగి నంతఁ బెంచు పులుఁగును దిలకింతుఁ - త్రిగుణసృష్టిఁ గాంతుఁ ద్రికరణముల.

చందురు చవిఁ గనుఁగొందున్ - జందురునందున్న కందు చవి గాదందున్
జందురు కల తెలివందున్ - జందు పరబ్రహ్మ కందు జగమని కందున్.

చందుమనం బొక్కటియా - నందునె కలతెల్వి జ్ఞాన మందునె నిత్యా
నందం బందునె యమృతం - బందునె బ్రహ్మానుభూతి యందునె యెఱుకన్.

గిరిరాజా! భవదీయ భూరిగుణ దాక్షిణ్యంబె పుణ్యంబు, సా
గరరాజా! భవదీయ సారగుణ సాంగత్యంబె నిత్యంబు, కం
ధరరాజా! భవదీయ దానగుణ సన్మానంబె జ్ఞానంబు నాఁ
బరమాత్మానుభవామృతంబు రుచియింపం గంటి మీ సత్కృపన్.

రాతిరియున్ బవల్ మఱపురాని మహోన్నతి నంది గోత్రసం
జాతగురుప్రశస్తిఁ గని సంయమమూర్తినిఁ గాంచి, వాతశీ
తాతపబాధలం గన వహార్యవరేణ్య! తలంప నీవె కా
దాతవు నేతవున్ స్థితివిధాతవు మా కవిరాజహంసవున్.

చుట్టిన చీఁకటిం దెరలఁ జూచి కరంబులు సాఁచి దూరముం
గట్టునఁ దోఁచి లోకములఁ గాంచు ప్రభాకరులీల నెమ్మదిం
జుట్టిన మోహపుందెరలఁ జుట్టలు సుట్టి దహించి తత్త్వపుం
గట్టున జ్ఞాన భాస్కరతఁ గైకొని కాంచెద నాత్మలోకమున్.

ఓ యవజ్ఞత! నా త్రోవ కోసరిల్లు - దూర మేఁగుము తృష్ణ! నీ దారి గాదు
దురభిమానమా! యిది నీవు త్రొక్కరాదు - నిష్ఠురత! రాకు నీ కిందు నీడ లేదు.

సంసార విప్లవంబులు - సంసారావర్త భయద ఝంఝానిలముల్
సంసారఘోరసాగర - హింసావృత్తములు పొంద వీక నన్నెందున్.

తన కింత విశ్వ సౌందర్యానుభవ మేల తన యక్షిగోళ చిత్రమునఁ గాక!
తన కింత విశ్వగీత సుఖానుభవ మేల తన కర్ణరంధ్రయంత్రమునఁ గాక!
తన కింత విశ్వామృత సుఖానుభవ మేల తన రసనాగ్రపాత్రమునఁ గాక!
తన కింత విశ్వగంధ సుఖానుభవ మేల తనఘ్రాణ మూలసూత్రమునఁ గాక!
తనకు నింతటి విశ్వతాత్పర్య మేల - తన మనోభ్రాంతి రూపమాత్రమునఁ గాక!
తనకు మన నేల? ప్రకృతితంత్రమునఁ గాక!-ప్రకృతి తన కేల? యాత్మ కర్మమునఁ గాక!

నెలఁ ద్రొక్కకుండ వెన్నెల చిక్కకుండఁ గ్రోంజలువ లానెడి నెలపులుఁగు లీల,
పువు గందకుండఁ బుప్పొడి చిందకుండఁ గ్రోందేనె లానెడి యెలఁదేఁటి లీల,
మబ్బెక్కకుండ గుమ్మలు స్రుక్కకుండఁ గ్రోంజినుకు లానెడి వానచిలుక లీల,
మది నోవకుండ నెమ్మది వోవకుండఁ గ్రోంజనవు లానెడి సాధుజనుని లీల,
ప్రకృతిఁ బాలించి ప్రణయస్వభావ మెంచి - పరము నాలించి తత్త్వప్రభావ ముంచి
ఆరగింతు నానందరసాయనంబు - అనుభవింతు సుజ్ఞానసిద్ధామృతంబు.

నిర్లక్ష్యవిశ్వసాధన - నిర్లిప్త నివృత్త నియతి నే జ్ఞానసుధా
వార్లహరి నానఁగంటిని - దుర్లభ యోగానుభూతి దొరకొనఁగంటిన్.

జ్ఞానార్ణవమునఁ ద్రిప్పెదు - నా నౌకను దివ్యలక్ష్యనక్షత్ర కళా
ధీనమగు యోగపథమున - నానందామృత పదంబు నందుట కొఱకున్.

విషయచింత లడఁచి విమలమార్గముఁ గంటి - శోక మడఁచి సుఖము చూఱఁగొంటి,
జీవచింత లడఁచి సిద్ధామృతముఁ గొంటి - ప్రకృతి నడఁచి బ్రహ్మపదవిఁ గంటి.

నే నెవ్వఁడ ననుకొనఁగా - నేనా జీవుఁడను గాను నిజ మనుకొనఁగా
నేనే లేదనుకొనఁగా - నానందబ్రహ్మ మైతి నమృతం బైతిన్.

చిగురుపొత్తిళ్లలోఁ జిన్నారిమొగ్గనై మూఁకతెమ్మెరలలో రేకులెత్తి,
పూవుఁజప్పరములోఁ బూఁదేనెసోననై వలపుఁగాలువలలో వఱదవెట్టి,
తీవయుయ్యాలలోఁ దెలిదోరపండునై సంసారవాటిలో సారెఁ బంచి,
పండాకుగిండిలో ఫలరసాయనమునై ప్రజ్ఞాననిధులలోఁ బాఱఁబోసి,
కేవలావ్యక్తగతి నహంకృతులు నేర్చి - ఇహ మెఱుఁగ నేర్చి పరము నూహింప నేర్చి,
నిత్యసత్య సుఖానందనియతి నేర్చి - విమల తత్త్వామృతంబు సేవింపఁగంటి.

ఓరి నాయనా!

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారు

౧

హిదాయతుల్లాకు పిల్లలు లేరు. పిల్లలు లేరని తాను గాని తనభార్య సాకినా గాని యెన్నఁడును అనుకొనిన పాపమునఁ బోలేదు. కాని ఈ చింత బంధుగులకుఁ గలిగెను. దాపు కుటుంబములకు బంధుగులే అధిదేవతలు!

హిదాయతుల్లాకు దగ్గఱచుట్టములు పలువురు కలరు. వారిలోఁ గొంత కొంత మందికి ఈ చింత ఉదయించెను. అతనికి దూరబంధువులును పలువురు కలరు. వారికిని ఈ చింత యుండెను. సుదూరబంధు వయినను రుస్తుం సాహెబుకే ఈచింత చాల నెక్కువ అని చెప్పవలయును. ఏల? రోజురోజుకు పెరిఁగి పోవుచున్న ఒకచక్కని కన్నె అతనికడఁ గలదు. రుస్తుంసాహెబు హిదాయతుల్లావారి బైఠక్ ఖానాలో * జీతనాతములు లేని పెద్దయుద్యోగి.

చక్కని కన్యగల ప్రతివానికిని ఈ చింత చింతవలె పెరిఁగిపోయెను.

పెరిఁగిపోయెను సరియే. దాన నేమి లగ్గు? హిదాయతుల్లా సామాన్యుఁడా? సముద్రుఁడు. తమకుఁగల చింత మనవి చేసికొనుటకు ఎవనికిని గుండెకాయ లేదు.

లేదు సరియే. లేదనిన నెటులు? చింత పుట్టనే కూడదు. పుట్టెను బో పిఱికిగుండె నుండియో మొఱికిగుండె నుండియో బయటఁ బడవలయును. పొగ పుట్టినచోట నుండునా?

హిదాయతుల్లా నమాజు చేసికొని బైఠక్ ఖానాలోఁ గూరుచుండి తేటమొగముతో ఖురాను ఏకరువు పెట్టఁదొడఁగెను. అపుడు రుస్తుంసాహెబు 'జహాఁపనా! ఖురాను త్రేఁచిన మహాపురుషు లొకరు మనపత్తనమున వేంచేసి యున్నారు' అనెను. హిదాయతుల్లా వెంటనే లేచి పడమటిదిక్కు తిరిగి ముమ్మాఱు సలాము చేసి 'ఎంత అవినయము జరిగిపోయినది? లెండు లెండు! దర్శనము చేసివత్తము' అనెను. అనఁగనే రుస్తుంసాహెబు 'అరే బజ్జూ! గాడీ గాడీ' అని అఱచెను. హిదాయతుల్లా 'వద్దు' అని నిష్కర్షగా చెప్పి 'నడచియే పోవలయును' అనెను. రుస్తుంసాహెబు 'చిత్తము' అనెను.

రుస్తుంసాహెబు ముందు నడవఁగా హిదాయతుల్లా వెనుక నడవఁదొడఁగెను. వారిని జూచినవా రందఱును వింతతో వారివెంట నడవ దొడఁగిరి.

వారు వెళ్లిన దొకమఠము. అందొకఁడు కనులు మూసికొని కూరుచుండెను. గడ్డముచే నతని అధఃకాయ మగపడుట లేదు. మొగమున విభూతి, తలకు రుమాలు, ఒకప్రక్క ఖురాన్, ఒకప్రక్క గీత. చూచుచునే హిదాయతుల్లా అల్లాకు చేయఁదగిన గౌరవము చేసెనుగాని ఆమహాపురుషుఁడు కనులు తెఱచి

* కబుర్ల కచేరి.

యుండలేదు. కనులు మూసికొన్నను మహాత్ములకు దివ్యదృష్టి యుండదా?

రుస్తుంసాహెబు ఫకీరును సమాధినుండి లేపఁ బ్రయత్నించెను. హిదాయతుల్లా అతని చాపలమును చేతితో సులువుగా వారింపఁ గలిగెను. హిదాయతుల్లాతోపాటు వచ్చినవా రందఱును ఆ మహాపురుషుని యెదుట మోఁకరిల్లి యుండిరి.

హిదాయతుల్లా-ఓపికను ఆ మహాత్ముఁడు లెస్సగా పరీక్షించి విసికెను. కనులు సగము తెఱచియు మూసియు తెఱచియు మూసియు తుదకు ఈ ప్రపంచకమును చూడఁగలిగెను.

హిదాయతుల్లా ఫకీరులకు చేయు ఉపచారములు చేయుచుండెను. రుస్తుంసాహెబు ఊరక కూరుచుండలేదు. 'పాదుషా తరువాత పాదుషా, మహమ్మదు తరువాత మహమ్మదు ఎవరనఁగా ఈ హిదాయతుల్లా!' అని ఉల్లాకు పరిచర్యచేయుచుండెను. హిదాయతుల్లా వెనుకకు నడచినచో రుస్తుం వెనుకకు నడచెను. ముందరికి నడచినచో ముందరికి నడచెను. వంగినచో వంగెను. లేచినచో లేచెను.

అది చూచి ఫకీరు ఇటు లనెను—'ఇతఁడు ఉల్లా యగుచో నీవు అల్లా.'

ఉల్లా పెదవులమీఁద లేనగవు తళుక్కుమనెను. ఫకీరు మొగమున సంతోషముగాని వింతగాని లేదు. అపుడు ఉల్లా యిటు లనెను—'ఈ దీనుని యింట తమరు విందారగించుచో అల్లాను తృప్తిపఱతును!'

ఫకీరు వెంటనే యిటులనెను: 'జనాబ్! ఖుదావంద్! నాకు అట్టి యిచ్ఛ కలుగలేదు. అది యటుండె. మీకు సంతతి లే దనుకొందును. అగునా? ఏమందురు? దయచేసి వెంటనే చెప్పఁడు!'

'అగును.'

'వాత్సల్య మెఱుఁగనివాఁడు చేయువిం దేమి విందు? మేఁకపోతు చన్నులను మేము చూడము.'

హిదాయతుల్లా మొగము మసిపాఁత యాయెను. అతఁడు ఆ మహాపురుషునకు వంగి వంగి సలాములు చేసికొనుచు వెనుక వెనుకకు వచ్చి వాకిటఁ బడెను. వాకిటికి వచ్చెనేకాని హిదాయతుల్లా కింటిదెసకు అడుగు పడలేదు.

హిదాయతుల్లా యింకను నాలుగడుగు లిడకముందే ఆ మహానుభావుఁడు తన గుడ్డను గోఁచిని సద్దుకొని అతని కనుల ముందఱగా ఆ పత్తనమునుండి లేచిపోయెను.

౨

హిదాయతుల్లా దర్శన మెవరికిని లేదు. అతఁడు సాకినా బీబీకిఁగూడ బీబీ యాయెను.

కొన్నాళ్లకా ఫకీరు వార్త సాకినా చెవిఁ బ్రాఁకెను. ప్రాఁకిన కొలఁదినాళ్లకే యామె తన కర్తవ్యమును నిశ్చయించుకొనెను.

హిదాయతుల్లా చీఁకటిగదిలో చింతాశయ్యాపయి పొరలాడుచుండెను. సాకినాబేగము గది గుమ్మముముందు నిలువఁబడెను.

సాకినా బేగము నిదుర నిట్టూర్పు హిదాయతుల్లాకుఁ దగిలెను. ఉల్లా వేఁడి నిటూర్పు సాకినా హృదయకమలమునకుఁ దగిలెను.

బేగము ఇటు లనెను: "గోరంతలు కొండంతలు చేయవలయునా? నే నీపనిని గోటిమీఁదఁ జేసియుండనా? మందనినచో మ్రాఁకే తెచ్చి యిడకయుందునా? వలయుచో నొక మాలాలిని దెచ్చి నిక్కా కట్టింతునే!"

బేగము హృదయము ఉల్లాకు అద్దము. అతఁ డానాఁడే లేచి పస్తు వదలి పథ్యము పుచ్చుకొనెను.

చీఁకటిగది తలుపులకు తాళము పడెను. బైఠక్ ఖానా తలుపులకు తాళము తొలఁగెను.

బైఠక్ ఖానాకు రుస్తుంసాహెబు అధిదేవత. తాళము తీయఁగనే దుంపలో పురుగువలె నతఁ డచట నావిర్భవించెను హిదాయతుల్లా ఆనందించెను. అతఁ డానందింపఁగనే ఆవెనుకనున్న తన కన్నెను మెహరున్నీసాను మెహర్బానీ పెట్టెను

ఆమలుసంజలో రుస్తుంసాహేబు తెర కొంచె మెత్తఁగనే మెహరున్నీసా తళుక్కుమని మెఱసెను. హిదాయతుల్లా కనులు మిఱుమిట్లు గొనెను. తెర వాలెను.

భరతవాక్యమునకు సాకినా వచ్చుచుండఁగా రుస్తుంసాహెబు ఓసరిల్లెను.

సాకినా తెర యెత్తెను. మెహరున్నీసా తలుపుచాటున కేఁగెను.

సాకినా 'దాఁగుడుమూఁతలేల?' అని పలికి మెహరును 'భాయీ' అని సంబోధించి రెట్టఁ గొని తీసికొని వచ్చి ఉల్లా ముందు నిలిపి 'సలాము చేయుము' అనెను.

ఉన్నీసా వడఁకుచు సలాము చేసెను. సాకినా మిగుల ఒద్దికతో మెహరున్నీసాకు సలాము చేసెను. ఉల్లా లేచి సాకినాకు సలాము కొట్టెను.

నాఁటినుండి మెహరున్నీసా *బుల్ బుల్ ఆయెను. రుస్తుంసాహెబు రొక్కపుదొర యాయెను. మహాపురుషుఁడు మాజీ మంత్రి యాయెను.

హిదాయతుల్లాకు సంవత్సర మొక దినమువలెఁ గడఁచెను. మహాపురుషుఁడు లేచి పోయిన రోజు మరల వచ్చెను.

రుస్తుంసాహెబును హిదాయతుల్లా తొలఁగించెను. మంత్రిని సాకినా తొలఁగించెను.

హిదాయతుల్లా మరల దుఃఖసాగరమున పానుపు పఱచెను. బైఠక్ ఖానా మూఁతలు పడెను.

రుస్తుంసాహెబు మెహరున్నీసాను నోటికొలఁది నిందించెను. మహాపురుషుఁడుగూడ నేర్పుకొలఁది నిందింపఁగా రుస్తుంసాహెబు చక్కఁగా సాయపడెను.

బైఠక్ ఖానా బద్ధము కాఁగనే సదస్యులందఱకును ఉల్లావారి చింత యెల్లను

* కవులలో కోయిలవంటి పిట్ట.

తెలిసెను. మఱునాఁడే మన్సూరుసాహెబు తన కన్నియను దెచ్చి నజ రిచ్చెను.

మరల నొకయేఁడు గడఁచెను. ఆ యేఁటి నుండియు హిదాయతుల్లా తనకు ఏఁబదియేండ్లు వచ్చువఱకును ఏఁటేఁట నొక్కొక నజరును సంపాదించుచునే యుండెను.

అతనికి విసుగు కలుగనందులకు సృష్టికర్త సంతసించెను. ఏఁబదియొకటవ యేఁట ఉల్లాకు వచ్చిన కానుక హసీనా. హసీనా కొడుకును గనెను. పుత్త్రోత్సవము ఉల్లాకే కాదు, జనానాకే కాదు, పత్తనమునకే కాదు, — ప్రజ కందఱకు గలిగిన నటులుండెను.

హిదాయతుల్లా క్రొత్తశిస్తులతో పాటు ప్రాఁతశిస్తు లన్నిటిని దీసివేసెను. చెఱసాలలను ఖాళీ చేయించెను. తనకుఁ గల ఖూనీ హక్కును విసర్జించెను.

మసీదు లన్నిట నమాఁజులు జరిగెను. ఆలయములలో అభిషేకము లాయెను. పల్లియలలోఁగూడ పంచదార బండ్లు తిరిగెను. ముసల్మానులకు ముసల్మానురాజ్యము హిందువులకు హిందూరాజ్యము దొరకెను.

తురకజోస్యులు హిందూజోస్యులును విడివిడిగా వ్రాసిన జాతకచక్రము లన్నియు ఏకీభవించెను. ఆయువు నూఱేండ్లు. రాజ్యలాభము రెట్టికి రెట్టి. విద్య నూటికి నూఱో కటి. కళత్రస్థాన మిఱుకు, ఇఱ్ఱిఱుకు. పట్టినది బంగారము, ముట్టినది మక్కా.

కాజీ వచ్చెను. జిన్, మారీద్, జాన్ ఆఫ్రీద్ మొదలగు తురకదయ్యములకు దురాయి కట్టించెను. పురోహితుఁడు వచ్చి ఏన్నామ్మలకు బ్రహ్మరాక్షసులకు షష్ఠీదేవికి భూతప్రేత పిశాచములకు రక్ష యిచ్చెను.

కాజీ పురోధల యనుమతితో హిదాయతుల్లా తన పసిఁబాపకు రహ్మత్ ఉల్లా అని నామకరణమహోత్సవము నొనరించెను. రహ్మత్ అనఁగా దైవకృప.

3

హిదాయతుల్లాకు మఱొక సంతానము నెడ కాంక్ష కలుగలేదు. కేవలునకు* బహుత్వమునందును అకేవలునకు† ఏకత్వమునందును కోరిక కాఁబోలు!

పెద్దభార్యను దక్కిన రాణివాసమును హసీనా వెడలఁగొట్టెను. పెద్దభార్యను ఉంచుటయేల? ఆమె పెద్దది. తాను చిన్నది. మఱియు ఆమె సాకినా; తాను హసీనా.

హసీనా కళాశాస్త్రము కైకొని రాఁగా ఉల్లా ఖురాను-ఏకరువులో నుండెడివాఁడు. సాకినా వచ్చి ఖురాను విని హసీనాకు కళాశాస్త్రము చెప్పించుచుండెడిది. ఇంతలో చిన్నో ఉల్లా వచ్చి తండ్రి గడ్డము పీఁకి జపమాల లాగి

* (పరమేశ్వరునకు) ఒంటిగానికి.

† జీవునకు (బహుత్వములో కొట్టుకొనువానికి).

'ఒకటి నాలుగు ఏడు మూఁడు పదకొండు' అని పూసల లెక్కించుచుండెడివాఁడు.

హిదాయతుల్లాకు ఒకచేతిలో కొడుకు, రెండవచేతిలో ఖురాను. ఒకకంట రాచకార్యము, రెండవకంట పుత్త్రదర్శనము.

హిదాయతుల్లా అయిదుమాఱులు నవాజు చేయఁగా రహమత్ ఉల్లా పదిమాఱులు చేసెను. తండ్రి ఖురాను ఏకరువుపెట్టఁగా కుమారుఁడుగూడ కూడ కూడ నేకరువుపెట్టెను. పెద్దఉల్లా పాదప్రక్షాళన మొనరింపఁగా చిన్నఉల్లా పాదప్రక్షాళన మొనరించెను. తండ్రి రాచకార్యములను జూచి కుమారుఁడుగూడ భృత్యులయెదుట రాచకార్యములు నడపుట ననుకరించెను. చిన్నఉల్లా బాల్య మిటు లల్లాహుముద్దుగా నడచెను.

హిదాయతుల్లాకు షష్టిపూర్తి. నాఁడు రహమత్ ఉల్లా పడమటిదెస కభిముఖుఁడయి ఉత్తరమునుండి దక్షిణమునకు అక్కరములు వ్రాయ నేర్చెను. సూర్యాభిముఖుఁడయి కూరుచుండి దక్షిణమున నారంభించి ఉత్తరమువఱకు వ్రాయనేర్చెను. నేలపల్లి పలకలకును కొండపల్లి కాకితములకును ఖర్చు హెచ్చెను.

ఖురానంతయు వ్రాయుట కొక ముల్లాయు భారతమంతయు వ్రాయుట కొక పండితుఁడును నియమింపఁబడెను!

అతఁ డొకనాఁడు తన పేరు వ్రాసి తండ్రికడ రవ్వలయుంగరమును కానుక బడసెను. గుఱ్ఱ మెక్కి తల్లికడ నొక తంగణాను సంపాదించెను. తుపాకి పేల్చి పెత్తల్లికడ ఖడ్గముఁ బడసెను.

అతఁడు బాలు రందఱకును పంతు లయిపోయెను, కాజీ అయిపోయెను, పండితుఁ డయిపోయెను, సేనానాయకుఁ డయిపోయెను.

రాజబాలకుఁడు జన్మముతోడనే పండితుఁడు, శూరుఁడు, కాజీ; కాని రాజత్వము తొలఁగించినను రహమత్ ఉల్లా పండితుఁడు, శూరుఁడు, కాజీ అని ముల్లా యనెను. ఉపాధ్యాయుఁడును అనెను. బాలు రందఱును అతని శూరతకు సాక్షులు. హిదాయతుల్లా పెద్ద సాక్షి.

అతనికి నేలంటు వదిలెను. పెద్దపెద్ద వ్రాఁతపుస్తకములు చేతికెక్కెను. పుస్తకములు చదివినకొలఁది క్రిందిమెట్టునుండి మీఁది మెట్టెక్కినటు లుండెను. అతఁ డిపుడు తేనెటీఁగ. ఆ తేనెటీఁగ వెనువెంటనే పెద్దతేనెటీఁగ హిదాయతుల్లా.

హిదాయతుల్లా మఱియొకతూరి బాల్యమనుభవించెను. కుమారునితో నవ్వెను. అతనితో పాంసుక్రీడ చేసెను. అతనితో విందారగించెను. అతనితో అక్షరములు దిద్ది పుస్తకము పట్టెను. అతనితో నాలోచించెను. అతనితో సాముచేసెను. తాను గుఱ్ఱమెక్కి యతని నెక్కించెను. తాను వ్యయము మాని కుమారుని కేఁటేట లక్షరూపాయలు ఇచ్చుచుండెను.

పంక్తిని కుమారుఁడు లేక అతఁడు ఆరగింపలేదు. కుమారుఁడు ప్రక్క నిదురింపక తాను నిదురింపలేదు. కుమారుఁడు నమాజు చేయక తాను జేయలేదు.

ఏ మహాపురుషుని యాసడింపువలన నీ పుత్రుఁడు శానకొదవెనో ఆ మహాపురుషుఁ డెపుడో దర్శన మీఁ గలఁడని యతఁ డనుకొనుచుండెను.

౪

రహమత్ ఉల్లాకు తన బోడిగుండు బాగుండలేదు. అతఁడు జులపాలు పెంచి వంచి కట్టి ముచ్చిలిగుంటమీఁద తరంగములవలె వ్రాలునటులు కత్తిరింపించుకొనెను. తండ్రికిష్టమును తన కడ్డము నగు గడ్డమును గొఱిగించుకొనెను. అతని మీసములు నిక్కఁబొడుచుకొని 'ఇట్టి విషయములలో నీవేమియు చెప్పరా' దని తండ్రిగారికి వేలెత్తి చూపుచున్నటులుండెను. చాపుఁ జక్కఁదనములతోఁ జేతులును, పొందిక పొంకములతో మూఁపులును, తీరుతీయములతో కన్నులును, వ్రటువదనముతో జప్పుక్కమను నడుమును, నడుమఁ బల్లముగను బ్రక్కల నాఁదోఁక మెరకగి వీఁపును, వెడఁదయు నిడుదయునగు నెడఁదయు నమరి యతఁడు మగవారినే మఱపించునటులుండెను.

అతఁడు చదువుకొనుచుఁ జదువుకొనుచు అడపముఁ దాల్చి ప్రక్కగా లోనికిఁ బోవు తాంబూలవల్లిని తలమెత్తి చూచెను. అతని వదన మెఱ్ఱఁబాఱెను. పరభామలఁ జూడ రాదను చదువతనికి గుఱుతు వచ్చెను. తల వాల్చెను.

కొంతసేపటిలోనే లోనుండి తాంబూలవల్లి వెలువడెను. రహమత్ ఉల్లా తల యెత్తెను. ఇంతలో హిదాయతుల్లా కొడుకుఁగుఱ్ఱను జూడవచ్చెను. చిన్న ఉల్లా తల చివాలున ఖురానులోనికి వంగెను.

కుమారుని రాచపనులలో దిద్ది తీర్చుటకు అప్పుడచటికిఁ దండ్రి వచ్చెను. కుమారుఁడు వలరాచపనులలో ఓనమాలు దిద్ద మొదలిడెనని అమాయికుఁడు ఆ తండ్రి యెఱుఁగఁడు.

'నాయనా! జమాబందీ చేయింతువు గాని వత్తువా?'

'నేఁడు కాదు, రేపు.'

తండ్రి వెళ్లిపోయెను.

పన్నీరుబుడ్డి యెత్తుకొని జులేఖా అతని గది గూఁటిముందఱ నుండి నడచుచుండెను. రహమత్ ఉల్లా తల యెత్తెను. జులేఖా చూచెను. అతని హృదయగుహలోని చీఁకటి కోణము లన్నియు తళుక్కుమనెను.

దేనికిని అంటి-ముట్టని అతని బాల్యమొక్కపరి గిర్రునఁ దిరిగి పోయెను. వింతలకును వంతలకును బునాదియు చలపాదియు నగు జవ్వనము రాజయి కూరుచుండెను.

అతఁడు బాల్య మిత్రములతో మాటాడుట మానివయిచెను. మగవారితో మాట

లాడు: టతనికి మోటాయెను. మగవారి మూతులు గోతులు. మగపురుగనిన నతనికి రోఁత పుట్టెను. అవేమో మగవారి కాళ్లు రోఁకళ్లు! వారివక్షములు అక్షములు! వారి మోములు హాములు. వారి మేను బ్రమాను. తుదకు తండ్రి దాపుగా వచ్చినను అతఁడు తూపాడిచెను. అతనికి మగవాఁడు ముదార్.

కుమారుని స్వాతంత్ర్యము తండ్రికి గోచరించెను. తన తండ్రి తన కీయేఁటనే సకల స్వాతంత్ర్యము లిచ్చివేసెను. తానును పిత్రాద్వార మవలంబించెను.

అన్న వేళ నిపుడు కొడుకున కాహ్వానము లేదు. తనశయ్య తనగదియంద, తనయుని శయ్య తనయుని గదియంద. మున్ను గదుల విభాగము లేదు. నేఁడు తండ్రి గది; కొడుకు గది.

క్రమముగా నదియు మాఱెను. తండ్రి మేడ; కొడుకు మేడ. తండ్రికి ప్రాఁత మేడ కొడుకునకు క్రొత్త మేడ.

మును పొకఁడే పాచకుఁడు. ఇపు డిరువురు. మును పొకఁడే చాకలి. ఇపు డిరువురు. క్రమముగా నెవరి దాసీదాసము వారికి, ఎవరి సాథా వారికి, ఎవరిపనులు వారికి, ఎవరి యధికారము వారికి. తుద కెవరికి వారు.

క్రొత్తమేడలోనికి వచ్చి ఇద్దఱు తల్లులును ముద్దుల బిడ్డని దీవించిరి. కుమారుఁడు సలాములు చేసెను. కొంచెము సేపుండి వారరిగిరి.

కుమారుఁడు దాపున లేమి తలిదండ్రులకు నిద రపట్టలేదు. హిదాయతుల్లా లేచి అటిటు పచారుచేసెను. హాసీనా లేచి 'మగవానిని కనరా'దని అనుకొనెను. 'దానఁ జేసియే నేను మానుకొంటి' నని సాకినా యనెను.

'నీ వేఁగి కుర్రనికడ శయనింపుము' అని హిదాయతుల్లా హాసీనాతో ననెను. 'అనిన దే చాలునుగా' హాసీనా పరువెత్తెను. హిదాయతుల్లా మేడమీఁదినుండి చూచుచుఁ జూచుచు 'సాకినా! ఇన్నాళ్ల కిటులు నీ కేకాంతము కలుగఁ జేయఁగలిగితిని' అని బొంకెను.

'ఏడవపదిలోఁగూడ నేకాంతమా? అగును లెంపు. ఆఁడుది ముప్పదేండ్లకు ముసలి. మగవాఁ డెనుఁబదేండ్లకును ఎలఁ బ్రాఁయము వాఁడే. అయినను మనకీ యేకాంతము దక్కదు. హాసీనా యెటులు పరువు లెత్తెనో యటులనే పరువులెత్తుకొని వచ్చును.'

'ఏల?'

'అంతియ.'

'కొంచెము వివరింపరాదా?'

'ఈ నడిరేయి వృద్ధ దంపతులమగు మనవలె నేపిన్నవారు తీరికగాఁ గూరుచుందురు?'

'నిక్కమే. అతఁడు గాఢనిద్రలో నుండి యుండును.'

ఇటులు వా రిరువురును మాటలాడుకొనుచుండఁగనే హాసీనా వడివడిగా తిరిగివచ్చెను

'ఏమి?'

'పారా యిచ్చినది ఇరాక్ దేశముదట! నతూలా మహల్ కా ఖాస్ బాందీట! పేరు గులాబ్ బేగమట! అది నన్ను పోసీయ మన్నది.'

'ఏల?'

'క్రొత్తహుజూరువారికి నిద్రాభంగము కాదా?'

'మంచిది. లేపుదు ననుకొంటిని.'

'మంచిదే. కాని రేపు మీ నీలును ఉంగరమును క్రొత్త హుజూరువారికి దాఖలు చేసికొని మీరు చేతులు కడుగుకొనుడు.'

హసీనా మాటల కతఁడు తెల్లఁబోయెను. కాని వెంటనే మాఱి 'ఇటు లందు వేల? అట్టి పుణ్యాహమునకే నే నెదురుచూచుచున్నాను' అనెను.

౨

హిదాయత్ ఉల్లాకు ఆంధ్ర దేశము నందును మహారాష్ట్ర దేశమునందును జాగీరులు కలవు. కుమారుని కనుభవము కలిగించుటకు అతఁడు పల్లియలలో గుడారము లెత్తించి జమాబందీ చేయించుచుండెను. అపు డతఁడు గుడారము లెత్తించిన దొక పెద్దపల్లె. దాని పేరు మునిపల్లె. అది పేరునకుఁ దగినది. కొండలంత కట్టలు గల మెట్టనీటి చెఱువు. దాని కానుకొని పల్లె. పల్లెచుట్టు పచ్చని కొండలు. తెల్లనివాఁగులు. జీబుచెట్లు. పల్లెనిండఁ జెట్లు. దొడ్ల నిండ తల్లియొడి దాఁక నీరు దాఁకు బావులు. పచ్చని పుంతలు.

హిదాయత్ ఉల్లా సవాఁజునకుఁ గూరుచుండెను. రహమత్ ఉల్లా గుర్ర మెక్కి షికారు బయలుదేఱెను. మఱియొక గుర్ర మెక్కి అతని వెనుక నొక రోహిలా.

కదము త్రొక్కికొనుచుఁ బోయి గుర్ర మాఁగెను. ఎదుటఁ జెఱువు కట్ట.

'ప్రక్కదారిని బోవుద' మని రోహిలా యనెను. రహమత్ ఉల్లా గుర్రమును అడ్డముగాఁ ద్రిప్పి రోహిలామీఁద కొరడా విసరెను. పిదప నతఁడు గుర్రమును నిలువుగా త్రిప్పి తనగుర్రమును కొరడాతోఁ గొట్టెను. గుర్ర మొకనిమిషములో చెఱువుకట్ట యెక్కెను. రహమత్ ఉల్లా దానిని గొంచెము దూరము నడిపించి రోహిలాకొఱకు కాఁగెను. రోహిలా తనగుర్రమును చెఱువుకట్ట నెక్కింపలేక తన్నుకొనుచుండెను.

చెఱువుకట్ట క్రిందనే పెద్ద యగడిత. దాని కానుకొని పెద్ద గృహారామము. దాన పండ్లతో వంగిన దబ్బచెట్టు. దానిముందొక బావి. బావిమీఁద ఆదబ్బపండ్ల చాయలోఁ గలసిపోయి నిలువఁబడిన పదునెనిమి దేండ్ల పడుచు.

రహమత్ ఉల్లా చూచి 'పాతాళకన్య' యనుకొనెను.

ఆమె వంగి నీరు చేదుకొనుచుండెను. ఆమె కుడిచేతిలో చేద లాగి యెడమచేతఁ

లను, ఆపచ్చని పొదలలో పన్నని గుడారము లను జూచెను. చూచి చూచి చప్పరించెను. వెనుదిరిగెను. చెఱువుకట్టమీఁదుగా వచ్చి శూన్యమగు ఆ గృహోద్యానమును పరికించుచు నిర్గమించెను.

కాకితములనన్నిటిని జూచి అనుక్రమణిక యేర్పఱచి బల్లమీఁద నుంచి హిదాయతుల్లా ఓసరిల్లెను.

కొలఁదికాలమునకే రహ్మత్ ఉల్లా వచ్చి కాకితములఁ జూచికొనెను. కాకితమున (నిలువయున్న) డబ్బు ఖజానాలో లేదు.

ప్రొద్దు వ్రాలెను. హిదాయత్ ఉల్లా నవాజులో నుండెను. రహ్మత్ ఉల్లా కరణమును నాయకుని గ్రామ నౌకరులను బండకొయ్యలలో వేయించెను. తాను బోయి పానుపును ఆశ్రయించెను.

౬

తాంబూలవల్లి వచ్చి రహ్మత్ ఉల్లా ముందు వెలవెలఁబోయెను. ఉల్లా తటాలున లేచి కూరుచుండెను.

తాంబూలవల్లి యిటు లనెను—'మహారాజా! మార్తాండతేజా! కరణముగారి భార్య అల్లాబకీనుకన్న మిన్న. ఎటు లందువా? విను:

'గీ. సంధిసేసిన సర్వస్వ సంక్షయంబు
యుద్ధమొనరింపఁ బ్రాణంబు లుండఁబోవు
అల్ల యల్లాబకీనరాణ్మల్లుతోడ
కుదుర దల సంధి, యుద్ధముం గుదురఁబోదు. *'

'ఇఁక నీమె యన్నదికదా విను:—సంధులు లిఖుగవలయుచో సంధి. ప్రాణదానము చేయుచో దానము. శరీరభేదముతో భేదము. ఇటులు మనకుఁ గాని తనకుఁ గాని దండోపాయమునే మిగిల్చినది.'

'ఏమిా?' అని రహ్మత్ ఉల్లా ఉఱిమెను. తాంబూలవల్లి యేమి చేయును? తల వాల్చెను.

రహ్మత్ ఉల్లా పకపక నవ్వి, 'పట్టితమలపుటాకు పట్టితమలపుటాకు' అనెను. కొంచెము యోచించి, 'రోహిలాలను పిలుతువా?' అనెను.

'ఏర్పాటు చేసియే సెలవుకొఱకు వచ్చితిని.'

'సెబాస్,మంచిది.ఎరికిని దెలియరాదు.'

'అది అక్కఱ మాలిన మాట.'

'సరి, యేమి చేయింతువు?'

'అరఁటిపం డొలిచి నిన్నుఁ బిలుతును. ముసలి పులి మాత్రము కనుకవలయును.'

'దాని కెపుడును కోరలు లేవు. మనకు దాని భయమే లేదు.'

'మంచిది.'

---

* సంధౌ సర్వస్వహరణం విగ్రహే ప్రాణనిగ్రహః, అల్లాబదీనన్నృపతౌ న సంధి ర్న చ విగ్రహః.

తాంబూలవల్లి జాతెను. ప్రాంతగుడార ములో భగవత్ ప్రార్థన పరిసమాప్తమాయెను.

ఇంతవఱకును కిటకిటలాడుచున్న వీథు లన్నియు బంగనబయళ్లయిపోయెను. ఏక్షణ మున నేమి జరుగునో యెవరికిఁ దెలియును? వెలుఁగు చీఁకటి యగును. చీఁకటి వెలుఁగగును. అష్టమీ చంద్రరేఖ అపుడపుడ ఆకాశవీథిని అశూన్య మొనరించెను. చుక్కలు ఒకచ క్కని చుక్కను పరికించుటకుఁబోలె వరుసలు దీరి కూరుచుండెను.

రహిమత్ ఉల్లా కంట వత్తిడికొని కూ రుచుండియుండెను. అతనికి నిమిష మేఁడాదిగా నుండెను. ఏమియు తోఁచలేదు. గులాపీ అని పిలిచెను. బదులు లేదు. జులేఖా యని పిలి చెను. మాఱుమాట లేదు. కాని గుడార ములో పదధ్వనియు, వెంటనే 'నన్నుఁ బిలువ లేదేమి?' అను వాక్యమును వినిపించెను. రహి మత్ ఉల్లా మొగము చేటంత ఆయెను. 'ఇఁక నీదే పని.'

రహిమత్ ఉల్లా గుడారము బయటి కేఁగెను. జీను కట్టిన గుఱ్ఱ మచట వేచియుం డెను. తాంబూలవల్లి చేతియూఁతతో నతఁడు గుఱ్ఱముమీఁది కెగిరి దూఁకెను. గుఱ్ఱము గొప్ప సకిలింతతో కోలాహలము చేయుచుఁ బరువిడెను. దానివెనుక గజ్జెలగుఱ్ఱమువలె తాంబూలవల్లి నడచెను.

'అల్లాహా అల్లాహా' అనుకొనుచు హిదా యతుల్లా లేచెను. వాకిటికి వచ్చి చూచెను. కికారణ్యము!

'గులాపీ ?'

'ం.'

'జులేఖా ?'

'ం.'

'తాంబూల్'?

'ం.'


'సులేమాన్ ?'

'ం.'

హిదాయతుల్లా గుడారముల చుట్టును దిరిగెను. వంటవారు నిదిరించుచుండిరి. బండ కొయ్యలలో నున్నవారు బండకొయ్యలలోనే నిదిరించుచుండిరి. సైనికుఁ డొకఁడును లేఁడు. అతఁ డంతయు కలయఁజూచి అపాయమును శంకించెను. పటాకత్తి దూసి గుఱ్ఱమెక్కెను. గుఱ్ఱము సకిలించెను. ఈసకిలింత విని రహి మత్ ఉల్లా-గుఱ్ఱము దూరముగా సకిలిం చెను. నిమిషములమీఁద హిదాయతుల్లా-గుఱ్ఱము రహిమత్ ఉల్లా గుఱ్ఱమును చేరఁ బాఱెను. కరణముగారి యింటిని జుట్టవయిచిన రోహిలాలు చెట్టు కొకఁడును పుట్ట కొకఁడు నయిరి.

తలుపు లింకను మూయఁబడలేదు. హి దాయతుల్లా గుఱ్ఱము దుమికి లోనికిఁ బరు గెత్తెను.

నడుమునుండి దూసిన ఒడ్డాణపు బాకు తో ఆ పడుచు. దాని తాఁకును తప్పుకొను



తత్పరత

చిత్రకారుడు : శ్రీ యస్ వెంకటరావుగారు, పెనుగొండ.

తాంబూలీ గులాపీ జులేఖాలు. దానిని లాగు కొనుటకుం బొంచియున్న కొడుకు. ఈ రంగ మంతయు నతఁ డరసెను.

అతని జూచుచునే దాసికలు దాఁటిరి. కొడుకు కత్తితో తండ్రిమీఁదికి లంఘించెను. జోసిపులి చిఱుతపులిని గ్రిందఁ బడఁద్రోసెను. పిదప మోఁకాలు మండవెట్టి తండ్రి కొడుకుగుండెలమీఁదఁ గూరుచుండెను. కూరుచుండి 'అమ్మా! ఇఁక రమ్ము ఖూనీసెలవు పోఁగొట్టుకొంటిని. వీనికి నీ కత్తితోడనే నీవు శిక్ష విధింపుము' అనెను.

ఆయమ వచ్చి తండ్రికొడుకుల కత్తులు లాగుకొని 'ఇతనిని నేను క్షమించితిని' అనెను.

'అమ్మా! నీవు దయావతివి. ఈ ముసలి కతినుఁడు?' అని కొడుకుగుండెలలో నొకపోటు పొడిచి మీఁదినుండి లేచి అతనిని లేవఁదీసెను. లేవఁదీసి బయటి కొక గెంటు గెంటెను. గెంటి యొడలు పట్టునన్ని దెబ్బలు కొరడాతోఁ గొట్టెను. కొట్టి—'నాకిఁక కొడుకు లేఁడు. నీవు నా కిఁకఁ గానరారాదు' అనెను.

వదిలినదే చాలునుగా రహమత్ ఉల్లా పాఱిపోయెను. హిదాయతుల్లా కానఁబడునంత వఱకును కుమారుని జూచి చేతులెత్తి 'ఓ ఫకీర్ ఓ ఫకీర్! ఓరినాయనా! ఓరినాయనా' అని ఆవఱచినటు లఱచెను.

ప్రాకృతగాథలు

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు

(అమవృత్తము)

*ఎవరి కలుక రాదు భువిఁ బ్రియురాలి కె
మ్మోవి కాటువడిన? ముగుద, తేంట్లు
మూఁగియున్న తమ్మి మూరుకొంటివి; వల
దన్న వినవు; సైఁపవమ్మ, యిపుడు.

—కావ్యప్రదీపము, పు. ౧౬౦.

తెల్లవాఱఁ జెమట దీయించుకొన్నాఁడు;
ఒడలు గడిగినాఁడు; కుడిచినాఁడు;
జోస్యుకడకు దినముఁ, జుక్కయు, వారము
నడుగఁ బల్లెపెద్ద వెడలినాఁడు!

—అదే, పు. ౨౩౪.

ఆదరించి సహృదయాళి చేపట్టిన
యపుడె గుణములెల్ల నంకురించుఁ;
తరణికిరణములను దడవినప్పుడుగదా
తమ్మిపూవు లగును దమ్మిమొగ్గలు!

—అదే, పు. ౨౬౧. †

---

* వీని మూలగాథకే 'వారణసీయఁదావగొనవా' ఇత్యాది శ్రీనాథుని యాంధ్రీకరణముగాఁ దోఁచెడిని. ఇది హాలుని సప్తశతిలోనిదఁట. కాని నిర్ణయసాగర ప్రముద్రణములో కానరాదు.

† దీని మూలగాథ ధ్వనికారుఁ డగు ఆనందవర్ధనాచార్యుని "విషమబాణలీల" లోనిదఁట.

—చూ. ధ్వన్యాలోకము, పు. ౬౨.

మిగులఁ గూర్చిన తన దొంగమగని మొగము
గురుజనంబుల నడుమఁ గన్గొన్నయంత
నెలఁతమనసుకుఁ దోఁచె 'నన్నిటిని వదలి
యడవి కెందైనఁబోవుదునా' యటంచు.

—అదే, పు. ౨౬౫.

అన్ని యింద్రియముల కాప్యాయనంబయి
సరసకావ్యమందు జాలువాఱు
వనితనంపు మెఱుఁగు పాతికపాలైనఁ
గనము వినము వేఱుకడల నెందు.

—అదే, పు. ౩౧౪.

జుమ్ముజుమ్మటంచుఁ జొచ్చి చచ్చెదు తేఁటి!
ముండ్లు నిండియుండు మొగలిపొదల;
జాజిపూవుతోడ సరివచ్చుపువు నీకు
దొరక దెంత దిమ్మఁ దిరుగుచున్న.

—అదే, పు. ౩౧౬.

చామ మేని యందచందమ్ములే వేఱు;
నడల నుడుల నెఱతనంబె వేఱు;
అందఱిని సృజించు నాబ్రహ్మ గీఁతయే
కాదు దీని యచ్చుకట్టు చూడ!

—అదే, పు. ౩౪౨.

సింగములజూలు, పిసినారిచేతిలోని
పసిఁడి, పెనునాగుఁబాముల పడఁగమణులు,
కులవధూరత్నముల కుచంబులును దాఁక
వచ్చునెట్టులు మేనిలోఁ బ్రాణ ముండ?

—అదే, పు. ౩౪౪.

ఎట్లు వచ్చు మాకు నేనుఁగుదంతాలు
పెద్దపులులతోళ్లు, బేరివాఁడ!
కలికిమొగముమీఁదఁ గదలు ముంగురులతోఁ
గోడ లింటఁ దిరుగు లాడుచుండ?

—అదే, పు. ౩౬౩.

[స. శే. వ. ము.]

ముఖ్యవిషయములలోకూడ, గవర్నరు తనయభిప్రాయమునే నెగ్గించుకొని ఆప్రకారమే పరిపాలనాపద్ధతిని నడుపుట కాతని కధికారము కలదు.

౨. రిజర్వుడు శాఖలవిషయములో గవర్నరుకు ప్రత్యేకబాధ్యత యుండుటయే కాక వాటి పరిపాలనకు కావలసిన సొమ్మును ఏర్పాటుచేయుటలో కాని, ఇతరవిషయములలో కాని ఆతనికి సంపూర్ణాధికారము కలదు. అట్టి సందర్భములలో శాసనసభ వారాతని చర్య నామోదించినను ఆమోదించకపోయినను కూడ గవర్నరు జంకవలసిన పనిలేదు.

ఈవిధముగ గవర్నరుకు పరిపాలనా విషయములలో ప్రత్యేకబాధ్యత ఈయబడినప్పుడు దాని నాచరణలో నుంచుట కాతనికి తగు అధికారము నుండవలెను. ఆయధికారములలో మొట్టమొదటిది శాసన సభవారు చేసిన చట్టముల నాచరణలోనికి రాకుండ చేయుట కనుకూలమగు "సర్టిఫికేట్" (Certificate) అధికారము. దీనినిగురించి సంస్కరణ చట్టపు ౧౩ సెక్షనులో ఈవిధముగ వ్రాయబడియున్నది — "లెజిస్లేటివ్ కౌన్సిల్ వారు ఎప్పుడైనను, రిజర్వుడుశాఖకు చెందిన ఏబిల్లును కాని, గవర్నరు సూచించిన పద్ధతిని ప్రవేశపెట్టుబడుటకు కాని, ప్రవేశపెట్టబడిన తరువాత చర్చించి ఆమోదించుటకు గాని, నిరాకరించుచో, గవర్నరు దాని ఆమోదము ఆయాశాఖలయొక్క పరిపాలనకు తనకు గల బాధ్యత కది అవసరమని సర్టిఫై చేయవచ్చును. ఆపైన కౌన్సిలు వారు దానిని సమ్మతించకపోయినప్పటికిని అది ఆమోదింపబడినట్లే ఎన్నుకోబడి, గవర్నరుసంతకమును బడయుటతో, అది కౌన్సిల్ వారివలన ఆమోదింపబడిన ఇతరచట్టములకున్న అధికారమును పొందినదగును."

ఈవిధముగ గవర్నరు సొంత అధికారము నుపయోగించి సర్టిఫైచేసిన చట్టములకును, గవర్నరు కార్యనిర్వాహకవర్గమువారి సలహాతో చేసిన "ఆర్డినెన్సు"లకును ఒక ప్రధానమగు భేదము కలదు*. పైన చెప్పబడిన విధముగ చేయబడుచట్టమును, శాసననిర్మాణ సభవారు ప్రతి ఇతరచట్టము నెట్లు మార్చుదురో, అవిధముగనే మార్చుటయు, సవరణచేయుటయు గవర్నరు అనుమతితో చేయుట కధికారము కల్గియున్నారు. "సర్టిఫికేట్" అధికారము ననుసరించి గవర్నరుఏర్పాటుచేయు ప్రతిచట్టమును, పార్లమెంటువారి అనుమతిని పొందవలసిన అవసరము కలదు. అనగా ఆచట్టము పార్లమెంటు వారి ఎదుట కొంతకాల ముంచబడి, దాని కెవరును అభ్యంతరపెట్టకుండ నుండిన నది హూహూలుగ ఆమోదింపబడినట్లు పరిగణింపబడును.

సర్టిఫికేట్ అధికారముతోపాటు గవర్నరుకు "వీటో" (Veto) అధికారముకూడ కలదు. దీని ప్రకారము శాసనసభవారు చేసిన చట్టములను ఆచరణలోనికి రాకుండ గవర్నరు ఆపుచేయవచ్చును. ఇండియా ప్రభుత్వ చట్టము ౧౧ సెక్షను (౪ క్లాజు) లో దీనినిగురించి ఈ క్రిందవిధముగ తెలుపబడినది:---

"ఏదైన బిల్లు ప్రవేశపెట్టబడినప్పుడు కాని, ప్రవేశపెట్టుట కుద్దేశింపబడినప్పుడు కాని, లేక ఏదైన బిల్లును సవరించుటకు నోటీసు ఈయబడినప్పుడు కాని, గవర్నరు ఆబిల్లును కాని, సవరణను కాని తనరాజధానియొక్క శాంతికి భంగకరమని సర్టిఫైచేసి, ఆబిల్లు విషయమున గాని, ఆసవరణవిషయమున కాని ఏవిధమైన చర్యను తీసికొనుటకు వీలు లేదని శాసననిర్మాణసభ వారిని నియమింపవచ్చును. అట్టినియమము వెంటనే

---

* ఇండియా ప్రభుత్వచట్టపు ౭౨ సెక్షను ప్రకారము గవర్నరు జనరలుకు అత్యంతావశ్యక మగు సమయములలో బ్రిటిష్ ఇండియాయం దంతటియందుగాని కొన్ని ప్రాంతములందు మాత్రమే కాని ఆచరణయందుండు ఆర్డినెన్సు (Ordinences) లను చేయుటకును, అమలునం దుంచుటకును అధికారము కలదు. ఈవిధముగ చేయబడు ఆర్డినెన్సులు ౬ మాసములకాలముకంటె ఎక్కువకాల మాచరణయం దుండుటకు వీలు లేదు. అవసరమైన మరల ౬ నెలలవరకు వాటిని గవర్నరుజనరలు పొడిగింపవచ్చును. కాని ఆకాలములో మాత్రము భారతశాసననిర్మాణసభ వారి చట్టమున కెట్టి యధికార ముండునో అట్టి యధికారమే ఆర్డినెన్సులకుకూడ నుండును

ముఖ్యవిషయములలోకూడ, గవర్నరు తనయభిప్రాయమునే నెగ్గించుకొని ఆప్రకారమే పరిపాలనాపద్ధతిని నడుపుట కాతని కధికారము కలదు.

౨. రిజర్వుడు శాఖలవిషయములలో గవర్నరుకు ప్రత్యేక బాధ్యత యుండుటయే కాక వాటి పరిపాలనకు కావలసిన సొమ్మును ఏర్పాటుచేయుటలలో కాని, ఇతరవిషయములలో కాని ఆతనికి సంపూర్ణాధికారము కలదు. అట్టి సందర్భములలో శాసనసభ వా రాతని చర్య నామోదించినను ఆమోదింపక పోయినను కూడ గవర్నరు జంకవలసిన పనిలేదు.

ఈవిధముగ గవర్నరుకు పరిపాలనా విషయములలో ప్రత్యేక భాధ్యత ఈయబడినప్పుడు దాని నాచరణలో నుంచుట కాతనికి తను అధికార ముండవలెను. ఆయధికారములలో మొట్టమొదటిది శాసన సభవారు చేసిన చట్టముల నాచరణలోనికి రాకుండ చేయుట కనుకూల మగు "సర్టిఫికేట్" (Certificate) అధికారము. దీనినిగురించి సంస్కరణ చట్టపు ౧౩ సెక్షనులో ఈవిధముగ వ్రాయబడియున్నది:—"లెజిస్లేటివ్ కౌన్సిల్ వారు ఎప్పుడైనను, రిజర్వుడుశాఖకు చెందిన ఏబిల్లును కాని, గవర్నరు సూచించిన పద్ధతిని ప్రవేశ పెట్టుబడుటకు కాని, ప్రవేశ పెట్టబడిన తరువాత చర్చించి ఆమోదించుటకు గాని, నిరాకరించుచో, గవర్నరు దాని ఆమోదన ఆయాశాఖలయొక్క పరిపాలనకు తనకు గల భాధ్యతకది అవసరమని సర్టిఫై చేయవచ్చును. ఆపైన కౌన్సిలు వారు దానిని సమ్మతించకపోయినప్పటికిని అది ఆమోదింపబడినట్లే ఎన్నకోబడి, గవర్నరుసంతకమును బడయుటతో, అది కౌన్సిల్ వారివలన ఆమోదింపబడిన ఇతరచట్టములకున్న అధికారమును పొందినదగును."

ఈవిధముగ గవర్నరు సొంత అధికారము నుపయోగించి సర్టిఫైచేసిన చట్టములకును, గవర్నరు కార్యనిర్వాహకవర్గమువారి సలహాతో చేసిన "ఆర్డినెన్సు"లకును ఒక ప్రధానమగు భేదము కలదు*. పైన చెప్పబడిన విధముగ చేయబడుచట్టమును, శాసననిర్మాణ సభవారు ప్రతి ఇతరచట్టము నెట్లు మార్చుదురో, ఆవిధముగనే మార్చుటయు, సవరణచేయుటయు గవర్నరు అనుమతితో చేయుట కధికారము కల్గియున్నారు. "సర్టిఫికేట్" అధికారము ననుసరించి గవర్నరుఏర్పాటుచేయు ప్రతిచట్టమును, పార్లమెంటువారి అనుమతిని పొందవలసిన అవసరము కలదు. అనగా ఆచట్టము పార్లమెంటు వారి ఎదుట కొంతకాల ముంచబడి, దాని కెవరును అభ్యంతరపెట్టకుండ నుండిన నది మామూలుగ ఆమోదింపబడినట్లు పరిగణింపబడును.

సర్టిఫికేట్ అధికారముతోపాటు గవర్నరుకు "వీటో" (Veto) అధికారముకూడ కలదు. దీని ప్రకారము శాసనసభవారు చేసిన చట్టములను ఆచరణలోనికి రాకుండ గవర్నరు ఆపుచేయవచ్చును. ఇండియాప్రభుత్వ చట్టము ౧౧ సెక్షను (౮ క్లాజు) లో దీనినిగురించి ఈ క్రిందవిధముగ తెలుపబడినది:—

"ఏదైన బిల్లు ప్రవేశపెట్టబడినప్పుడు కాని, ప్రవేశపెట్టుట కుద్దేశింపబడినప్పుడు కాని, లేక ఏదైన బిల్లును సవరించుటకు నోటీసు ఈయబడినప్పుడు కాని, గవర్నరు ఆబిల్లును కాని, సవరణను కాని తనరాజధానియొక్క శాంతికి భంగకరమని సర్టిఫైచేసి, ఆబిల్లు విషయమున గాని, ఆసవరణవిషయమున కాని ఏవిధమైన చర్యను తీసికొనుటకు వీలు లేదని శాసననిర్మాణసభవారిని నియమింపవచ్చును. అట్టినియమము వెంటనే

* ఇండియాప్రభుత్వచట్టపు ౭౨ సెక్షనుప్రకారము గవర్నరు జనరలుకు అత్యంతావశ్యక మగు సమయములలో బ్రిటిష్ ఇండియాయందంతటియందుగాని కొన్నిప్రాంతములందు మాత్రమే కాని ఆచరణయందుండు ఆర్డినెన్సు (Ordinences) లను చేయుటకును, అమలునం దుంచుటకును అధికారము కలదు. ఈవిధముగ చేయబడు ఆర్డినెన్సులు ౬ మాసములకాలముకంటె ఎక్కువకాల మాచరణయం దుండుటకు వీలు లేదు. అవసరమైన మరల ౬ నెలలవరకు వాటిని గవర్నరుజనరలు పొడిగింపవచ్చును. కాని ఆకాలములో మాత్రము భారతశాసననిర్మాణసభ వారి చట్టమున కెట్టి యధికార ముండునో అట్టి యధికారమే ఆర్డినెన్సులకుకూడ నుండును

భారతీయ సైనిక నిర్మాణము[1]

నార్ల వెంకటేశ్వరరావుగారు

కెన్వర్దీ సేనానిగా రొకసందర్భమున "బ్రిటిషుసైనికులు దేశరక్షణ గావించుచుండగా స్వరాజ్య ప్రభుత్వమును కొనసాగింపవచ్చు ననుకొనుట హాస్యాస్పద"[2] మని పలికియుండిరి. ఈ పలుకులలో చాల సత్యమున్నది. పరదేశసైనిక సాహాయ్యముతో స్వదేశ పరిపాలన గావింప నెంచుట కేవలము భ్రమ. అందుచేతనే అఖిలభారత కాంగ్రెసు మహాసభ పుట్టినది మొదలు జాతీయవాదు లందరును ముక్తకంఠముతో భారతీయులకు సైనికశాఖయం దధికముగ స్థాన మొసగవలెనని ఘోషించిరి. కాని వారిఘోషలన్నియు అరణ్యరోదనము లయ్యెను.

నేను పైన వ్రాసినదానినిబట్టి భారతసైనికదళము లలో భారతీయులకన్న విదేశీయులే అధికసంఖ్యాకులుగ నున్నారని భావింపరాదు. ప్రస్తుతము భారతదేశమందున్న సైన్యములో నూటికి ౭౦ మందికి పైగా భారతీయులే యున్నారు. కాని వారందురును స్వల్ప వేతనములను తెచ్చుకొను సిపాయిలు. లేదా, చిన్న చిన్న వర్గములపై నధికారముచేయు సుబేదారులు, హవలు దారులు మొదలగువారు. అవసరము వచ్చినప్పుడు శతఘ్నుల కరయనుటయే కాని, వారికి సైనిక వ్యూహపద్ధతి యేమియు తెలియదు. ఇట్టివారి సాహాయ్యమున స్వరాజ్యప్రభుత్వ మహాసౌధము రక్షింపబడగలదా!

అట్లెన్నటికిని జరుగనేరదు. అందువలననే జాతీయ క్షేమాభిలాషు లందరును భారతీయులను కేవలము సైనికభటులక్రిందనే నియమింపక వారికి సేనాధిపత్యము వహించుట కర్హమగు శిక్షణ నొసగవలెనని కోరుచున్నారు. కాని యిట్లొనర్చుటకు కొన్ని తీవ్ర ప్రతిబంధకము లున్నవని బ్రిటిషురాజకీయవేత్తలును, సైన్యాధ్యక్షులును పలుకుచుందురు. వారు పేర్కొను ప్రధానప్రతిబంధకమేమన:—"భారతీయులలో సైనికోద్యోగపదవి నందుట కర్హమగునట్టివారు తగినంతమంది లేరు; ఏ కొలదిమందియో యున్నను వారికి సైనికులను నియమబద్ధముగ నుంచుట తెలియదు." అని. ఈవిధముగ పలుకువారిలో రాలిన్సను ప్రభువుగా రొకరు. వారు తమవాదన నిట్లు సంక్షిప్తముగ వ్రాసిరి.

"భారతసైన్యము పరిపూర్ణముగ భారతీయసైనికోద్యోగులవశము గావింపబడవలె నన్న, ౨,౦౦౦ మందికి పైగా సైనికోద్యోగులు కావలెను. దీనికిగాను తగినంతమంది, తగినగుణగణములు గలవారు లభింతు రనుట కడు సందేహాస్పదము."[3]

కాని పైవిధముగ సందేహింపవలసిన యగత్యము లేదు. భారతీయులు మొదటినుండియు నలౌకిక యుద్ధవిద్యానైపుణ్యమును గనుపఱచిరి. బ్రిటిషుదేశస్థులు నాగరికత వాసనయైనను ఎఱుగని దినములలో భారతీయులు ప్రపంచజైత్రయాత్రను సలుపుచువచ్చిన అలగ్జాండరు చక్రవర్తిని వెనుకకు మరల్పగల్గిరి. అటుపిమ్మట తురుష్కుల మతావేశపూరితమైన యాక్రమణధాటికి తాళలేక యూరపుఖండమంతయు కిక్కురుమనక తల యొగ్గుచుండ భారతీయులు చాలకాలమువరకు తురుష్క సేనానీకముల పరాజయమొనర్పగలిగిరి. తదుపరి రాణా

1. Indianisation of the Army.

2. "The Idea of Swaraj with British Solidiers guarding the country is Indians"—I.t. commander Kanworthy.

3. "If the Indian Army is to be completely Indianised, we want over 2,000 officers, and it is more than doubtful whether a sufficient number of right type of Indians will ever come forward to supply the military requirements of the Army"—Lord Rawlinson.

రణజిత్‌సింహుఁడు ఆఫ్గనుస్థానముపై దండెత్తి అమీరును స్వాధీనము గావించుకొన గలిగెను. అంతేగాక బ్రిటిషు వారు భారతదేశము నాక్రమించుకొను పట్టున కొన్ని యుద్ధములలో భారతీయులచే నడుపబడిన సేనలు బ్రిటిషు దళముల నోడింప గలిగెను. కేవలము భారతీయ పురుషులే గాక సమయము వచ్చినప్పుడు భారతీయ స్త్రీలు సహితము నిరుపమానయుద్ధవిద్యా కౌశల్యమును ప్రదర్శించిరి. రాణీ మీరాబాయి, రాణీదుర్గావతి, చాంద్‌బీబీ, ఝాన్సీ లక్ష్మీబాయి మున్నగు వీర నారీరత్నముల యశోగానములచే నితిహాసములు నేటికిని అలంకరింపబడుచున్నవి. ఇట్టి వీరగర్భయగు భారతమాత నేడు గొడ్డుపోయినదా?

లేదు. భారతమాత గొడ్డుపోలేదు. నేటికిని భారతదేశమున బ్రహ్మాండమగు సైనికశక్తి యున్నది. ఈవిషయమును కొంతమంది యాంగ్లేయులే అంగీకరించి యుండిరి. జనరలు సర్ ఇయాన్ హామిల్టనుగా రొక సందర్భమునం దిట్లు వ్రాసిరి.

"ఉత్తమసేనాపతు లున్నచో యూరపుఖండపు కృత్రిమసంఘము నంతయు కూకటివ్రేళ్లతో సహితము సంచలింపజేయగల సైనికశక్తి యుత్తరహిందూస్థానమం దున్నది. విజ్ఞానవ్యాప్తితో నాయకులుకూడ బయలు దేరగలరు.4

ఇట్లే కొంతకాలముక్రింద 'కాంటెంపరరీ రివ్యూ' (Contemporary Review) అను పత్రికలో నొక యాంగ్లేయసైనిక విద్యానిపుణుఁడు సహితము వ్రాసెను. అతఁడు వ్రాసినదానిని కూడ క్రింద నేర్కొనుచున్నాము.

"ప్రష్యాదేశపు నిర్బంధసైనిక శిక్షావిధానము భారతదేశములో ప్రవేశపెట్టబడినయెడల, శాంతిసమయములో నుపయోగింపబడని రిజర్వు గాక, ౨౫ లక్షల సైన్యమును యుద్ధసన్నద్ధముగ నుంచవచ్చును. అంతేగాక, యేటేట ౮ లక్షలమంది క్రొత్తగ శిక్షణ బడయుచుందురు. ఈబలముతో కేవల మాసియాఖండమునే గాక సర్వప్రపంచమును జయింపవచ్చును".5

కాని పరులయభిప్రాయముల బట్టుకొని ప్రాకులాడ నేల? భారతప్రభుత్వముచేతనే స్వయముగ నియమింపబడిన స్కీనుకమిటీవారు భారతదేశములో సైనికోద్యోగపదవి నందుటకు తగినవారు, తగినంతసంఖ్యలో, లభింప కనుకొనుట యవిశ్వసనీయమైన విషయ మని వ్రాసిరి.!6

పోనీ, వాదనకొఱకు సైనికోద్యోగులుగ నుండుటకు భారతీయులు తగరని యొప్పుకొందము. ఐనచో నాంగ్లేయులు సైనికోద్యోగులుగ నుండుటకు పరిపూర్ణముగ నర్హులై యున్నారా? వారి సైనికోద్యోగులలో నెట్టి లోటుపాట్లు లేవా? ఈప్రశ్నలకు నేను స్వయముగ ప్రత్యుత్తర మిచ్చుటకన్న కొంతమంది విఖ్యాతినందిన ఆంగ్లేయసేనాపతుల యభిప్రాయములను నేర్కొనుట మంచిది.

సామాన్య సైనికభటుని స్థానమునుండి సర్వసైన్యాధ్యక్షపదవికి ప్రాకిన రాబర్ట్సు ప్రభువుగా రిట్లు వ్రాసిరి:—

"బ్రిటిషుప్రకృతిలో నది స్వతస్సిద్ధముగనున్నదో లేక శిక్షణపద్ధతిలో నేదైన లోపమున్నదో నేను

4. 'There is material in the North of India sufficient and fit under good leadership to shake the artificial society of Europe to its foundations: and diffusion of Knowledge will produce leaders." Quoted in "Japan's Foreign Policy" by A M. Pooly, p. 310.

5. "If the Prussian conscription were applied to India, we should without counting reserves on land * * * or army force not summoned in times of peace, have two and a half millions of Soldiers actually in barracks with 800,000 recruits coming up every Year;—a force with which not only Asia but the whole world might be subdued." Quoted in the Legislative Assembly Debates, Vol IV, No 60 p. 4,244, 13th Sep., 1927.

6. *Vide* Indian Sandhurst Committee Report, p. 21.

గులు తమ విధ్యుక్తధర్మమునందు ప్రమత్తులై యుండుట యేకారణమని పలుకుటకు నేను శంకించుట లేదు." 14

విల్లింగ్టను ప్రభువు వెల్లడించిన యభిప్రాయము వంటిదానినే ౧౯౦౨వ సంవత్సరమున నియమింపబడిన అక్సను—వర్గ్లసు కమిటీవారు సహితము ప్రకటించిరి. వారు తమ నివేదికలో నిట్లు వ్రాసిరి :—

"మా సమక్షమున నున్న సాక్ష్యమునుబట్టి సైన్యములోని చిన్న యుద్యోగు లందరు నాయుధ విద్యాశాస్త్రములని పరిపూర్ణముగ విదితమైనది. ఇంతకన్న విపరీతమేమన, వారు దాని నభ్యసించుట కుత్సుకతనైనను చూపుటలేదు. ఈవిషయమై పరిపూర్ణముగ తెలిసిన వారు నిమ్నోద్యోగులలో బహుసంఖ్యాకులు నిర్బంధించిన గాని పని చేయరని మాకు చెప్పిరి. ఆయుధవిద్యాభ్యాసమునకై యుత్సాహము, గనపఱచుట హీనమనియు, సాధ్యమైనంత తక్కువపని చేసి తప్పించుకొనుట మంచిదనియు వారు భావించుచున్నారు."15

బ్రిటిషు రాజకీయవేత్తలును, సైన్యాధ్యక్షులును భారతీయులు సైనికోద్యోగపదవుల నందుట కనర్హులని పలుకుట మన "గురివెందగింజ" సామ్యమువ నున్నదని సంపూర్ణముగ నిరూపించుటకే నే నింతదనుక విషయవిస్తరమునైనను పాటింపక వ్రాసితిని.

అసలు బ్రిటిషువారు భారతీయ సైనికనిర్మాణమున కిచ్చగింపకుండుటకు గల కారణము వేఱుగనున్నది. దానిని నేను చెప్పుటకన్న విఖ్యాత పత్రికావిలేఖరులైన యఫ్. డబ్లియు. విల్సనుగారిచే చెప్పించిన బాగుండును. వా రొకచో నిట్లు వ్రాసిరి:—

"భారతదేశములోని బ్రిటిషు ప్రభుత్వమునకు ఖడ్గబలము చరమాధారమని యెల్ల రంగీకరింపక తప్పదు. ఈవిషయమును కప్పిపుచ్చినను లాభములేదు. సైనికుడు సాధారణముగ సత్యగ్రాహిగ నుండును. అందుచే నతనికి సైన్యమును భారతీయులపరము చేసి, భారతదేశములోని బ్రిటిషుబలములను సాధ్యమైనంతవఱకు తగ్గించినచో, రాజ్యాధికారసత్వము భారతీయుల హస్తగత మొనర్చినట్లే యని తెలియును."16

విల్సనుగారిపలుకు లక్షరశః సత్యములు! ఏనాడు సైన్యము భారతీయులవశము గావింపబడునో ఆనాడే భారతీయులకు సంపూర్ణ స్వాతంత్ర్యము లభించును. బ్రిటిషువారికి సంపూర్ణ స్వాతంత్ర్య మీయ నిచ్ఛ లేదు గనుకనే వారు మనకు సైన్యములో నున్నత పదవుల నిచ్చుటలేదు. ఇక భారతీయులలో సైనికోద్యోగపదవి నందుటకు తగినవారు లేరని చెప్పుట కేవలము సాకు!!

దీని కొక యుదాహరణము గైకొనుడు. నేడు భారతీయులకు శతఘ్నిశాఖయందు ప్రవేశము లేదు. దీనిని బట్టి కొందఱు భారతీయులకు బహుశః శతఘ్నుల నుపయోగించుటయందు ప్రావీణ్యము లేదని భావింపవచ్చును, కాని యట్లు భావించుట కేవలము పొరపాటు. వారు శతఘ్నివిద్యయందు కడు చాకచక్యమును బడయగలరు. అందుచేతనే వారికి దానియందు ప్రవేశము లేకుండ చేయబడినది. ఈవిషయము కేవలము నే నూహించి చెప్పునది కాదు. కొంతమంది ప్రభుత్వోన్నతోద్యోగులే దాని నంగీకరించిరి. ఎల్ఫిన్‌స్టను ప్రభువుగారు దీనివిషయమై యిట్లు వ్రాసిరి:—

14. Quoted in Oman, Vol. VI, p. 157.

15. Report of the Committee appointed to consider the Education and Training of officers of the Army—1902, p p. 22-29-

16. "There is no getting away from the fact that British rule in India has, as its ultimate sanction, the British bayonet. This may be camouflaged, and cushions may be placed on the bayonets, but they are still there. The soldier is usually a realist, and he knows full well that if you make the Army Indian and reduce the purely British Army in India to a minimum, you are handing over the real power in this country to the Indian People." -Mr, F. W. Wilson in 'New India,' Madras, 20—2—1930.

"భారతీయులకు శతఘ్నివిద్య నేర్పగూడ దను వారితో నే నేకీభవింతును. వా రావిద్యలో నధిక ప్రావీణ్యమును బడయగలరు. వారు శతఘ్నులకు చాల ప్రాముఖ్యముకూడ నిత్తురు. అందువలననే వానిని వారి హస్తగత మొనర్చుట అపాయకరమై యున్నది." 16 A.

పై యభిప్రాయముతో ఎలింబరో ప్రభువుగా రేకీభవించిరి. వారిట్లు నుడివిరి:—

"శతఘ్నిశాఖను పరిపూర్ణముగ మనస్వాధీనమం దుంచుకొనవలెననుట సర్వజనాభిప్రాయమువలె గన్పట్టుచున్నది. * * * భారతీయులకు ఫిరంగులను చేయుట యందును కాల్చుటయందును స్వతస్సిద్ధమైన ప్రావీణ్యమున్నది. వారికి తమ ప్రావీణ్యమును పెంపొందించుకొను నవకాశ మొసగరాదు. * * * వారు తమ శతఘ్ని రక్షణకై ప్రాణములను సహిత మర్పింతురు." 17

భారతీయులకు శతఘ్నివిద్యలో స్వతస్సిద్ధ ప్రావీణ్యమున్నది గాన వారికి దానిలో ప్రవేశము లేకుండ జేయవలెనట! ఈ యొకవిషయమును బట్టియే బ్రిటిషువారు స్వార్థసిద్ధికి మనలను నిస్సహాయస్థితియం దుంచుటకు శంకింపరని తేటతెల్లమగుటలేదా?

ఇంతేగాదు, కొంతమంది యాంగ్లేయప్రముఖులు భారతీయులను నిర్జీవప్రతిమలవలెను, జీవచ్ఛవములవలెను ఉంచినగాని బ్రిటిషుప్రభుత్వము సుస్థిరముగ నుండదని వ్రాసిరి. అట్టి యభిప్రాయములలో రెంటిని క్రింద సమర్పించుచున్నాను

బొంబాయి సైనికదళములకు సర్వసైన్యాధ్యక్ష పదవి నలంకరించిన లెఫ్టినెంటు జనరలు వార్రీగా రిట్లు సెలవిచ్చిరి:—

"భారతీయుల శౌర్యాగ్నిని ప్రజ్వలింపజేయుట మన యధికారమునకు చేటు దెచ్చుకొనుట యని నాచిరకాలాభిప్రాయమై యున్నది." 18

ఫీల్డు మార్షలు బ్రాంసులోగారు సహితము పైవిధముగనే సెలవిచ్చిరి:—

"కాలగతి యెంత విపరీతముగ వక్రించినను చారిత్రకదృష్టాంతమును గాని, వర్ణభేదమును గాని మఱచుటకు వీలులేను. అందుచేత భారతీయ సైన్యములను హెచ్చుచేసినను, వారియందు వీరోత్సాహమును వృద్ధిచేయ తలపెట్టినను అది మనకు మన సంకటమునకు కారణమై ఉపద్రవకరము కాక తప్పదు." 19

నే నింతవఱకు వ్రాసినదానినిబట్టి భారతీయ సైనిక నిర్మాణమునకు ప్రతిబంధకముగ కేవలము బ్రిటిషురాజనీతిజ్ఞత తక్క మఱేదియు లేనట్లు విస్పష్టమైనదని విశ్వసించుచున్నాను. ఇక తక్కిన వ్యాసభాగమున

---

16. A. "I agree with those who think that it is not judicious to train any natives of India to the use of guns. They make excellent artillery men, and they attach great value and importance to guns; but these veiy circumstances make it dangerous to place them in their hands. "—Lord Elephinstone-

17. "It appears to be the concurrent opinion of all men that we should keep the artillery wholly in our hands. * * * The natives have a genius for casting and working guns and we should not afford them means of enjoying it * * * The natives die at their guns. "—Lord Ellenboroug h

18. "I have always been under the impression that the restoration of the martial spirit in India would be fatal to our suprremacy. "

—Lieutenant General Warree, Commander-in-Chief of the Bombay Army.

19 "To add to their (Indian) troops, and to encourage their (Indian's) martial ardour would make them (Indians) an anxiety and possibly a danger not with standing the perplexing march of time and we cannot disregard the historical precedent or the question of colour. "—Field Marshal Bronslow.



౨. నూనెదండుగ


ఛాయాచిత్రకారుడు: డి. అణ్ణాజీ రావుగారు.



3. బజారువీథి, విజయనగరము

ఛాయాచిత్రకారుడు: బులుసు కామేశ్వరరావుగారు.

ఆకస్మిక చ్ఛాయా చిత్రములు



౧. సోదరప్రేమ

ఛాయాచిత్రకారుడు : డి. అప్పాజీరావుగారు.

ప్రజాఘోషను ధిక్కరింపలేక క్రిందటి పదివత్సరములలోను బ్రిటిషువారు తమసైనికనీతిలో గావించిన యల్పసంస్కరణములనుగూర్చి చర్చింప యత్నించెదను.

సైనికోద్యోగములలో రెండుతరగతు లున్నవి. మొదటిది కింగు కమిషను; రెండవది వైస్రాయి కమిషను. కింగుకమిషను గలవా డెట్టి యున్నతపదవినైనను బడయగలడు. వైస్రాయి కమిషను గలవానికి సుబేదారు, హావల్ దారు మున్నగు చిన్నయుద్యోగములకు మించి వేరేదియు లభింపదు. ౧౯౧౮-వ సం. ము వఱకు భారతీయులకు కింగు కమిషను లభించెడిది కాదు. కాని భారతీయులు జర్మని మహాసంగ్రామమున జూపిన యప్రతిమాన ధైర్యస్థైర్యములకు ప్రతిఫలముగ వారికి సంవత్సరమునకు పది కింగు కమిషను లొసగబడునని యా సంవత్సరమున ప్రకటింపబడినది. తర్వాత నీసంఖ్య యిరువదికి పైగా హెచ్చింపబడినది. ఈ మహావరప్రసాద ఫలితముగ ౧౯౩౦-వ సం. మునకు ౧౩౧ మంది భారతీయులకు కింగు కమిషనులు లభించినవి. ప్రస్తుతము భారతదేశసైన్యమున ౪,౦౦౦ మందికి పైగా కింగు కమిషను గలవా రున్నారు. వీరిలో సుమారు ౩,౧౦౦ మంది బ్రిటిషుదళములకు చెందినవారు. తక్కిన ౯౦౦ మందియు భారతీయదళములకు చెందిన ఆంగ్లేయులు. దీనినిబట్టి భారతీయదళములు భారతీయ సైనికోద్యోగుల వశము గావింపబడవలెనన్న, ౯,౦౦౦ మంది భారతీయులకు కింగు కమిషను లభింపవలెనని స్పష్టపడుచున్నది. ౧౯౧౮-వ సం. ము మొదలు ౧౯౩౦-వ సం. ము వఱకు, అనగా ౧౨ సంవత్సరములలో ౧౩౧ మంది భారతీయులకు కింగు కమిషను లొసగబడినవి. ఈరీతిగనే ముందుగూడ జరిగినయెడల సుమారు ౩౬౬ సం. ములలో భారతీయదళములను భారతీయులు పాలించుట సంభవించును. ఇట్టిపద్ధతిని వేఱుగ ఖండింప నక్కర లేదు. దానిని కేవలము వర్ణించి వదలివేసిన చాలును.

ఇట్లు సంవత్సరమునకు పదిమందికి గాని, యిరువదిమందికిగాని కింగు కమిషనులు లభించుచుండుటవలన భారతదేశమునకు మూడునాలుగు శతాబ్దములలో గాని మోక్షము కలుగదు గాన సైన్యము సత్వరముగ భారతీయుల వశము చేయుటకుగాను వేఱువైన పద్ధతుల ననుసరింప వలసి యుండునని జాతీయవాదు లందరును ఆందోళన సలుప నారంభించిరి. ఆ యాందోళన ఫలితముగ ౧౯౨౧-వ సం. లో నప్పుడు సర్వసైన్యాధ్యక్షులుగ నున్న రాలిన్సను ప్రభువుగారిచే నొకకమిటీ నియమింపబడెను. ఆ కమిటీవారు ౧౯౨౨-వ సం. జనవరి ౧౧-వ తేదీని తమ నివేదికను సమర్పించిరి. దానిలో సైన్యమును ముప్పదివత్సరములలో భారతీయుల పరము గావించుట కొకపద్ధతి సూచింపబడెను. కమిటీవారు భారతీయ సైనికనిర్మాణమును గావింపవలసిన ౩౦ వత్సరములను మూడుభాగములక్రింద విభజించిరి. ఒక్కొక భాగమునందు క్రిందివిధముగ భారతీయులకు కింగు కమిషను లివ్వవలసి యుండునని వ్రాసిరి.

౧.	ప్రథమభాగము	౧,౧౩౭
౨.	ద్వితీయభాగము	౨,౫౯౪
౩.	మూడవభాగము	౩,౧౪౮
	మొం త్తము	౬,౮౬౯

ఈ పద్ధతి ౧౯౨౫-వ సంవత్సరమునుండి ఆచరణలోనికి రావలయుననియు, ౧౯౫౫ వ సంవత్సరమునకు పూర్తికావలయు ననియు కూడ వారు వ్రాసిరి. కాని కమిటీవారి సూచనలు బ్రిటిషువారి కేమాత్రమును నచ్చలేదు. అందుచే వారు కమిటీ నివేదికనైనను ప్రకటింపలేదు. మొన్నటి రౌండుటేబిలు కాన్ఫరెన్సు డిఫెన్సు కమిటీ సముఖమున నానివేదికను పెట్టవలసివచ్చుటచేతనే మనకు నేను పేర్కొన్న వివరములైనను తెలియవచ్చినవి.

తర్వాత భారతీయుల కండ్లనీరు తుడుచుటకో యనునట్లు, రాలిన్సను ప్రభువుగారిచేత "అష్టదళపద్ధతి" (Eight units Scheme) ప్రవేశపెట్టబడెను. ఈపద్ధతి క్రింద నెనిమిది భారతీయదళములు ప్రత్యేకింపబడును. పూర్వము కింగు కమిషనులు పొందిన భారతీయులును, క్రొత్తగ వానిని పొందువారును ప్రత్యేకింపబడిన యెనిమిదళములపై నధికారము చెలాయింప నియమింపబడుచుందురు. ఇట్లు పది సంవత్సరములు గడచునసరికి కాదళముల

లోని పదవులన్నియు భారతీయులచే నాక్రమింపబడును. ఈ పది సంవత్సరముల తర్వాత పద్ధతి జయప్రదమైనదని తోచినచో మరి యెనిమిది దళములు పైరీతిగనే ప్రత్యేకింపబడును. ప్రస్తుతము భారతసైన్యములో ౧౮౧౦ సిపాయిదళము లున్నవి. కనుక రాలిన్‌సను ప్రభువుగారి పద్ధతి యనుసరింపబడినచో మొత్తము సిపాయిదళము లన్నియు భారతీయ సైనికోద్యోగుల యధికారముక్రిందకు వచ్చుటకు ౧౩౬ సంవత్సరముల మూడు మాసములు పట్టును. దానినిబట్టి మన కెంతశీఘ్రముగ సైనిక స్వపరిపాలన మొసంగుటకు ప్రభుత్వమువా రభిలషించుచున్నారో విదితమగుటలేదా?

ఈపద్ధతిని సమర్థించుచు రాలిన్‌సను ప్రభువుగారు కొన్ని కారణములను తెలిపిరి. వానిలో ప్రధానమైనవేవనగా:—(1) దీనివలన భారతీయ సైనిక నిర్మాణమున కవకాశమున్నదియు, లేనిదియు తెలియగలదు. (2) బ్రిటిషు సైనికోద్యోగితో కలసి పనిచేసినప్పటికంటె ప్రత్యేకముగ పనిచేసినప్పుడు భారతీయ సైనికోద్యోగి గుణాగుణములు హెచ్చుగ ప్రకాశమానములు కాగలవు.

కాని యిట్టి కారణము లన్నియు కేవలము సాకులు. అష్టదళపద్ధతి ప్రవేశపెట్టుటకుగల నిజమైన కారణములు వేరుగ నున్నవి.

౧౯౧౮-వ సం. ములో కింగు కమిషనులు భారతీయులుకూడ పొందవచ్చునని ప్రకటన గావింపబడినట్లు పైన చెప్పితిని గదా? అప్పటినుండియు భారతీయులు సైనికదళములలో నున్నత పదవులను కొన్నిటిని పొందనారంభించిరి. దీనిని గాంచి పెక్కుమంది బ్రిటిషు సైనికులును, సైనికోద్యోగులును తాము భారతీయులకు తాబేదారులుగ పనిచేయమనియు, అట్లు చేయుట తమ ఆత్మగౌరవమునకు భంగకర మనియు గగ్గోలు పెట్టసాగిరి. అందుచేత బ్రిటిషువారికి భారతీయ సైనికోద్యోగి యాజ్ఞానువర్తులై మెలగవలసిన యవసరము లేకుండ అష్టదళపద్ధతి ప్రారంభింపబడినది. ఈవిషయమును సర్ వాలెన్ టైను చిరోలుగారు ౧౯౨౩-వ సంవత్సరమున ప్రకటితమైన "భారతదేశము" (India) అను తమగ్రంథములో స్పష్టముగ నంగీకరించిరి. ఏవను చిరోలుగారి యభిప్రాయముతో పని యేమి? అష్టదళపద్ధతిని ప్రారంభించిన రాలిన్‌సనుప్రభువుగారే దాని నంగీకరించిరి. ఈమధ్యనే రాలిన్‌సను ప్రభువుగారి జీవితము ప్రకటింపబడినది. దానిలో వారి దినచర్య (Diary) నుండి చాలభాగము లెత్తి వ్రాయబడినవి. ఆగ్రంథముప్రకారము భారతదేశ సర్వసైన్యాధ్యక్షుపదవి నలంకరింప వచ్చుటకు ముందు రాలిన్‌సను ప్రభువుగారు తమ దినచర్యలో నిట్లు వ్రాసినట్లు తెలియుచున్నది.:—

"ఇక్కడి ప్రజలు భారతీయసైనిక నిర్మాణవిషయమై భయభ్రాంతు లగుచున్నారు. పురాతన సైనికోద్యోగులు తమ పుత్రులను భారతీయుల ఆజ్ఞానుబద్ధముగ సేవచేయనీయ మనుచున్నారు. కనుక కొన్ని దళములను ప్రత్యేకించి, వానిని భారతీయ సైనకోద్యోగుల వశము నం దుంచుటయే శరణ్యముగ లె గన్పట్టుచున్నది."[20]

దానిలోనే మఱియొకచో వా రిట్లు వ్రాసిరి:—

"కొన్నిదళములను ప్రత్యేకించి వానిని పరిపూర్ణముగ భారతీయుల యధీనతయం దుంచుటచేతనే కాని శ్వేత సైనికోద్యోగులు భారతీయ సైనికోద్యోగుల క్రింద సేవచేయవలసిన యవసరము తప్పునట్లు నాకు తోచదు"

20. "People here are frightened of ·this talk of Indianisation, and old Officers say, that they won't allow their Sandhurst sons to serve under natives. The only way to begin is to have certain regiments with native Officers only."—Quoted in Legis. tative Assembly Debates, Vol. I, No- 29, p. 1938, Dt. 15-3-29.

21. "To my mind the only solution is to begin by making some cavalry and infantry regiments wholly Indian. This will avoid that difficulty of making white Officers serve under Indian Officers."—Ibid.

కారము క్రిందకు వచ్చుటకు [illegible] క్రమముగ [illegible] పట్టును. దానినిబట్టి మన [illegible] రక్షిల [illegible] సుశిక్షితులు హెచ్చుగ ప్రకాశమానములు కాగలవు.

కాని యిట్టి కారణము లన్నియు కేవలము సాకులు. అష్టదళపద్ధతి ప్రవేశపెట్టుటకుగల నిజమైన కారణములు వేరుగ నున్నవి.

౧౯౧౮-వ సం. ములో కింగు కమిషనులు భారతీయులుకూడ పొందవచ్చునని ప్రకటన గావింపబడినట్లు పైన చెప్పితిని గదా? అప్పటినుండియు భారతీయులు సైనికదళములలో నున్నత పదవులను కొన్నిటిని పొంద నారంభించిరి. దీనిని గాంచి పెక్కుమంది బ్రిటిషు సైనికులును, సైనికోద్యోగులును తాము భారతీయులకు తాబేదారులుగ పనిచేయమనియు, అట్లు చేయుట తమ

రాలిన్‌సను ప్రభువుగారి [illegible] నుండి [illegible] భాగము [illegible] గారి దినచర్య (Diary) [illegible] భారతదేశ [illegible] ద్యోగులు తమ పుత్రులను భారతీయుల ఆజ్ఞానుబద్ధముగ సేవచేయనీయ మనుచున్నారు. కనుక కొన్ని దళములను ప్రత్యేకించి, వానిని భారతీయ సైనికోద్యోగుల వశము నం దుంచుటయే శరణ్యమువలె గన్పట్టుచున్నది."[20]

దానిలోనే మఱియొకచో వా రిట్లు వ్రాసిరి:—

"కొన్ని దళములను ప్రత్యేకించి వానిని పరిపూర్ణముగ భారతీయుల యధీనతయం దుంచుటచేతనే కాని శ్వేత సైనికోద్యోగులు భారతీయ సైనికోద్యోగుల క్రింద సేవచేయవలసిన యవసరము తప్పునట్లు నాకు తోచదు"

20. "People here are frightened of this talk of Indianisation, and old Officers say, that they won't allow their Sandhurst sons to serve under natives. The only way to begin is to have certain regiments with native Officers only."—Quoted in Legislative Assembly Debates, Vol. I, No. 29, p. 1938, Dt. 15-3-29.

21. "To my mind the only solution is to begin by making some cavalry and infantry regiments wholly Indian. This will avoid that difficulty of making white Officers serve under Indian Officers."—Ibid.

దీనినిబట్టి యష్టదళపద్ధతి కేవలము బ్రిటిషుసైనికుల జాత్యహంకారము సంతృప్తిపఱచుటకై ప్రవేశపెట బడినదని నిర్ధారణయగుట లేదా?

ఈయష్టదళపద్ధతియెడ భారతీయులు ప్రారంభమునుండియు తమ తీవ్ర - అసమ్మతిని ప్రకటించిరి. సైన్యములో కూడ నష్టదళపద్ధతిక్రింద ప్రత్యేకింపబడిన దళములను చాల నీచముగ చూచుచుందురట! సిపాయిలు సైన్యములో జేరునపుడు సాధారణముగ నే సుబేదారుపనియో హవల్ దారుపనియో తమకు కాలానుసరణిని లభింపక పోదని భావించుచుందురు. కాని ఈ యెనిమిది దళములలో నట్టి పదవులు లభించుట కవకాశ ముండదు. ఏల యన కింగు కమిషనులు పొందిన భారతీయులకే యట్టి పనులన్నియు పోవుచుండును. అందువలన వాని నందరును ఏవగించుచుందురట. స్కీను కమిటీ ముందు సాక్ష్యమిచ్చిన ప్రతివారును అష్టదళపద్ధతి దేశమునకు శ్రేయోదాయకము గాదు గాన దానిని రద్దు పఱచవలెనని చెప్పిరి. స్కీను కమిటీవారు రికార్డుచేసిన సాక్ష్యము ప్రకటింపబడకపోవుట జగమెరిగిన విషయమే; అట్టియెడ సాక్షు లందరును అష్టదళపద్ధతిని రద్దు చేయమని చెప్పినట్లు నే నేయాధారముపై చెప్పగలనని కొందరు నన్ను ప్రశ్నింపవచ్చును. ఈ విషయమును స్కీనుకమిటీ సభ్యులైన జిన్నాగారే అఖిలభారతశాసన సభాచర్చల సందర్భమున పేర్కొనిరి. అంతకు మించిన ఆధారము కావలెనా? ఇట్లు సాక్షు లందరును ముక్త కంఠముతో గోరుటవలన స్కీను కమిటీవారు దానిని రద్దుచేయుమని సిఫార్సుచేసిరి. కాని ఆసిఫార్సు త్రోసి రాజు చేయబడినది. పైగా కొన్నిదినముల క్రిందనే మఱియొక యష్టదళపద్ధతి ప్రారంభింపబడినదని పత్రికలో ప్రకటింపబడినది!!

ఇది యిట్లుండగా నఖిలభారత శాసనసభలో జరిగిన యాందోళన ఫలితముగ ౧౯౨౫-వ సంవత్సరము జూన్ మాసములో సర్ ఆండ్రూస్కీనుగారి యధ్యక్షత క్రింద సాండుహర్స్టు కమిటీ నియమింపబడెను. ఈకమిటీవారు భారతదేశములో సైనికకళాశాలను స్థాపించుటకు తగు నవకాశము లున్నవా లేవా యను ప్రశ్నను విచారించి తమ నివేదికను ప్రకటింపవలయునని కోరబడిరి. ఆప్రకారమే స్కీనుకమిటీవారు విపులముగ విచారణసలిపినపిదప ౧౯౨౬-వ సంవత్సరము నవంబరు ౧౪-వ తేదీని తమ నివేదికను ప్రకటించిరి. కమిటీలో నాంగ్లేయులు, భారతీయులు, సైనికులు, సివిలియనులు; ప్రభుత్వోద్యోగులు, జాతీయవాదులు—మొదలుగాగల భిన్నభిన్న దృక్పథములు గలవారున్నను. వారందరు నేకగ్రీవముగ భారతదేశమున సైనికకళాశాల నొకదానిని స్థాపించుటకు వలయు నవకాశము లున్నవని వ్రాసిరి. వారు గావించిన ముఖ్య సూచనలు క్రింద పేర్కొనబడుచున్నవి:—

(1) ౧౯౨౮-వ సంవత్సరమున ప్రస్తుతము భారతీయులకు బ్రిటను దేశపు సైనిక కళాశాలలో నొసగబడుచున్న స్థానములను రెట్టింపుచేయవలెను. ఆపిదప నట్టి స్థానములు భారతదేశములో సైనిక కళాశాల స్థాపింపబడు వఱకు కాలానుగుణ్యముగ హెచ్చింపబడు చుండవలెను.

(2) భారతీయులకు సైనికదళములలోని సమస్త శాఖలలోను ప్రవేశము కలుగవలెను.

(3) ౧౯౩౩-వ సంవత్సరమున భారతదేశమున సైనిక కళాశాల ప్రారంభింపబడవలెను. ఆకళాశాలలో నూరుమందికి శిక్షణ గరపుటకు ఏర్పాటు లుండవలెను. శిక్షణ మూడుసంవత్సరములకు మించిగూడదు. కాలక్రమమున కళాశాలను వృద్ధిపఱచవలెను.

(4) సైనిక సమస్యలలో సామ్రాజ్య సంబంధమును సుస్థిరముగ నుంచుటకు భారతదేశములో సైనిక కళాలను స్థాపించిన పిమ్మటగూడ బ్రిటనుదేశపు సైనిక కళాశాలలో భారతీయులకు ౨౦ స్థానములు రిజర్వు చేయవలెను.

ఈ సూచన లన్నియు ఆచరణలోనికి కొనిరాబడినయెడల ౧౯౫౨-వ సం. వచ్చునరికి భారత సైనిక దళముల యుద్యోగులలో సగముమంది భారతీయులు కాగలరని అంచనా వేయబడెను. లార్డు రాలింసనుగారు

నియమించిన కమిటీవారి సూచనలకన్న నివి చాల సంకుచితమైనవి. కాని వీనికూడా వానిగతియే పట్టెను. ఈ రిపోర్టుకూడ చల్లగ బుట్టదాఖలు చేయబడెను. కూడగా తమ కనుకూలముగ లేని నివేదికల నన్నిటిని దాఖలు చేయుటకు ప్రభుత్వము వారివద్ద చాల పెద్దపెద్ద బుట్టలెల్లప్పుడును సిద్ధముగ నున్నట్లున్నవి.

కాని తుట్టతుదకు బ్రిటిషుప్రభుత్వమువారు భారతీయప్రజాభిప్రాయమును పరిపూర్ణముగ త్రోసివేయజాలకపోయిరి. అందువలన రౌండుటేబిలు సభవారిచేత నియమింపబడిన డిఫెన్సు సబ్‌కమిటీసభలో థామస్ మంత్రిగారు భారతదేశమున సైనికకళాశాలను స్థాపించుటకు ప్రభుత్వమువా రంగీకరించిరని ప్రకటన గావింపవలసివచ్చెను. భారతదేశమున సైనికకళాశాలను స్థాపించుట యను మూలమాత్రము నంగీకరించిన పిమ్మట, దాని నాచరణలో బెట్టు విధానమునుగూర్చి విచారించుట కొక కమిటీ యేర్పాటు చేయబడెను. దాని పేరు "భారత సైనికకళాశాల కమిటీ"[22] ఆ కమిటీవారు ౧౯౩౧-వ సం॥ మే ౧౫-వ తేదీని తమ నివేదికను ప్రకటించిరి. దానిలో సభ్యులైన ఆర్గురు భారతీయులను బహుజనాభిప్రాయము కు భిన్నముగ నొక మైనారిటీ రిపోర్టును వ్రాసిరి మొత్తముమీఁదపై సమాహారించిన కమిటీవారి రిపోర్టుకూడ చాల ఆశాభంగకరముగ నున్నది.

రాలిన్‌సను ప్రభువుగారు తమ దినచర్యలో నొక భాగమున సైన్యమును పరిపూర్ణముగ భారతీయులవశము చేయుట, లేదా భారతదేశమును కత్తితో పరిపాలించుట యను రెండుమార్గములే యున్నవనియు, ఈ రెండు తెడ్లపైన రెండుకాళ్లను పెట్టుట మంచిపద్ధతి కాదనియు వ్రాసిరి. వారు సూచించిన పద్ధతి చాల మంచిదని నాయభిప్రాయము, భారతసైన్యనిర్మాణము గావింపదలచుకొన్న, తత్కార్యనిర్వహణకై హృదయపూర్వకముగ పూనుకొనవలెను; లేదా మానుకొనవలెను. కాని ప్రస్తుతము ప్రభుత్వమువారు పై రెండుపద్ధతులలో దేనిని నవలంబించుట లేదు.

దీనికి తార్కాణముగ నొకటి రెండువిషయముల బరికింపుడు. ప్రస్తుతము భారతీయులకు కింగ కమిషను లొసంగబడుచున్నవి. దీనినిబట్టి సహజముగ మన మనుకొనున దేమనగా, వట్లు కింగ కమిషను బడసిన భారతీయులను కింగ కమిషను గల ఆంగ్లేయుల స్థానమున నియమింతురని. కాని యట్లు జరుగుట లేదు. కింగ కమిషను బడసిన భారతీయులు వైస్రాయి కమిషను గల భారతీయులస్థానముకూడ నియమింపబడుచున్నారు. ఈ విధముగ భారతీయులలో భారతీయులకు పోటీపడుచున్నది.[23] ఈపద్ధతి సమంజసమైనదా? అటే విధముగ భారతీయసైనికకళాశాల స్థాపింపబడనున్నను, దానిని సంకుచిత మొనర్ప యత్నములు జరుగుచున్నవి. వీని నన్నిటిని విచారించినప్పుడు, భారతదేశమున కెప్పటికైన స్వరక్షణ గావించుకొనుశక్తి కలుగగలదా యను సందేహము కలుగుచుండును.

---

22. Indian Military College Committee.

23. Vide Legislative Assembly Debates, Vol I, No.28, p p 1, 887-88, Dt. 14-3-1929.

నాగపూజ

(నాగుల చవితి)



చిత్రకారుడు: వై. సుబ్బారావు, రాజమండ్రి

తేయాకు

కాంచనపల్లి వెంకటరంగారావుగారు

ప్రశస్తతరములగు పానీయములలో తేయాకు ఒకటిగా ఎన్నబడుచు, సుమారు భూభాగమంతటి యందునను గల జనసంఖ్యలో సగముమందిచే త్రాగబడుచున్నది. తేయాకుమొక్కలను యథేచ్ఛగా పెరుగనిచ్చినచో, సుమారు ౩౦ మొదలు ౪౦ అడుగుల వరకు పెరుగును. ఒక్కొక్క వత్సరములోపున మూడు అడుగులవరకు పెరిగి పెద్ద పొదవలె కాన్పించుచు మరి సజ్జ వృక్షములా యని భ్రమగొల్పుచుండును. తరచుగా వర్షములు కురియు ప్రదేశములందును, సమశీతోష్ణప్రదేశములయందును తేయాకుపంట విరివిగా పండును. అట్టి స్థలములలోనే తేయాకుపంట బలిష్ఠముగాను విశేషముగాను ఉండును. నీరు త్వరలో ఇంకు నల్లనేలయందు తేయాకు అతి త్వరితముగాను, పుష్టిమంతముగాను పెరుగును.

సామాన్యముగా ఇండియాయందలి యుష్ణ మైదానములన్నియు మెరక నేలనే విస్తారముగా పండుచుండును. చైనాదేశములో ఒక వెయ్యిసంవత్సరముల క్రిందట ఈ తేయాకుమొక్కలు ఎంతకును పెరగక పచ్చగాను, గుబురుగాను ౩ మొదలు ౫ అడుగులవరకు పెరుగుచుండి కత్తిరించుచు తోటను మొక్కలవలె చూచుచుండిరి. చైనాయందు ఈ తేయాకుపంట విపరీతముగా ఉండి అన్ని కాలములయందును ఉపయోగకారిగా నుండును. అస్సాములో ఈ యుత్పత్తి జాస్తి. అచ్చట చెట్టును అడవులక్రిందగల చిత్తడినేల (Marshy Places) యందు ౧౨ మొదలు ౧౫ అడుగులవరకు పెరుగును. హిందూదేశములో ఈ పంట అస్సాము, డెహ్రాడూను, కుమాయూను, డార్జిలింగు, కచ్చారు, కాంగ్రా, చిట్టగాంగు, తిరాయు, నీలగిరి, మొదలగు స్థలములలో విరివిగా ఉత్పత్తి యగుచున్నది.

ఏకాలమునందును, నూతనముగా తెలుపడిన ప్రతి విషయమునకును దేశములందు కొందరిమందిచే ప్రప్రథమమున అవరోధము కలిగింపబడి విరివిగను ప్రచారము జరుగబడకుండుటను మనము చూచుచునే యున్నాము. అటులనే యీ తేయాకు పానీయమునకు పరీక్షము మొదట్లో వైద్యులవల్లను మతప్రచారకులవల్లను, ఇది యొక దురభ్యాసమనియు, ఇది మత్తుపదార్థము గనుక నిషేధమనియు ఖండింపబడెను. కాని కాలక్రమమున ఇది త్రాగువారి సంఖ్య దినదినాభివృద్ధి నొంది, ప్రస్తుతము యావత్ ప్రపంచమునందును, అది త్రాగని వారు నాగరికులుగా పరిగణింపబడనంతటి ప్రచారము గల్గి, దుస్థితి కొనితెచ్చినది. ఆంగ్లేయులు ౧౭ వ శతాబ్దమధ్యమునుండియే యిది త్రాగు నాచారము ప్రారంభించిరి.

ప్రస్తుతము ఎగుమతి చేయబడుచున్న యీ తేయాకు మూడు రకములు. ౧. నల్లపురంగు (Black Tea) ౨. ఆకుపచ్చ రంగు (Green Tea) ౩. ఇటికరంగు తేయాకు (Brick Tea). నల్లపురంగు తేయాకునుండి పికో (Pekoe) ఆరంజి పికో (Orange Pekoe), సౌచాంగ్ (Souchong), పికో సౌచాంగ్ (Pekoe Souchong) అను నాలుగు విధములుగ తేయాకు తయారుచేయబడుచున్నది. ఆకుపచ్చని తేయాకు అనునది, చెట్టుయొక్క విశేషము ముదురని – అతిలేత గాని – యీ మధ్యరకపు ఆకునుండి తయారగుచున్నది. ఇందు విశేషముగా టానిక్ ఏసిడ్ (Tannic Acid), ఆల్కలాయిడ్ (Alkaloid) మిశ్రమమై యుండును. ఇటికరంగు తేయాకులో (Brick Tea) మధ్య-ఏషియాలో కొన్ని జాతుల వారు పాలు, ఉప్పు, వెన్న కలిపి యొకవిధమగు కూరగా తయారుచేసి భుజింతురు.

తేయాకు సిలోను దేశపు ముఖ్యపంట. అచ్చట నుండి ప్రథమమున ౧౮౩౯-వ సం. లో రూ. ౨౮౦ లు విలువగల ౨౩ పౌనుల తేయాకు ఎగుమతిచేయబడెను. ౧౯౧౮-వ సంవత్సరాంతమునకు ఇది కడు విచిత్ర ప్రచారము గలదై, ౨౩, ౧౨౨, ౧౬౩ పౌనులు ౧౬౪, ౩౫, ౬౧౮ రూపాయల ఖరీదుకు ఎగుమతి జరి

గెను. ౧౮౮౯ అఖరుకు ౨౫, ౧౫, ౨౨, ౬౧.౭ రూపాయల విలువగల తేయాకు పౌను ౧-కి ఒక రూపాయి చొప్పున ఎగుమతిచేయబడెను. సుమారుగా ౪, ౭౪, ౦౦౦ యెకరముల ప్రదేశము ఈతేయాకు పంటక్రింద సుమారు ౬, ౮౦, ౦౦౦ కూలీలచేత సాగు చేయింపబడుచుండెను. కడచిన ఈ ౨౦-వ శతాబ్దములో తేయాకుపంటయందు అభివృద్ధి మిక్కుటమై, తక్కువ కాలములో విశేషపరిశ్రమ లేకయే, కొలదిమంది కూలీలచే మిక్కుటమగు పంట పండించుట కనువగుమార్గములు అనేకములు కనిపెట్టబడెను. ప్రశస్తమగు తేయాకు కావలయు నన్న, ముందు సిలోన్ టీ (Cylon Tea) చెప్పి తర్వాత మరొకటి చెప్పవలయును. దానియొక్క సుగుణములు తేనీటి అభిలాషులందరిచేతను ఘనముగా కొనియాడబడుచుండెను. ప్రస్తుతము కల్తీలేని సిలోన్-టీ కావలయు నన్న అది లభించుట బహు దుర్ఘటముగా నున్నది. తక్కువరకపు తేయాకులను విలువగలవాటినిగా నొనరించుటకు ఈ సిలోన్-టీ తెచ్చి మిశ్రమము చేయుచుందురు.

సగటు సం. మునకు యావత్ భూభాగ మందును ౨ వేల మిలియను పౌనుల తేయాకు ఖర్చుచేయబడుచున్నది. అనేకమంది దేశ విదేశ కవిపుంగవులు దీని ఘనతను కొనియాడియుండిరి. దీనియందు పాలు పంచదార కలియుటచే శరీరమునకు పుష్టి సహితము కలిగించును. ప్రశస్తమగు తేయాకుతో తయారుచేయబడిన టీనీరు ఒక గ్రుక్కెడు త్రాగినచో ఆకీసుబడలిక, చీకాకు, గలవారికి ఆ బాధలు తొలగును. కర్మాగారములయందు పనిచేయు కార్మికులకు ఇది వెంటనే శరీరమును ఆయాసమునుండి తప్పించి కులాసా కలుగజేయును. తత్వవేత్తలచే ఇది అతిగా కొనియాడబడెను. డాక్టరు శామ్యుయెల్ జాన్సన్ అనువతడు తేయాకు త్రాగుట నందు అతిప్రియుడై, పొయ్యిమీదనుండి కెటిల్ దింపకుండ అర గంటలు నీళ్లు ఇందుకొరకై మరుగనిచ్చెడి వాడు. ప్రతిపదార్థమునందును ఇది కలిపి పుచ్చుకొనునంతటి ఆసక్తి గలవాడై యుండెడువాడు. సిగరెట్లు అహర్నిశము రెండు వేళ్లమధ్యను ఉంచుకొనుట కొందరి కెంత గౌరవప్రదమో వీరికి అనుక్షణము టీ త్రాగుట అంత ఆచార మైపోయెను. మితి మీరి త్రాగినచో జీర్ణకోశముల శక్తి తగ్గించి అజీర్ణమును కలిగించును. గుండెదడ, నిస్సత్తువ, నరములపటుత్వము సన్నగిల్లుట, నిద్ర లేకపోవుట, చేతులు వణుకుట, కొంకరలు, మొదలగు అనారోగ్యములకు కారణ మగును. ఆహారముతో కలిపి గాని, భోజనానంతరము వెంటనే గాని టీ త్రాగరాదు. అట్లు త్రాగినచో జీర్ణము కానున్న పదార్థములకు అవరోధము గల్గించును. ఈవిషయము తేనీరు త్రాగువారు గుర్తింతురుగాక !

ఈ త్రాగుటనుండి ఆరోగ్యము చెడకుండుటకై శుభ్రముగా తయారుచేయబడిన ఖరీదుగల తేయాకునే వాడవలసియుండును. తేయాకుగుండ (Tea dust) కన్న తేయాకు (Tea leaf) వాడుట శ్రేయస్కరము. సామాన్యముగ కల్తీలేని తేయాకు దొరుకుట దుర్లభము. హిందూదేశములో చైనా, సిలోన్ తేయాకులకే యెక్కువ ప్రచారము గలదు. ఈ రెండింటియందును సిలోను తేయాకు ప్రశస్తమని వేర చెప్ప బని లేదు. త్రాగుటమూలమున ఆరోగ్యము భంగముకాకుండుటకై యిది తయారుచేయునప్పుడు శ్రద్ధబూని జాగ్రత్తతో చేయవలెను.

నీళ్లు బుడగలు వచ్చునంతవరకు మరగబెట్టి అనంతరము ఆ నీటికి తగినంత తేయాకు (Leaf) గాని, లేకగుండ (Dust) గాని వేసి కలిపి, మూడునిమిషముల కన్న హెచ్చుకాలము ఉంచరాదు. ఇంతకు మించి హెచ్చుకాలము, హెచ్చు డికాక్షను దిగువను భ్రమతో వడగట్టక యుంచినచో జీర్ణకోశముల శక్తిని అట్టి డికాక్షనుతో తయారుచేయబడిన టీ అణచివేయుటయే గాక, ఆకలి నణచివైచి, బద్ధకము కలిగించి, మలబద్ధకమునకు మూలమై, క్రమేపి తత్సంబంధమగు రోగములకు దోహదమగును. శుభ్రతతోను, జాగ్రత్తగాను, సరియగు పద్ధతుల తయారుచేసిన తేనీటిని ఒకగ్రుక్కెడు ఉదయ సాయంత్రములు త్రాగినచో, వెంటనే యెంతటి ఆయాసము, నీరసము, దుర్బలత్వము, బద్ధకము నైన నణచివైచి వెంటనే చాల చురుకుతనము గల్గించును.

ఆంధ్రదేశమునందలి ప్రాచీన విషయములలో నతవాటి యొకటి. నేటికృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాయు, దానిప్రాంతముననున్న నిజామురాష్ట్రము లోని మధిర తాలూకాయు నాడు నతవాటిసీమగ వ్యవహరింపబడెను. పండ్రెండవ పదమూడవ శతాబ్దములందు చాగివంశజులు మొదట గుడిమెట్టయు, పిదప బెజవాడయు రాజధానులుగ నీనతవాటి విషయమును పరిపాలించిరి.

శాసనములందు 'చాగి' పదము 'సాగి', 'త్యాగి' రూపముల గూడ గనబడుచున్నది. త్యాగిశబ్దభవమే చాగి కావచ్చును. 'సాగి' పదము 'చాగి' రూపాంతరము. చాగివారు మొదట 'విప్పర్ల' వంశజు లనుటకు శాసన, గ్రంథ[2] ఆధారము కలదు.

చాగివారు క్షత్రియులా?

చాగివారు క్షత్రియులలోను[3], చతుర్థాన్వయుల లోను[4] ఉండుటచేత నతవాటి విషయాధీశ్వరు లగు చాగివారు క్షత్రియులా లేక చతుర్థాన్వయులా యను సమస్య కలుగుచున్నది.

1. ఈవ్యాసమును ప్రారంభింపకముందు ఇందు సూచింపబడిన కొన్నిశాసనములకు నకళ్లొసంగిన మద్రాసు ఆర్కి శాఖాధికారులకు నాకృతజ్ఞత సూచింపవలసియున్నది.

2. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నున్న వెలుగోటివారి వంశావళి యను నముద్రితగ్రంథమున సాగిపైచన యిట్లభివర్ణింపబడినాడు :

"మును విప్పర్లకులాధిపుల్ బిరుదులే మోమోటలే కాని పెం
పున పెంపాలర మానసం బలర యేపారం చెరల్ బెట్టి నా
వనఘా! గన్నయ సాగిపైచ! పటుబాహాశక్తి వెల్లంకి మా
దని యారాముని బట్టి కాచితి మహోద్దామ ప్రతాపోన్నతిన్."—Ms. No. 15-5-32.
(యథామాతృకము)

మరియు అనుమంచిపల్లిశాసనము (No. 283 of 1924) ఇట్లు చెప్పుచున్నది :

"...బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్ర విధయా వర్ణాశ్చతుర్థాక్రమాత్.
తత్రాస్తి బాహుజకులాభరణం తపోభి ర్విప్పర్లవంశ ఇతి విప్రకరోపమానాత్."

ఈ విప్పర్లవంశమునకు చాగిమన్మగణపతి చెందినవాడని తరువాత వర్ణింపబడెను.

3. చాగివారు క్షత్రియు లని శా. శ. ౧౧౧౦ నాటి నెల్లూరుజిల్లా ఒంగోలుతాలూకా నన్నూరుశాసనము (O. No. 92.) ఇట్లు తెలుపుచున్నది:

"స్వస్తిశ్రీ సూర్యవంశబునేంటి చాగి వెంకనకొడుకు బల్లిరాజు."

4. చాగివారు విష్ణుపాదపద్మమున జన్మించిన చతుర్థాన్వయు లని వినుకొండశాసనము (No. 527 of 1913) ఇట్లు తెలుపుచున్నది:

"శ్రీ లక్ష్మీపతి పాదపద్మజనితో వర్ణాశ్చతుర్థాభవ
త్తస్మిన్నన్నమనాయకః సమజని శ్రీసాగివంశోద్భవః —(Mack. Mss. 15. 6. 21.)

ఏమను లక్ష్మణకవి విరచిత మను రామవిలాసమున చాగివారు సూర్యాన్వయులని[5] వర్ణింపబడినది. నతివాటి విషయాధీశ్వరులలో గడగొట్టువాడను మన్మ చాగిగణపతిఅనుమంచిపల్లెశాసనమునందు చాగివారు బాహుజ కులాభరణులనియు, విప్పర్లవంశజులనియు[6] వర్ణింపబడెను. తదితరశాసనములం దెచ్చటను క్షత్రియ ప్రశంసలేక దుర్జయాన్వయులని మాత్రము చెప్పబడియున్నది. అమరావతిశాసనములో[7] చాగిపోతరాజు తమ్ముడగు కల్లయనాయకుడు బ్రహ్మపాదములం దుద్భవించిన దుర్జయవంశసంజాతు డగు ముచ్చయనాయకుని కుమార్తెయగు చెరువమ్మను పరిణయమాడినట్లు చెప్పబడియుండుటచే దుర్జయాన్వయులు శూద్రులనియే చెప్పవలసియుండును. దుర్జయాన్వయ మొకవంశము కాక యొక వర్ణమనియే యెంచవలసియుండును. దుర్జయవంశజుడగు కల్లయనాయకుడు దుర్జయవంశజు డగు ముచ్చయకుమార్తెను వివాహమాడుట, దుర్జయాన్వయ మొకవర్ణమనియే చెప్పుచున్నది.

చాగివారివలె దుర్జయాన్వయులమని చెప్పుకొనినవారు పలువురు గలరు. దుర్జయాన్వయులగు కొండపడమటి సీమరాజులు తాము చతుర్థాన్వయులమనియే తమ శాసనములలో జెప్పుకొనిరి. శాసనములందు దుర్జయకులజులమని చెప్పుకొనిన కాకతీయులును చతుర్థాన్వయులుగనే తెలియవచ్చెదరు[9]. కాని దుర్జయకులజుడగు కాకతీయ గణపతిచక్రవర్తి చోళులను జయించిన పిమ్మట క్షత్రియుడనని ప్రకటించుకొనినప్పుడు, సమకాలికుడును, ఏకవంశస్థుడును నగు మన్మ చాగి గణపతికూడ తాను క్షత్రియుడనని చెప్పుకొనుటలో ఆశ్చర్యములేదు. కాకతీయులు, చాగివారు తాము క్షత్రియులమని తెలుపుకొనిన శాసనములు ఒకేకాలమునాటివి[10]. చాగివంశమున ప్రఖ్యాతపురుషులగు పోతరాజు దోరభూపుల శాసనములలో లేని క్షత్రియవంశసూచన సామాన్యుడగు మన్మ చాగి గణపయశాసనములో నుండుట కిదియే కారణము. కావున చాగివారు చతుర్థాన్వయు లనియే నిర్ణయింపదగును.

---

5. శ్రీవిష్ణు నాభి రాజీవ మధ్యంబునఁ బ్రభవించె విశ్వనిర్మాత ధాత
యంభోజభవునకు సంభవించె మరీచి యతనికిఁ గశ్యపుఁ డవతరించెఁ
గశ్యపబ్రహ్మకుఁ గలిగె బ్రహ్మాండదీపకుఁడు త్రయీమూర్తి భాస్కరుండు
వనజమిత్రునకు వైవస్వతుం డుదయించె ఘనుఁడు వైవస్వతమనువుఁ గాంచె
దక్షు నిక్ష్వాకునృపునిఁ దద్వంశమునను-దగఁ గకుత్స్థుండు రఘువును దశరథుండు
జనన మొందిరి యాదశస్యందనునకు-రాముఁడు జనించెఁ ద్రిభువన రక్షకుండు.

వ. ఏతాదృశ మహాపురుష భూషితంబైన సూర్యాన్వయంబు సాగి వంశంబునం గ్రమంబుగఁ బ్రసిద్ధంబయ్యె.

6. Ins. No. 283 of 1924.

7. „ „ 271 of 1897.

"శ్రీపతిః...శ్రీవత్స సల్లక్షణం
తన్నాభ్యుద్భవ నీరజాతవిలస ల్లోకైకకర్తా విధి
స్తత్పాదాంబుజ సంభవం కులమిదం శ్రీ దుర్జయానా మభూత్.
తద్వంశజాత స్సకలార్థికర్ణః శ్రీముచ్చనాఖ్యః కులవార్ధిచంద్రః."

8. నాదెండ్ల శాసనము (No. 227 of 1892).

9. వడ్డమాను శాసనము.

10. కాకతీయులు క్షత్రియులని తెలుపు మల్కాపురశాసనకాలము శా. శ. ౧౧౮౩. చాగివారు క్షత్రియులని తెలుపు అనుమంచిపల్లె శాసనకాలము శా. శ. ౧౧౮౨. అందుచే పైవాదము బలీయమగుచున్నది.

వంశావళి

ముక్త్యాలశాసనము[11] ననుసరించి మన కీక్రింది వంశావళి యెదురుపడుచున్నది.

దుర్జయుడు
|
ముప్ప
|
దోర
|
పోత=రాజాంబిక
|
చాగి అను దోర
|
పోత

బెజవాడలోని యొకశాసనమున[12] చాగివంశానుక్రమ మీవిధముగ నీయబడినది.

అరయుడు
|
దోరరాజు
|
పోతరాజు
|
చాగిరాజు
|
నరసింహవర్ధనపోతరాజు

అరయడే ముప్పడనుటకు ముక్త్యాలశాసనమే ప్రమాణము[13]. అందుచే పైరెండు శాసనములలోని వంశావళియు సరిపోవుచున్నది. చాగి దోరభూపతి భార్యపేరు చిమ్మాంబిక[14]. అమరావతి[15], బెజవాడ[16] శాసనముల ననుసరించిచూడ దోరయకు కల్లయనాయకుడని, భీముడని యిరువురు కుమారులు కలరని తెలియుచున్నది. వీరిలో కల్లయ దుర్జయకులజుడగు ముచ్చయకు జక్కాంబికవలన కలిగిన చెఱువమ్మను పరిణయమాడెను. దోరయభీమునికి దోరడు, అతనికి పోతడు అనుకుమారులు కలిగిరి. పూర్వోక్తశాసనముల పరిశీలనమువలన ఈక్రింది రీతిని చాగివారి వంశానుక్రమము నేర్పఱుపవచ్చును.

దుర్జయుడు ⋮ ముప్పరాజను అరయ
|
దోర=చిమ్మాంబిక
|
మొదటిపోత=రాజాంబిక — చాగిరాజను దోర — (రెండవ) నరసింహవర్ధనపోత
భీమ — దోర — పోత
కల్లయ నాయక = చెఱువమ్మ

దుర్జయకులము ⋮ ముచ్చయ=జక్కాంబిక
|
చెఱువమ్మ


పోతవరం ఫకీరు తక్యావద్దనున్న శాసనము[17]ననుసరించి మొదటి పోతరాజునకు ప్రోలమదేవి యను నొక కుమార్తె కలదనియు, ఆబిడభర్త పేరు దుర్గరాజనియు మనకు తెలియుచున్నది.

వేదాద్రిలోని చాగి మన్మగణపతి శాసనమున[18] దోరమహీపతికి గణపతియు, గణపతికి చాగిమన్మమహీ

11. Ins. No. 300 of 1924.
12. „ „ 335 of 1892.
13. పూర్తి వివరములకు సమదర్శిని ప్రజోత్పత్తి యుగాదిసంచికలోని నా 'అరయడు — విప్పర్లవారు' అనువ్యాసమును జదువ గోరెదను.
14. Ins. No. 313 of 1924.
15. „ „ 271 of 1897.
16. „ „ 294 of 1892.
17. Elliot collection, Vol. II, p. 10.
18. Ins. No. 309 of 1924.

పతియు కుమారులని తెలుపబడినది. అనుమంచిపల్లె శాసన[19] మీావిషయమును ధ్రువపరచుచు విప్పర్లపోత నకు దోరభూపతియు, దోరయకు ముప్పాంబికవలన గణపతియు, గణపతికి దివ్యాంబికవలన మన్మచాగిగణపతియు, మన్మచాగిగణపతికి పోతడును కుమారు లని చెప్పుచున్నది. మునగాలపల్లెశాసనము[20] చాగిరాజునకు భీమరాజును, భీమరాజునకు పార్వతీదేవివలన మనుమ చాగిరాజును కుమారులని తెలుపబడినది. దీని ననుసరించి చాగివారి వంశావళి యీ క్రిందివిధముగా దేలుచున్నది.

చాగివారి వంశవృక్షము



వంశ చరిత్ర

చాగివారిలో చారిత్రక పురుషుడుగ పేర్కొనబడిన ముప్పభూపతి మొదటివాడు. ఇతడు మహాయోధుడగుటవలన రాజేంద్రచోడుని యాదరణమునకు పాత్రుడై రాజ చిహ్నములగు ఢాలే, భేరి, శంఖము, ఆనకము, కాహళి యను పంచమహాశబ్దములను, అరయతాపట్టకమును బొందెను[21]. మరియు నితడు రాజలాంఛనములగు స్వర్ణమయమగు పల్లకియు, నక్షత్రయుతాంబరమును బోలిన యుల్లెడయు, పూర్ణేందు శుభ్రమగుఛత్రమును, చంద్రుని హసించు హేమదండముగల చామరమును కలిగియుండెను.

మొదటి దోరభూపతి

కాని కొన్ని శాసనములు[22] ఈమర్యాదలు ముప్పభూపతికుమారు డగు దోరభూపతి పొందెనని తెలుపుచున్నవి. ఈ శాసనములు దోరభూపతికి తరువాత పది సంవత్సరములనాటి వగుటచేతను, అం దొకటి యతని కుమారుడగు కల్లయనాయకునిది, రెండవది యతని జ్యేష్ఠ కుమారుడగు పోతభూపుని ప్రధానియగు కవిలియసింగన పెగ్గడది యగుటచేతను దోరభూపతియే రాజేంద్ర చోడుని యాదరణకు గురియై సామంతపదవిని బొందినాడని విశ్వసింపవచ్చును; లేదా, తండ్రి బిరుదము కుమారుడు ధరించి తండ్రివలెనే శాసనముల గీర్తింపబడి యుండవచ్చును.

మొదటి పోతరాజు

దోరభూపతి తరువాత 'త్యాగ సత్య శౌర్యాది గుణమణివిభూషితు'డగు[23] పోతరాజు రాజ్యమునకు వచ్చెను. గుడిమెట్ట రాజధానీనగరముగ[24] నితడు నతవాటిసీమను పరిపాలించెను. ద్విజుడును, మోప. గోత్రజుడును, మల్ల నామాత్యుని తనయుడును నగు కవి

19. Ins. No. 283 of 1924.
20. " " 259 of 1924.
21. " " 313 of 1924.
22. " Nos. 253 & 271 of 1897.
23. " No. 335 of 1892.
24. " " 313 of 1924.

లియు సింగన ప్రెగ్గడ యితనికి సచివో_త్తముడు[25]. శ్రీశైల సందీపితదీపయుగ్మముగల కల్లయనాయకు డితనికి సోదరుడు[26]. ఇతనికి ప్రోలమదేవి యను నొక కుమా_ర్తె గలదు. ఆమెభ_ర్త పేరు దుర్గరాజు[27].

పోతరాజు తన ప్రధాననగర మను గుడిమెట్టలో విశ్వేశ్వరాలయము కట్టించెను[28].

ఏమను లక్ష్మణకవి ప్రణీతమగు రామవిలాసము సాగి పోతరాజు మనుమడును, నరసింహరాజు కుమారుడును నగు మన్మపోతరాజు

"స్థిరథ_క్తిగ గుడిమెట్టలోపల బ్రతిష్ఠించె గృపాసింధుబం,ధురసౌధంబున విశ్వనాథు........." నని నుతించినది[29].

గుడిమెట్టశాసనము ప్రకారము విశ్వేశ్వరాలయము కట్టించినది మొదటిపోతరాజు; రామవిలాసము ప్రకారము నరసింహునికుమారుడు మనుమపోతడు, అనగా రెండవపోతరాజు. కాని యిది సత్యము కాదు. రామవిలాసము నుడువునట్లు నరసింహుని కుమారుడు పోతరాజని యూహించుటకు శాసనాధార మేదియు లేదు. 'నరసింహవర్ధను' డనునది రెండవ పోతరాజునకు బిరుదవాచకము. ఈరెండవపోతరాజు '[శ్రీ]యోగానంద నరసింహదేవదివ్య శ్రీపాదపద్మారాధకు'డని, 'శ్రీనరసింహవర్ధన స్త్యాగి పోతధరణీపతి' యని బెజవాడ శాసనములో[30] పేర్కొనబడినాడు. శ్రీనరసింహదేవ దివ్యశ్రీపాదపద్మారాధకుడగుటవలననే యితనికి నరసింహవర్ధనుడనుబిరుదము కలిగెను[31]. కావున నరసింహవర్ధన చాగిపోతరాజన నర

---

25. Ins. No. 253 of 1897. వీరు చాగివారికి వంశపరంపరగా వచ్చుచున్న మంత్రులు.

26. „ „ 271 of 1897.

"...సోయం సముద్భాహిత విప్రవర్గః శ్రీశైల సందీపితదీపయుగ్మః,
విధాన సంపాదితపూర్తధర్మః స్వర్ణావసంతోషిత యాచకౌఘః..."

27. Elliot Collection, Vol. II, p. 10:

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౦౭౯ అగు నేటి......శ్రీమన్మహామండలేశ్వర పోతరాజుల కూతురు ప్రోలమదేవులు తనపురుషుండు దుగ్గరాజునకు ధర్మార్థముగా నొక దీపమునకు......"

28. Ins. No. 313 of 1924:

"శ్రీ కృష్ణవేణ్ణాతట భూమిభాగే శ్రీ పోతభూపో గుడిమెట్ట నామ్ని,
విశ్వేశ్వరాఖ్యం శివ మాదిదేవం సంస్థాపయామాస పురే స్వకీయే."

29. ఈవిషయము సుప్రసిద్ధ చరిత్రకారులగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు తమ ఆంధ్రులచరిత్రయం దిట్లు చర్చించుచున్నారు:

"రామవిలాసములోని నరసింహపోతరాజును గుడిమెట్ట శాసనములోని దోరపరాజు పోతరాజును నొక్కడేయని చెప్పదగును. అట్లయినయెడల దోరపరాజునకు నరసింహరాజను నామాంతరము కలదని యూహింపవలయును. ఇంతియగాక బెజవాడ కనకదుర్గాంబయొక్కయాలయములో శ్రీనరసింహవర్ధన చాగి పోతరాజు పేరిట నొకశాసనము గలదు. అయ్యది నరసింహునికుమారు డైన చాగిపోతరాజు శాసన మని తెలుపుచున్నది."

కాని యిది పొరపాటు. పైనిచేసిన చర్చ ననుసరించి నరసింహరాజు పోతరాజు తండ్రి కాడనియు, దోరపరాజునకు నరసింహరాజను నామాంతర మున్నదనుకొనుట పొరపాటనియు తేలుచున్నది.

30. Ins. No. 335 of 1892.

31. ఇటులనే జుజ్జూరు శాసనమునను (Ins. No. 326 of 1924) చెప్పబడియున్నది. మరియు నరసింహదేవ దివ్య శ్రీపాదపద్మారాధకు డనుట సింహాచల శ్రీనరసింహునకు చాగిపోతసముద్రం బను చెరువును త్రవ్వించెనను విషయము (Ins. No. 301 of 1924) ధ్రువపరచుచున్నది. అంతియకాక యీ 'నరసింహవర్ధను' యను పదము రెండవపోతరాజునకు పిమ్మట రాజ్యమునకు వచ్చినగణపతియు తననామమునకు జోడించుకొనుటవలన (Ins. No. 234 of 1905) అది బిరుదవాచకమని చెప్పకయే చెప్పచున్నది.

సింహునికుమారుడగు చాగిపోతరాజని యనుకొనుట ప్రమాదము. రామవిలాసము చాగివారి పరిపాలనమునకు చాలకాలమునకు పిమ్మట వ్రాయబడిన దగుటచే నెందటి పోతరాజు కృత్యములను రెండవ పోతరాజునెడకు జుట్టినది.

పోతరాజు చావునకొక విచిత్రకథ జనశ్రుతియా పకముగ నున్నది. వేములవాడ భీమకవి యొకప్పుడు పోతరాజు ప్రధాన నగరమగు గుడిమెట్టకు వెళ్లెనట. సాగి పోతరా జాతని గుఱ్ఱమును తన సాహిణమున గట్టి పెట్టించి యాతడు వేడినను గుఱ్ఱమును వదలలేదట. అందుపై భీమకవి కోపించి యీ విధమున శపించెనని యొక పద్యము ప్రచారమున నున్నది:

"చ. హయ మది సీత, పోతవసు
ధాధిపుఁ డారయ రావణుండు, ని
శ్చయముగ నేను రాఘవుఁడ,
సహ్యజ వారిధి, మారుఁ డంజనా
ప్రియ తనయుండు, లచ్చన వి
భీమణుఁ, డా గుడిమెట్ట లంక, నా
జయమును బోత రక్కసుని
చావును నేడవనాఁడు చూడుఁడీ!"[32]

కవిశాపదగ్ధుడై పోతరాజు మరణించెనట!

ఈ కట్టుకథ నమ్ముటకు వీలు లేకుండ నున్నది. ఈ పద్యము రెల్లూరి తిరుమలయ్యదని అప్పకవి చెప్పుచున్నాడు. ఈ పోతరాజు సాగిపోతరాజు కాడనియు, లేబవరపు పోతరాజనియు, అతనిగూర్చి తురగా రామకవి చెప్పిన పద్యమనియు వేరొక వాదము గలదు[33]. చాగి పోతరాజును, భీమకవియు సమకాలికులయినను ఈ భిన్నవాదముల మధ్య నేది నిజమో నిర్ణయించుట కష్టముగా నున్నది.

పోతరాజు - పల్నాటి యుద్ధము

పోతరాజు పల్నాటియుద్ధమునకు వచ్చినట్లు శ్రీనాథ విరచితమగు పల్నాటి వీరచరిత్రమున[34] నిట్లు తెలుపబడినది:

"సాగి పోతమరాజు సత్యాళ్ళ పెగడ
గుండమదేవుడు గొబ్బూరిరాజు
మొదలయినవారలు ముఖ్యులౌ బంట్లు
రేనూరుతో గూడి సెనుబదిమీద
నెనిమిదివేలతో సేతెంచి రపుడు."

సుప్రసిద్ధ చరిత్రకారులెల్లరు[35] పల్నాటి యుద్ధము ౧౦౯౮ - ౧౧౦౪ శాలివాహన శకవత్సరములలో జరిగియుండునని చెప్పుచున్నారు. పోతరాజు కుమారుడగు రెండవదోరభూపుని శాసనములు శా. శ. ౧౧౧౪ వరకును[36], అతనికుమారుడగు రెండవ పోతరాజు శాసనములు శా. శ. ౧౧౧౯ నుండియు[37] కనబడుచున్నవి. అందుచే రెండవదోరభూపతి శా. శ. ౧౧౧౪, ౧౧౧౯ ల నడుమ కాలధర్మము నొందియుండును కావున నతడు రమారమి ౧౧౧౯ వరకు రాజ్యమేలెనని నిశ్చయింపవచ్చును. ఇతడు బెజవాడ నగరమున పదునయిదు సంవ

32. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'చాటుపద్య మణిమంజరి' నుండి.

33. వీరేశలింగం పంతులుగారి కవిజీవితములు, శ్రీరామమూర్తిగారి ఆంధ్రకవులచరిత్రయు చూడనగు.

34. మద్రాసు ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారములోని యముద్రిత ప్రతి (No. 12-2-34) ననుసరించి.

35. అక్కిరాజు ఉమాకాన్తముగారు పల్నాటియుద్ధకాలము శా. శ. ౧౦౯౫ - ౧౧౦౪ లోపల నని నిర్ణయించుచున్నారు. (పల్నాటి వీరచరిత్రము-పీఠిక).

భావరాజు కృష్ణరావుపంతులుగారు, చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు శా. శ. ౧౦౯౮ - ౧౧౦౪ లోపలనని తెలియబరచుచున్నారు.

36. Elliot Collection, Vol. I, p. 466: బెజవాడశాసనము.

37. S. I. I. Vol. IV, No. 795.

త్సరములు రాజ్యమేలెనని తెలియుటచే[38] రాజ్యారంభము శా. శ. ౧౧౦౩ లేక ౧౧౦౮ లో అయి యుండును; అనగా పల్నాటి యుద్ధానంతరము రెండవదోరభూపుని పరిపాలనము ప్రారంభమయినది. పోతభూపుడు పల్నాటియుద్ధమునకు వెళ్లుటయు, యుద్ధానంతరమతని కుమారుడగు రెండవదోరభూపుని రాజ్యపాలనము ప్రారంభింపబడుటయు జూడ, పోతభూపతి యొకవేళ పల్నాటియుద్ధమున మరణించెనేమోయని యోచింపవలసి యున్నది.

రెండవ దోరభూపతి

పోతరాజునకు పిమ్మట చాగిరాజను నామాంతరముగల[39] రెండవ దోరభూపతి రాజ్యమునకు వచ్చెను. ఇతడు తన ప్రధాననగరమును గుడిమెట్టనుండి బెజవాడకు మార్చెను[40]. పదునయిదు వత్సరములు రాజ్యమేలెను. రాజ్యమునకు రాకపూర్వమే తండ్రిచే గుడిమెట్టలో ప్రతిష్ఠింపబడిన విశ్వేశ్వరునకు, దాసీజనమునకు, తదితర స్వామిసేవకులకు మాన్యములొసగెను[41]. ఇతనికి పోతరాజను తనయుడేగాక, గణపతి[42], భీమరాజు[43] అను కుమారులు కలరు.

రెండవ పోతరాజు

దోరభూపతికి పిమ్మట అతని కుమారుడగు పోతరాజు రాజ్యమునకు వచ్చి బెజవాడ ప్రధాననగరముగ[44] నతవాటిసీమను పరిపాలించెను. ఇతని శాసనములు శా. శ. ౧౧౧౯ మొదలు శా. శ. ౧౧౫౭ వరకు కన బడుచున్నవి. ఇతడు పెక్కు ధర్మకార్యము లొనర్చెను. ముక్తీశ్వరమహాదేవరకు గుడి కట్టించెను. త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర విశ్వనాథ చోడనారాయణ దేవాలయములకు గనకకలశముల బెట్టించెను. సింహాచల శ్రీ నరసింహునకు 'చాగిపోత సముద్రం' బను చెరువు త్రవ్వించి నరసింహవర్ధన త్యాగిపోతరాజను కీర్తి వహించెను. శ్రీశైలమున మల్లికార్జునదేవరకు నందికేశ్వరుని ప్రతిష్ఠించి దేవభోగంబులకు కంభముపాడు, ముచ్చింతల, బూదపాడు మొదలగు గ్రామముల నొసగెను[45]. ఇంతియేకాక ముక్తీశ్వరునకు హవిర్బల్యర్చనార్థము 'ముక్తి' యను గ్రామ

38. Ins. No. 335 of 1892.
"...చాగిరాజః పంచదశవర్షాణి విజయవాటికాం ధర్మమార్గేణ శశాస.

39. " " 300 of 1924.
"...శ్రీమత్పోతనరేశ్వరాన్మమునిభా ద్రాజాంబికాయా మభూ,
త్సూను ర్దాన నవీనభానుతనయ స్త్యాగీ కుమారేశ్వరః.
తస్య త్యాగ గుణాంకస్య దోరభూపస్య నందనః, త్యాగిపోతధరాధీశో రాజతే రాజమండలే."

40. " " 292 of 1892.
"వీర స్త్యాగీ భోగపురందరః, శశాస నగరీం జిష్ణో ర్నందన స్యేహ సర్వదః."

41. " " 316 of 1924.

42. " " 309 of 1924.
"......దోరాధిప కుమారః తస్యానిశపీరో గణపతినామ నృపో జజ్ఞే నే అజాయత జగజ్జనః."

" " 283 of1924.
"......త్యాగిదోరక్షితిపతేః ... ముప్పాంబాయాం గణపతిరితి ఖ్యాతనామా నరేంద్ర స్త స్మాదాసీత్".

43. " " 259 of 1924.

44. " " 290 & 294 of 1892.
...జాతవాన్ పోతభూపాల స్త్యాగసాగరచంద్రమాః, సుత్రామ్ణా స్థిత దైంద్రస్య నగరీం ధర్మతత్పరః.

45. " " 301 of 1924.

ముము, ఇరువదిఆయిను గోవులను, రత్నమయకిరీటమును సమర్పించెను[46]. స్వవంశ రక్షణార్థము స్వయంభూ దేవిని ప్రతిష్ఠించెను[47]. బెజవాడలో శ్రీ మల్లేశ్వరస్వామికి హావిర్ బల్యర్పణార్థము నొందిప్ల గ్రామమును జక్కమపూడిలోని రెండు భాగముల నొసంగెను[48]. రాజనారాయణదేవరకు జక్కమపూడిలో మిగిలిన మరియొక భాగమును, గో గ్రాసార్థము గోరా టంకయును నొసంగెను[49]. తన సోదరుడగు గణపతితో తాను కురుమూరిలోనున్న సోమనాథస్వామికిని, స్వయంభూ దేవరకును మాన్యములుగ భూము లొసంగెను[50]. అను మంచి గ్రామమున శివాలయమును నిర్మించి ఆ మహా దేవునకు భూము లొసంగెను[51]. తనపేర సోతాపురం అను అగ్రహారమును పెంపొందించి హింతాలతాలాగరు నారికేళ వృక్షములతో విలసిల్లునట్లు చేసెను[52]. ఈ దేవతారాధనలతోడనే ప్రొద్దుపుచ్చక వతీవాటీ మహీతలమును ధనధాన్యములతో తులతూగుటకు సాలేటి నుండి కావేరినిబోలు నొకపెద్దకాలువను త్రవ్వించెను[53].

గణపయరాజు

రెండవపోతరాజు అనంతరము రాజ్యమునకువచ్చినవాడు అతని సోదరుడగు గణపయరాజు. ఇతనిశాసనములు శా. శ. ౧౧౪౨ వరకు కనబడుచున్నవి. కృష్ణాతీరమున నున్న దాములూరున శ్రీ అమరేశ్వరస్వామికి సమర్పించెను[54]. తల్లియగు ముప్పాంబతో త్రిపురాంతకము జని గోదానము సల్పెను[55]. ఇంతకన్న గణపయరాజు గురించి విశేషములు తెలియవచ్చుటలేదు. ఇతనికి దిన్నాంబికవలన మనుమచాగిగణపయ యను నొక కుమారుడు కలిగెను[56].

మనుమచాగి గణపయ

రెండవ చాగిరాజునకు మనుమ డగుటవలన ఇతనికి మనుమచాగిరా జని నామకరణము చేయబడెను. 'మనుమచాగి గణపయ' యనియు నామాంతరము కలదు. ఇతడు వేదాద్రిలోని ప్రతాపనృసింహస్వామికి వేముపల్లిగ్రామము సమర్పించెను[57]. శ్రీవత్స గోత్రజుడను చేవలింద్రయజ్వ మనుమడును, అన్నిమంచి కుమారస్వామియజ్వకుమారుడును నగు సోమయాజి భాస్కరుడు రాజ్యాభివృద్ధికి చాగి మన్మ గణపేశ్వరుడను పేరుతో నీశ్వరాలయము నిర్మింప, నీప్రభువు కొంతభూమి యాదేవునకు మాన్యముగ నొసగెను[58]. ఇంత

46. Ins. No. 300 of 1924.

"...శ్రీముక్తీశ్వర మహేశ్వరాయ హవిర్బల్యర్చనాభోగ్య దదాత్, ముక్తిగ్రామ ముపాధినా విరహితం చాసాం గవాం త్రింశతం, రాజద్రత్నమయం కిరీట మనఘో సోత్యాగిపోతాధిపః."

47. „ „ 294 of 1892.

"...స్వవంశ రక్షావిధయే విచార్య్యా యం స్వయం సముత్పాద్య సునిర్వ్రణః తస్వభూః; సమాశ్రయం చ్చా పృథయం త్రివమస్తథా యథాచతుర్భి శ్చరణైః ప్రతిష్ఠితః."

48. „ „ 335 of 1892.
49. „ „ 335 of 1892.
50. „ „ 273 & 275 of 1924.
51. „ „ 284 of 1924.
52. Ibid.
53. Ibid.
54. Ins. No. 255 of 1897.
55. „ „ 234 & 235 of 1905.
56. „ „ 283 of 1924.
57. „ „ 309 of 1924.
58. „ „ 283 of 1924.

కన్న విశేషాంశములు చాగివారినిగూర్చి తెలియవు. ఇతని కుమారుడగు మహామండలేశ్వరచాగి మాడయ పోతరాజు శాసన మొకటి బెజవాడలో59 కనబడుచున్నది కాని యాతని పరిపాలనగూర్చి మరెట్టి యంశములు లభింపకున్నవి.

ఇతరుల శాసనములు

ఈకుటుంబముతో సంబంధముగల చాగివారి శాసనములు మరికొన్ని గలవు. చాగిభీముని కుమారుడగు దోరభూపతి నతవాటిసీమలో పరిపాలనము సల్పుచు ఏలేశ్వరమహాదేవుని ప్రతిష్ఠించి మున్నానది కవతలనున్న కొన్ని భూములను హవిర్బల్యర్చనార్థ మొసగెను.60 చాగిమన్మపోతరాజనువత డొకడు పెనుగంచిప్రోలులో శా. శ. ౧౧౭౯ లో రాజ్యమేలెనని ముప్పాలశాసన మొకటి61 తెల్పుచున్నది. వీరుకాక యితరశాసనముల వలన62 చాగిరాజు మనుమడును భీమరాజు తనయుడును నగు మనుమచాగిరాజు, చాగి మన్మరాజు, రుద్రయ త్యాగిరాజు అనువారలు తెలియవచ్చుచున్నారు కాని పరస్పరము వీరికి గల సంబంధము తెలియరాదు.

వి వే కా నం ద

జ. జాషువ గారు

౧

దోరసానమ్మలు బొమ్మలై కలికిముద్దుంగన్నుల న్నిండుట
చ్చెరువు న్మరుక్కవ నింపఁ జక్కఁదనముల్ జిన్నారి లేఁ బ్రాయముల్
మెఱయన్ హైందవవేదసారమును గంభీరోక్తులన్ నీవయిన్
గురియించెన్గద మానవేంద్రమునిచంద్రుం డో చికాగోపురీ!

౨

దయతో నాఁటిసభావిభుం డిడిన క్లప్తంబైన కాలాన, మీ
నయగారాజలపాత వేగము నుపన్యాసంబునం బూని, దు
ర్జయవేదాంతరహస్యతత్త్వమును పూర్ణప్రజ్ఞ దీపింప, న
వ్యయవాగ్ధోరణి వెల్లడించినది మావాఁడే, చికాగోపురీ!

59. S. I. I. Vol. 1V, No. 787.
60. Ins. No. 279 of 1924.
61. „ „ 257 of 1924.
62. „ „ 254, 259 & 317 of 1924.

3

రామకృష్ణుని దయా రత్నసౌధమునందు వాసం బొనర్చిన బ్రాహ్మణుండు
ముక్తికాంతాగళంబున పుస్తెఁ గీలింప వడి వంక లేక చొప్పడిన మగఁడు
కాషాయవస్త్రంబు గట్టినపదవికి మరియాద నిల్పిన పరమయోగి
ప్రజ్ఞాబలంబున పాషండమతములఁ గారించు పండితాఖండలుండు
గంగమాంబిక హిమవదగ్రమునుండి-అవని కేతెంచు నాఁటి వే గాతిశయము
వానివాక్కున నిలిపి గుప్తంబుసేయ-సాటి యెఱుఁగని వక్తృపంచాస్య మతఁడు.

౪

ఆవాగ్గన్నులలోని దివ్యకళ లోకాతీత మావిగ్రహా
ప్రావిర్భావ మలభ్య మంచు భవదీయశ్రోణి కీర్తింప లే
దా విశ్వంబులు కందిపోవఁగ? వివేకానందకర్మంది స
ప్పావుల్ మృత్యువు మెచ్చి, త్రుంచుకొని కొంపోయెన్, జికాగోపురీ !

౫

ఎలఁబ్రాయంబున, రోదసీకుహారమధ్యేమార్గముల్ దాఁటి, వే
ల్పులతో మంతనమాడు నాతనియశంబుల్ జూచి, యా వేయిగ
న్నులవాఁ డేమని కొండెము ల్వలికియునో బ్రహ్మతో, కట్ట! య
చ్చెలువంపుంగని నగ్నిలోన నిడి వేల్చెన్, ముప్పదాతేండ్ల కే?

౬

తెలవార్వేళఁ గషాయదీధితుల ను త్తీర్ణత్వముల్ జెందు వె
ల్గులతోనిం గను శ్వేతజాతులకు మా గోసాయికాషాయకాం
తుల భ్రాంతుల్ తలమెత్త, నల్లదె నరేంద్రుల్ పండితుల్ కేలు మో
డ్పుల మన్నించిన భారతీయముని, చూడుం డం ద్రుమసన్సంధ్యలన్.

దురదృష్టవతులైన స్త్రీలు

(రెండవ భాగము)

దర్శి చెంచయ్యగారు

నేనిదివఱకు వ్రాసినవ్యాసమునందు నాసాహాయ్యము బొంది క్షేమ మందిన వితంతువులనుగూర్చి వ్రాచ్చియుంటిని; కాని కొందఱికి నేను దోడ్పడఁజాలనైతిని. నే నాంధ్రదేశమున పాటుపడునప్పు డందలి సంఘపరిస్థితుల సంపూర్ణముగా నెఱుఁగమియే యందులకు కారణము. ఇట్టి పరిస్థితులే నేను సాయముసేయ నెంచిన స్త్రీలకింతింతనరాని వెతఁ గల్పించినవి. అట్టి సందర్భములు స్ఫురణకు వచ్చినప్పు డంతయు నేను గంటఁ దడివెట్టక యుండఁజాలను.

విధవా వివాహమును బ్రచారముసేయుటకు ముందే నేను మదీయ గురువరేణ్యులగు కీర్తిశేషులైన శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారి స్వీయచరిత్రము జదివితిని. ప్రస్తుతపు హైందవసంఘ మాయనకాలమునాఁటికంటె మిక్కిలి సహనము గలిగియున్నదని యెఱిఁగితిని శ్రీయుతులు వదలినకడనుండి తదుద్యమము కొంతవఱకు సాగించవలెనని తలంచితిని. వితంతూద్వాహ నిర్వహణ విషయమున రెండుమార్గములు సేయఁగడంగితిని:— 1. ఇట్టి వివాహములలో సంఘమంతయు వలసినంత యభిరుచి చూపునట్లు సేయుట, 2. సాధారణముగా పిల్లలకు పెండిలి సేయునట్లు, వితంతువులకును వారితలిదండ్రులు, పోషణకర్తలు యథావిధిగా వివాహములు స్వగృహములలో జరుపునట్లు ప్రోత్సహించుట.

మొదటియంశములో నేను నెగ్గితిని. వైశ్య, కమ్మసంఘములు కొంతవఱ కంగీకారమును జూపుచున్నవి. ఎట్లయిన నేమి? బహిరంగముగా నుద్యమమున కెట్టియడ్డపాట్లు లేవు. మఱియు నిట్టియుద్వాహములలోఁ బాల్గొనువారి నెంతమాత్రమును నిషేధించరాదని తత్సంఘీయుల యభిప్రాయముగ నేర్పడినది. రెండవమార్గము మాత్రము ప్రస్తుత కాలానుసరణముగ లేదు. కాఁబట్టి ప్రారంభదశలో భంగము గలుగుట సహజమే. లోకులను దృష్టిపఱచుటకై తలిదండ్రులు, అన్నదమ్ములు మున్నగువారు మందభాగ్యులైన వితంతువులయెడ నెంత కాఠిన్యము, అనాదరణ, నిరసనభావము వహించుచున్నారో చూపుటకు నాయెఱిఁగినకొలఁది కొందఱివిషయముల నుదాహరించెద.

నేను బెజవాడలో నున్నప్పుడు మన్మిత్రులు పదునైదేండ్ల జవరాలగు నొకయనాథబాలికకు పెండ్లిసేయ నాసాయమును గోరిరి. ఆమె బాల్యదశలో (మైనరుగ) నుండెను. ఆమె వారికి చిరపరిచితురాలు. నా భార్య యాచిన్నదానిని గలసికొని యామె తలిదండ్రులో లేక సోదరుఁడో యామె పునర్వివాహవిషయమై తమ యంగీకారమును మా కెఱిఁగించినచో తప్పక సాయపడి నెఱవేర్చెద మనెను. ఆబాల దుఃస్థితికై తోఁబుట్టువు చెలలు వోవుచుండుటచే నతనిసమ్మతిఁ గొనివత్తుననియు, పెండిలి యగువఱకు మాయింట నుండుననియు నాచిన్నది చెప్పెను. రెండురోజులపిమ్మట పైనుడివిన మామిత్రులాయువతివృత్తాంతమును దెలిసి వాపోయిరి. జరిగినగోల యేమన:—ఆకన్నియ సోదరునుమతి వేఁడెను. అతఁడు మండిపడి తలిదండ్రుల కావార్తఁ దెలిపెను. పిమ్మట పిల్లకు ప్రహారింపులే గాక క్షురకర్మయును జరిగెను. అంతియ గాక యామె వంటశాల వదలఁగూడదని నిర్బంధము. ఇరుగుపొరుగువారితో మాటాడరాదట! ఇట్టికట్టడియా? నేను, నాభార్య ఆయనాథబాలికకెటులైనను సాయముసేయ నెంచితిమి. ఇంతలో మా యభిమతి మెఱిఁగిన మన్మిత్రుఁడగు కే. శే. రామమూర్తి (బి. ఏ., ఎల్. టి.) యామె నుద్ధరింప సమ్మతించెను. ఆమెను దీసికొని వచ్చుటలోఁ గలుగు పనికిమాలిన యపవాదమునకుఁ గాని, తుద కాలుకోలల శిక్షకైనను నతఁడు వెనుదీయ లేదు. ఐతే, మాయభిప్రాయ మామెకు తెలుపఁజాలక పోతిమి. ఇప్పు డామె పుట్టింటిలో కేవల మొక

పనికత్తెయై వంటసేయుచున్నది. వేయేల? ఆమె శవచ్ఛవమువోలెఁ గన్పట్టుచున్నది.

శ్రీమతి శే...... ఒక పల్లెటూరిలో నుండెను. తలిదండ్రులు డబ్బు కాసపడి కాటికి కాలు చాఁచియున్న యొక మూఁడుగాళ్ల ముదుసలి కామెనంటఁ గట్టిరి. పెండ్లియైన కొన్నాళ్లకే ఆయన కనుమూసెను. పిల్లకేమో పదివేలరూపాయల ఆస్తి ముట్టినది. ఆమె తండ్రికి రేఁబవళ్లు కోర్టుల చుట్టుటే వృత్తి. కాఁబట్టి డబ్బు నంతయు నాయన ముగించెను. అంతట నా యువతి కుట్టుపనిచే ద్రవ్య మార్జించి కన్నవారిని పోషించుచుండెను. ఆమెకు పదునెనిమిదివత్సరములే. పునర్వివాహము చేసికొనవలయునని యూహ. అయ్యది సహజమే. అందుకై ఆమె నాసాయము గోరెను. పెండ్లి యగువఱకు మాయింటనే యుండవలయునని యామెను హెచ్చరించితిని. లేనిచో తద్విషయమున నెట్టిపోక్యము పుచ్చుకొనరాదని నిశ్చయించితిని. పిమ్మట నామెను దీసికొనివచ్చుటకై తగినయేర్పాటు చేసితిని. నగలు నాణెముల కాసించక కట్టుగుడ్డతో రమ్మని తెలిపితిని. కాని యామె యట్లు సేయక కొన్ని యాభరణములఁ దగిలించుకొని, వస్త్రములను మూటఁగట్టుకొని బయలుదేఱెను. ఈసడి నెఱిఁగి తలిదండ్రులు శంకించి యామెను ఛావఁ దన్ని యింటిలోఁ బడవేసిరి. కొన్ని రోజులు గడచినవి. ఆబాలిక మాటిమాటికి తప్పించుకొని రావలయునని ప్రయత్నించినది. ఐతే ధైర్యము లేదు. అందుచే నామెను గొనివచ్చుట కెన్ని సదుపాయములు పన్నినను ఫలము లేకపోయెను.

శ్రీమతి కా...... ఒకవిద్యావంతుని ముద్దు కూఁతురు. చిన్ననాఁడే తల్లిని భారవోసికొనెను. అందుచే పెదతండ్రిపోషణలో నుండెను. బాల్యమునందే యాబాల వైధవ్యము నొందెను. ఆజన్వనికి రెండవపెండ్లి సేయ నెంచి తండ్రియు, పెద్దతండ్రియు నాప్రాపు గోరిరి. వరుఁడు లభించువఱకు కన్య వారింటనే యుండవలయు ననిరి. విద్యావంతుఁడును, దైవభక్తియుతుఁడును, స్వార్థత్యాగపరాయణుఁడగు నామిత్రుఁ డాబాలను జూచెను. పిమ్మట వారిరువురు అన్యోన్యానురాగము గలిగి గృహస్థులగుటకు సమ్మతించిరి. పిమ్మట నాముద్దరాలు తనసవతితల్లి పెట్టు బాధల నతనితో నామూలాగ్రముగ నుగ్గడించి పుట్టినింటినుండి సత్వరమే వెళ్లవలయునని యంగలార్చెను. ఇంతలో పావకములో పుడకవలె నామె పెదతండ్రి మఱియొక ధనికుని సంబంధముకై కాలయాపన సేయుచుండెను. అతఁ డాయనాథబాలిక యొక్క యభిప్రాయము నెఱుఁగఁ దలకొనలేదు. సవతితల్లిపోరు తండ్రి కెఱిఁగించు టెట్లు? ఇంతలో వరనిశ్చయము నలువురిచెవిలోఁ బడెను. అట్టివివాహము జరిగినచో కులమునుండి వెలిఁబెట్టఁబడుదురని కొంద అమ్మలక్కలు సవతితల్లిని హెచ్చరించిరి. అంత నామె పెద్దయల్లరి చేసెను. ఆ గయ్యాళికి భయపడి, కూఁతురిపై నెంతవాత్సల్యమున్నను తండ్రి యామె పునర్వివాహప్రశంసయే మానుకొనవలసినట్లు తటస్థించెను. వరుఁడగు నామిత్రుఁ డాకన్నెను మనసార వలచి తనప్రయత్నము సేయుచుండెను. ఒక వత్సరము గడచినది. ఇంతలో నాబాలిక, సంఘ నిబంధనలకు వెఱచి, పెండ్లిమాటయే బొత్తుగా వదలుకొనవలసివచ్చెను. అంత నిఫలమనోరథుఁడైన నామిత్రుఁడు కృశించి దివంగతుఁ డయ్యెను.

శ్రీమతి అ......యొక్క స్వానుభవ మించుక యెఱిఁగినవారి మనసు కరఁగక మానదు. ఆమెవయసు ఇరువదిమూఁడువత్సరములే. తన అక్క లిరువురు నామె రెండవ పెండ్లికై ప్రయత్నించిరి. వరనిశ్చయ మైనది. ఆ వధువుమాయింటికి వచ్చినతోడనే పనులన్నియు చక్కఁబెట్టినాంటిమి. తుద కట్లే జరిగినది. ఇఁక పెండ్లికి మూఁడు రోజు లున్నవి. అప్పు డామె అక్కయు, బావయు రెండుదినములు వారింటనే యుండున ట్లాయువతిని ప్రేరేపించిరి. ఐతే వివాహము ముగియువఱకు ఆమె మాయింటిగడప దాఁటుట నా కెంతమాత్రము నచ్చలేదు; కాని యామె ధోరణి యామెకు సరి! తన కల్యాణమునకు అక్కయు, బావయుఁ దోడ్పడుదురని యామె దృఢమైన నమ్మకము. ఐతే పెండ్లినాఁ డామె రాలేదు. ముహూర్తమునకు విచ్చేసిన పెద్దలు నిర్ఘాంతపోయిరి. ఇంతలో నొకతంతి వచ్చినది. ఆచిన్నది సోదరియింట బంధింపఁబడెనఁట. నామిత్రు లామెను దోడ్కొనివచ్చు

టకు విశ్వప్రయత్నములు చేసిరి. ఫలము లేక పోయెను. అక్కయు, బావయు నామెను రైల్వేస్టేషనుకు తీసికొని వెళ్లిరట. ఆపిల్ల బండి యెక్కుట కెంత మాత్రము సమ్మతించలేదట. ఈ యాగడము విని జనులు మూఁగుటయు, పోలీసువాఁడు వచ్చుటయు తటస్థించెనట. ఆమెకు పిచ్చి పట్టినదని బావగారు చెప్పఁగా పోలీసువాఁడు నమ్మి యామెను బలాత్కారముగ బండిలోనికి గెంటెనఁట. ఒక సంవత్సరము గడచిన తర్వాత నే నామెకు మఱల చేయూఁత నొసఁగఁ దలపెట్టితిని. కాని యాయువతి తా పడినపాట్లన్నియుఁ దడవెను. దేహ మంత కంతకు కృశించెను. మనోవ్యాధి హెచ్చెను. నల్లతాటిపంకువలె కఠినమైన చిత్తముగల మానవసంఘము పై నామె కింతిం తనరాని యసహ్యము తోఁచెను. తా నానంద మనుభవింప నశక్తురాల ననియు, తన్ను చేపట్టు పురుషునిసహితము సుఖపెట్టఁజాలననియు నామె వాపోయెను. పాపము! ఆమెదౌర్భాగ్య మెంతనవలయును!!

శ్రీమతి వి...... ముక్కుపచ్చలారని ముగ్ధ. తండ్రి ధనికుఁడు. ఒక్కతే కూఁతురు. అడవిఁ గాచిన వెన్నెల వోలె నాజవ్వనిసంతసము వమ్ముసేయఁజాలక పునర్వివాహప్రయత్నమునకు చేయూఁత నొసఁగవలయునని నాతో నతఁడు ప్రస్తావించెను. దుహితకు అల్లునకు తన యాస్తిలో చాలభాగము ముట్టఁజెప్పెదనని పలికెను. కుమారియెడ ప్రేమ మెండు. కాని యతఁడు పూర్వాచారపరాయణుల ధిక్కరింపఁజాలఁడు. ఆమెను నావశము సేయఁడు. ఇఁక కార్యక్రమ మెట్లు? కొన్నియేండ్లు గడచినవి. అప్పటికిని ఆమెకు పెండ్లి సేయుదునని లేనిపోని పొల్లుమాటలఁ బలుకుచుండెను. అట్టి యుత్సాహకరములగు మాటల విని నమ్మి యనవరత ముద్విగ్నురాలు నాకామిని యడియాస నేమనవలయు? మునుపటిముగ్ధ గాదు. నిండుజవ్వని. పాపము! ఆతండ్రి దెంత మంద బుద్ధి!!

ఇట్టి యాశాభంగము నొందిన బాలవితంతువుల హృదయాందోళనకు మేర లేదు. కొందఱకి మనోవ్యాధి. సాహసము గలవారు తమదారిని బోయి తుదకిహపరముల రెంటి కెక్కని రేవడ లైరి. కావున వితంతూద్వాహమున నెట్టి విఘ్నములు గలిగినను వెఱవక, యెవ రేమన్నను, ఎన్నికష్టములు గలిగినను వెనుదీయక, పని సాధింపఁగల మని దృఢమగునమ్మక మున్నచో చేసియే తీరవలయును. అప్పుడే మనకు తృప్తియు, వారికి నిజమైన ఆనందమును గలుగును. వివాహము సేయ మనకు శక్తి యున్నచో కార్యము తప్పక చక్కఁ బెట్టవలయును. లేనపుడా ప్రశంసయే వాక్రువ్వక నోరు మూసికొని యుండవలయును. ఆయవాశలను సవాశలుగాఁ జేయుదుమని వారికి ఆశ పుట్టించి తుదకు వారిని విఫలమనోరథలఁ జేయుటకంటె పాపము వేఱొ లేదని ప్రాజ్ఞు లెఱుంగుదురు. అట్టి దురదృష్టవంతులైన కన్నియలఁ దలిదండ్రులను వీడి వితంతు శరణాలయములలోఁ బ్రవేశించువఱకు వారివిషయమున జోక్యము పుచ్చుకొనఁగూడదని తీర్మానించుకొంటిని.

ఏకులమునకు చెందియున్నను సరే! ఎంతవయస్సున్నను సరే! ఏవితంతువునకైనను ప్రస్తుతము వివాహము సేయించుట కష్టము గాదు. దేశకాలపరిస్థితులు మారుచున్నవి. ఇందులకు గాంధిమహాత్ముఁడును, సత్యాగ్రహశీలురే హేతువు. నవయుగారంభియువకులకు మునుపటివలె వేదశాస్త్రపురాణాదులయెడ భక్తివిశ్వాసముల కంటె గాంధిసూక్తులయందుఁగల గౌరవభక్తిశ్రద్ధము మెండనుట లోకవిదితము. ఆతఁడు బాలవితంతువులకు పునర్వివాహము చేయుటే శ్రేయస్కరమనియు, నయ్యది మన కర్తవ్యమనియు నొక్కి వక్కాణించెను. పూర్వాచారపరాయణ పాషండులకు బహిష్కార మనుమాట తప్ప మఱేమియుఁ దెలియదు. అంతకన్నను వారి బాణము సాగదు. సంఘీయులు వెలిఁబెట్టిన వారితో భుజింపరాదనుట కఠోరమైన నిబంధన. ఇందుకు భయపడి ధైర్యవంతులు సహితము వారికి లొంగిపోవుచున్నారు. మనభాగ్యముచే స్వరాజోద్యమము దినదినాభివృద్ధి నొందుచున్నది. జాతిమతభేదములను బారఁదోలి మనభారతీయులు గలసి మెలసి సమపఙ్క్తి భోజనములందు పాల్గొన ప్రోత్సహించుచున్నది. ఇట్టి యభేద పఙ్క్తిభోజన మెల్లరకు నచ్చి యాచరించునపుడే కులకట్టు లంతరించును. రజస్వలానంతరవివాహములు జయప్రద

ముగా జరుగును. జాతిభేదము లదృశ్యమగును. మతములు మాసిపోవును. వితంతూద్వాహముల కేయడ్డంకియు నుండదు.

ఎవఁడు కులభేదములను పాటింపక, విద్యావంతులగు పెద్దలతోఁ గలసి మెలసి తిరుగుచు, పూజారి పురోహితుల నాశ్రయింపక, మంత్రములను దలఁచకుండునో యతఁడే నిజముగ సంఘమును సంస్కరింపఁగలఁడు. అట్టివాఁడే నిజముగ సంఘసంస్కర్త. అతఁడే ధన్యుఁడు. అతని సదుద్యమ మనలతీరమే దిగంతములకుఁ బ్రాఁకి, పూచి, కాచి ఫలించును. అట్టిసంస్కర్త కెట్టియుపద్రవములును గలలోనైనను గలుగవు. అట్లు గాక కులమును, పూజారి, పురోహితుఁడు, మంత్రములు మున్నగువానిని దలఁచినచో నాక్షణమే యతఁ డగడ్తలోఁ బడిన పిల్లి యగును. అట్టివాఁడు సంఘము నెంతమాత్రమును సంస్కరింపఁజాలఁడు. వాని యుద్యమము కల్ల. అద్దాని వ్యాప్తికి బొడ్డుసున్న. మాసంఘమువారు నన్నాఱు పర్యాయములు నిషేధించిరి. నాకు జాతిభేదము లేదు. అందఱును సమానులే. నేను ఎక్కువతక్కువల పాటింపను. నాకు అందఱు తోఁబుట్టువులే. పూజారులతోను, మంత్రములతోను నాకవసరము లేదు. అందుచే నన్ను వారు బహిష్కరించినను ముమ్మాటికిని నాకేమియు లోటు లేదు.

సంఘదురాచారముల నామూలాగ్రముగ తొలఁచివేయుటకు తరుణ మబ్బినది. దీప మున్నప్పుడే వెదకికొనవలెను. నవయువకులు, యువతులు ఆలస్యము చేయరాదు. కాలము వమ్ముసేయరాదు. భావిశుభోదయమునకు కృషి సేయ నిదియే మంచిసమయము.

ముఖ్యముగా స్త్రీలీయుద్యమమునకు ముందంజ వేసి ధైర్యోత్సాహములఁ బ్రకటించి తోడ్పడవలయును. వారు స్వేచ్ఛను సంపూర్ణముగా గడించ కంకణము గట్టుకొనవలయును. తమయెడ సంఘము చూపు నిరసనభావమును, అనాదరణయుఁ దొలఁగింప నేకగ్రీవముగా, నధికారపూర్వకముగ సాధింపవలయును. "మా హక్కుల మా కొసఁగినసరి! లేనిచో మీగతి చూడుఁ" డని పురుషుల కలజడి పుట్టింపవలయును. స్త్రీస్వాతంత్ర్యమునకై దీక్షఁబూనిన ఆంగ్లేయ యువతులు తమ వేఁడికోలు పెడఁజెవిఁబెట్టిన ప్రధాన మంత్రియగు ఆస్క్విత్ వంటివానిని చబుకుతోఁ గొట్టి లొంగఁదీసికొని తమ హక్కులను సాధించినరీతి, మన భారత నారీమణులును, సాంఘికపక్షపాతము నత్వరము నిర్మూలింపనిచో, పెట్టుకు పెరుమాళ్లనునట్లు, పురుషులకుఁ దగినశాస్తి చేసి సబలల మనిపించి తమహక్కుల నెప్పుడు గడించి విజయశంఖమును బూరింతురో యని యువ్విళ్లూరుచున్నాఁడ!

వావిలాల వాసుదేవశాస్త్రిగారు

(౧౮౫౧ - ౧౮౯౭)

అడవి శంకరరావుగారు, బి. ఏ., ఎల్. టి.

"ప్రకృత కవిత్రయం బనగ రాజమహేంద్రపురంబునందు సెన్నిక గలవారిలో" నొకడగు వావిలాల వాసుదేవశాస్త్రి ౧౮౫౧ జూన్ ౧ (విరోధికృత్తు సం. జ్యేష్ఠ శుద్ధ విదియ) నాడు గుంటూరుమండలమున రేపల్లెతాలూకాలో కారుమూరు గ్రామమున జననమొందెను. ఈతనితండ్రి అప్పయ్యశాస్త్రి. తల్లి శ్రీ మహాలక్ష్మమ్మ. ఈతని మాతామహ పితామహవంశములు ప్రఖ్యాతి జెందిన పండితవంశములు. వీరి ప్రపితామహులగు వెంకటశివావధాని వాసిరెడ్డివారి యాస్థానమున బండితుడుగా నుండెను. వీరి పితామహులు సుబ్రహ్మణ్యసోమయాజి, అగ్నిష్టోమాది క్రతువు లొనర్చిన వేదశాస్త్రవేత్త. వీరు బాలసరస్వతి యనుబిరుదు వహించి యుండిరి. వాసుదేవశాస్త్రి తండ్రి అప్పయ్యశాస్త్రి గోదావరి, కృష్ణా జిల్లాలకు అబ్కారీ ఇజారీల చేసిన సంపన్న గృహస్థులు. వీరి మాతామహులు శ్రీ వఝ్ఝల అద్వైతబ్రహ్మశాస్త్రులు, కొంతకాలము బందరులోని ప్రావిన్షియలు కోర్టు పండితులై ఆ మీద చెన్నపురి సదర్ కోర్టులో పండిత పదర్ మీన్ ఉద్యోగముచేసెను. ఆంధ్రనిఘంటువును రచించిన సి. పి. బ్రౌను కాంధ్రమున వీరు గురువులు. వఝ్ఝల అద్వైతబ్రహ్మశాస్త్రి కొమారుడు వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి తన ఇరువదిరెండవయేట బందరులో శతఘంటకవనము సల్పెనట. వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి రచించిన వ్యవహారదర్పణము, శాక్తభాష్యము ప్రసిద్ధి కెక్కినవి. ఇందు శాక్తభాష్యము 'స్వధర్మప్రకాశిని' యందు బ్రచురింపబడినది. వాసుదేవశాస్త్రిపేరు మేనమామ వఝ్ఝల వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి నామమే.

ఆ సోదరులలో వావిలాల వాసుదేవశాస్త్రి రెండవవాడు. ఈతడు బందరునివాసియు, నోబిల్ పాఠశాలలో బండితుడు నగు కోరాడ రామచంద్రశాస్త్రి యొద్ద సంస్కృతకావ్యముల బఠించెను. వాసుదేవశాస్త్రి రాజమహేంద్రవరము కళాశాలలో ౧౮౭౨ లో పట్టపరీక్షలో కృతార్థుడయ్యెను. ఆ వత్సరమున నీతడు మార్ష్ వాల్ష్ బంగారుపతకము బడసెను. ౧౮౭౫ మొదలు ౧౮౯౬ వరకు వాసుదేవశాస్త్రి రాజమహేంద్రవరమున దొరతనమువారి కళాశాల యందు ఆంగ్ల సహోపాధ్యాయుడుగా నుండెను. తరువాత గొంతకాలము పాఠశాలల సహాయపరీక్షకుడుగా గోదావరి కృష్ణా జిల్లాలలో బనిచేసి ౧౮౯౭ జూన్ ౧౩ వ తేదిని (హేవిళంబి సం. జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి) ఆదివారమున రాజమహేంద్రవరమున మృతినొందెను. నలుబదియారేండ్ల పిన్నప్రాయముననే మృతినొందినను, "ప్రకృత కవిత్రయము" లోని తక్కిన ఇరువురు నగు కందుకూరి వీరేశలింగము, వడ్డాది సుబ్బారాయనివలెనే మూడవవాడగు వాసుదేవశాస్త్రి కూడ ప్రతిభావంతులగు నాధునిక కవిశ్రేష్ఠులలో బరిగణింపదగినవాడు.

౧౮౭౫ లో భజగోవింద శ్లోకములను వాసుదేవశాస్త్రి 'ముముక్షుతారక' మను నామమున తెనిగించెను. ౧౮౭౫ లోనే వడ్డాది సుబ్బారాయకవియు భజగోవింద శ్లోకముల నాంధ్రీకరించి ౧౮౭౬ ఆగష్టు 20 వ తేది 'వివేకవర్ధని' లో బ్రచురించెను. ౧౮౭౫-౭౬ లలో 'బ్రాహ్మణీయ'మను నొక ప్రబంధమును వాసుదేవశాస్త్రి రచించెను కాని అది ముద్రితము కాక అట్లే నిలిచియున్నది. ౧౮౭౬ లో ఆంగ్ల మహాకవి షేక్స్పియరు విరచితమైన 'జూలియస్ సీజరు' నాటకమును వాసుదేవశాస్త్రి ఆంధ్రీకరించి ప్రచురించెను. ఆంగ్ల నాటకముల నాంధ్రీకరించి ప్రచురించుటకు వాసుదేవశాస్త్రియే ప్రథముడని చెప్పవచ్చును. ప్రచురింపబడిన కొద్దికాలముననే 'ముముక్షుతారకము' నాలుగు ముద్రణములును, 'జూలియస్ సీజరు' నాటకము రెండు ముద్రణములును బడసెను.

'జూలియస్ సీజరు' నాటకమును వాసుదేవశాస్త్రి తన తండ్రియగు అప్పయ్యశాస్త్రికి నంకిత మొనర్చెను. ౧౮౭౪ లో (భావ సం. ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు) తండ్రియైన అప్పయ్యశాస్త్రి స్వర్గస్థులు కాఁగా, ౧౮౭౭ లో వాసుదేవశాస్త్రి 'పితారాధనము' రచించి ప్రచురించెను. ౧౮౭౯ లో వాసుదేవశాస్త్రి తల్లి శ్రీమహాలక్ష్మమ్మ పరమపదించెను. ఈ సంవత్సరమున వాసుదేవశాస్త్రి ఆంగ్లకవియగు కౌపరుచే రచింపబడిన 'మాతృస్వరూపస్మృతి'ని నాంధ్రీకరించుటయే కాక 'మాత్రారాధన' యను ఖండకావ్యము నొకదానిని ప్రచురించెను. 'మాతృస్వరూపస్మృతి' తల్లి యగు శ్రీమహాలక్ష్మమ్మ కంకిత మొనర్పబడినది.

౧౮౮౦ లో 'నందకరాజ్యము' అను కల్పిత నాటక మొకటి వాసుదేవశాస్త్రిచే రచియింపబడి ప్రకటింపబడెను. బ్రాహ్మణులలో గల యంతఃకలహములను, వానివలన గలుగు నష్టములను నిరూపించుటయే ఈ నాటకముయొక్క ముఖ్యోద్దేశము. 'జూలియస్ సీజరు' నాటకము, 'నందకరాజ్యము' ఒక్క తేటగీతియందే వ్రాయబడిన నిర్వచననాటకములు. 'జూలియస్ సీజరు', 'నందకరాజ్యము', 'పితారాధన' రచనలయందు వాసుదేవశాస్త్రి కావ్యరచనమున తనమతమును వెల్లడించినాడు. ౧౮౭౬ లో రచింపబడిన 'సీజరు' నాటక పీఠికలో "నాటకవైఖరిని మొదటనుండి తుదివఱకుం దేటగీతినే వ్రాయుట తగునని యెంచి యాతీరున వ్రాసినాఁడ. ఈపద్ధతి క్రొత్తదైనను మూలగ్రంథమందలి చందంబునకు దాదాపుగా నుండునని కూడ గ్రహింపఁబడెడి" అనియు, ౧౮౭౭ లో ప్రచురింపబడిన 'పితారాధనము'లో చివర,

"తాల్పఁగూడదు తెలుఁగుపాత్తమ్ములఁ గవి
సమయసిద్ధము కాని పదముల ననుట
మూటిగాఁ దాతకాలపునాఁటిమాట;
దాని కే నొల్లను, దదభిమానిఁ గాను.

"భాష లోలి మాఱకలయుట తప్పదు,
కాలరీతిఁ బట్టి క్రాలు నవియు;
జెంద కెన్ని యున్న నది నా యభిమతమ్ము"

అనియు, ౧౮౮౦ ఏప్రిలులో ప్రచురించిన 'నందక రాజ్యము' నాటకముయొక్క పీఠికలో, "ఇప్పటికి వచనము లేకుండనే వ్రాయఁబడినది. కాని నేను వ్రాయఁదలంచుకొన్న నాటకములలో వాడుక మాటలు చేర్చుటయే కాక సహజరీతిని వచనమే కూర్చువాఁడను. అయిన నీ విషయమయి యాంధ్రాభిమానుల యభిప్రాయములను గోరఁబడుచున్నవి. అయినను 'బ్రాహ్మలు', 'వెళ్లిచాము' మొదలయిన కొన్ని పదములు వాడుకలో నుండుట సూచించుటకై వీని నొక్కొకతేప వాడినాను. ఒక్క తేటగీతిలోనే వ్రాయుటవల్లఁ జదువువారికి విసుగు పుట్టు నని కొంద అన్నారని విన్నాను గాని నాకు మాత్రము సహజమగు వాక్ప్రవాహమునకు దీనిలో నున్నంత సమమార్గము తక్కిన వానిలో లేదని స్పష్టముగాఁ దెలిసియున్నది. సాంతముగా నీపుస్తకమును జదువువారి కాయభిప్రాయము పుట్టక పోదని నమ్ముదును" అనియు వాసుదేవశాస్త్రి చెప్పుకొనియున్నాడు. గ్రంథములు సజీవమును, జాతీయము నగు వాడుకభాషలో వ్రాయబడవలయు నను శ్రీ గిడుగు రామమూర్తి గారికిని వారి మిత్రులకే గాక, వాసుదేవశాస్త్రి యభిప్రాయమును బట్టి చూచినచో, నాటివారికే యిట్టి యభిప్రాయము లున్నట్లు గోచరించుచున్నది. ఆంగ్లేయనాటకములలో వలె నాటక మంతయు నేకవృత్తమున రచింపబడవలయుననియు, ఈ వృత్తమున నటకులు తమ యభినయమున పాడుట మాని పఠించుటయే ముఖ్యమనియు నాన మానాఁడే ప్రబలియుండుటచే వాసుదేవశాస్త్రి తన 'సీజరు' 'నందకరాజ్యము'ల నొక్క తేటగీతిలోనే వ్రాసెను. వీరి ననుసరించి వీరేశలింగము పంతులు తన 'కవీశ్వర చరిత్ర'లోను, వీరిరువుర ననుసరించి మఱికొందఱు తర్వాతను ఈ పద్ధతి ననుసరించియున్నారు.

కాళిదాసుని 'శాకుంతలము' నాంధ్రీకరించుటకు బిరుదు కెక్కిన తెలుగుకవులు డీకొనినట్లే భవభూతి 'ఉత్తరరామచరిత్రము' ను తెన్గించుటలో కూడ వీరు పందెముల జరచినారు. 'ఉత్తరరామ చరిత్రము' ను మొదట వావిలాల వాసుదేవశాస్త్రి ౧౮౮౩ లో



V. Vasudevasastri

రాజమహేంద్రవర రాజకీయ సర్వకళాశాలాధ్యాపకాన్యతముఁడును, సంస్కృత ప్రాకృత వైకృత నానాభాషా సామ్య వైషమ్యబోద్ధయు, శాస్త్ర బ్రహ్మచార్యుపధానుద్ధతాప్త సువర్ణశాసనుండును, కతిపయ రూపకాదిప్రణేతయు నగు

వావిలాల వాసుదేవశాస్త్రి, బి. ఏ.,

జననము ; జూన్, 1851. మరణము ; జూన్, 1897.



1894-వ సంవత్సరములో కీ. శే. శ్రీ పనప్పాకము అనంతాచార్యులుగారు పిఠాపురము కేసులో రాజమహేంద్రవరము వచ్చినపుడు, రాజమహేంద్రవరములో ప్రసిద్ధివడసిన పండితులను రప్పించి తీయించిన ఫోటో.

ఇందు కూర్చున్నవారు: యెడమనుండి కుడివైపునకు వరుసగా—కీ. శే. చిలంబి ఆదినారాయణప్ప నాయఁడుగారు, కీ. శే. వావిలాల వాసుదేవ శాస్త్రిగారు, శిష్టు జగన్నాథ శాస్త్రిగారు.

నిలువబడినవారు: కీ. శే. ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారు, కీ. శే. కందుకూరి వీరేశలింగము పంతులుగారు, వడ్డాది సుబ్బారాయడుగారు.

వాంధ్రీకరించి ప్రకటించెను. తరువాత దీనిని ౧౯౦౯ లో మల్లాది సూర్యనారాయణశాస్త్రి, ౧౯౧౩ లో పిఠాపురమునుండి వేంకటరామకృష్ణకవులు, ౧౯౧౪ లో వేదుల బ్రహ్మానందశాస్త్రి, ౧౯౧౭ లో ఏలూరునుండి శ్రీ మంత్రిప్రగడభుజంగరావు, ౧౯౧౯ లో రాజమహేంద్రవరమునుండి నిడుమర్తి జలదుర్గా ప్రసాదరాయడు, ౧౯౨౪ లో గొంతిమార్పుతో ఉత్తర రాఘవము పేర బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, ౧౯౩౦ లో చెన్నపురినుండి వేదము వేంకటరాయశాస్త్రి ఆంధ్రీకరించిరి. ఈ వివిధాంధ్రీకరణముల ప్రాశస్త్యము నిర్ణయించు భారము రసజ్ఞులును, పండితులును నగు విమర్శకులు వహింపవలసినది. తా మాంధ్రీకరించిన యుత్తరరామచరిత్రమును వావిలాల వాసుదేవశాస్త్రి తమ పినతండ్రియు, గురువు నగు వావిలాల నరసింహశాస్త్రి కంకిత మొనర్చెను.

౧౮౮౪ లో తన సతీమణి రుక్మిణి స్వర్గస్థురాలు కాగా వాసుదేవశాస్త్రి ఆ సంవత్సరమే 'రుక్మిణీస్మరణము' రచించెను. ౧౮౯౧ లో ఈ కవి కాళిదాసుని 'రఘువంశము' (ఆరుసర్గలు) ఆంధ్రీకరించి ప్రచురించెను. అచిరకాలములో నిది రెండు ముద్రణముల గాంచెను. శూద్రకమహాకవి విరచితమైన 'మృచ్ఛకటికము' నీత డాంధ్రీకరించెను. దీనినే తరువాత ౧౯౦౬ లో తిరుపతి వెంకటకవు లాంధ్రీకరించిరి. ౧౮౯౦ లో ముద్రారాక్షసము నాంధ్రీకరించిన కుసర్ల అనంతరావు తాను వాసుదేవశాస్త్రి శిష్యు డగుటచే 'మృచ్ఛకటికము'ను తన గురు వాంధ్రీకరించుటచేసి తాను ముద్రారాక్షసము కరించితినని చెప్పికొనియున్నాడు.

౧౮౯౭ లో వాసుదేవశాస్త్రి దివంగతులైన తరువాత ౧౮౯౮ లో వీరి సోదరులు అద్వైతపరబ్రహ్మశాస్త్రి 'భ్రాత్రారాధన'మని యొక స్మరణకావ్యమును, వాసుదేవశాస్త్రి జీవితమును దెలియజేయు దానిని, ప్రకటించిరి. పచ్చయప్పకళాశాలలో గొంతకాల మాంధ్రపండితులుగ నుండి సుమారు ముప్పది నాటకముల నాంధ్రమున రచించిన గుంటూరు వాస్తవ్యులు, సుప్రసిద్ధ కవియు నగు శ్రీ కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి వాసుదేవశాస్త్రియొక్క బావగారు. వాసుదేవశాస్త్రి శిష్యులలో దుగ్గిరాల సూర్యప్రకాశరావు, కుసర్ల అనంతరావు, బయ్యా నరసింహేశ్వరశర్మ, చిలకమర్తి లక్ష్మీనరసింహము, చిత్రపు వెంకటాచలము మున్నగువారిని చేర్కొనవచ్చును.

తా మాంధ్రీకరించిన 'జూలియస్ సీజరు' నాటకము ప్రతి నొకదానిని కందుకూరి వీరేశలింగముగారికి ౨ వ ఏప్రియల్ ౧౮౭౬ (ధాతసం. శ్రీరామనవమి భానువారము) తేదిని బంపుచు వావిలాల వాసుదేవశాస్త్రి ఆ గ్రంథముయొక్క ముఖపత్రముమీద,

" తప్పు లున్నఁ గాని తాళిక నేయుచుఁ
గైకొనుండి మిగులఁ గరుణతోడఁ;
బరమహితముఁ గోరి పంపినాఁ డిది మీకు
వావిలాల వాసుదేవశాస్త్రి"

అని వ్రాసికొనియున్నాడు.

దులు మాటలు

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు

జ. రామయ్యగారు
(నిఘంటు సంపాదకుఁడు)

ఈ సంవత్సరపు భాద్రపదమాస భారతి సంచికలో శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువును గూర్చి ప్రకటింపఁబడిన వ్యాసమును జదివితిని. నిఘంటువు శీఘ్రముగా ప్రకటింపఁబడవలయు ననుకోరిక భాషాభిమానుల కుండుట సమంజసమే. గ్రంథము శీఘ్రముగా వెలువడుటకే కార్యభారము వహించినవారు శ్రద్ధతోఁ బని చేయుచున్నారు. వీరు చేయుచున్న కార్యక్రమము వివరణము తెలియకపోవుటచేత లోకము పని యేమియు జరుగకున్నదని భ్రమపడవచ్చును. ఎంత జాగరూకతతోఁ బనిచేసినను, 'కుతోఽప్యవచనీయతా' అను న్యాయమున తప్పు పట్టెడువా రుండకపోవరని తెలిసినను, సాధ్యమగునంతవఱకు తప్పులు లేకుండ చేయవలయునని సంకల్పించినప్పు డాలస్యము కాకమానదు. అజాదిశబ్దము లన్నిటిని జేర్చి యొకసంపుటముగా ముద్రింపించుటకు తగిన యేర్పాటులు పూర్తియైనవి. కొలఁదిదినములలోనే ముద్రణకార్య మారంభమగునని తెలుపఁగలందులకు సంతసించుచున్నాఁడను.

ఈ విషయముమాత్రమే కాక యీ వ్యాసమున ఆక్షేపాత్మకములును, నయథార్థములునగు వాక్యములు కొన్ని గలవు. ప్రజలకు యాథార్థ్యము తెలుపుటకై వాని కించుక సమాధానము చెప్పవలసియున్నది.

ద్రావిడభాషా నిఘంటు నిర్మాణకార్యము, ఈ శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటు కార్యారంభమునకు పిదప ఆరంభమైనట్లు అందున్నది. కాని యది సరిగాదు. ఆంధ్రసాహిత్యపరిషత్తు పుట్టుటకు కొన్ని సంవత్సరముల పూర్వమే ద్రావిడనిఘంటు కార్య మారంభమై జరుగుచున్నది.


శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువునకు దాదాపు లక్షరూపాయ లయినట్లు వ్రాసినారు. ఇది అతిశయోక్తి. ధనము వ్యర్థముగా వ్యయమగుచున్నదో లేదో అనువిషయమును ధనదాతలై తమసమక్షమందు కార్యము చేయించుచున్న శ్రీ మహారాజావారుగదా కనిపట్టవలసినది? వారికి తోఁపని యాక్షేపము పైవారి కేల తోఁపవలసివచ్చినదో తెలియదు. జీతములు పుచ్చుకొని పనిచేయుచుండిన పండితులు జీతముల కాసించి వృథా కాలహరణము చేయుచున్నట్లు ఈవ్యాసములోని వ్రాఁత స్ఫురింపఁజేయుచున్నది. ఇది కేవల మసంబద్ధము. ఇది శ్రీ మహారాజావారికిని దెలియును.

'నిఘంటురచనయందు అనుభవము గలిగి సమర్థులగు శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రిగారు నిఘంటు కార్యాలయమును వదలిపోవలసివచ్చుట నిఘంటువు దురదృష్టము' అని వ్రాసినారు. దీనిని సామాన్యదృష్టిచేఁ జదువువారలకు లక్ష్మీపతిశాస్త్రిగారే యీ నిఘంటు భారవాహకులనియు, వారు వెడలిపోవుటచే నిఘంటుకార్యము చక్కఁగాఁ జరుగుట లేదనియు స్ఫురించును. అది సత్యము గాదు. నిఘంటుకార్యస్థానమునఁ బనిచేయు పండితులలో లక్ష్మీపతిశాస్త్రిగారు నొక పండితులుగా నుండిరి. ఆయన స్థానమున వచ్చినవారు ఆయన కేవిధమునను పాండిత్యమునఁ దీసిపోరు. సరిగదా, ఆయనకంటె అధికులనియే తప్పక చెప్పవచ్చును. లక్ష్మీపతిశాస్త్రిగారు ఈ కార్యస్థానమునుండి వెడలిపోవుటవలన నిఘంటు కార్యమున కేవిధమయిన 'దురదృష్టము'ను కలుగుట లేదు. పని మునుపటికంటెను చక్కఁగా జరుగుచున్నదని చెప్పఁగలను.

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువునందు ద్రావిడ నిఘంటువుకంటె ఎక్కువ విషయసంగ్రహము చేసినట్లు కనిపింపదనియు నందుఁ గలదు.

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు ప్రథమ సంపుటమైనను అచ్చుపడిన పిమ్మట రెండు నిఘంటువులును నిష్పక్షపాతబుద్ధితో పోల్చిచూచినవారికిఁ గదా వాని తారతమ్యము దెలియుట.

దీనియందు సుమారు ౯,౩౫,౦౦౦ ల ఘనపు టడుగుల నీరు నిలువ చేయుదురు. సరస్సునందుండు నీటిమట్టము + ౭౮౦ (M. S. L.) అడుగులు ఉండును. నదియొక్క మట్టము + ౬౨౫ (M. S. L.) ఈ యత్నమువల్ల ముఖ్యమైన లాభములు—ఇకముందు ఇచ్చటి పంటలకు మునుపటివలెగాక, ముందుగనే నీరు అందుబాటు



బొ. ౩: కట్టబడుచున్న ఆనకట్ట గోడ

కాగలదు. మునుపటివలె, నీటిఅరుదు, కలుగుచుండ నేరదు. నీటిపారుదల కూడ క్రమపరచుటకు వీలగును. వరదలయొక్క నీరంతయు వృథా అయిపోకుండా ఉపయోగింపబడును. పిమ్మట అకస్మాత్తుగా వచ్చు వరదలవల్ల నష్టము కూడ తగ్గింపబడును.

ఈ యత్నముప్రకారము మెట్టూరువద్ద కావేరీనది కడ్డముగ కట్టుచున్నట్టి ఆనకట్టగోడ ప్రపంచమం దున్న గొప్పవాటిలో నొకటి. బ్రిటిషుసామ్రాజ్యమం దింతపెద్దది మరియొకటి లేదు. ఈ గోడయొక్క పొడవు సుమారు ౫,౩౦౦ అడుగులు. దీనియొక్క ఎత్తు నదిమట్టముపైని ౧౭౬ అడుగులు. అనగా దీని పైనయొక్క మట్టము +౮౦౧. ఈపొడవుతో ఇంత ఎత్తు కలిగినట్టిది మరియొక్కటి లేదు. ఈ ఆనకట్టు గోడయొక్క పొడవును, అందు కల వివరములు బొమ్మ (౧) యందు చూపబడినవి.


ఇది యింత పెద్దది యగుటచేతనే, దీనిని నూతన యంత్రసహాయ్యమున, నవీనపద్ధతులను నుపయోగించి కట్టుచున్నారు. ఈ ఆనకట్టుగోడ నదిని అడ్డుటవల్ల వచ్చెడి నీటిఒత్తిడి (Pressure) నంతయు, ఇది దానియొక్క బరువునలననే (Gravity Dam) ఆపుచున్నది. కనుకనే బొమ్మ (౨) యందు చూపబడినటుల, నీటిఒత్తిడితోపాటు గోడయొక్క మందముకూడ అధిక మగును.

ఈ ఆనకట్టుగోడను రాళ్ల సున్నముతో (Rubble Masonry in cement) నే చాలమట్టుకు కట్టుచున్నారు. కొద్దిభాగములయందు మాత్రము మధ్యను కాంక్రీటుతో నింపెదరు. ఇయ్యది చాలా పొడవుగా నుండుటచే, ఉష్ణమువల్లను శీతలమువల్లను పొడవగుట తగ్గుటకును తగిన ఏర్పాటులు చేసియున్నారు. ఇందు తగ్గుదలయే ముఖ్యమైనది. ఇందుకుగాను మొత్తము పొడవును ప్రతి ౧౨౬ అడుగుల పొడవును చేర్చి కట్టుచున్నారు (Contraction joint). ఇట్టి కూడిక



బొ. ౪: ఆనకట్టగోడ కుడిచివర; సరస్సు

రొకటి బొమ్మ (౫) యందు చూపబడినది. అందు



బొ. ౫: వసారా


చూపబడినటుల, నీటిపైపున వలుపలకల కాంక్రీటు స్తంబము నొకటియును, దానివెనుక రాగి ౮ ఆకారము నొకటి కలవు. ఇంతియేకాక, సరస్సుపైపునుంచి నీరు చొచ్చుకొనకుండుటకుగాను సరస్సుపైపున ఈగోడ కొంతమందము శ్రేష్ఠమైన సిమెంటు (cement) తో కట్టబడినది. ఏవిధముననైనను దీనిగుండా నీరు వూరినచో, ఆవూటనీరు ఈగోడపై ఒత్తిడి కలుగచేయకుండుటకుగాను, గోడయొక్క మందమునందు ౭¾ X ౭¾ అడుగుల వసారా (Drainage Gallery) — నొకదానిని, + ౬౫౦ మట్టమున మొత్తము ౮,౩౦౦ అడుగుల పొడవునను వదలియున్నారు. ఈ వసారాయందు కూడుచుండు ఊటనీరు విడుదలచేయుటకై, ఇదిరే కొలతలును, మట్టమును కల వసారాలను అడ్డముగ అచ్చటచ్చట కట్టియున్నారు. ఇట్టి వసారా రొకటి బొమ్మ (౬) యందు చూపబడినది.

ఈ మెట్టూరుసరస్సునందలి నీటిని వ్యవసాయములకై కాలువలలోనికి వదలుటకుగాను మెరకను, పల్లమును తూములు మొదలగు వసతులు కట్టబడినవి. ఈ ఆనకట్ట గోడయొక్క పొడవునందు ౩,౭౦౦ అడుగుల పొడవు వద్ద పల్లపుకాలువ (Low - Level - Channel) గుండా నీరు వదలుటకుగాను పల్లపుతూములు (Low - Level Sulices) కట్టబడినవి. వీటియొక్క మట్టము + ౬౭౦. ఇందు ప్రతిదానియొక్క వెడల్పు ౭ అడుగులును, ఎత్తు ౧౮ అడుగులును. ఇట్టితూములు ఇందు ౫ కలవు.




బొ. ౬: వసారా (Drainage Gallery)

ఈ తూములద్వారా, సెకండునకు సుమారు ౨౫,౦౦౦ ఘనపుటడుగుల నీటిని విడుదలచేయవచ్చును. బొమ్మ (౭)యందు ఈతూములవివరములు చూపబడినవి. బొమ్మ (౮)యందు ఈతూములద్వారా నీరు ప్రవహించుచున్నది.




బొ. ౭: పల్లపుతూములద్వారా నీటిపారుదల

ఆనకట్టు గోడపొడవునందు, ౮,౭౭౦ అడుగుల పొడవువద్ద మెరకతూములు (High - level - sluices) కట్టబడుచున్నవి. ఈతూములు పల్లపుతూములకంటె



బొ. ౭: పల్లపు తూములు

౫౦ అడుగుల ఎత్తున అనగా + ౭౨౦ మట్టమున కలవు. ఇందు ౧౦ [illegible] అడుగుల వెడల్పును, ౧౬ అడుగుల ఎత్తును కలిగినట్టి తూములు ౭ కలవు. ఈతూములు [illegible] వ బొమ్మ (౮) యందు చూపబడినది. ఈతూముల సరస్సు వైపు బొమ్మ ౭ యందు చూపబడినది.



బొ. ౮: మెరక తూములు



బొ. ౧౦: మెరకతూములు (సరస్సువైపునుండి)

ఈరెండుతూములయొక్క తలుపులను విద్యుచ్ఛక్తి మోటరులచేతనైనను, చేతితోనైనను మూయుటకు, తెరచుటకు వీలు కలదు. ఈపల్లపుతూములు మెరకతూములు రెండుతూములవద్దనుండి వచ్చు రెండు కాలువలును కలసి నదిలో ఒక ౧ మైలున ఆనకట్టుగోడకు క్రిందను కలియుచున్నవి. ఈకాలువయొక్క వెడల్పు ౧౪౨ అడుగులు, లోతు ౧౫ అడుగులు. ఈ కాలువ మెరకతూమునుంచి నదిలో కలియునప్పటికి సుమారు ౯౦ అడుగులు క్రిందికి దిగును. పల్లపుతూములు పూర్తిగా తయారైనవి. మెరకతూములు కూడ చాలమట్టుకు తయారైనవి.

వరదలకాలములో సరస్సునందు మిగతా వుండు నీటిని వ్యవసాయమునకై విడుదలచేయుటకుగాను ఎడమ ప్రక్కను ఎల్లిస్ సాడల్ (Ellis Saddle) వద్ద తూములు (Surplus - Siuices) కట్టబడినవి ఇందు ౬౦ అడుగుల వెడల్పును, ౩౦ అడుగుల ఎత్తును గలవి ౧౬ తూములు కలవు. ఈతూము లన్నియు నీటివిడుదలకై తగినపొడవు దొరకుటకై ౧,౬౦౦ అడుగుల పొడవున చంద్రాకారముగ కట్టియున్నారు. ఈతూములకు రెండుచివరలును కొండలపై ఆనుకొని యున్నవి. ఈ తూములకు వెనుకప్రక్కను ఈ దూలములపైనే మద్రాసునుంచి కలకత్తా పోవు మార్గమును తీసికొనిపోవుటకై మార్గము తయారుచేసియున్నారు. ఈ తూములు సెకనుకు సుమారు౪౩౬,౦౦౦ ఘనపుటడుగుల నీటిని విడుదలచేయగలవు. ఈ తూములు బొమ్మ (౧౧) యందు మాపబడినవి.

ఈతూములగుండా విడుదలయగు నీరంతయు కొండప్రక్కనుంచి, లోయగుండా ప్రవహించి ఏవిధమైన అపాయము కలుగజేయకుండా నదిలో ఒకమైలు క్రిందను కలియుచున్నది. ఈతూములయొక్క ౧౬ తలుపులను, విద్యుచ్ఛక్తిమోటరులచేతను, చేతితోనైనను మూయుటకును, తెరచుటకును వసతులు కలవు. ఈ తూము లన్నియు పూర్తిగ తయారైనవి.




బొ. ౧౧: అలుగు తూములు

ఈ సంవత్సరపు వరదలను వదలుటకుగాను సుమారు 1,100 అడుగుల పొడవువద్ద ఒక ౬౩౦ అడుగుల వెడల్పున మాత్రము నదిమట్టమునుండి సుమారు ౫౦ అడుగులయెత్తే, అనగా +౬౮౮ మట్టమువరకే కట్టి, దానిమీదనుంచి పొరలి ప్రవహింపజేయుచున్నారు. ఇటుల ౫౦ అడుగుల ఎత్తునుంచి పొరలి ప్రవహించుట బొమ్మ (౧౨) యందు చూపబడినది.

అందుచే ఈ యేటికి తయారైన సరస్సు యొక్క వైశాల్యము సుమారు ౯ చదరపు మైళ్లు. ఈ సరస్సునందు కొంతభాగమును, ఆనకట్టుగోడయును బొమ్మ (౧౩) యందు చూపబడినవి.

ఈ ఆనకట్టుగోడ మూడువంతులు ($\frac{3}{8}$) కట్టుట పూర్తి అయినది. చాల భాగములందు +౮౫౦ మట్టమువరకు, కొన్ని భాగములందు +౮౩౦ వరకును కట్టబడినది. కుడిప్రక్కను ఒక ౩౮౦ అడుగుల పొడవుమాత్రము పూర్తిగా అంత ఎత్తునను (+౭౦౧) కట్టబడినది. పూర్తిగా కట్టబడిన ఆనకట్టు గోడయొక్క కుడిచివర బొమ్మ (౧౪) యందు చూపబడినది.

వచ్చెడి సంవత్సరమునకు ఇప్పుడు నది పొరలి ప్రవహించెడు భాగము +౮౨౦ మట్టమువరకు కట్టెదరు. అందుచే అప్పుడు నీరు సుమారు ౯౫ అడుగులయెత్తు నుంచి పొరలి ప్రవహించును. ఈఆనకట్టు గోడమీదికి కట్టుటకుగాను కావలసిన రాళ్లు మొదలైన సామానులు



బొ. ౧౨: ౫౦ అడుగుల యెత్తునుంచి నీరు పొరలి ప్రవహించుట




బొ. ౧౩ : సరస్సుయొక్క కొంతభాగము, ఆనకట్ట గోడ



బొ. ౧౪ : పూర్తిగా కట్టబడిన ఆనకట్ట కుడిచివర

గలబండ్లు దానిమీదికి తీసికొనిపోవుట బొమ్మ (౧౫) యందు చూపబడినది.


ఈయత్నము ఇంతత్వరగా పూర్తియగుచుండుట ముఖ్యముగ నవీనయంత్రములయొక్కయు, విద్యుచ్ఛక్తి



బొ. ౧౫: పొగబండ్లు ఆనకట్టుగోడమీదికి పరికరములను గొనిపోవుట



బొ. ౧౫ అ: సరస్సుయొక్క దృశ్యము




బొ. ౧౫ ఆ: సరస్సుయొక్క దృశ్యాంతరము

యొక్కయు సాహాయ్యమువల్లనే. ఇందుకు కావలసిన కాంక్రీటంతయు తయారుచేయుటకుగాను రెండు గోపురపుయంత్రములు కలవు. ఇవి ఒక్కొక్కటి ౩౦౬ అడుగుల పొడవును, ౧,౮౦౦ టన్నుల బరువును గలవి. ఇవి చేయు పని ముఖ్యముగా కాంక్రీటు తయారుచేసి, గొట్టములద్వారా గోడపై పోయుట. ఇవి ఒక్కొక్కటి ౧౨ గంటలలో ౨,౦౦౦ టన్నులు తయారుచేయగలవు. వీటిలో ఒక్కగోపురపుయంత్రము బొమ్మ (౧౬) యందు చూపబడినది. రెంటియొక్క ఖరీదు సుమారు ౨౮ లక్షలరూపాయలు.

ఇందులకు కావలసినట్టి రాతి సంతయు బ్రద్దలు గొట్టి తయారుచేయుటకుగాను నదికి ఇరుప్రక్కలను మూడుయంత్రములు కలవు. ఇవి ఒక్కొక్కటి గంటకు సుమారు ౨౦౦ టన్నుల రాతిని తయారుచేయగలవు. వీటియొక్క ఖరీదు సుమారు ౧౮ లక్షల రూపాయలు.

ఇచ్చట నున్న అన్ని పనులును విద్యుచ్ఛక్తిమూలమున కాబడుచున్నవి. ఈవిద్యుచ్ఛక్తి యంతయు ప్రస్తుతము ౯౩ మైళ్ళదూరమున నున్నట్టి శివసముద్రమునుండి ౩౫,౦౦౦ Volts, ౨౫ cycles నుండి యిచ్చటికి



బొ. ౧౬ : గోపురపు యంత్రము

వచ్చును. దానిని మైసూరు గవర్నమెంటువారు ౩,౩౦౦ volts, ౫౦ cycles కు మార్చి మద్రాసు గవర్నమెంటువారికి ఒకేమొత్తముగ చౌకగా నమ్ముచున్నారు. మొత్తమున ౬,౦౦౦ K. V. A. అందు బాటు చేయుటకు వసతులు గలవు. ఇటువంటి పను లన్నిటికొరకై నిర్మించియున్నట్టి కర్మాగారములును, విద్యుచ్ఛాలలును మొత్తము సుమారు ౨౫ లక్షల రూపా యలు. కర్మాగారములు కొన్ని బొమ్మ (౧౮) యందు చూపబడినవి.



బొ. ౧౭ : ఎనిమిది ద్వారములు



బొ. ౧౮ : విద్యుచ్ఛక్త్యుత్పాదనశాలలు

మెట్టూరు విద్యుచ్ఛక్తి ప్రబంధము (Mettur Hydro-electric scheme) ప్రకారము విద్యుచ్ఛక్తి నంతయు ఇక్కడనే తయారుచేయ ప్రయత్నించు చున్నారు. నీలన, మెట్టూరు సరస్సునం దింత నీరు నిలువయుంటచే, ఈ నిలువనీటియొక్క ఒత్తిడినుండి విద్యుచ్ఛక్తి తీయ నిశ్చయించిరి. నిలువనీటియొక్క ఒత్తిడి, చదరపు టడుగునకు సుమారు ౧౫ టన్ను లు. అందుచే ఆనకట్టుగోడయందు ౯౬౦ అడుగుల పొడవునకును, ౧,౨౦౦ అడుగుల పొడవునకును మధ్యను నాలుగు విద్యుచ్ఛక్తి నీటిగొట్టములను స్థాపింప బడియున్నవి. ఒకొక్కగొట్టముయొక్క వ్యాసము ౧౫ అడుగులు. ఈ నాలుగు నీటి గొట్టములలోను ఒకొక్కక్క గొట్టము లోనికి నీరు సరస్సునుండి రెండు ద్వారములగుండా ప్రవహించును. ఇటులున్న ఎనిమిది ద్వారములును బొమ్మ (౧౭) యందు చూపబడినవి. ఇటులు గల ఎనిమిది ద్వారములు మూయుటకును, తెరచుటకును, మర మ్మత్తులకును తగిన ఏర్పాటులు కలవు. ఈనాలుగుగొట్టములును, వెనుకనుండు విద్యుచ్ఛాలకు నీటిని గొనిపోయి, అచ్చట ఈనీటిఒత్తిడివల్ల నీటిచక్రము లను (Turbines) త్రిప్పును. ఈసర స్సునందు నీటిలోతు హెచ్చుచు, తగ్గు చునుండుటచే సగటున ౧౨౫ అడుగుల లోతుతో సుమారు ౩౩,౦౦౦ H. P. తయారుచేయవచ్చును. ఈ నాలుగు నీటిగొట్టములును బొమ్మ (౧౯) యందు కనబడుచున్నవి.



బొ. ౧౯ : నాలుగు విద్యుచ్ఛక్తి నీటిగొట్టములు


ఇచ్చట తయారగు విద్యుచ్ఛక్తిని పైకారా యందు తయారగు విద్యుచ్ఛక్తితో కలిపెదరు. ఇచ్చట నుంచి విద్యుచ్ఛక్తి ౨౦౦ మైళ్లదూరమున నున్న మద రాసునకును, ఈచుట్టుప్రక్కల నున్న సేలము, తిరుచ నాపల్లి, చెంగల్ పట్టు మొదలగుప్రదేశములకు చవుకగా పంపనగును. సేలంజిల్లాయందున్న కొన్ని గనుల పరిశ్ర మలు వృద్ధి పొందుటకును వీలగును. ఇంతే కాకుండా ఈ ఆనకట్టుగోడ పూర్తిఅయినపిమ్మట ఇచ్చట విద్యు చ్ఛక్తి చాల చవుకగా దొరకనుంటచేతను, రాకపోకలు మొదలగు వసుపాయము లుంటచేతను ఈమెట్టూరునందు పరిశ్రమలు స్థాపింప చాల లాభకరముగా నుండును.

ఈ కావేరీ మెట్టూరు యత్నమునకు సంబంధిం చినట్టి కాలువలుకూడ చాలమట్టుకు తయారైనవి. ఈ కావేరీ మెట్టూరు యత్నముయొక్క మొత్తపుఖరీదు సుమారు ౪. ౩౪ కోట్లరూపాయలు. ఇందు సుమారు ౨. ౨౮ కోట్లరూపాయలు కాలువలకుగాను. ఈ ఆన కట్టుగోడయందు మొత్తము సుమారు ౨౮౦ లక్షల ఘనపుటడుగుల కట్టడము (Masonry) పట్టును. ఈ యత్నము క్రింద మొదటి లెక్కలప్రకారము సుమారు ౧౦ లక్షల ఎకరములును సాగుబడి చేయనగును. ఇంతే కాకుండా, సుమారు ౩,౦౧,౦౦౦ ఎకరము లనుకూడ సాగుబడి చేయ నుద్దేశించుచున్నారు. వ్యవ సాయములకై నీటివిభజన గ్రాండు ఆనకట్టు (Grand Anicut) క్రిందనే ప్రారంభ మగును. ఈ యత్నము ౧౯౩౮-వ సం॥ పూర్తియగు నని తలంచుచున్నారు.

ఈయత్నమునందు పాల్గొనుచున్న ఉద్యోగస్థు లలో సుమారు ౨౦ మంది ఆంధ్రులుకూడ కలరు. ఇంత ఉన్నతమగు యత్నమును సఫలముగా పూర్తిచేయుట యందు ఆంధ్రులకుకూడ భాగము కలదనువిషయము ఎంతయు ఆనందదాయకమైనది.



బొ. ౨౦ : మెట్టూరు ప్రాజెక్టు నిర్మాణ కార్యమున వినియుక్తు లయియున్న యుద్యోగులను నాంధ్రులలో కొందఱు



క వి పూ జ

గతమాసమున రాజమహేంద్రవర నాగరికులు స్వర్ణ కంకణముతో కవిశేఖర వడ్డాది సుబ్బారాయడు గారినీ, కవిగండపెండేరముతో కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారినీ యావదాంధ్రమహాజనుల పక్షమున సత్కరించినారు.

దీనితో వాఙ్మయవాహిని మరల నొకసారి యుత్తరంగితమైనది. కవికుమారుల తీవలేఖినికి నవశక్తి, నూత్న ప్రవృత్తి యొదవినది.

రాజమహేంద్రవరము కవులకు జన్మస్థలము కూడనా? వాసస్థానము మాత్రమేనా? ఇదియొక క్రొత్త ప్రశ్న. ఈ విషయము నుద్ఘాటించి, వాసస్థానము మాత్రమే యనుటలో సబబున్నదని శతావధానులు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు చేసిన ప్రతిపాదనము యుక్తియుక్తముగా నున్నది. అయితే: రాజమహేంద్రవరము కవులకు వాసస్థానము మాత్రమే అయినా ఆది కాలమునుండియు నిచ్చట కవులకు సమ్మానము, భాషా వాఙ్మయములకు పోషణము ప్రశంసాపాత్రముగనే జరుగుచున్నవి.

ఈ సమ్మానము, ఈ పోషణము పూర్వము జమీందారు మొదలు చక్రవర్తివఱకును ప్రభువులే—వ్యక్తిగ్రాహ్యముగ ప్రభుసల్యాశే చేయుచువచ్చినారు. కాని నేడు ప్రజలు—జనసామాన్యము చేయుచున్నది. ఇదియే, ఇంతే భేదము.

భేద మిదియే. ప్రవృత్తిలోగూడ భేద మింతే; గాని పర్యవసానము మాత్రము పోలికలేనిదిగా నున్నది.

అప్పటి వాఙ్మయమున నొకటే మార్గము. ఒకటే పద్ధతి. ఒకటే లక్ష్యము. ఒకనిని జాతి యొకఁడు, ఒకనిని మించవలెనని యొకడు నప్పుడు కవులు గతానుగతికముగా పద్యము లల్లినారు.

వారిలో స్వతంత్రులు మిగుల—చాలా తక్కువ.

ప్రభువుల మందహాసమునే అప్పటికవులు కాంక్షించినారు. అందుకు సంతోషించి ఆ రాజులు ఆ కవులకు శాలువలు కప్పినారు. గొప్పగొప్ప మాన్యము లిచ్చినారు. అగ్రహారము లొసంగినారు. తుదకు గండపెండేరములుగూడ తొడిగినారు.

ఆ కవులు ఇట్లు ఆకాలమునకు తగిన యున్నతి, అప్పుడు ప్రశస్తిగన్న ఆనందము అనుభవించినారు.

ఇప్పటి రాజులకు—జమీందారులకు, కవుల యెడల నాదరము, వాఙ్మయమునెడల ప్రీతి యున్నదనుట చాల సాహసము. జంతువులమీదనున్న ప్రేమ వారికి దేనిమీదను, ఎవరిమీదను లేదు.

ఉండినచో అది యాంధ్రేతర కవులమీదను, ఆంధ్రేతర వాఙ్మయములయెడలను ఎక్కువ.

ఏతావతా: ఇప్పుడు కవులభారము రాజుల భుజస్కంధములనుండి జాతి ప్రజల శిరములపై బడినది. కవులకు ప్రజలజీవిత విశేషములను గానము చేయవలసి వచ్చినది.

జనసామాన్యమున ఒక్కొక్క స్త్రీ యందును, ఒక్కొక్క పురుషునియందును వికసించియున్న సుగు

ణములను, కీర్తింపని కవి కిప్పుడు ఆదరపూర్వకమైన స్వాగతము, హృదయపూర్వకమైన పూజ లేవు.

ఎట్లయినను అంకురము పొటమరించినది; గాని యిప్పుడు ఆంధ్రకవులును, ఆంధ్రప్రజలునుగూడ తమ బాధ్యతలను లెస్సగా గుర్తించినట్లు లేదు.

అయితే: ఇప్పుడు కవిశేఖరులకును, కవి సార్వభౌములకును జరుపబడిన సత్కారము వారికి చాలిన దేనా? లేక వారందు కర్హులేనా?

ఇవి విషమప్రశ్నలు. ఏమంటే? భాషా వాఙ్మయ ప్రపంచములలో నివి ప్రజాప్రభుత్వము కొనసాగుచున్న రోజులని పైన సూచించియున్నాను. అనుట రుచిమూలకములగు నిట్టి సందర్భములయందు ప్రజలలో నేకాభిప్రాయము గలుగుట సాధారణముగా నెప్పుడును పొసగనిది.

కాని కవి సార్వభౌముల పాదమునకు శతావధానులు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు స్వయముగ గండపెండేరమును దొడుగుటలో విశేష మున్నది.

ఈ బిరుదము సర్వోత్కృష్టతకు చిహ్నము. కవుల మద్రిక్తులను గావించి వాదములకు దింపు కీలక మున్న.

ఆధునికాంధ్ర కవిలోకమున వేంకటశాస్త్రిగారి స్థానము సాధారణమైనది గాదు. ఇట్టి సందర్భములలో వారు తగవులకు వెనుదీయువారుగూడ కారు.

అయిన నీ సన్నివేశ మెట్లు తటస్థించినది?

కవి సార్వభౌములకు, వేంకటశాస్త్రిగారికి గురుశిష్య సంబంధ మున్నది; గాని యా సంబంధము ఈ విషయమున నేమియు పనిచేయలేదని వేంకటశాస్త్రి గారు సహేతుకముగ నిరూపించియున్నారు

ఈసమ్మానముల సందర్భమున ఇంక ననేకులు విద్వాంసులు, కవులును గూడ తమ ప్రశంసలను దెలిపియున్నారు.

ఇంతకీ: ఈ సందర్భమున వ్యక్తిపరముగ విమర్శనము చేయుటకంటె ఈ సమ్మానములు మానాకు దొడుగుచున్న నవ్యాంధ్రకవితాలతకు దోహదముగా నర్థముచేసికొనుట మంచిది. ఏమంటే? ఆంధ్రవాఙ్మయమునకు నవీనత యెంతో కలుగవలసియున్నది. ప్రజలప్రోత్సాహము లేనిదే వాఙ్మయ నిర్మాతలు సర్వతోముఖమగు నిర్మాణమును గావింపజాలరు.

—శాస్త్రి

చెన్నరాజధానియందు ౧౯౩౦-వ సంవత్సరము ఏప్రిల్ ప్రారంభము మొదలు
జూను తుదివరకు గల మూడునెలల కాలమున ముద్రితములయి ప్రకటితములయిన

ఆంధ్ర గ్రంథముల పట్టిక*

ఇతిహాసము

శ్రీమదాంధ్రోత్తరమహాభారతము—కె. వెంకటశేషాచారి

కథలు—ఐతిహాసికములు, పౌరాణికములు

పురాణకథలు—కె. నరసింహం.
భాగవతకథామాలిక—డి. సీతారామరావు.

—కల్పితములు

కథాకుసుమమంజరి—టి. పాపయ్యశాస్త్రి.
జనగంటలు—సి. సత్యనారాయణ.
నూఱుగంటి—ఏ. నారాయణదాసు.
మణిమేఖల—వి. సుబ్బరావు.
స్త్రీచరిత్రకదంబము—టి. రాజగోపాలరావు.

—చారిత్రకములు

చరిత్రకథామంజరి—యస్. రాధాకృష్ణయ్య.

కల్పములు

ఆబ్దికవిధానము, సటీక—ధ. నాగభూషణాచార్యదీక్షిత.
శ్రీనాథస్వామి వ్రతకల్పము—ఏ. కృష్ణమూర్తి అండ్ బ్రదర్సు, విశాఖపట్టణము.
శ్రీవిశ్వేశ్వర సపర్యాకల్పః—ము. సుబ్రహ్మణ్యశాస్త్రి.

కామశాస్త్రము

వాత్స్యాయనకామసూత్రములు—(ప్ర). పి. ఆదినారాయణశాస్త్రి, మదరాసు.

కావ్యములు

కవిరాజమనోరంజనము—కె. అబ్బయామాత్యకవి.
సమీరకుమారవిజయము—పుష్పగిరి తిమ్మకవి.
సుమాలినీపరిణయము—జె. వెంకటసుబ్బరాయకవి.

గణితశాస్త్రము

ఎక్కాలు—(ప్ర). గంపోల బ్రదర్సు, రంగూను.
భూమికొలత సర్వేగణితము—యం. రామయ్య.

గేయములు

అచలప్రబోధ యను శుద్ధనిర్గుణతత్వ జంటకందార్థదరువులు—బి. మునిసామి.
ఆంధ్రనాయకుల జైలుపాటలు—భా. ౧ మొ—౬వరకు (ప్ర). వి. శ్రీనివాసాచార్యులు, బెజవాడ.
గాంధిజీ జైలుపాటలు, భా. ౧ మొ—౬వరకు. (ప్ర.) వి. శ్రీనివాసాచార్యులు, బెజవాడ.
తత్వకీర్తనలు—పి. కృష్ణదాసు.
పాంచజన్యము—(ప్ర). వెస్టుకృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.
ప్రార్థనగీతములు—(ప్ర). మునిసిపల్ కౌన్సిల్, బెజవాడ.
ప్రార్థనదీపిక—జి. శేషయ్య, పి. దక్షిణామూర్తిశాస్త్రి.
భగవత్కల్యాణగుణకీర్తనలు—శ్రీరామమూర్తి.
భగవద్గుణానుభవము—వి. వెంకటరామదాసు.
భజనకీర్తనలు—జి. పరిదేశిన్స్.
మద్యపాననిషేధకీర్తనలు—యస్. వెంకయ్య.

---

* ఈ పట్టికయందుగల సంకేతపదముల వివరణము: అ.—అధ్యాయము; అను.—అనువాదము; అనువాదకులు. ప.—పద్యము. ప్ర.—ప్రకాశకులు. భా.—భాగము. వ.—వచనము. సం.—సంపాదకులు. సటీ.—సటీకము.

శ్రీకృష్ణుని జననము—(ప్ర). రామకృష్ణబుక్ డిపో, విశాఖపట్టణము.
శ్రీపాండురంగభజనకీర్తనలు—టి. యజ్ఞమహాలక్ష్మమ్మ.
శ్రీపాండురంగభజనకీర్తనలు—టి. శేషదాస్.
శ్రీమద్రామాయణ యాలపాట—యస్. శేషనామాత్యుఁడు.
శ్రీరామభక్తసంకీర్తనలు—ఏ. వెంకటేశ్వరులు.
శ్రీవరహావతారచరిత్ర—(ప్ర). జి. జగన్నాథం అండ్ సన్, రాజమహేంద్రవరము.
శ్రీవాసుదాసుకీర్తనలు—వి. సుబ్బరావు.
శ్రీహరినామ సంకీర్తనలు—(ప్ర). పి. నాగరత్నము, పెద్దాపురము.

చరిత్ర

వాణీహిందూదేశచరిత్రము—ఛ. నరసింహరావు.

చట్టము

శారదాబిల్లు అనుకూలప్రతికూలవాద సంగ్రహము—ఏ. వాసుదేవరావు.

ఛందశ్శాస్త్రము

ఛందస్సు—వి. వెంకటరాయశాస్త్రి.

జీవితములు

అన్నపూర్ణాదేవి జీవితము—ఏ. వెంకటసీతమ్మ.
తులసీదాసు జీవితచరిత్రము—బి. లక్ష్మీకాంతం.
ఫ్రాన్సిస్ మహనీయునిచరిత్ర—సిల్లిన్ సెయమూర్ డార్లింగ్.
మల్లాది సుబ్బదాసు—పి. వీరరాఘవుడు.
మహాపతివ్రతలకథలు—(ప్ర). సన్ లైట్ బుక్ డిపో, రాజమహేంద్రవరము.
మహారాణి ఝాన్సి లక్ష్మీబాయి—యం. జగన్నశాస్త్రి.
మెజినీజీవితము—యం. జగన్నశాస్త్రి.
లక్ష్మీగంగమ్మజీవచరిత్రము—బి. వెంకటరత్నశర్మ.
శ్రీవిశాలక్షీదేవేరి చరితము—ఏ. వెంకటసీతమ్మ.
శ్రీవేంకటపతి దేవమహారాజు—టి. శివశంకరం.

జ్యోతిషశాస్త్రము

దివగోచారమంజరి—ఆర్. జగదీశ్వరరావు.

దండకములు

కలుగుళ్లమ్మ దండకము—వి. వెంకటసుబ్రహ్మణ్యశర్మ.
దండకత్రయం—(ప్ర). రామకృష్ణ బుక్ డిపో, విశాఖపట్టణము.
మహంకాళమ్మదండకము—యం. చలమయ్య.
శ్రీకృష్ణదండకము—యస్. భాగవతకవి.

నవలలు

కంకణరహస్యము—యస్. అనంతాచార్యులు
జీవనోర్మికలు—డి. కోదండరామయ్య.
నాయకురాలి దర్పము, భా. ౧—సి. వీరభద్రరావు.
ప్రణయమహిమ—జి. వెంకటచలపతిరావు.
భానుమతి—యం. వి. పాపన్నగుప్త.
మాధవి—జె. సత్యనారాయణమూర్తి.
మాయామయి, భా. ౧—కె. రంగయ్య.
సరోజిని—యస్. సదాశివయ్య.

నాటకములు

గయోపాఖ్యానము—యం. సన్యాసయాచార్యులు.
దేవతిలకుల నాటకము—యస్. అప్పలనరసయ్య.
ద్రౌపదీవివాహము—లక్ష్మీనృసింహరాజు.
ముద్రారాక్షసనాటకము—(అను) యస్. అనంతరావు.
మృత్యుంజయనాటకము—జి. బాలసౌరిరెడ్డి.
లీలాపనిందాపహారి నాటకము—పి. వెంకటసుబ్బారాయుడు.
శ్రీభక్తకుచేల—ఏ. వీరవెంకటజోగయ్యశాస్త్రి.
నీతిసింధువు—జె. శేషాద్రిశర్మ.
సావిత్రీపరిణయనాటకము—యు. తమ్మయ్య.
సైంధవపరాభవము—పి. సుబ్బరాయకవి.

పరిశిష్టము

ఆంధ్రనవీనపద్యవాచకమునకు టిప్పణము—(ప్ర). కె. మునిసామినాయుడు, మదరాసు.

ఆంధ్రపౌరుషము—(ప్ర). వెస్టుకృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

ఆనందామృతం, భా. ౨—బి. వి. నరసింహులు శెట్టి.

ఇరువదియొకటవ సంవత్సరాదిసంచిక—(ప్ర). కా. నాగేశ్వరరావు పంతులు, మదరాసు.

ఉపదేశామృతము—మలయాలస్వామి.

ఔరంగజేబుదౌర్జన్యము స్వరాజ్యమునకు మార్గము—యస్. ఇస్మైల్ షా.

కంకణము—భ. నారాయణమూర్తి.

కమలా కథావాచకములు, తరగతులు, ౨, ౩—కే. వి. సుబ్బరావు, ఏ. జగన్నాథశాస్త్రి.

కృతివిమర్శననిరాసము—వి. రామసుబ్బారాయుఁడు.

కోసేరు—కె. వెంకటరావు.

గుమ్మెనముద్దులరవ్వ—ఏ. వెంకటేశ్వరులు.

గ్రామపునర్నిర్మాణపు తరగతుల ఉపన్యాసములు—(ప్ర). యస్. సుబ్బారావు, కొవ్వూరు.

గ్రామమునపభులపరిషత్ ప్రదర్శిని—బి.లక్ష్మీనరసింహం.

గీతామంజరి, తే. ౬, ౭, ౮—సి, దీక్షితులు.

చతుర్థవార్షిక కార్యనివేదిక—(ప్ర). యం. యస్. చలపతి, ఏలూరు.

ఛాందసుక్కులసభలు—వి. వి. ఘంటరాజుశాస్త్రి.

జర్మనీదేశ విద్యావిధానము—సి. నారాయణరావు.

జ్ఞానభాస్కరము—టి. వెంకటసుబ్బరావు.

త్రయి—కె. వెంకటరావు.

దరిద్రనారాయణీయము—(ప్ర). వెస్టుకృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

దాంపత్యము—(ప్ర). డి. నాగేశ్వరరావు, మదరాసు.

నారదప్రభావము—పి. పిచ్చయ్య.

నాళంవారి సత్రము—యస్. రామలింగయ్య, యస్. సత్యానందం.

నిర్భాగ్యభారతము—డి. వెంకటశివరావు.

నూజవీటి ప్రభువులగు అప్పారాయుల వంశచరిత్ర, సంకుచితము—(ప్ర). డి. అప్పరావు, నూజవీడు.

నూతనవాచకము, బుక్ ౨, ౩—ఏ. వి. నరసింహం.

పవిత్రవర్తనాబోధిని—డి. రామచంద్రరావు.

పురాణవాచకము, తరగతులు, ౬, ౭—జి. సోమన్న, భ. నారాయణరావు.

పెద్దబాలశిక్ష—పి. సీతారామశాస్త్రి.

బాలరామాయణము, సటీక—(ప్ర). కె. లక్ష్మణమొదలి అండ్ సన్, మదరాసు.

భారత బాలవీరులు—పి. సూర్యనారాయణతీర్థులు.

మద్యపానని షేధము—కె. ధర్మన్న.

మధుమురళి—(ప్ర). వివేకవర్థనీగ్రంథమండలి, బాపట్ల.

మనలను విడువని చుట్టాలు (ప్ర). క్రిశ్చియన్ లిటరేచరు సొసైటి, మదరాసు.

మానవధర్మములు—(ప్ర). యం. జగన్నశాస్త్రి, రాజమహేంద్రవరము.

మారుతి నూతన నివిత్స వాచకము బుక్, ౨, ౩—బి. రామమూర్తి, యస్. యస్. సోమయాజులు.

మూడవతరగతి క్రొత్త తెలుగువాచకపుస్తకము—యస్. భూషణం.

మొదటితరగతి పుస్తకము—(ప్ర). క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాసు.

రఘుకులవీరులు—కే. వీరమల్లయ్య.

లతావాచకము, తే. ౩—యస్. వెంకటనరసింహారావు

లోకచరితము—డి. సర్వేశ్వరుఁడు.

వానిళ్ల వాచక పుస్తకము, తరగతులు ౧ మొ—౫ వరకు—జె. గంగన్న.

విద్వద్రాజకులప్రదీపిక—(ప్ర). బి. సీతారామరాజకవి, ఊనపల్లి.

విమానయానము—(అను) యం. విశ్వనాథము.

వివాహితాంగనా హితము—(ప్ర), యస్. యఫ్. కింగ్ జుట్, లండన్.

వివేకవాచకము, బుక్, ౮—(ప్ర). ఇండియన్ పబ్లిషింగ్ హౌస్, మదరాసు.

వీరగాంధర్వము—బి. రామానుజాలు రెడ్డి.

వెలమకులమహాశయులలోకవిజ్ఞప్తి—డి. అప్పలనాయుడు

శాంతిపుష్పము—(ప్ర). పి. నాగలింగం, మొరటోల.

శారదాపద్యవాచకములు, బుక్ ౭—టి. రాజగోపాలరావు.

శారదాబిల్లు హడావిడి—ఏ. యస్. రాజు.
శుచిముఖి—యస్. సీతారామమూర్తి.
శ్రీగురుభక్తనిజయము—పి. ఆదినారాయణశాస్త్రి.
శ్రీపద్మావతి—కె. కె. అప్పన్ అయ్యంగారు.
శ్రీపాండురంగ నక్షత్రమాల—టి. పేరిలింగం.
శ్రీభీమేశ్వరస్వామివారి కోటిపత్రిపూజలో పోణంగి లింగమూర్తిదాసుగారిచ్చిన యుపన్యాసము—(ప్ర). యస్. సుబ్బారాయుడు, కపవరము.
శ్రీరామ వనవాసము—పి. పిచ్చయ్య.
సంగ్రహచరిత్ర—(ప్ర). గోదావరి స్వదేశీ కోఆపరేటివ్ పర్చేస్ అండ్ సేల్స్ సొసైటి లిమిటెడ్, అనంతవరము.
సరస్వతీశాస్త్రపాఠములు, బుక్, ౨, ౩, ౪—యస్. సత్యనారాయణ.
సామాన్యజ్ఞానము, త. ౪—(ప్ర). టి. వి. చెల్లప్పశాస్త్రి అండ్ సన్సు, మదరాసు.
సుఖజీవమార్గము—జే. యఫ్. రూదర్ ఫోర్డు.
హరివంశము (ప్ర)—యం. వెంకటరత్నము.
హరిహరగుహ భజనోత్సవచంద్రిక—కె.రంగనాథయ్యర్

పారిశ్రామికము

చేతిపనుల విధానము—(ప్ర) వాసన్ బుక్ డిపో, మదరాసు.

ప్రకృతిశాస్త్రము

ప్రకృతిశాస్త్ర పాఠపుస్తకములు, బుక్. ౧—జి. వెంకటరామయ్య.

ప్రహసనములు

కోడిగ్రుడ్ల కొట్లాట—(ప్ర). యం. యస్. రాములు అండ్ కో, మదరాసు.
ముద్దుమామ—విచిత్రనాథ.

భూగోళశాస్త్రము

క్రొత్త చిత్తూరుజిల్లా భూగోళశాస్త్రము—పి. నారాయణ అయ్యంగారు.
గూడూరు తాలూకా భూగోళము—డి. వెంకట రమణయ్య.
నెల్లూరుతాలూకా భూగోళము—డి. వెంకటరమణయ్య.

మతము—హిందు

పురాణోక్త కర్మప్రకాశిక—(ప్ర). సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.
శూద్ర కమలాకర స్మృత్యుక్త పూర్వకర్మప్రకాశిక—(ప్ర). సి. లక్ష్మీనృసింహశాస్త్రి, మచిలీపట్టణము.
శ్రీ కృష్ణావతారతత్వము, భా. ౨—కె. శేషాద్రిశర్మ.

—ఇతరములు

క్రైస్తవ కీర్తనలు—జగిరి అవాస్.
యేసునాథుని దివ్యహృదయముయొక్క పూజితమాసము- జె. రెవ్. అలక్.
తెలుగు కీర్తనలు—(ప్ర). క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాస్.
దూతయొక్క వర్తమానము—(ప్ర). క్రిశ్చియన్ లిటరేచర్ సొసైటి, మదరాసు.
ప్రభుపాద సన్నిధి—సాధు సుందర శింగ్.

మాహాత్మ్యము

అమరావతి మహాత్మ్యము—యం. అనంతరామయ్య.
పుష్యశుక్ల యేకాదశి మహాత్మ్యము—(ప్ర). వి. సుబ్బారెడ్డి.
శ్రీశైలక్షేత్ర మాహిమము—రామకృష్ణ సీతారామ కవులు.
శ్రీ సింహాచలక్షేత్ర మాహాత్మ్యము—ఏ. కృష్ణమూర్తి అండ్ బ్రదర్స్, విశాఖపట్టణము.

రాజకీయములు

ఉప్పుసత్యాగ్రహము—నిర్మాణకార్యక్రమము—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.
కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమము—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.
బార్డోలీ సత్యాగ్రహ విజయము—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

బ్రిటిష్‌వస్తు బహిష్కారము—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

విదేశవస్త్ర బహిష్కారము—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

సత్యాగ్రహ బోధిని—(ప్ర). వెస్ట్ కృష్ణ కాంగ్రెస్ కమిటి, బెజవాడ.

స్వరాజ్యరథము—బి. కోటేశ్వరరావు.

వాస్తుశాస్త్రము

మయశాస్త్రము—(ప్ర). పంచాననబుక్ డిపో, సోంపేట

వేదాంతశాస్త్రము

ఆత్మవిలక్షణసారము—యస్. శేషకవి.

గూఢార్థసంగ్రహసహిత శ్రీభగవద్గీతాశాస్త్రము—(ప్ర) సచ్చిదానందర్ అండ్ కో, మదరాసు.

శ్రీమద్బ్రహ్మసూత్రభాష్యము—(ప్ర). కే. శ్రీనివాసరావు, విజయనగరం.

వైద్యశాస్త్రము

ఆంధ్రక్షైమజ్వరత్నావళి—(ప్ర). యస్. కృష్ణమూర్తిశాస్త్రి, బెజవాడ.

గోసాయి చిటికలు—బలరామ అవధూత.

పశునేత్రచికిత్స—వై. శ్రీరాములుచౌదరి.

పశువ్రణచికిత్స—వై. శ్రీరాములు చౌదరి.

భస్మప్రకాశిక—(ప్ర). యస్. కృష్ణమూర్తిశాస్త్రి.

వైద్యకల్పద్రుమము—సి. సత్యనారాయణశాస్త్రి.

వ్రణచికిత్స—కె. సుందరరామయ్య.

సిద్ధమూలికా రహస్యము—యం. సుబ్బరాయులునాయుడు.

సుఖరోగచికిత్సారత్నము—సి. వెంకటరామయ్య.

శతకములు

ఏకోత్తరశతలింగ బాలకోటేశ్వరశతకము—బి. వీరభద్రకవి.

కృష్ణశతకము—ఏ. లక్ష్మణస్వామినాయుడు, రాజమహేంద్రవరము.

జామిజనార్దనశతకము—పి. గంగరాజు.

భాస్కరశతకము—(ప్ర). ఏ. లక్ష్మణస్వామినాయుడు రాజమహేంద్రవరము.

ముక్తపదగ్రస్తకందశతకము—జి. బుచ్చిరాజావధూతవర్మ.

శతకరత్నములు, భా. ౧, ౨—(ప్ర). కె. వెంకయ్య, రాజమహేంద్రవరము.

శ్రీచందలూరు మహాలక్ష్మమ్మ శతకము—పి. సుందర వెంకటశేషాచలపతిరావు.

శ్రీభక్తకల్పద్రుమశతకము—బి. సుబ్బరావు.

శ్రీమర్త్యకంఠీరవశతకము—వి. వెంకటాచారి.

శ్రీమాధవశతకము—డి. బాబుసాహెబు.

శ్రీరాఘవశతకము—కె. రామలింగాచారి.

శ్రీరాజయోగిశతకము—కే. వీరయ్య.

శ్రీవరాహలక్ష్మీ నరసింహశతకము—ఏ. కృష్ణమూర్తి అండ్ బ్రదర్సు, విశాఖపట్టణము.

సుమతీశతకము—(ప్ర). వెంకటరాం అండ్ కో, తెనాలి. అర్యక్ బుక్ డిపో, రాజమహేంద్రవరము—ఏ. లక్ష్మణస్వామినాయుడు, రాజమహేంద్రవరము.

సంగీత శాస్త్రము

సంగీతామృత కీర్తనములు, భా. ౧, ౨, ౩—టి.సి. తిరునావక్కరసు.

సారస్వతము

కావ్యమీమాంస—(అను) పి. ఆదినారాయణశాస్త్రి.

స్తోత్రములు

శ్రీకంచికామాక్షీస్తోత్రము—యు. వెంకమ్మ.

శ్రీనరసింహమంత్రము—వి. రాజ్యలక్ష్మమ్మ, తణుకు.

శ్రీమృత్యుంజయస్తోత్రనక్షత్రమాల—కె. తిమ్మయ్య.

శ్రీరామనక్షత్రమాల—టి. లక్ష్మినారాయణ.

శ్రీరామనామస్తవము—వి. జానకిరామమూర్తి.

శ్రీరామస్తవమంజరి—టి. శేష.దాస్.

శ్రీశైలమల్లేశ్వరస్తోత్రము—పి. వీరమ్మ.

హరికథలు

అంగదసందేశము—బి. బాలాజిదాసు.

నిజ భక్త ప్రహ్లాద హరికథ—ఏ. అంకాలుదాసు.

శ్రీరామచంద్రలీలా తరంగిణి—యం. వెంకటాచలం.

శ్రీహనుమద్వివాహము—పి. సత్యనారాయణాచార్యులు

సునస్యోపాఖ్యానము—ఏ. పొన్నయ్యచౌదరి.



వసుచరిత్రము:

'స్వైరవిహారధీర' లనుపద్యమునందలి ధ్వని

వసుచరిత్రమునకు వ్యాఖ్యానములు పెక్కులు గలవు. అందలి పద్యముల పెక్కుతావుల ధ్వన్యర్థము హృదయంగమముగ నుండునని వేఱ చెప్పవలయునా? కావ్యేందిరకు ధ్వని జీవమును, అలంక్రియావితానము సొమ్ములును గదా. అట్టిరెండ వ్యాఖ్యానముల నట్టిధ్వన్యర్థములు విశదీకరింపబడక యుండుట శోచనీయము. 'స్వైరవిహారధీర' లనుపద్యమున 'స్వైరవిహార ధీరలగు సారసలోచనలున్నచోటు'నకు 'చోరున లాతివారు చోరబూనినచో రసభంగ'మంచు కవి నుడివియున్నాడు. రసభంగమనిన నసారస్యమని వ్యాఖ్యాతలు వ్రాసియున్నారు. అది సరియే కాని సారసలోచనలు సాలోచనలగుదురని కదా కవి సూచన. రసశబ్దభంగముచే నిది ఘటించుచున్నది. అందును సారసలోచనలః స్వైరవిహారధీరలుగదా. లాతివారు చోరబూనిన నధీరలగుట సమంజసమే. వారి స్వైరవిహారమున కప్పు డడ్డంకులు వాటిల్లును. అట్టివారిసమీపమునకు నవాంబురుహాంబకుడగు వసురాజే పోవలయును. సారసలోచన, నవాంబురుహాశబ్దములు నాయికలయొక్క పద్మినీత్వమును, నాయకుని యుత్తమత్వమును ఘోషించుచున్నవి. మఱియు సారసలోచనల జేర నవసారసలోచను డేగుటచే స్వజాతీయత ఘటిల్లినది. రసభంగమును వాటిల్లదు. అందును నవాంబురుహాంబకుడు. నవశబ్దముచే నాయకుని యాధిక్యము సూచింపబడినది. మన్మథునికన్న మిన్న యనియు, గిరికకు దగిన వరుడనియు స్పష్టము. అంబకశబ్దమునకు బాణ నేత్రము లను నర్థము లుండుటచే నిది ఘటిల్లినది. రసభంగ మనుచో సాలోచన లగుదురని వ్యాఖ్యానముల గానరాదు. సోమకవి విద్వన్మనోరంజనీ నామక వ్యాఖ్యానమున గూడ నిది మృగ్యంబు.

మఱియు లతాంగిరూపు కన్నారగ జూచి వసురాజునకు చెల్ప మిత్రుడు వచ్చెను. రూపు శబ్దమునకు రత్నాకరాదినిఘంటువుల జక్కదనమనియే యర్థ మొసగబడినది అర్థాంతరము గానరాదు. రూపుశబ్ద ప్రయోగముచే గిరిక యవివాహిత యని సూచింపబడెననియు, రూపన నవివాహితలు ధరించు నొక యాభరణ విశేషమనియు దెలియుచున్నది. రూపు లను నాణెములను బాలికలు పూసలతో ధరించుట మనకు దెలిసినవిషయమే. రత్నాకర, లక్ష్మీనారాయణీయ, పారిజాతాదులయందిట్టి యర్థ మేల గైకొనబడి యుండలేదు? ఆంధ్రనామ సంగ్రహాదులయందును గానము. 'ఈ రూపునకుగల రూ పెయ్యది' యని పూర్వపుపరీక్షాపత్రముల గలదట. ఈ యర్థమునకు గ్రంథాంతర ప్రమాణములు గలవా? వ్యాఖ్యానముల నెందైన నిట్టి యర్థము గలదా? పండితులు విశదీకరింతురుగాక.

—కిలాంబి రాఘవాచార్యులు

'అమరనాథగుహ'

కాశ్మీరమునందలి యాత్రాస్థలము

అనువత్సరము శ్రావణ శుక్ల పూర్ణిమనాడు అమరనాథమునొద్ద మహోత్సవము జరుగుచుండును. వేలకొలది హిందువు లనాదికాలమునుండి ఆనా డచటికి యాత్ర పోవుచుందురు. సదాచారసంపన్ను లగువారు

త్రోవయంతయు కాలినడకను పోవుదురు. అటుపయి వారివారి శక్త్యనుసారము గుఱ్ఱములమీదను, పల్లకీల లోను ప్రయాణము చేయుదురు.

పహేల్గము మొదలు చన్దన్‌వారువరకు గలమార్గము తిన్ననై యున్నది. లిడారువల్లా ప్రాంతములగల యడవులమార్గము వంపులు తిరిగి రమణీయముగ నున్నది.

చన్దన్‌వారువద్ద నదిమీద మంచు గప్పియుండును. ఇట్లు నది నావరించిన మంచు నదిమీద స్వభావముగ నేర్పడిన వంతెనవలె గన్పట్టుచున్నది.

చన్దన్‌వారునుంచి బాట చాల కష్టమైనది. యాత్రికులు బారులుతీరి పోవుదురు. ఈబారులు కొన్ని మైళ్ల పొడు గుండును.

పర్వతమార్గమున కొంతదూరము పోయిన తరువాత చెట్లు చేమలు పెరుగని బయళ్లు కనబడును. ఆ ఎత్తయిన ప్రదేశమున బయళ్లు గంభీరముగ నుండును. ఆ బయళ్లయం దేవో కొన్ని పుష్పజాతులుమాత్ర ముండును.

ఇంకను కొన్ని మైళ్లు దూరము పోయిన తర్వాత లిడారుయొక్క యుత్పత్తిస్థానము కనవచ్చును. ఇచటికి షిష్రామనాగు ౨౦౦ అడుగులక్రింద మంచులో నున్నది. సరస్సునకు చాలదూరమున కోహెన్హారు ౧౭,౦౦౦ అడుగుల ఎత్తున మంచుతో గప్పబడియున్నది. ఇక్కడ యాత్రికులు స్నానము చేయుదురు. అచటినుండి మహంతు మొదలగు పూజారుల యాజమాన్యమున పంచతర్ణి తీర్థమునకు యాత్రికులు పోవుదురు. దారిలో మహాగుణపర్వతశ్రేణిని, హిమశిలలను వీరు దాటవలయును.

పంచతర్ణి అనగా అయిదు తీర్థములు. అంత చలిలో యాత్రికులు ఆ అయిదుతీర్థములలోను స్నానము చేయుదురు. ఒకతీర్థమునుండి మరియొకతీర్థమునకు తడిగుడ్డలతోనే పోయెదరు. పంచతర్ణి వద్దనుంచి అమరనాథమునకు మూడుమైళ్లదూరము గలదు. అక్కడినుంచి యాత్రికులు అమరనాథాలయమందు సమర్పింపవలసిన ముడుపులను సంసిద్ధము చేసికొనుచుందురు.

అమరనాథము చేరి అమరావతియందు స్నానము చేసి యాత్రికులు తాము తెచ్చిన పుష్పములను తీసికొని శివస్తోత్రములు చేయుచు దేవాలయమునకు పోయెదరు.

గుహయందలి ఆగ్నేయభాగమున స్వయంభువైన శివలింగము గలదు. ఆగుహయం దనేకవందలమంది చేరి పరమేశ్వరుని ప్రార్థించి తమ మ్రొక్కులను ముడుపులను జెల్లించెదరు.

ఆగుహయందే స్వయంభువులైన పార్వతీ గణేశుల విగ్రహములు గలవు. అట్టి విగ్రహము లేవిధముగ నేర్పడినవో యని శాస్త్రవేత్త లాశ్చర్యనిమగ్ను లగుచున్నారు.

ఈమహోత్సవసందర్భమున చేరిన యాత్రికులకుటీరములన్నియు గలిసి ఒక గొప్పపట్టణమువలె గన్పించును.

యాత్రికుల శంఖనినాదములు, వేద గానము, చీకటి పడగానే వెలిగింపబడు దీపముల కాంతియు హృదయోల్లాసమును గలిగించుచుండును.

యాత్ర పూర్తియయిన తరువాత యాత్రికులు 'హతియారా తలావ్' అనెడి సరస్సుమీదుగా పోవుచుండెడి యాచారము గలదు. ఇపు డామార్గ మపాయకరముగ నున్నది గాన కాశ్మీరదేశ ప్రభుత్వమువా రాదారిని నిషేధించిరి. పూర్వ మెపుడో యాత్రికు లామార్గమున పాటలు పాడుచు బోవుచుండగా, ఆ శబ్దమువలన గాలిలో గలిగిన మార్పుచే గాబోలు, వినాశకరమగు వడగండ్లవాన వచ్చినది. అందరు చనిపోయి కొద్దిమంది మాత్రము మిగిలిరి. కావుననే యీసరస్సునకు 'హతియారా తలావ్' [హాయుధసరసి] అను పేరు వచ్చినది. ఆదారిని పోవుచు పెద్దగా మాట్లాడినగాని, పాడినగాని, కడకు సరస్సువంక చూచినమసరే, చావునిజమని యాత్రికులు తలంచెదరు. ఈసరస్సును గురించిన కథయిది.

పంచతర్ణియొక్క జన్మస్థానమునకు దారి యొక మంచుగుహగుండా యున్నది. దారిలో హిమశిలలు మెండుగ నున్నవి.

అపుడపుడు మంచుగుహ విరిగిపడి అపాయముగ నుండును. అపుడపుడు సూర్యకిరణములు ఈమంచు శిలలపై ప్రసరించి వివిధములగు రంగులతో ఈ ప్రదేశములను ప్రకాశింపజేయుచుండును.



శ్రీయుతులు అరియాకుడి రామానుజయ్యంగారు



శ్రీ అరియాకుడి రామానుజయ్యంగారు నేటి దాక్షిణాత్య సంగీతప్రపంచమునందు అగ్రస్థాన మలంకరించియున్నారన్న అతిశయోక్తి కానేరదు. ప్రారంభమునందే వీరు తమ అసమానసామర్థ్యము వలన, తమకు గల్గిన అతంకములనెల్ల అతిక్రమించి సంగీతకళా ప్రపంచమున ఘనమగు విద్వాంసులని పేరు వడసిరి.

దయామయుడగు భగవంతుని కృపవలన ఆరంభమునందే వీరికి శ్రీ రామనాథపురము శ్రీనివాసయ్యంగారివంటి అపూర్వ విద్వాంసులయొద్ద శిక్షణము చేకూరెను. కొంతకాలము వీరియొద్ద నభ్యసించి, అటుతరువాత శ్రీ ఎం. శ్రీనివాసయ్యంగారివద్ద తమ పాండిత్యమున సంపూర్తి చేసికొనిరి. అరియాకుడివారి సంగీతము చాల వరకు శ్రీ ఎం. శ్రీనివాసయ్యంగారి సంగీతమునే పోలియుండును. అరియాకుడివారు మొదటి పర్యాయము చెన్నపురిలో తమ కలాకౌశలమును ప్రదర్శించినతరి సభికు లాశ్చర్యముతో వీరి సంగీతము ఎం. శ్రీనివాసయ్యంగారి సంగీతమునకు సరియైన నకలు (గ్రామఫోను రికార్డు) వలె నున్నదని పొగడియుండిరి.


చెన్నపురిలో సభ జరిగినచోటనుండియు, వీరికి పౌరప్రముఖుల సాహాయ్యము సునాయాసముగా చేకూరెను. నాటినుండియే వీరి అభ్యుదయముకూడ మొదలిడిన దనవచ్చును.

వీరి సంగీత మన్నివిధములను శ్రేష్ఠమైనదన వలనుకాదు. కే. శే. పుష్పవనం అయ్యర్ గారి సమృద్ధియు సరళత్వమును గల్గిన తరుకుగాని, కోనేరి రాజపురం వైద్యనాథయ్యర్ గారి గాంభీర్యము గాని, వీరి సంగీతమునందు లేదందురు. వీరు ప్రారంభించిన విద్యయందు అవిచ్ఛిన్నమైన భక్తితో గూడిన సాధకముచేతను, అతిశయమైన స్వప్రయత్నముచేతను సాటిలేని కౌశలమును పొందిరే గాని, సంగీతమునందే పుట్టి పెరిగిన విద్వాంసులందు కనబడు సహజమైన సొంపు వీరి కళయందు అరుదు. మరియు వీరి సంగీతము రక్తికట్టుట సమయమునుపట్టి యుండును. ఒక్కొకతరి శ్రోతలను ఆనందతరంగముల దేల్చివైతురు. సాధారణ స్వరములనే దైవికకళగా చూపుదురు. వీరి కీర్తనలయం దొకవిధమైన నవ్యమాధురి యున్నది. రాగాలాపనము కాల్పనికభావముల నతిశయిల్లును. వీరు పలువిధములగు ఆడంబ

రములు లేకయే సభికులకుం దానందమును, ఉత్సాహమును కలుగజేయుదురు.

వీరు తమ కలాకౌశలముచే నిజమైన సంగీతాభిమానియను ప్రతియొక్కని హృదయమునను స్థిరమగు స్థానమును గలిగియున్నారు. నేటికే వీ రనేకములగు బహుమతులను బడసిరి. కొద్దిరోజుల క్రితమే కళాభిమాని శ్రేష్ఠులగు మైసూరు సంస్థానాధీశులు వీరిని ఉత్తమతరగతి బహుమతిచే సత్కరించిరి. ఇంతయే కాక ఇంకను అనేక సంగీత కళాభిమానుల మన్ననలకు పాత్రులై యున్నారు.

ఇప్పటికి అరియాకుడి వారికి వయస్సు ౩౫ వత్సరములు మాత్రమే. వీరు తిరువయ్యారులో ప్రతి సంవత్సరము జరుగు త్యాగరాజఉత్సవములకు కార్యదర్శి. కొద్ది రోజులకు పూర్వము ఓడియన్ కంపెనీవారికి కొన్ని కీర్తనలను రికార్డు చేయుట కిచ్చియున్నారు. ఇవి వీరి సంగీతము ప్రత్యక్షముగా విని ఆనందించుట కవకాశము లేని రసికుల కెంతయు నుపయోగపడగలవు. వీరు తమ కళానైపుణ్యముచే దాక్షిణాత్య సంగీతము నితోధికముగ నభివృద్ధికి తేగల్గుదురని నమ్ముచున్నాము.



వరాహావతారము. (ప్రాచీన చిత్రము)

ఉదయగిరికొండను గల శిల్పచిత్రము.



'కార్తిక దీపములు'

చిత్రకారుడు: శ్రీ ఎస్. వి. ఎస్. రామారావుగారు, మదరాసు.





శ్రీమతి చిలుకూరి లక్ష్మీనరసమ్మ గారు

అనంతపురం జిల్లాబోర్డు సభ్యురాలుగా ఎన్నుకోబడినది. ఈమె అనంతపురమండలమున "గ్రామసేవా సంఘము"లను స్థాపించి పనిచేయుచున్నది. "గ్రామసేవ" అను పేర ఒక మాసపత్రికను నిర్వహించుటకు ఏర్పాట్లు చేయుచున్నది. రాయలసీమోద్యమము ఆంధ్రోద్యమమును భిన్నము కాదనిన్ని, ఆంధ్రదేశములోని ప్రత్యేక భాగముల అభివృద్ధినిగురించి పాటుపడినదే తప్ప మొత్తముమీద ఆంధ్రోద్యమము ఫలింపదను ఉద్దేశముతో వెలకొల్పబడినదనిన్ని, ఆంధ్రహృదయము కలతలేక ఒప్పారుచున్నదనిన్ని, ఈమె విజయము చాటుచున్నది.

ఈమె శ్రీ డా. చిలుకూరి నారాయణరావుగారి భార్య.



ప్రేమ

'విషాదాంతక నవల': కర్త, ఇ. విష్ణురావు గారు, బి.ఏ., బి. యల్., కొవ్వూరు (పశ్చిమగోదావరి). క్రౌను సైజు: ౧౭౭ పుటలు. వెల ౦-౧౨-౦.

అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయడుగారిచే రాజమహేంద్రవరమున సరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రింపబడిన ఈ క్రొత్తనవల అచ్చును, పసుపుపచ్చని కాగితపు అట్టతీరును సుందరముగ నున్నవి.

మూడు భాగములుగ రచింపబడియున్న ఈ నవల ప్రేమోత్పత్తి, "ప్రేమ విజృంభనము", "విముక్తి" యను శీర్షికలు కలిగియున్నది. ఈ నవల పేరువలనను, విభాగముల శీర్షికల వలనను, విషాదాంతమని ముందే తెలుపబడుటవలనను, లోని వస్తువు సుగ్రహమగుచున్నది. గ్రంథకర్త యగు ఇరువంటి విష్ణురావు గారు శరీరాతీతమైన—ఆత్మీయమగు—మోహముకాని, పాశవముకాని — ప్రేమను, కామముకాని హృదయభావమును—విశ్వప్రేమను, ప్రధానముగ చిత్రించి చూపవలయునని ఉద్దేశించి యీ ప్రయత్నము ప్రారంభించినట్లు తోచును.

ప్రేమ యనునది స్వచ్ఛము స్వతంత్రము నగు పవిత్రభావమనియు, అది ఒక శక్తియనియు, దాని స్వేచ్ఛ నరికట్టి మానవ వ్యక్తులలో బంధించి నియమించియుంచుట దోషమనియు, దానిని ఒక్క స్త్రీని ఒక్క పురుషుడే (వైవాహికముగ) ప్రేమింపవలయు నను నిర్బంధములోనుండి విడుదల చేసి విశ్వవ్యాప్త మొనరింపవలయు నను Abstract ideal ఒకటి నేటికాలపు 'భావకవిత్వపు' రచనలలోనుండివలె ఈ నవలలో వెదకి బయటికి తీయవచ్చును, శ్రమపడి!

ఇందలి కథలోని అంశములలో వాస్తవికతయు సహజతయు కానరావు. కథానాయకుల మనస్తత్వము వింతగను, వెఱ్ఱి ధోరణిగను ఉన్నది. కథయంతయు Melodramatic గను, fantastically dreamy and imaginative గను ఉన్నది. ఊహాగానమువలెను భావకవిత్వమువలెను ఉన్న యీ రచన సజీవముగను సంఘచిత్రముగను లేక, పందిరి లేని తీగపాదువలె అల్లిబిల్లిగ గొడవగ నున్నది (clumsy). ఈ పుస్తకము వలన, సంఘము నీతి ఎట్లున్నదో తెలియుటలేదు, ఎట్లుండవలయునో అంతకన్నను తెలియుటలేదు! కథయందు నలుగురు వ్యక్తులు పరలోకమునకు పంపబడిరి. కథానాయకుని మరణము అతిఘోరముగను హేయముగను ఉన్నది. ఇంత విషాదాంత పరిస్థితుల కవసరము లేదని తోచును.

ఇక భాషనుగురించి. శైలి నిర్దుష్టము కాదు. గ్రాంథికమును కాదు, వాడుకభాషయు కాదు. సంస్కృత ఆంధ్ర పదముల కలయిక సమాసములందు చాల తప్పులున్నవి. విషాదాంత మను నుద్దేశముతో 'విషాదాంతక' మని వ్రాయుట గనుము. ఒకచోట "పూలెక్కువగా కాయుట చేతను" (౪౧-వ పుట) అని వ్రాసినారు. వర్ణనలలోను తప్పు లున్నవి. 'ఆమె దృష్టి ఆమధ్యాహ్నపు తేజోవంతమగు సూర్యరశ్మిలో తేలిపోవుచున్నది.' 'హఠాత్తుగా ఆమె మనస్సు నల్లని మేఘాచ్ఛాదితమగు ఆమె వంటరి జీవితమునందు నక్షత్రములచే ప్రకాశించుచున్న నిర్మల నీలాకాశములో

ప్రవహింపసాగెను.' ఒకొరంగములో కాలము మార్పు లేకుండనే 'తేజోవంత మగు సూర్యరశ్మి' యు, 'నక్షత్రములచే ప్రకాశించుచున్న నిర్మల నీలాకాశము'ను. వర్ణనమును పరిశీలింపుడు.

నిర్దుష్టము కాని భాషయు, విస్పష్టమును సహజము కాని భావములును, కలిగి శుద్ధిలేని కథాకల్పనము గల ఈ నవల ప్రయోజన మేమో ఎరుకపడకున్నది.

జ. బ్ర.

రాయబారము

రాయబార మను నామమున, నవలారూపమున, సవిమర్శముగ మహాభారతములోని ఉద్యోగపర్వ కథను రచియించి, తద్గ్రంథ పేటికకు తాళముచెవివంటి విషయసూచిక, ౨౫ పుటల గ్రంథమును ప్రచురించి, ౩౦౦ పుటలకు మించు అసలుగ్రంథమును ముద్రించుచున్నా మని శ్రీ దేవరాజు వెంకట కృష్ణారావుగారు (బరంపురం వేగుఁజుక్క ముద్రాలయాధిపతి) ౯ నెలల క్రిందటనే ప్రచురించిన చిన్ని రాయబారపు విషయసూచికను అందుకొంటిమి. శ్రీ డి. వి. కృష్ణారావుగారు ౪ సంవత్సరము లయి వస్తుసామగ్రిని చేకూర్చి సిద్ధపరచి రచియించిన గ్రంథము ముద్రణమై వెలువడి ఆంధ్రుల హస్తము లలంకరించునాటికి, కృష్ణారావుగారు ప్రచురించిన విషయసూచికను చూచిన వారెవరైన నెంతో సులువుగ నిట్టిగ్రంథము వ్రాసి ప్రచురించుట కెంతేని యవకాశ మొసంగుచున్నది. శ్రీకృష్ణచారిత్ర మెందరెన్ని విధముల రచించినను తనివి తీరని దగుటను ఎవరెట్లు బోధపరచి కొనిన నట్లే సరిపడునట్లు తోపజేయు కథావస్తువు గలదగుటను, పలువురు పలుపోకల పోవుటకు మూల మగుచున్నది. కావున కృష్ణారావుగారు తమ గ్రంథమును త్వరితముగా వెలువడజేయుట యత్యావశ్యకము.

జ. బ్ర.

శ్రీభగవద్గీతా దర్శనము

రాజమహేంద్రవర వాస్తవ్యులగు శ్రీ నిడమర్తి జలదుర్గాప్రసాదరాయ క్రోడీకృతము. డెమ్మీసైజున 189 పుటలు, కాగితపు బైండు. వెల కానరాదు.

గ్రంథరాజం బగు భగవద్గీతాయోగశాస్త్రంబును పరికింపఁ బరికింప పరమార్థము కానవచ్చుచుండును. ప్రసాదరాయఁడుగారు పండితగోష్ఠియందు గ్రహించిన పెక్కు విషయముల నీగ్రంథమున వివరించిరి. పైవరుసయందు శ్లోకములును, క్రిందిభాగమున శ్లోకసంఖ్యప్రకారము వాక్యార్థమును, అధ్యాయాంతమున నందులోని విషయసంగ్రహమును చక్కగా వ్రాయఁబడియున్నవి. అక్కడక్కడ విశేషార్థములును కానవచ్చుచున్నవి. గోపాలనందనుఁ డగు శ్రీ కృష్ణపరమాత్మ ఉపనిషత్తు లనెడి గోవులనుండి గీతామృతమనెడి పాలు పిదికి విజయుఁ డనెడి వత్సమునిమిత్తమున సర్వప్రపంచమున కొసంగెను. ఆ గీతామృతము నాస్వాదించుచుండుకొలఁది క్రొత్తచవు లూరుచుండును. ఇట్టి దుగ్ధధారాప్రవాహము సంస్కృత పర్వతశిఖరములనుండి యాంధ్ర-మైదానముల ప్రవహింపఁజేసి ప్రసాదరాయఁడుగా రాంధ్రప్రపంచమునకు మహోపకారమును కావించిరి.

వర్తమానకాలమున గీతోపదేశము చాల నావశ్యకముగా నున్నది. ప్రజాసామాన్యము స్వార్థపరమై స్వతఃశక్తిని మఱచిపోయినది. సర్వదిశలనుండి పాంచజన్యారావము విధ్యుక్తధర్మముల నెఱవేర్పుఁడని పూరింపఁబడుచున్నది. ప్రస్తుతము కావలసినది ఫలాపేక్షారహిత కర్మ. ఆద్యంతములు గీతాభాషణ మిదియే. తక్కిన గ్రంథములును ఈ విషయమునే చాటుచున్నవి. (St. Matthew, VI, 34. "Take therefore no thought for the morrow: for the morrow shall take care for the things of itself. Sufficient unto the day is the evil thereof.") ఆంధ్రు లీ యుపదేశమును హృదయగతము కావించుకొని కార్యదీక్ష నిర్వహించుచో నతిశీఘ్రమున విశ్వకల్యాణము చేకూరుట నిక్కువము.

అమోఘోపదేశములచే నలరారుచుండు నిట్టి గ్రంథము కాగితపుబైండుకాక మంచి అట్టబైండు కలిగియుండుచో శాశ్వతముగా నుండుట కవకాశ ముండును. వ్యాఖ్యానమున సంస్కృతాంధ్రపదములు కలగూరగంపగా నున్నవి. శ్లోకములు ప్రత్యేకముగా నున్నవి కాన క్రింద తాత్పర్యమును విశేషార్థములును మాత్ర ముండిన సులభపఠనీయముగా నుండును.

"భారతామృత సర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిస్సృతమ్,
గీతా గంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే."

యనునట్లు ఆంధ్రసోదరు లందరు నీ గీతాదర్శనము కావించుకొని జన్మలు సార్థకము చేసికొందురుగాత!

"జగన్నాథం."

శక్తి

దీనికి బ్యారిష్టరు పార్వతీశం అను సువ్యాప్త హాస్యరస నవలా గ్రంథకర్తలును సాహితీసమితి సభ్యులు నగు శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు సంపాదకులు. ఇది ప్రతి శుక్రవారమున వెలువడు క్రొత్త తెలుగు వారపత్రిక. సంపుటము ౧ సంచిక ౧ 16-9-1932 నాడు వెలువడినది. ఈమొదటిసంచికయందు ౨౬ పుటల వ్యాసములు గలవు. ఇదివరకే 'సమదర్శిని' పత్రికయందు ప్రచురితమయిన 'బాపూజీ-మా బాపు' అను హృద్యమగు గేయము ఈసంచికయందు అగ్రస్థానము నలంకరించినది. ఇది శ్రీయుతులు బసవరాజు అప్పారావుగారు రచించినది. ఈసంచిక చివరపేజీలోనున్న గ్రంథాది 'విమర్శనలు'ను, నేటి రాజకీయాది విషయముల గూర్చిన 'పరామర్శలు'ను అప్పారావుగారు వ్రాసినవే. సంపాదకులు వ్రాసినది 'బండసుబ్బడు' నవ్వుతాలకథ ఒక్కటే. అందును, "భావము H. G. Wells గారి కథనుండి గ్రహింపబడిన"దే నని శాస్త్రిగారే మనవి చేసుకొన్నారు. శ్రీ డాక్టరు బుర్రా శేషగిరిరావుగారు వ్రాసిన 'శక్తి'యను వ్యాసమున వారు "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నట్లే "సర్వంఖల్విదం శక్తిః" అనవచ్చునని యారంభించిరి. "అనేకవిధములైన శక్తిపరివర్తనములను మెలియించుటకై 'శక్తి' అను పేరుతో ఆంధ్రమందు తత్త్వోపాసకులు పత్రిక లేవదీసి"రని వీరు వ్రాసిరి. "దేహాశ్రయమైన శక్తిని దేశకాలపాత్రాబాధితము చేయగల మన్నందులకు గాంధీగారే ప్రత్యక్షప్రమాణానుయాయియైన యభినవప్రపంచమున కంతకును సర్వసాక్షి. నిజమైన శక్తితత్త్వ మాయనలో నీనాటి చిన్నమనస్సులకు ప్రకాశించినది. గాంధీజీని స్మరించకుండా మన ఈ ఇరువదియవ శతాబ్దములో 'శక్తి'నిగూర్చి ప్రసంగించలేము" అని శేషగిరిరావుగారు వ్రాసినది తత్త్వోపదేశకముగ నున్నది. "'శక్తి' పత్రికాప్రకాశనము సాహితీకళావిశేషము..." అనియు వీరు వ్రాసిరి. పందొమ్మిదవ శతాబ్దమువరకు గల ఆంధ్రకవులలో గల "జీవిక గాని ప్రతిభ గాని మననాటి శూన్యవాదుల కవితలలో గాని పరిణామవాదుల కవితలలో గాని కనబడదు" అని వీరు తలచిరి. ఇంత నిరుత్సాహమునకును నిరాశకును తావు లేదు. "సాహితీశక్తి విశేషముగా సర్వవిధశక్తి ప్రభావోద్దీపనముగా నడపించుటకు సంకల్పించిన 'శక్తి' పత్రిక ఆంధ్రసంప్రదాయవిలసితమగు ఆస్తిక్యబుద్ధితో నడపబడుగాక యని సాహితీసేవకుల యాశయము" అను శేషగిరిరావుగారి ఆశీర్వాదవాక్యమే 'శక్తి' సంపాదకుల ఈప్సితార్థము కాదగును. శ్రీ కల్యాణానంద...స్వాములచే వ్రాయబడి 'సశేషము'గ ప్రకటింపబడిన 'వేదవ్యాసహృదయము' అను వ్యాసము ఛాందసముగ నున్నది. భారతదేశమున నేటి విద్యావిధానము మార్పుచెందవలసి యున్నదనియు, ప్రాచ్య పాశ్చాత్య విద్యాదర్శములకు సమన్వయము చేకూర్పవలెననియు శ్రీ ములుకుట్ల పేరిదీక్షితులుగారి వ్యాస సారము. శ్రీ తెలికిచెర్ల కృష్ణమూర్తిగారు మన 'నేటి కట్టుబాట్లు'లోనే దాస్య పద్ధతి యున్నదనియు, స్వాతంత్ర్యశక్తిని పెంపొందించుటయే ఈ 'శక్తి' పత్రికోద్దేశ్యమనియు చిన్నవ్యాస మొకటి వ్రాసిరి. ఇదివరకే మా 'భారతి'లో ప్రకటితమైన 'ప్రతాపకుమారి' అను శ్రీ శివశంకరశాస్త్రి గారి

పద్యవ్యాసము మరల ఇందు ప్రకటింపబడినది! శ్రీ వంకూరి సుబ్బారావుగారి 'పూలబాసలు' అను 'రెంకి పాట' ఒకటి యీ సంచికయందు గలదు. శ్రీ తే. కృష్ణమూర్తిగారి 'శేడిమో'గూర్చిన పరిచయ వ్యాసము నిందు గలదు. శ్రీ కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు గార్ల పద్దెములు రెండు పేరుకేనివి యిందు ప్రచురితములు. శ్రీ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రిగారు 'వ్యవసాయాభివృద్ధి' గూర్చి వ్రాసిన వ్యాసము చిన్నదయినను ఉపయోగకరముగ నుండగలదు. 'పాతపత్రికాధిపతి' (?) బసవరాజు అప్పారావుగారి సారస్వతవిమర్శల భాషాధోరణి బాగుంది కాని వీరి విమర్శదృష్టిలో ఆక్షేపణధ్వని అతిగా ఉంది. మొత్తముమీద వీరికి నవ్యకవుల రచనలే రుచింపవని తోస్తుంది. ఏ యువకవీ ఇతనివల్ల ప్రశంస పడయడం అరుదు అన్నప్పుడు ఇతనిలో Right Appreciation తక్కువే అనాలి. సాహిత్యాభివృద్ధికి అడ్డుతగులు ఈ పద్ధతి యవలంబింపదగినది కాదు. వీరి 'పరామర్శ'లలోని అంతర్జాతీయ రాజకీయాంశముల గూర్చిన వ్యాఖ్యాన ధోరణి బాగున్నది. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారి ఆంధ్ర భాషావృద్ధి ప్రయత్నముల గూర్చిన అప్పారావుగారి యనుమానములు సహజముగ నున్నవి.

పుస్తకరూపమున సారస్వత మాసపత్రికల ఆకారము గల ఈ 'శక్తి' వారపత్రిక యత్నము బాగున్నది. కాని మొదటిసంచికలోని వ్యాసముల యేర్పాటుల బట్టి చూచినచో నీ 'శక్తి'కి శక్తి తక్కువ యని గోచరమగును. తరువాతి సంచికలలో ఎక్కువగునేమో! కాని అవి వెలువడలేదు!

జ. బ్ర.

The Andhra University College Telugu Association, Bulletin No. 1.

ఆంధ్రవిశ్వకళాపరిషత్తు-కళాశాలాంధ్రసంఘము వారి ప్రచురణము. సంపుటము ౧, సంఖ్య ౧. అక్టోబరు ౧౯౩౭. సంపాదకులు శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు, ఎమ్. ఏ.

సంపాదకులు తొలిపలుకులందు "ఈ పత్రికారంభమునకు మా విద్యార్థుల యుత్సాహశక్తియే కారణము......ఇది యల్పారంభము. అయ్యు ననుకూల కాలవశమున బహుఫలోదర్కమగునని యూహించెదము. ఇది విద్యార్థుల రచనాసాధనభూమియే కాని, జగదుపదేశకము కాదు. నేరిచి నేరని బాలురు వ్రాయు వ్రాతలు గాన, నివి యప్రౌఢములుగను, దోషసహితములుగను నుండవచ్చును..." అని వ్రాసిరి.

సంచికలోని వ్యాసము లన్నిటను శ్రీ పాటిబండ మాధవశర్మగారు వ్రాసిన 'శాకుంతలము - ప్రకృతి యోగము' అనునది ఉత్తమముగ నున్నది.

ఈ పత్రికకు పోషకులలో నొకరగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఇందు గాంధీ మహాత్ముని ప్రాయోపవేశము గూర్చిన సాభిప్రాయవిశేషములను వ్రాసిరి.

సంఘ కార్యదర్శియగు గ. శ్రీ. వ. ఆచార్యులు గారు వ్రాసిన 'కాలేజి నోట్సు' లో తమ సంఘస్థాపన సమావేశాది కార్యముల గూర్చి క్లుప్తముగ వివరించిరి. వీరు 'ఆంధ్రనాయకశతకము' గూర్చి ప్రశంసావ్యాస మొకటియు వ్రాసిరి. తిక్కనగూర్చియు, తులసీదాసుగురించియు, తిరుపతి వేంకటేశ్వరులగురించియు, ఆంధ్రభారతముగూర్చియు పలువురు వ్రాసిన వ్యాసములు నిందున్నవి. పి. ఆర్. పి. ఫ్రాంసిస్ గారి వ్యాసము పర మతసహనముయొక్క ఆవశ్యకతను గూర్చినదై యున్నది. ఇట్లు ఈ 'బులెటిన్' ప్రచురణమును ఈసంఘమువారు సక్రమముగ చిరకాలము కొనసాగించుచుందురు గాక!

జ. బ్ర.

స్వీకారము

జ్ఞానవాహిని

'ఆర్యమత రహస్యములను, ఆంధ్రభాషా సౌందర్యమును వివరించు ద్విమాస పత్రిక.' సంపాదకుడు: మహోపాధ్యాయ ముదిగొండ నాగలింగశాస్త్రిగారు,

తెనాలి. చందా సం.కు రు ౨. మొదటి రెండు సంచికలు చేరినవి. డెమీ్మ సైజున ఒక్కొకటి ౩౨ పుటలు.

భక్తిప్రబోధిని

మాసపత్రిక. తొలుతటిసంచిక. ప్రకాశకులు: శ్రీరామకృష్ణ పూజామందిరము, కొత్తపేట, గుంటూరు. సం. చందా రు ౧౨. విడిసంచిక ౨ అ. డెమీ్మ సైజు. 'ఇది ప్రతినెల మొదటివారములో ప్రచురించబడును. మహనీయుల చరిత్రముల నిందు వరుసగా నెలకు ౮౦ పేజీలవంతున ప్రచురణ చేయుదుము.' అని తదీయులు.

భక్తచింతామణి

రచయిత: సూక్తిసుధానిధి వడ్డాది సుబ్బారాయుడుగారు, రాజమహేంద్రవరము. 'వెనుకటి కూర్పున ౨౪౦ పద్యములు; ఈ ౨౧-వ కూర్పున ౩౫౨ పద్యములు.' క్రౌను సైజు: ౬౦ పుటలు. వెల ౫ అ.

కవిత్వ చింతామణి

గ్రంథకర్త: చదలువాడ కోటి నరసింహము గారు, ఊటుకూరు, గుంటూరు జిల్లా. క్రౌను సైజు: ౧౩౦ పుటలు. వెల ౧౨ అ.

విజయలక్ష్మీవిలాసము

(అను విక్రమాభ్యుదయము). కర్త: కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు, రాజమహేంద్రవరము. క్రౌను సైజు: ౨౦౮ పుటలు. వెల రు ౧-౮-౦.

శ్రీ గౌతమక్షేత్ర (బుగ్గ) మాహాత్మ్యము

(పద్యకావ్యము). రచయిత: కవిభూషణ దోమా వేంకటస్వామిగుప్తగారు, సంపాదకులు, శ్రీ వాఙ్మయ వినోదినీ గ్రంథమాల, ౩౫-౩౪ తంబుచెట్టివీథి, జి. టి. మద్రాసు. క్రౌనుసైజు: ౧౩౮ పుటలు. వెల ౧౦ అ.

ముద్దు చెల్లెలు

పద్యకావ్యము. రచయిత: దేశరాజు రామదాసు గారు. ముద్రితమైనది శ్రీరామకృష్ణ ముద్రాలయమున, శ్రీకాకుళము, గంజాముజిల్లా. క్రౌనుసైజు.

ఆత్మదర్శనము

వచన వేదాంత గ్రంథము. రచయిత: పులుగుర్త నృసింహామాత్యులు, కాకినాడ (౧౯౧౦). డెమీ్మసైజు ౧౩౬ పుటలు. వెల రు ౧.

మూగతల్లి

'గోమాతను గూర్చిన కావ్యఖండ ప్రకీర్ణము.' ఏలూరు గోసంరక్షణసమితి (కావ్యప్రచురణము-౬). క్రౌనుసైజు: ౩౮ పుటలు.

దెయ్యాల లంక

కర్త: పా. వెం. రాజమన్నారుగారు, బి.ఏ., బి. ఎల్., మద్రాసు. క్రౌను సైజున చిన్న ఏకాంక రూపకము.

మనవి మాటలు

సరస్వతీ సమారాధనము - ఆంధ్రదేశము

శ్లో. 'సంగీత మపి సాహిత్యం సరస్వత్యా స్తనద్వయమ్,
ఏక మాపాతమధుర మన్య దాలోచనామృతమ్.'

అను సూక్తిని బరికించిన, సంగీత సాహిత్యములకు 'గుడి యెడమ' లకుఁ గల వాసి కాన్పించుచున్నను, వాని గుణములును ఫలములును సమానములే యని యంగీకరింపక తీరదు. ఆ రెండును ఏకప్రకృతిజన్యములు; ప్రాక్తన సంస్కారప్రాప్యములు; లౌకికాలౌకికానంద సంధాయకములు. మానవునిఁ బ్రవృత్తి నివృత్తిమార్గములు నేకపదమున నడిపింపఁగల శక్తి యా రెంటికిఁ గలదు. ఈ తత్త్వము కేవల సహృదయ హృదయ సంవేద్యము. ప్రాక్తనవాసనాబలమునఁ దమ్ము నంటిపుట్టినచో వీనిని బ్రయత్నపూర్వకముగా నిరంతరము నారాధించి సిద్ధిఁ బడయ గలిగినవారు మహానుభావులు. అట్లును గాక, తత్సిద్ధిచేఁ దమకు సంప్రాప్తమయిన పరమానందానుభూతియం దన్యులను సయితము భాగస్వాములను జేయఁగలుగువా రామహానుభావులకును మహానుభావులు. అట్టివారు సరస్వతీదేవి కడుపు చల్లఁగాఁ గని ప్రేముడి మీఱఁ బెంచిన పిల్లలనఁ దగినవారు. వారి యారాధనము సరస్వతీసమారాధనము. ఈ తెఱఁగున నారాధిత యయిన సరస్వతి యారాధకులకు సంగీతసాహిత్యరూప స్తనద్వయమునుండి గానకవితారూపామృతమును సంతతధారముగా స్రవించుచుండఁగలదు. సరస్వతి స్రవించు నీ యమృతధారలనుండి కతిపయ బిందువు లయినఁ దమకు లభించుటకయి యాంధ్రులిపుడిపుడే కడచనిన యాశ్వయుజమాసమున నాతల్లి ముద్దుబిడ్డలలో ముగ్గురి నొకతీరున నారాధించి యామెకు ముదమును జేకూర్చిరి. మొనఁదేలి యీమాత్రమయినఁ జేయఁగలిగిన తన్నిర్వాహకులెల్లరు నభినందనార్హులు.

పూజితు లయిన ముప్వురును జగ మెఱిఁగిన బ్రాహ్మణులు. వారిలో నిరువురు సుప్రసిద్ధులగు పండితులు, కవులు. ఒకరు: వడ్డాది సుబ్బరాయ కవిగారు; ఇంకొకరు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు. ఈ యిరువురు రాజమహేంద్రవర పురవాసులు.

వడ్డాది సుబ్బరాయకవి మధురవాక్కున నంకురించిన కవితాలత తత్ప్రౌఢ పాండిత్యాలంబనమున నింపులొలుక నల్లనల్లన నెగఁబ్రాఁకి నిరంతర నవ్యామోదభరితము లయి, పాఠక హృదయముల సూక్తిసుధను జిలుకు వివిధ కావ్యకుసుమములను బుష్పించి 'భక్తచింతామణి' యందుఁ బరిణతి గాంచి యాలోచనామృతముగా నిలిచియున్నది.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి వేదశాస్త్రపఠనాపూత మగు నుద్దండవాక్కున నుద్భూతమయిన కవితామహాలత తత్ప్రచండ

పాండిత్యాలంబనమునఁ బరువులువారుచు నుత్పథమున కెగఁబ్రాఁకి నలువైపులకుఁ బారలు సాఁచి, బహుళగ్రంథప్రసవభారమును వహించి, తత్పూర్వజన్మపుణ్యవిశేషమున నని దంపూర్వము, ననితరసాధ్యము నయిన మహాభారత సంపూర్ణాంధ్రీకరణోరుఫలమును దలను దాల్చియుఁ దద్విజయసూచక స్తంభమువలె సుదృఢముగ నిలిచియున్నది.

వసురాయ కవిగారికి సువర్ణకంకణము (తోడా), సేలువ, నూత్నవస్త్రములు సమర్పింపబడినవి. 'సూక్తిసుధానిధి' యను నన్వర్థబిరుదము నొసఁగఁబడినది. పద్యప్రసూనములతోఁ వారినిఁ గొందఱు పూజించిరి. తద్విరచిత గ్రంథము లన్నిటిని మూఁడుసంపుటములుగ ముద్రించి ప్రకటించుట కేర్పాటు జరిగినది.

శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారికి గండపెండేరమును, దశసహస్రపరిమిత ధనమును సమర్పింపఁబడెను. పద్యప్రసూనములను బలువురు వర్షించిరి. వీరు కవిసార్వభౌమ బిరుదభ్రాజమానులగుట నద్దానికన్న నుత్కృష్టమగు బిరుద మొండేదియు సముచితమయినది లేమిని గుర్తించి కాఁబోలు నన్యబిరుదము వీరి కొసఁగఁబడదయ్యెను.

ఈ యుభయసన్మానమహాసభలును రాజమహేంద్రపురమున జరిగినవి. తొలివారిని ప్రజలెల్లరుఁ గలిసి యథాశక్తిని బయిఁటీరున సన్మానించిరి. మలివారిని కేవలము వ్యక్తిద్వయము ప్రత్యేకము సన్మానించినట్లు తేలుచున్నది. అందొక్కరు మందపాటి శ్రీ సీతారామరాజుగారు. తమ యాస్థానమున నమాత్యపదము నధిష్ఠించిన కవివంశమునందును, కవియందునుఁ దమకుఁ గల భక్త్యభిమానములను బ్రకటించుటకయి వారిచే నొసఁగఁబడినది గండపెండేరము.* కాని వారు తొడిగినది కాదు కృష్ణదేవరాయలు పెద్దనకుబలె ఇఁక రెండవవారు పెరికల కొండయ్యగారు. వీరు తమకుఁ గవిగారియందుఁగల గౌరవముచేఁ దమకుఁ గవిగా రొసఁగవలసిన బాకీని— దశసహస్రపరిమితధనమును— వదలివేసితి మని మహాసభయందుఁ బ్రకటించిరి. ఇట్టి సన్మానము లీ యుభయులయొక్క వ్యక్తిగత భక్త్యభిమానగౌరవములను చాటునవి.

మూఁడవవారు బందరు పుర నివాసులగు హరి నాగభూషణముగారు. వీరు గాంధర్వకళారహస్యవేత్తలు; భగవద్భక్తి తత్పరులు. జంత్ర (వాయువిలీనము) గాత్రముల నసాధారణప్రజ్ఞ గలిగి రెంటను సమానరీతిని గానామృతలహరిని విచిత్రగతుల సునిపుణముగఁ బ్రవహింపఁ జేయఁగల సమర్థులు. విశేషించి, దానిని భక్తిభావ సమ్మిళితముచేసి నిర్మలము, నాపాత

* మన కవిసార్వభౌముని పూర్వు లేయాస్థానమున నమాత్యపదవుల నలంకరించిరో యట్టి యాస్థానవంశస్థులగు శ్రీరాజా మందపాటి రామనారాయణరాజుగారి కుమార్లు శ్రీ సీతారామచంద్రరాజుగారు కవివంశమునందును, కవియందును, వంశానుక్రమముగఁ దమకుఁ గల భక్త్యభిమానములను బ్రకటించుటకయి యీ కవిగండపెండేర మను స్వర్ణ నూపురము నొసంగిరి.

—ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము.

మధురముగ గానించి శ్రోతలను బ్రహ్మానంద పరవశుల నొనరింపఁ జాలినవారు. వీరి సామర్థ్యము స్వపరరాష్ట్రములవారగు సుప్రసిద్ధగాయకులచే నేకగ్రీవముగాఁ బ్రశంసింపఁబడినది. వీరికి శ్రీరామ స్వర్ణ నవరత్న మాలను, స్వర్ణకంకణమును (తోడా) మహాసభవారు సమర్పించిరి. 'వాగ్గేయకారరత్న' అను బిరుదము నొసంగిరి. పలువురు సమర్పించిన ఆదరాభిమానపూరితము లగు పద్యమాలిక లీ వాగ్గేయకారరత్నము సామర్థ్యమును మిన్ను ముట్టించినవి. ఈ గాయక శిరోమణి నిట్లు చిక్రోడసికతాన్యాయమున సన్మానించి యాంధ్రులు ధన్యతను గాంచిరి. ఈ సన్మానమువలన ఆంధ్రలోకమునకును విశేష గౌరవము గలిగినది.

పూర్వము భాషాభిమానులు భాషాపోషకులు నగు మహారాజులు తమ యాస్థానములఁ బండితులఁ గవుల నెందఱనో పోషించిరి; ఎందఱనో సన్మానించిరి. తన్మూలమున వాఙ్మయ మపారముగఁ బెంపొందినది. తరువాతఁ దరువాత నట్టిపోషణ సన్మానములు తఱుఁగఁ జొచ్చిన కొలఁది వాఙ్మయాభివృద్ధియుఁ దఱుఁగఁజొచ్చినది. ఇటీవల దీనిఁ దలపోసి ప్రజలే కవులను, పండితులను యథాశక్తి నానావిధములఁ బోషింప మొదలిడిరి. అట్టి ప్రయత్నము లెల్లవిధములఁ బ్రశంసార్హములు.

కవిత్వము, గానము నీరసమగు మానవ హృదయమునకు సరసత నాపాదించి యాహ్లాదమును సమకూర్చునవి. వానికిఁ జక్కని ప్రవృత్తి లేని దేశము జాతి చైతన్యహీనములు. వాని ననుగ్రహింపఁగలవారు కవులు, గాయకులు. చైతన్యప్రదాతలగు నామహానీయులు దేశీయులకు సర్వథా సర్వదా పూజార్హులు. తత్పూజనము దేశమునకు, జాతికి నిరంతర శ్రేయోదాయకము.

బిరుదముల విషయమున మాత్రము గొంత వివేచన యావశ్యకము. బిరుదములను కల్పించుటయు, నొసఁగుటయు, స్వీకరించుటయుఁ జాల తేలిక. వీనిని స్వీకరించు వారికంటె బిరుదముల నొసఁగువారు గొప్పవారుగ నుండు టావశ్యకము. వెనుకటికాలమున బిరుదములు విశేషించి వీరులకే (యోధులు) చెందెడివి. చక్రవర్తులు, మహారాజులు, తమ సామంతులు మున్నగువారికి వారి వీరకృత్యములకు మెచ్చి బిరుదముల నిచ్చుచుండెడివారు. క్రమముగ నవి యందఱకును నేదో చేసిరని, (చేసెదరనికూడ ఒకొక్కప్పుడు) అంటఁగట్టుటయలవాటయిపోయినది— మఱియు నీకాలమున. కావున ప్రదాత లగువారు మాత్రము విశేషించి వివేకింపవలసియున్నారు. అట్లు చేయకపోవుటచేతనే వేలకొలఁదిగ నీనాఁడు దేశమున సృష్టింపఁబడి, వారివారికిఁ దగుల్పఁబడుచున్న బిరుదములు చాలవఱకు, సర్థశూన్యములు, హాస్యాస్పదములు నయి తమ విలువ నవి పోఁగొట్టుకొనుచున్నవి. ఇట్లగుటను, మునుముందీవిషయమున నాంధ్ర మహాజనులు సముచితమార్గము నవలంబించుట శ్రేయము.

నక్షత్ర మండలము *

(కార్తీకమాసము)


ఉత్తరము



పశ్చిమము

దక్షిణము

* దీనికి సంబంధించిన వ్యాసము మార్గశీర్ష మాస సంచికయందు ప్రకటింపబడును. —సం. భారతి.



ప్రపంచపరిస్థితులు ధర్మజ్ఞులకు, శాంతికాములకు, సత్యప్రియులకు, స్వాతంత్ర్య పరాయణులకు విచారమును గలుగజేయుచున్నవి. ఐరోపామహాసంగ్రామము ముగిసి పదునైదేండ్లు గడచినను ప్రపంచపరిస్థితులందు శాంతిస్థాపనము, ప్రజాసౌభాగ్యము కాలము గడచినకొలది దుర్లభ మగుచున్నవి. విల్సను మహాశయుడు ప్రతిపాదించిన స్వయంనిర్ణయ ధర్మము, ప్రజాస్వామ్యము, వివిధరాజ్య స్వాతంత్ర్యసంరక్షణము వర్సైల్సు సంధిరంగముతోనే నిష్క్రమించినవి. వివిధ రాజ్యరంగములందును సూత్రధారులు ప్రధానరంగముల నంతర్హితములుగ చేసి విష్కంభముల నారంభించిరి. విష్కంభములు మామూలు నాటకరంగములందును, రాజ్యరంగములందును, నితర రంగములందును ప్రదర్శించుటకు వినియోగపడుచున్నవి.

మహాసంగ్రామము చిరకాలసంవర్ధితమైన ప్రపంచసంస్కారమును శిథిలము చేసినది. పాశ్చాత్యసభ్యతాధారమునను సంవర్ధితమైన ప్రపంచసంస్కార మంతయును కూలినది. పాశ్చాత్య సభ్యత్వమునకు లక్ష్యము లైన ప్రచండజాతీయత, ధనస్వామ్యము, వ్యాపార పరిశ్రమస్వామ్యము, దండనీతి, పరాక్రమణము, వ్యక్తిస్వాతంత్ర్యము, ఆయుధధారణ రక్షణము వ్యాధిగ్రస్తము లై ప్రపంచప్రయోజనములకు నిరుపయోగములుగ నున్నవి. పరిశ్రమ వ్యాపారములు స్తంభించినవి. నిరుద్యోగము ప్రబలినది. పన్నులు దుర్భరములుగ నున్నవి. ఆయుధధారణ వ్యయ మపారమయినది. ప్రపంచ మంతయును ప్రచండమైన దుఃఖవేదన ననుభవించు చున్నది. ప్రపంచమునందు శాంతిని, ధర్మమును స్థాపించుటకు సామాన్యజనులు, ముఖ్యముగను యువజనులు, చేసిన త్యాగ మంతయును నిరర్థకమైనది. యువజన హృదయ సంకల్పిత మైన ధర్మరాజ్యము, నిరాధారమై స్వార్థరాజ్యము సహస్రముఖములను పునరుద్ధరణ మగుచున్నది. ధర్మరాజ్యమునకు రాజ్యరంగమునందు గలిగిన పదచ్యుతి నైతికార్థికసాంఘికాది రంగములకును వ్యాపించినది. ప్రపంచమునకు పరిపాటి యైన బలరాజ్యము శిథిల మైనను, రాజ్యతంత్రము ప్రబలమై చాణక్యనీతి వర్ధిల్లుచున్నది. బలరంగమునకు పరిపాటి యైన

చాణక్యనీతి అర్థికరంగమునకును, నైతికరంగమునకును, సాంఘికరంగమునకును సంక్రమించి యథేచ్ఛముగ విహరించుచున్నది. సకల రంగస్థలములందును స్వస్తిపదమును స్వాహా భావము యథావిధి నాక్రమించుటకు తిరిగి ప్రయత్నించుచున్నది. స్వాహా భావము బలసంవర్ధిత మైనను, ధనసంవర్ధిత మైనను, విద్యాసంవర్ధిత మైనను, సంఘసంవర్ధిత మైనను, జాతిసంవర్ధిత మైనను, రాజ్యసంవర్ధిత మైనను సంక్షోభ సంరంభములకు వలెను స్వస్తికిని శాంతికిని వినియోగపడజాలవు. స్వస్తి స్వాహా ల సంరంభమునందు స్వాహాకు పదచ్యుతి గలుగుచున్నను స్వస్తికి పదారోహణము గలుగుటకు ప్రపంచమునం దంతటను మహాపరివర్తనము సంప్రాప్త మగుచున్నది.

స్వస్తి - స్వాహా ల సంరంభము

సంగ్రామదావానలము యువజన హృదయారాధ్యమైన ధర్మరాజ్య ప్రతిష్ఠాపనమును దుస్తరము చేసినది. ధనాభిమానము, విద్యాభిమానము,సంఘాభిమానము,జాత్యభిమానము, కులాభిమానము, వ్యాపారప్రయోజనము ధర్మరాజ్యమును స్వాహాయ స్వాహా చేసినవి. నవజీవనస్థానములను పూర్వసంస్కారము తిరిగి ఆక్రమించినది. పూర్వసంస్కారము శిథిలమై వ్యాధిగ్రస్తమైనను సంచారసాధనమునను ప్రాణసంరక్షణమును జేసికొనుటకు విశ్వప్రయత్నములను జేయుచున్నది. స్వాతంత్ర్యనిరంకుశత్వములకును, జ్ఞానాజ్ఞానములకును, పురాణ నవ జీవనములకును, గుణాగుణములకును, బలధర్మములకును, ధనాధిపత్య కర్మాధిపత్యములకును, స్వస్తిస్వాహాలకును ప్రవర్ధమానంబగుచున్న మహాసంరంభమును ప్రపంచవ్యవహారములు సర్వత్ర ప్రత్యక్షముచేయుచున్నవి. చీనా జపాను సంఘర్షణము, నానాజాతిసమితి విభేదములు, బ్రిటీషు జాతీయప్రభుత్వాంతర్భేదములు, సాంఘికవిభేదములు, నాయకానుచరభేదములు, పారతంత్ర్య స్వాతంత్ర్య విభేదములును అభిమాన ధర్మదేవతల అవరోహణారోహణావసరమును విశదము చేయుచున్నవి. సుప్రసిద్ధ కవీశ్వరుడు బర్నార్డ్షా గారు దేశాభిమానులను నిరుపద్రవకరులను జేయవలయునని బోధించుచున్నాడు. గాంధి మహాత్ముడు వర్ణాశ్రమధర్మములు గుణకర్మ విభాగాధారములుగ నుండవలయునని కోరుచున్నాడు. మానవ ధర్మజ్ఞులు అంటరానితనమును నివారింప గోరుచున్నారు. దేశాభిమానులనువలె నితరాభిమానులను నిరుపద్రవకరులను జేయవలసిన యవసరమును ప్రపంచవ్యవహారములు వేయిముఖములను విశదముచేయుచున్నవి. ప్రాజ్ఞు లందరును నీ యవసరమును ఘోషించుచున్నను పురాణ సంస్కారులు,ఆచారాభిమానులు, స్వప్రయోజన పరాయణులు వారివారి యభిమాన దేవతారాధనమునకు యావచ్ఛక్తిని వినియోగించుచు ధర్మదేవతారోహణమును దుస్తరము చేయుచున్నారు.

* * * *

అభిమానదేవత-హిందూస్థానము

అభిమానదేవతకు హిందూస్థానమునందు గల ప్రతిష్ఠ లోకమునం దేయితర ప్రదేశములందును గనుపడదు. నిరంకుశాభిమానము, అధికారాభిమానము, ధనాభిమానము, కులాభిమానము, విద్యాభిమానము, ఆచారాభిమానము మొదలగు నభిమానదేవతలకు హిందూస్థానమునందు గల విహారావకాశములు ప్రపంచమునం దేయితర దేశములందును లేవని నిత్యానుభవము విశదము చేయుచున్నది. రాజ్యాంగములందు దండనీతి యథేచ్ఛముగ విహరించుచున్నది. న్యాయస్థానములందును, రక్షణశాలలందును, చెఱసాలలందును, శాసనసభలయందును, స్థానికసంస్థలందును, సాంఘికవ్యవస్థలందును, రాజకీయపక్షములందును భేదదండోపాయములకు గల ప్రతిష్ఠ సామదానోపాయములకు లేకున్నది. రాజ్యాంగములందు దండోపాయమునకు గల ప్రతిష్ఠ ధర్మసాధనమునకు గలుగకున్నది. ప్రభుత్వాధికారులు తాత్కాలిక దండశాసనములను శాశ్వతదండశాసనములనుగ మార్చుట రాగల రాజ్యాంగసంస్కరణములకు మహాఫలముగ నున్నది. భారత ప్రభుత్వ మవలంబించుచున్న రాజ్యతంత్ర మంతయును పురాణజీవనమునకు నిదర్శనముగాని నవజీవనమునకు నిదర్శనము గాదు. విదేశీయ నిరంకుశాధికారవర్గమును, స్వదేశీయ పురాణజీవనవర్గమును దేశమును సంక్షోభమయము చేయునటులు శాంతిసౌఖ్యస్వాతంత్ర్యప్రదము చేయజాలకున్నవి. పురాణజీవనపరమైన ఆచారవ్యవహారక్షేత్రములందు నవజీవనపరాయణమైన స్వాతంత్ర్యబీజములు వికసింపజాలవు. సాంఘికపాశబద్ధములైన రాజ్యాంగవ్యవస్థలయందు ధర్మప్రయుక్తములైన పక్షాశయములు ఫలదాయకములు కాజాలవు. నవజీవనాధారప్రయోజనరహితములైన నిర్బంధశాసనములు, శాంతిరక్షణశాసనములు, వర్ణాశ్రమధర్మనిర్ణయములు, రౌండుటేబిలు సమావేశములు, రాజ్యాంగసంస్కరణఘోషములు దేశక్షేమమునకు నిరుపయోగములని కాలము విశదము చేయగలదు.

మూడవ రౌండుటేబిలు సమావేశము

మూడవ రౌండుటేబిలు సమావేశము కేవలము ప్రహసనముగ పరిణమించినచో విచిత్రముగ గనుపడదు. ప్రజావిశ్వాసమునకు పాత్రుడైన గాంధిమహాత్ముడు నిర్బంధము ననుభవించుచున్నాడు. గాంధిమహాత్మునితో సంప్రతించుటకును అధికారులు నిరాకరించుచున్నారు. దేశమునందు పలుకుబడిగల దేశసేవకు లందరును నిర్బంధముల ననుభవించుచున్నారు. ప్రభుత్వము తనకు విశ్వాసపాత్రమైన మితవాదిపక్షమునకును నిరాదరణము చూపినది. మహమ్మదీయులందును స్వాతంత్ర్యప్రియులు నిరాకరింపబడిరి. ఇంగ్లాండునందు లాన్సుబరిగారు మొదలగు కార్మికపక్షనాయకులు రౌండుటేబిలు సమావేశమునందు పాల్గొనుటకు నిరాకరించిరి. గ్రేటుబ్రిటను నందును, హిందూస్థానమునందును పురాణ

సంస్కారపరాయణులు మాత్రము రౌండు టేబిలు సమావేశమునందు గూడి రాజ్యాంగ ప్రణాళికను నిర్ణయించుట, హిందూస్థానమునందు శాంతిసౌఖ్యములను స్థాపించుటకు, నిరుపయోగములని దేశవ్యవహారములు విస్పష్టము చేయుచున్నను పురాణసంస్కారపరు లైన హోరువర్గమువారికి జ్ఞానోదయము గలుగకుండుట వారి హృదయమున కనురూపఫలముగ నున్నది. స్వదేశమునందు అయిరిషు రాజ్యముతోను, కార్మికనాయకులతోను, ఆయుధవిసర్జనసభ సందర్భమునను, నిరుద్యోగ విషయమునను, నితర వ్యవహారముల సందర్భమునను శాంతిస్థాపనమునకు పనిబూనని జాతీయప్రభుత్వము హిందూస్థానవిషయములందు శ్రద్ధను బూనుట యసంభవము. సర్ తేజబహాదరు సప్రూ, జయకరు, ఠాకురు దాసుగారులు మొదలగువారు శీఘ్రకాలముననె కన్నులు తెరిచి వారి యజ్ఞానమును గ్రహింపవలసియుందురు. బ్రిటీషుప్రభుత్వ మవలంబించుచున్న ఆర్థికవిధానమును, వ్యాపారనీతియును, మారకపు పద్ధతియును, కార్మికతంత్రమును దేశమునందు గలుగజేయుచున్న సంక్షోభము వర్ణనాతీతముగ నున్నది. ఈవిషమసమయమునందు హిందూదేశీయుల తరణోపాయము వారి హస్తములందే కలదు. హిందూస్థానమునందు సాంఘికైక్యమునకయి మౌలానా షౌకతాలి, మదనమోహన మాలవీయగారు మొదలగు మహాశయులు చేయుచున్న ప్రయత్నములు సకల జనులకును సమాదరణీయములు గావలసి యున్నవి.

సాంఘికసంయోగము

ప్రయాగయందు దేశభక్తపితామహుడు విజయరాఘవాచార్యులుగారి యధ్యక్షత క్రింద సమావేశమైన సాంఘికమహాసభ సాంఘికసమస్యను ప్రత్యేకసంఘలక్ష్యముతో గాకను దేశస్వాతంత్ర్యలక్ష్యముతోను, ప్రజాస్వామ్యత్వ లక్ష్యముతోను జేయవలసి యున్నది. అవర్ణజాతుల ప్రతినిధులకును, సవర్ణజాతుల ప్రతినిధులకును నేర్పడిన నిర్ణయమువలె నితర సంఘముల ప్రతినిధులకును నుదారమైన నిర్ణయములు కుదురవలసి యున్నవి. ఈ సమస్యను నిర్ణయింపవలసిన భారమును అధిక సంఖ్యాకులైన హిందువులు వహింపవలసి యుందురు. అధికసంఖ్యాకులైన హిందువులు స్వల్పసంఖ్యాకులకు విశ్వాసమును గలుగ జేయుటకు వారి సంకల్పమును సఫలము చేయుట ధర్మము. అధికార మంతయును దూరస్థులైన విదేశీయుల హస్తములం దుండుట కంటెను సన్నిహితులైన స్వదేశీయుల హస్తములం దుండుట సకలవిధములను శ్రేయస్కరము. విదేశీయాధికారుల ప్రాతికూల్యమే హిందువులకును, హిందూస్థాన వాసులకును వారికర్తవ్యమును బోధించుచున్నది. విల్లింగ్డను ప్రభువుగారు మౌలానా షౌకతాలిగారికి గాంధి మహాత్మునితో సంప్రతింపులను నిరాకరించుట శాంతిప్రియులకు విచిత్రముగను గనుపడుచు

న్నది. శాంతిస్థాపనమునకు, సత్యసాధనమునను పరితపించుచున్న గాంధిమహాత్మునకు ప్రతిబంధకములను గల్పించుచు గాంధిమహాత్ముని నిందించుట ప్రపంచవ్యాప్తమైన చాణక్యనీతి. సైమనువర్గమువారు నిర్ణయించిన రాజ్యాంగవిధానము సనుగ్రహించుట కిట్టి నాటకప్రదర్శన మేల కావలయునో రాజ్యతంత్రజ్ఞులకు గ్రాహ్యమైనను సామాన్యులకు గ్రాహ్యము కాజాలదు. పురాణసంస్కారపరాయణు లైన విదేశీయ స్వదేశీయ నాయకులు తమ ప్రయత్నములు నిరర్థకములని కాలాంతరమునం దైనను గ్రహింపగలరు. మూడవ రౌండుటేబిలు సమావేశమునకు ప్రథమ ద్వితీయసమావేశములకు గల గౌరవమైనను గలుగజాలదు. గాంధిమహాత్ముని విడుదల జేయుటయును, నిర్బంధవిధానము నుపసంహరించుటయును, బాధ్యతాయుత రాజ్యాంగమును వెంటనే స్థాపించుటయును హిందూస్థాన క్షేమమునకును, బ్రిటీషు సామ్రాజ్య ప్రయోజనములకును, ప్రపంచశాంతికిని సాధనము. నిర్బంధవిధానములు, ఒట్టావా తంత్రములు, సంకుచిత రాజ్యాంగములు సంక్షోభమునకు సాధనము లయినటులు శాంతికి సాధనములు గాజాలవు. సత్యాధారములేని సాధనము లన్నియును కార్యసిద్ధికి నిరుపయోగములని ప్రపంచపరిస్థితులు సహస్రముఖములను బోధించుచున్నవి. నవజీవనవిధానము మానవధర్మపరాయణంబైన నవధర్మారాధనమును జేయగోరుచున్నది. సకలదేశములందును నవజీవనవిధానమునకును పురాణ జీవనవిధానమునకును ప్రాప్తమగుచున్న సంరంభము ప్రభుత్వమునకును ప్రజలకును వారి కర్తవ్యమును బోధించుచున్నది. చెన్నరాష్ట్రశాసనసభయందు సంప్రాప్తమైన మంత్రాంగమును నవజీవన ప్రబోధమునకు నిదర్శనముగ నున్నది.

* * * *

మద్రాసు శాసనసభ—మంత్రులు

చెన్నరాష్ట్రమునందు జస్టిసుపక్షమునందు గలిగిన పరివర్తనమును తంజావూరు సభ సువ్యక్తముచేసినది. పరిపాలనములు, పదవులు, పక్షములు, కక్షలు ప్రజల ప్రయోజనముల కేర్పడినవికాని ప్రజలు వీనికొర కేర్పడలేదు. శ్రీమంతులు, విద్యావంతులు, బలవంతులు వారి శక్తి సామర్థ్యములను ప్రజాక్షేమమునకు వినియోగించుట ధర్మము కాని ప్రజలను స్వీయప్రయోజనములకై వినియోగించుట ధర్మము కాదు. ఉద్యోగములకును, బ్రాహ్మణేతరసంఘప్రయోజనములకును, నిరంకుశప్రభుత్వ సమర్థనమునకును వినియోగపడిన జస్టిసుపక్షమునకు తన లక్ష్యమును నవజీవన హృదయమునందు లగ్నము చేయవలసిన యవసరము గలిగినది. పురాణ నవజీవన సంరంభమునం దారంభమునందు పురాణసంస్కారము విజయమును పొందినను కాలక్రమమునను నవజీవనసంస్కారము విజయమును బడయుట సహజము. రాజ్యాంగములందు జమీందారులకు, రయితులకు, తమిళులకు, తెలుగులకు, భిన్నసంఘముల

కును, సంరంభము గలుగుటకు ప్రభుత్వావలంబనమె మూలబీజము. నవజీవనసంస్కారమునందు సంకుచితమైన ప్రయోజనము లంతరించి విశాలమైన ప్రజాప్రయోజనము విజృంభించుట సహజము. శ్రీ మునుస్వామినాయడుగారీప్రయోజనమును సాధించుటకు వారి పక్షబలమును కాకపోయినను స్వీయశక్తినైనను వినియోగించి నవజీవన సంస్కారమును వ్యాపింపజేయుటకు ప్రయత్నించి పరాజయమును బడసినను నిరుత్సాహమును బడయవలసిన యవసరము లేదు. అసహజమైన పక్షారాధనము కాలక్రమమునను నిరర్థకగుమటయును సహజమైన ధర్మారాధనము సార్థకమగుటయును సహజము. మునిస్వామినాయడుగారి రాజీనామాయును నూతనమంత్రివర్గ నిర్మాణమును జస్టిసుపక్షమునందు ప్రబలిన సాంఘికాభిమానమును తొలగించుటకును ప్రజాస్వామ్యత్వాభిమానము నభివృద్ధిచేయుటకును వినియోగపడవలసి యున్నది. అస్థిరములైన యుద్యోగము లాకర్షకములైనను సుస్థిరమైన ప్రజాప్రయోజనమువలెను ఆకర్షయోగ్యము గాదు. జస్టిసుపక్షమునందు గలిగిన నవజీవన లక్ష్యము నిరంకుశవర్గమునకు జ్ఞానోదయమును గలుగజేయవలసియున్నది. హిందూస్థాన స్వరాజ్య సంపాదనము హిందూదేశవాసుల దృఢసంకల్పముమీదను, సాంఘిక సంయోగముమీదను నాధారపడియున్నదనియును నిరంకుశవర్గానుగ్రహముమీదను, రౌండుటేబిలు సమావేశములమీదను నాధారపడియుండలేదనియును దేశపరిస్థితులను ప్రపంచపరిస్థితులను నేర్పుచున్న గుణపాఠమును ప్రజలును ప్రభుత్వమును గ్రహించుట ధర్మము. శ్రీ బొబ్బిలిరాజాగారి నాయకత్వముక్రింద నేర్పడిన నూతన మంత్రివర్గమును నవజీవన లక్ష్యమును సంరక్షించుటకు పాటుపడి దేశ ధర్మరక్షణమును జేయుట ధర్మము.

Printed and Published by C. Seshagiri Rao, B. A., at the Andhra Patrika Press, No.7, Thambu Chetty St., Madras
Editor: G. Subbaramayya.